సమాలోచనం

Literary Criticism

# కవిత్రయం
# సృజన రూపం - నిర్వహణ శిల్పం అనుశీలనం

పరిశోధనా సిద్ధాంత గ్రంథం

సంగ్రహరూపం

**1962-64**


పర్యవేక్షకులు

**డా. పల్లా దుర్గయ్య**

పరిశోధకులు

**డా. మాదిరాజు రంగారావు**



**2014**

**రసధుని - సాహితీ పరిషత్తు**

**శాంతినగర్, హైదరాబాద్ - 500 028.**

Literary Criticism

**KAVITHRAYAM**

**SRIJANA ROOPAM - NIRVAHANA SHILPAM**

(Concept and practice of
poetry of Kavithrayam)
(Abridged)

by

Prof. Maadiraju Ranga Rao

© : Dr. M. Santhosh Kumar

Y.P. Second Edition : 2014

**Price : 100/-**

For Copies :
**Navodaya Book House**
'X' Roads, Kachiguda,
Hyderabad - 27.
Ph : 040 - 24652387

**Vishalandhra Book House**
Bank Street,
Hyderabad - 500 001.

Printed at
Anupama Printers
126, Shantinagar, Hyderabad- 28
Ph : 040 2339134
Email : anupamaprinters@yahoo.co.in

# ఆముఖం

ఇది ఉస్మానియా విశ్వ విద్యాలయం తెలుగు శాఖలో పిహెచ్.డి డిగ్రీ పొందిన సిద్ధాంత గ్రంథం. దీని శీర్షిక "కవిత్రయం సృజన రూపం. నిర్వహణ శిల్పం" (Concept and practice) గా నిర్ధారితమయింది. ఈ దృష్టితో ఇది కవిత్రయం – రచనల్ని గురించి జరిపిన సమాలోచనం సంగ్రహ రూపం. సృజన కళలో కవిత్రయం కవిత్వరచనా విశిష్టమైన వ్యక్తిత్వాల్ని స్ఫురింపజేసే విధంగా ప్రాతినిధ్య పూర్వకమైన పద్ధతిలో సాగిందీ కావ్యానుశీలనం.

ఈ సత్ప్రయత్నంలో నాలో అభిరుచిని గమనించి విషయాన్ని (Subject) స్థిరపచి మార్గాన్ని నిర్దేశించి ప్రణాళిక (Synopsis) ను సిద్ధం చేసి కార్యోన్ముఖుణ్ణి చేసిన తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారికీ,

పరిశోధనా సందర్భంలో పరిమితుల్ని నిర్ణయించి పర్యవేక్షకులు (supervisor) గా అవసరమైన విజ్ఞానంతో నా ప్రయత్నాని కొక రూపాన్ని ఏర్పరచిన డా. పల్లా దుర్గయ్య గారికీ

నాలో పరిశోధనా జిజ్ఞాసను ప్రోత్సహిస్తూ వస్తున్న డా. బిరుదు రాజు రామరాజుగారికీ,

నాపై వాత్సల్య దృష్టితో సాహిత్య ప్రభావాన్ని నెరపిన డా. దివాకర్ల వేంకటావధానిగారికీ నమస్కృతులు.

పరిశోధనా సందర్భంలో సముచితమైన సూచనలతో బహుధా సహకరించిన ఆప్త మిత్రులు కోవెల సంపత్కుమారాచార్యులకూ,

పరిశోధనకై రెండు సంవత్సరాలు (1962–64) స్కాలర్‌షిప్ ఒసగిన యూనివర్సిటి గ్రాంట్స్ కమిషన్ (న్యూడిల్లీ) మరియు

మరీ ముఖ్యంగా నా పట్ల అవ్యాజమైన అభిమానంగల పాలనాదక్షులూ సహృదయులూ రిజిస్ట్రార్ బి.పి.ఆర్. విఠల్, ఐ.ఎ.ఎస్. గారికీ,

అన్ని విధాలా తోడ్పడిన ఉస్మానియా విశ్వ విద్యాలయం పాలనాధికారులకూ, సన్మిత్రులకు కృతజ్ఞతలు.

2–2–1965 **మాదిరాజు రంగారావు**

# అంకితం

**ఉన్నతమైన పరిశోధనా స్వరూపం**

**మూర్తీభవించిన మనస్వి**

**ఆత్మబంధువు**

ఆచార్య బిరుదురాజు రామరాజుగారికి

# నన్నయ మహా భారతం

## ప్రవేశిక

అనుభూతి గుణాన్ని భావనా స్థితిని కల్పనా విధాన్ని రచనా శక్తిని పురస్కరించుకొని భాష ద్వారా కళాత్మకంగా ప్రకటించాలనే తీవ్రమైన ఔత్సుక్య సమావిష్కారం కవిత్వం. ఈ ఔత్సుక్యం కవికి సహజం. సృజనాత్మక సౌందర్యానికి చెందిన అఅభూతి మొదలైనవి అందరికీ ఒకే విధంగా ఉండవు. బహుమార్గాల్లో వివిధ పరిణామాల్ని కలిగి ఉంటాయి. ఈ వైవిధ్యం ఆయా కవుల ప్రతిభ సంస్కారం మానసిక స్థాయిని బట్టి యేర్పడతాయి. ఇందులో ఉదాత్తమైన దశకు చెందింది, ఉత్తమ కవిత్వమవుతుంది. ఆ భాషా సాహిత్య సంస్కృతులకు మౌళిభూతంగా విలసిస్తుంది. ప్రాచీన కవిత్వ విషయంలో త్రికాలాబాధ్యమయి బ్రహ్మానంద సబ్రహ్మచారియైన రసానందాన్ని కలిగిస్తుంది. సహృదయులకు ప్రీతికరమవుతుంది. చిత్త వికాసానికీ ఉత్తమ సంస్కారానికి నూతనమైన ఉత్తేజానికి హేతుభూతమవుతుంది. ఉత్తమ కవిత్వమెప్పుడూ మానవ మనస్తత్వ విశ్లేషణాత్మకమయింది. లోక స్వభావ చిత్రణాత్మకమయింది. సంవేదన శీలకమయింది. చిత్త వికాస హేతుకమయింది. కవిత్వంలో ఇవి అనివార్యాలుగా కనిపిస్తాయి. అంటే వీటి సమ్యక్ వేతృత్వం కవిలో ఉంటుందని తాత్పర్యం. కవుల్లో స్థాయికి సంబంధించిన భేదాలెట్లా ఉంటాయో, పాఠకుల్లోను కన్పిస్తాయి. పాఠకుల అనుభూతి లక్షణంలోని తారతమ్యాన్ని బట్టి కావ్యార్థ గ్రహణంలో తదనుభవంలో తారతమ్య మేర్పడుతుంది. పాఠకుల్లో 'సహృదయు'ని స్థానం ఉన్నతమైంది.

**"తదా జాయన్తే గుణా: యదా తే సహృదయై ర్గృహ్యన్తే**
**రవి కిరణానుగృహీతాని భవన్తి కమలాని".....**

కావ్యమెంతటి గుణ సంపన్న మైతేనేం? అందులో గుణాల్ని గ్రహించే సహృదయులుండాలి. వీరు సూర్యుని కిరణాల్ని గ్రహించి వికసించే కమలాల వంటివారు.

సహృదయులు లేకపోతే గుణాలకు సుస్థితి లేదు. గుణాలు గ్రహింపబడినపుడే వాటి పరిగణనం ప్రయోజనం సమకూడుతుంది. ఒకపుడు సహృదయ స్థితి లోపించడం వల్ల గుణాలు లోపాలుగాను కన్పించవచ్చు.

**"యే నామ కేచిదిహ న: ప్రథయన్త్యవజ్ఞాం**
**జానంతు తే కిమపి తాన్ప్రతి నైష యత్న:**
**ఉత్పత్స్యతే హి మమ కోఽపి సమాన ధర్మ:**
**కాలోఽ హ్యయం నిరవధి ర్విపులాచ పృథ్వీ"**

అని భవభూతి సహృదయులు కాని పాఠకులను నిరసిస్తూ సహృదయుల కొరకెదురు చూడవలసి వచ్చింది. సహృదయత లోపించడం వల్ల కావ్య ప్రయోజనం వితథమవుతుందని భావం. సహృదయుని గురించి అభినవ గుప్తపాదులు, "యేషాం కావ్యానుశీలను వశాత్ విశదీ భూతే మనోముకురే వర్ణనీయ తన్మయీభవన యోగ్యతా తే హృదయ సంవాద భాజ:" అని, నిరంతర కావ్యానుశీలనం వల్ల మనస్సు శుభ్రమైన దర్పణం వలె ప్రకాశిస్తుంది. అప్పుడు కావ్యంలోని గుణ విషయం మనో దర్పణంలో ప్రతిబింబిస్తుంది. తన్మయీ భవన యోగ్యత చేత సహృదయ ప్రభావం అవగతికి వస్తుంది. కావ్యానందాన్ని అనుభవించిన సహృదయుడు, తాను పొందిన అనుభూతిని ప్రకటించే ఔత్సుక్యాన్ని పొందడంతో 'విమర్శ' అవతరిస్తుంది. కావ్యాస్వాదనానంతరం అనుభూతి స్వరూపం హేతు సమర్పకంగా వివేచితమవుతుంది. ఇది స్థూల దశల నుండి సూక్ష్మదశల దాకా పర్యాప్తమవుతుంది. కావ్యాన్ని గురించి విశిష్టమైన అనుభూతి ప్రపంచనంతో పాటు ఆలోచనాత్మక విశ్లేషణ కూడా జరుగుతుందన్న మాట.

'విమర్శ' అన్న పదం దూషణ భావ సూచకంగానూ నేడు అభి వ్యాప్తమయింది. దీనికి బదులు 'అనుశీలన' మన్నపదం గ్రహింపబడింది. పరిశీలనంతో పాటు సమాలోచనమన్న పదం కూడా స్వీకరింపదగిందే. 'సహృదయ' నిర్వచనంలో, అభినవ గుప్తపాదుల 'అనుశీలన' మన్న పద ప్రయోగం, దీనికి బలాన్నిస్తుంది. కావ్యంలో నిహితమైన కవి హృదయాన్ని మొదట గ్రహించాలి. భవభూతి చెప్పిన 'సమాన ధర్మ' మన్నది దీన్నే సూచిస్తుంది. అపుడే కావ్యంలో నిక్షిప్తమైన బహువిధాలైన నిగూఢ రహస్యాలు

తెలుస్తాయి. తనకు తెలిసిన రహస్యాల్ని, కావ్య జిజ్ఞాసువులకు తెలిపేందుకు 'సహృదయుడు' సంకల్పించే స్వార్థరహిత ప్రయత్నమే కావ్యానుశీలనం. ఎన్ని లక్షణాలు పేర్కొన్నప్పటికీ, ప్రతిభతోపాటు కవి మనస్తత్వం ఆ కాలం పరిసరాలు పరిస్థితులు సంస్కారం ఇతర కవుల ప్రభావం మొదలైన బహు విషయాల్ని ఆశ్రయించి, మహాకవి వ్యక్తిత్వం వైశిష్ట్యాన్ని వైవిధ్యాన్ని సంతరించుకుంటుంది. ఇతర కవులతో విభేదిస్తుంది. ఒక్కొక్క గొప్ప కవిలో, ఇతర కవుల నుండి వేరైన విశిష్ట లక్షణం స్ఫూర్తికి వస్తుంది. "యేనాస్మిన్నతి విచిత్ర కవి పరంపరా వాహిని సంసారే కాళిదాస ప్రభృతయోద్విత్రాః పంచషా వా మహాకవయ ఇతి గణ్యన్తే" ఈ విచిత్రమైన కవి ప్రపంచంలో ఇరువులో ముప్వురో అయిదారుగురో మహాకవులు కన్పిస్తారు. ఈ సంఖ్య లోక వ్యవహార సామాన్యమైంది. మహాకవుల సంఖ్య బహుస్వల్పమని భావం.

తెలుగు సాహిత్యంలో అసంఖ్యాక కవుల నుండి "పరిస్ఫురత్ ప్రతిభా విశేషహేతువు" చేత పృథఃకరింపబడి పరిగణన యోగ్యత పొందిన వారి సంఖ్య స్వల్పమే ఇందులో కవిత్రయం ముందు సాక్షాత్కరిస్తారు. కావ్యావతారికలో కవి రచనోద్దేశం, తత్ప్రేరణం, కావ్య సిద్ధాంతాభిప్రాయాలూ, మొదలైనవి దృష్టికి వస్తాయి. కాబట్టి కావ్యావతారిక కావ్యాను శీలనానికి భూమికగా తోడ్పడుతుంది. ఈ సృజన కళ నిర్వహణ శిల్పం అనుశీలనంలో మూల కథానుసరణం ప్రధానం కాదు. కథాగత నిర్మాణ మార్మికత నెత్తి చూపడం ముఖ్యమైంది. కవుల మహనీయమైన వ్యక్తిత్వాల్ని నిరూపించే గుణాలకాస్థానమైన ఘట్టాలు సన్నివేశాలు గ్రహించి వివేచించడం జరిగింది.

నన్నయ రచనలోని కథా కథన శిల్పం నానారుచిరార్థ సూక్తి అక్షర రమ్యత, తిక్కన రచనలోని కళా శిల్పం, పాత్ర చిత్రణం, సంభాషణాత్మక విధం, ఎఱ్ఱన రచనలో నన్నయ తిక్కనల గుణ సమన్వయంతో పాటు ప్రత్యేకమైన ప్రాబంధిక సంస్థితి, వైశిష్ట్యాల పై వెలుగు ప్రసరించడం జరిగింది. ఇంకా తత్త్వ ప్రపంచం కళాశిల్ప సౌందర్యం, మనస్తత్వ ప్రకాశనం కావ్యాను శీలనంలో చోటు చేసుకున్నాయి. రచనలో సృజన కళ – నిర్వహణ శిల్పంలో ఉపకరించే రూప రేఖల్ని, కవి స్వతంత్ర వ్యక్తిత్వాన్ని అనుసరించి జరిపిన కావ్యానుశీలనం ఈ సిద్ధాంత వ్యాసం.

# సృజన కళ - నిర్వహణ శిల్పం

# నన్నయ మహాభారతం - అవతారిక

1

నన్నయ భారతావతారిక శ్రోత కేంద్రంగా ఉంది. ఇది అంకిత తుల్యం, అంకిత గ్రంథానికవసరమైన అవతారిక లక్షణాలన్ని ఉన్నాయి. కాని ఎవరికీ అంకితం కాదు తన రచనకు ప్రేరకుడయిన వ్యక్తిని కవి శ్రోతగా నిలపడం జరిగింది. ఇది దీని ప్రత్యేకత. రాజ రాజ నరేంద్రుడు భార రచనకు నన్నయను ప్రేరేపించడం కన్పిస్తుంది. భారతావతారికలో కృతి సమర్పణ సంప్రదాయంలో కన్పించే షష్ఠ్యంతాలు వినా, తక్కిన మర్యాదలన్ని, ఇష్టదేవతాస్తుతి కన్పిస్తాయి. ప్రేరకుడు లేదా శ్రోత కృతి భర్త కాకపోవడం వల్ల షష్ఠ్యంతాలు లేవు. తన కృతిని రాజరాజ నరేంద్రున కంకిత మిచ్చినట్లు నన్నయ ఎక్కడ చెప్పలేదు. అకి లక్షణే – లక్షణ మంటే చిహ్నం, అంకిత మంటే చిహ్నంగా చేయబడింది, “చిహ్నం లక్ష్మచ లక్షణమ్” – అని నామ లింగాను శాసనం. కృతిని అంకితం చేయడమంటే, కృతిని ఒక వ్యక్తికి చిహ్నంగా చేయడమే కృతి సప్త సంతానాల్లో ఒకటి 1) అగ్రహారం, 2) దేవాలయం,3) ఉద్యానవనం, 4) తటాకం, 5) పుత్రుడు, 6) నిధి, 7) కృతి యనేవి సప్తసంతానాలు. వీటివల్ల పుణ్యం కీర్తి లభిస్తాయి. భారతీయుల జీవితంలో వీటికి గల స్థానం విశిష్టమైంది. వీటిలో ఖిలం కాకుండా ఉండేది కృతియే. ఉత్తమ కృతి మరీ శ్రేష్ఠమైంది.

**శ్రీ వాణీ గిరిజాశ్చిరాయ దధతో వక్షోముఖాంగేషు యే**
**లోకానాం స్థితి మావహంత్య విహతాం స్త్రీ పుంస యోగోద్భవామ్**
**తే వేదత్రయ మూర్తయ స్త్రిపురుషా స్సంపూజితా వస్సురై**
**ర్భూ యాసు: పురుషోత్తమాంబుజ భవ శ్రీ కంధరా శ్శ్రేయసే”**

రాజరాజ నరేంద్రుడు కూడ శ్రీ మహాభారంతోని “అభిప్రాయము విన అభిలాష పెద్ద”యై యున్నట్లు శ్రవణేచ్ఛయే ప్రకటించాడు. ఈ కారణంగా రాజరాజ నరేంద్రుని శ్రోతగా మాత్రమే భావించి నన్నయ మహాభారత రచనకుద్యుక్తుడయినట్లు

నిశ్చయింపవచ్చు. రాజరాజనరేంద్రుని మహాభారత "శ్రవణాసక్తి" ఆయన ఉత్తమ వ్యక్తిత్వంలో భాగమైంది.

వేదత్రయ మూర్తుల వర్ణనంతో మహాభారతావతారిక ఆరంభమయింది. ఇది స్తుతి పరంగానే కాక ఆశీః పరంగాను ఉంది. సంస్కృత నాటకాల్లోని నాందీ శ్లోకాన్ని తలపిస్తూంది. ఇందులో వర్ణింపబడిన త్రిమూర్తులు వేద ప్రపంచితమైన పరబ్రహ్మ సుగుణరూపాలు. లోక సృష్టికీ స్థితికీ లయకూ హేతుమూర్తులు. బ్రహ్మ సృష్టికర్త, విష్ణువు స్థితి కర్త, శివుడు లయ కర్త, సృష్టి స్థితి లయాల సమష్టి స్వరూపమే దృశ్యమాన ప్రపంచం వీరు సత్త్వరజస్తమో గుణాలకు ప్రతీకలు. సత్వం జ్ఞాన కారణం యధార్థంగా ఎరుగబడేది సత్తు. దీని భావం సత్త్వం, ఇది జ్ఞాన హేతువు, రాగయుక్తమొనర్చేది రజస్సు ఇది రక్తి హేతువు. గ్లాని పొందింపజేసేది తమస్సు ఇది మోహ హేతువు మానవ జీవితం ఈ గుణత్రయ సమ్మేళనం పరివర్తనం కలిగింది. ఇందులో ఏది లోపించినప్పటికీ వ్యహార గమనమే లేదు. పూర్ణత్వం సిద్ధించదు. ఇది మంగళ శ్లోకం అశీర్నమస్క్రియా వస్తు నిర్దేశాలతో సంపన్నమైంది. త్రిమూర్తులు శుభాన్ని కలిగింతురు గాక యనుటలో ఆశీర్వాదం త్రిమూర్తులస్తుతి చేత నమస్క్రియ, లోక స్థితి నిర్వహణం మొదలుగా కార్యతత్పరత్వం చేత దీనికి ప్రతిమింబమనదగిన మహాభారతంలోని ప్రతిపాద్య విషయ స్ఫూర్తితో వస్తు నిర్దేశం దృష్టికి వస్తాయి.

మహాభారతం ధర్మాధర్మాల మధ్య జరిగిన తీవ్రమైన సంఘర్షణ రూపం వివిధ స్థితులు పరిణామాలు పర్యవసానాలు ఆవిష్కృతమైనాయి. ధర్మాన్ని పరిరక్షించడం త్రిమూర్తుల కర్తవ్యం. వారు వేదత్రయమూర్తులు వేదం అఖిలధర్మాలకు మూలం కాబట్టి ధర్మ రక్షణ వారి సహజ లక్షణం. ఈ విధంగా వారి పట్ల విధి సహజత్వం రూపితమైంది. పరమాత్మకు చెందిన అంశ జీవునిలో ఉంది. అవిద్య చేత కప్పబడిన చైతన్యమే జీవుడు, ప్రాగ్గత బహుజన్మల సంస్కార సంపుటి. జీవునికి అవిద్య ఆవరణంగా ఉంది. ఇది ఉన్నంతవరకు ముక్తి కలగదు అవిద్య చేత లౌకిక జీవనంలో ధర్మాచరణం మొదటి సోపానం "ధరతి లోకానితి ధర్మ:" లోకాల్ని ధరించేది ధర్మం. దీని పరిణత స్వరూపం వేద నిగదితమైంది. త్రిమూర్తులు దీని లక్ష్య సాధనలో రూపాలు నిత్య చైతన్య స్వరూపులైన త్రిమూర్తులకూ, నిత్య చైతన్య వికృతియైన పంచ భూతాత్మక

ప్రపంచం, ఇందులో మాయ చేత కప్పబడిన జీవునకూ గల పరస్పర సంబంధం ప్రపంచితమైంది.

ఈ జీవ సృష్టి మిథునానురాగ మూలమైంది. ఈ విషయం. ఈ శ్లోకంలో జీజప్రాయంగా నిక్షిప్తమైంది ఈ స్వరూపానికి ప్రతీకలైన వేదమూర్తులను భార్యాసహితులుగా వర్ణించడంలో సృష్టి మూలం, దాంపత్య భావనతో స్థితి నిర్వహణలో పరంపరా రూపం, మిధునానురాగ ప్రధానంగా భావితమైంది స్త్రీ పురుష యోగం చేత కలిగే అప్రతిహతమైన స్థితి నిర్వహణానికి మూడు వేదాలు మూర్తీభవించిన వారు శుభాలు కలిగింతురు గాక! అనడంలో దేవతా మూర్తులకూ లౌకిక జగత్తుకూ సంబంధం స్థాపితమైంది ఈ దివ్యమైన సంబంధం దేనికి? అంటే లోకాల శ్రేయస్సుకని సమాధానం. ఈ లోక శ్రేయస్సు ఎట్లా సిద్ధిస్తుంది? అంటే ధర్మ రక్షణం వలనే. ఇట్లా సమకూరడం త్రిమూర్తుల విధి నిర్వహణంలోని భాగంగా గ్రహించాలి. కాబట్టి త్రిమూర్తులు నిఖిల ధర్మాని కాస్థానమైన వేద స్వరూపులుగా వర్ణించడం జరిగింది. మహాభారతం పంచమ వేదం ఇందులో వేద ధర్మం జగన్నిర్వహణ శీలంగా త్రిమూర్త్యాత్మకంగా విశ్వశ్రేయస్సులక్ష్యంగా ప్రపంచితమైన విషయం సూచితమైంది. ఈ విధంగా మహాభారతంలోని పరమార్థం అవతారికలో మొదటి శ్లోకంలో స్థాపితమైంది. ఇది నిత్య చైతన్యం నుండి ఉద్భవించిన దివ్య జగత్తుకూ లౌకిక జగత్తుకూ మధ్య వంతెన వలె అనివార్యమైన అనుబంధాన్ని ఆవిష్కరిస్తుంది.

దర్శన శక్తి కలిగిన నన్నయ ఈ ఆరంభ శ్లోకంలో తెలుగు మహాభారతం ముగ్గురు కవులచే దీర్ఘ కాలంపై నిర్వహింపబడుతుందన్న భావాన్ని అప్రయత్నంగా సూచించినట్లు కొందరు విమర్శకుల అభిప్రాయం ఇందులో పురుషోత్తమాంబుజ భవ శ్రీ కంధరులు క్రమంగా నన్నయ (నారాయణ శబ్దభవం) తిక్కన (కవిబ్రహ్మ) ఎఱ్ఱన (శంభుదాసుడు, ప్రబంధ పరమేశ్వరుడు)లుగా ఊహకందుతారు. వేద త్రయమూర్తులు లోకాన్ని నిర్వహించినట్లుగా ఈ ముగ్గురు కవులు పంచమ వేదమైన మహాభారతాన్ని తెలుగులో నిర్వహిస్తారు. శ్లోకంలో 'చిరాయ' పదం దీర్ఘమైన కాలాన్ని సూచిస్తుంది. భారత రచన నిర్వహణం కొంత కాలాన పూర్తి అవుతుందని అర్థం. ఇందులో

పురుషోత్తమాంబుజ భవ శ్రీ కంధర”లో సూచితమైన నన్నయ తిక్కన ఎఱ్ఱనల కాలక్రమాన్ని, వచనంలోని “హరి హర హిరణ్య గర్భ”లో, తెలుగు మహాభారత గ్రంథ స్థితి క్రమాన్ని గమనించవచ్చు ఈ ఆరంభం ఫలానుమేయమైంది. “ఋషీణాం పునరాద్యానాం వాచమర్థోను ధావతి” యన్న భవభూతి సూక్తికి లక్ష్యభూతంగా ఉంది. కవుల జీవిత కాలాన్ని బట్టి చూస్తే ఎఱ్ఱన చివరి వాడుగా కన్పిస్తాడు. ఇది కవుల కాల క్రమం అయితే గ్రంథం మొదటి భాగాన్ని (అది సభాపర్వాలు మరియు అరణ్య పర్వంలో కొంత భాగం) నన్నయ, రెండో భాగాన్ని (అరణ్య పర్వశేషం) ఎఱ్ఱన, మూడో భాగాన్ని (విరాటపర్వం మొదలుకొని చివరి వరకు) తిక్కన రచించారు. ఇది గ్రంథ స్థితి క్రమం. శ్లోకంలో కాలక్రమం వచనంలో గ్రంథస్థితిక్రమం ఉద్దిష్టమైనాయన్న విశ్వనాథ అభిప్రాయం గమనార్హమైంది.

ఆరంభంలో విశ్వశ్రేయోభావనానంతరం రాజరాజనరేంద్రుని గుణ వర్ణనం ఐదు పద్యాల్లో ఉంది. ప్రధానంగా ఆయన లక్షణాలు శౌర్యదీప్తి ధర్మబుద్ధి, ధర్మవర్తనం దాన దయాగుణం సత్కీర్తి చిత్రితమైనాయి. ఒక ప్రభువు సత్పురుషుడు ధర్మవేత్త వైయక్తిక సామాజిక పారలౌకిక ప్రపంచానికి ప్రతినిధిగా కన్పిస్తాడు. రాజకులైన భూషణుడు అన్య రాజతేజో జయశాలి వివిధాగమ విహిత శ్రముడు వర్ణాశ్రమ రక్షణ మతి, ధర్మ నిబద్ధ దయార్ద్ర బుద్ధి ఆశ్రిత పోషణుడు, అత్యకలంక చరిత్రుడు ఇవి వైయక్తిక సామాజిక పారలౌకిక విధుల కాదర్శ రూపంలో ఆనాటి ప్రజాపాలకుని కుండవలసిన లక్షణాలు ఈ సందర్భంలో రాజరాజ నరేంద్రుని పరిపాలనం వసంత ఋతు భావనాత్మకమైంది. ఇది నన్నయ్య భావనాశక్తికీ ప్రౌఢరచనకూ నిదర్శనమైంది చాళుక్య వంశంలో జన్మించిన రాజరాజను మన్మథుడు కలికాల ప్రభావం వల్ల ఏర్పడిన దోషమనే మంచును, తన శుభోదయం చేత దూర దూరం త్రోసి వేస్తున్నాడు. జగజ్జనాను రంజకంగా “వసంత విభూతి”తో ప్రకాశిస్తున్నాడు “ధర్మ దయార్ద్రనిబద్ధ బుద్ధియై” అని పాఠాంతరం అయితే ధర్మంతో ఆర్ద్ర శబ్దార్థం అన్వయం కుదరదు. అందువల్ల ‘ధర్మ’ వెంటనే ’నిబద్ధ’ శబ్దంతో అన్వయించవచ్చు. అతని బుద్ధి ధర్మ నిబద్ధమైంది; దయార్ద్రమైంది, అనడంలో ప్రసన్నత చేకూరుతుంది. అన్వయ సౌలభ్యం ఉంది. శిశిరంలో శోభాదారిద్ర్యం వహించిన ప్రకృతి వసంతోదయ స్పర్శతో చైతన్య

సంభరితమవుతుంది. ఎచ్చటచూచినా సృజన రూపం సౌందర్యవికాసం పరిమళ గతి అవహిస్తుంది. హృదయ చక్షూ రమ్యంగానే కాక మనస్తర్పణంగానూ రసానుభూతిని కలిగిస్తుంది. రాజరాజనరేంద్రుని పరిపాలనా స్వరూపం వ్యంజితమయింది. మన్మథుడు విరహుల పట్ల దయలేనివాడు కాని ఈ చాళుక్య మన్మథుడు ధర్మ దయా గుణ వైశిష్ట్యంతో ప్రవర్తించడం విశేషం. సర్వ ఋతువుల్లో శిఖరాయమాణమైంది వసంతం. ఆంధ్ర సాహిత్య చరిత్రలో రాజరాజ నరేంద్రుని పరిపాలనా కాలం "గాసట బీసటే చదివి గాథలు త్రవ్వ" శిశిర వాతావరణం ఒక్క మారు వసంతర్తు సుందరంగా పరిణమించింది. ఒకనాడు రాజరాజ నరేంద్రుడు విద్వజ్జన పరివేష్టితుడై విద్యా గోష్ఠిలో నన్నయతో తెలుగులో మహాభారతావతరయాభిలాషను తెలియజేసాడు రాజరాజు "అనుమతంబున" విద్వజ్జనుల" యను గ్రహంబునం జేసి" "నేర్చు" విధంబున నన్నయ అధికధీయుక్తితో తెలుగులో రచింప సముద్యుక్తుడయివాడు. ఈ సన్నివేశం ఉత్తమపురుషలో కాక ప్రథమపురుషలో నిర్మితమైంది. తెలుగులో మహాభారతావతరణ సందర్భం వినీతత్వాన్ని ఔదాత్యాన్ని సంతరించుకుంది.

"తనకుల బ్రహ్మణు ననురక్తు నవిరళ జపహోమ తత్పరు విపుల శబ్ద
శాసను సంహితాభ్యాసు, బ్రహ్మాండాది నా నా పురాణ విజ్ఞా నిరతు
పాత్రు నాపస్తంభ సూత్రు, ముద్గలగోత్రజాతు సద్వినుతావదాత చరితు
లోకజ్ఞు నుభయ భాషా కావ్య రచనాభిశోభితు, సత్ప్రతి భాభియోగ్యు
నిత్య సత్య వచను మత్యమరాధిపాచార్యు సుజను నన్న పార్యు, జూచి
పరమ ధర్మ విదుడు, వర చళుక్యాన్వయా భరణుడిట్టులనియె కరుణతోడ"

ఈ పద్యంలో నున్న పదునారు విశేషణాలు నన్నయ కులగోత్రాదులు, ఆచార శీలం, విద్యా ప్రజ్ఞాపాటవాలు ప్రసక్తమైనాయి. ఇవి లౌకిక పారలౌకిక విషయాలకు సంబంధించిన ఉదాత్త జీవనాన్ని ఉన్నత చింతనను ఉత్తమ ప్రవర్తనను రూపు కట్టిస్తున్నాయి. నన్నయ రాజరాజ నరేంద్రుని కుల బ్రాహ్మణుడు. అంటే తరాలుగా వివిధ సందర్భాల్లో హిత పూర్వక స్థానం కలవాడని అర్థం. అతని యందను రక్తుడు ఈ రెండు విశేషణాలు వారిరువురి విశిష్టమైన సమార్ద్ర సంబంధాన్ని ప్రకటిస్తున్నాయి.

మొదటిది వంశాను గతమైంది రెండోది వైయక్తికమైంది. అయితే దీనికి "లోకజ్ఞు" "మత్యమరాధిపాచార్యు" మొదలగు విశేషణాలు రాజునకు ధర్మాధర్మ న్యాయాన్యాయ పరిజ్ఞాన వివేచనా గతంగా సహాయపడే వ్యక్తిత్వాన్ని రూపిస్తున్నాయి. ఇవి నన్నయ లౌకిక ప్రవృత్తిని ఆంతర వివేకాన్ని ప్రతిఫలింపజేస్తున్నాయి. 'సంహితాభ్యాసుదు' 'అవిరళ జపహోమతత్పరుడు" వేద పఠనంతో పాటు వైదికమైన కర్మాచరణ నిరతిని ధర్మావలంబనాన్ని ఆధ్యాత్మిక చిత్తవృత్తిని చిత్రిస్తున్నాయి. ఇతడు బ్రహ్మాండాది "నానా పురాణ విజ్ఞాన నిరతుడు" బ్రహ్మాండ పురాణం అష్టాదశ పురాణాల్లో విశిష్టమైంది ఇది అన్ని పురాణాలకన్నా ప్రాచీనమైంది. విషయ విస్తృతి కలిగింది, దీనితోపాటు వివిధ పురాణాల్లోని విజ్ఞాన సంపత్తి కలిగిన విద్వాంసుడు పురాణం సర్గ ప్రతి సర్గ వంశ మన్వంతర వంశానుచరితమనే పంచలక్షణోపేతమైంది. ఇంకా నీతి ధర్మాది వివిధ శాస్త్ర విషయ ప్రసక్తి కలిగింది. ఈ పురాణాల్లో శిఖరాయమాణమైంది బహ్మాజ్ఞానం. నన్నయ బహు పురాణ విజ్ఞాన మహితత్త్వం అతని మహావ్యక్తిత్వంలోని ఆంతరపార్శ్వం "పాత్రుడంటే, యోగ్యుడని అర్థం ఇది గుణశీల విద్యా బుద్ధి ప్రజ్ఞా వివేక విలసితమైంది" "సద్వినుతావదాత చరితుడు", "నిత్య సత్య వచనుడు" "సుజనుడు" మొదలైన విశేషణాలు పాత్రతకు సంపూర్ణత్వాన్ని చేకూర్చే విశిష్టమైన అంశాలతో సంపన్నమైనవి. ఇవి ఉత్తమ జీవ సంస్కారాన్ని భావింపజేసేవి. ఆపస్తంభ సూత్ర ముద్గల గోత్ర జాతుడన్నవి సంప్రదాయ పరంపరను వంశోత్కర్షను సూచించేవి.

ఇక సాహిత్యానికి సంబంధించినవి "విపుల శబ్ద శాసనుడు", "ఉభయ భాషా కావ్య రచనాభిశోభితుడు" "సత్ప్రతిభాభి యోగ్యుడ"న్నవి. శబ్దం భాష కావ్య సృజన శక్తిని ప్రతిపాదించేవి. ఈ మూడింటిలో మొదటిది "విపుల శబ్దశాసనుడు" తెలుగు భాషా విషయంలో నన్నయ సాధికారత్వాన్ని ప్రయోగ సామర్థ్యాన్ని నిరూపిస్తుంది. 'అనుశిష్యంతే సాధు శబ్దేభ్య: వివిచ్య జ్ఞాప్యతే అనేనేత్యను శాసనమ్" శబ్దానామనుశాసనమ్ అని శబ్దాను శాసన పద నిర్వచనం సాధువులైన శబ్దాల్ని అసాధువులైన శబ్దాల నుండి వేరు చేసి నిరూపించడం శబ్దానుశాసనం. ఈ విధంగా నిరూపణ చేయటానికి వ్యాకరణమని నామాంతరం. నన్నయ విపుల శబ్ద శాసనుడు తెలుగు భాషా విషయంలో అంతకుముందు గాసట బీసటగా నున్న భాషను, స్వరూప

విషయంలో సాధుత్వం అసాధుత్వం గురించి వివేచన చేసి నిర్ణయ పూర్వకంగా శాసించి సుపరిష్కృత మొనర్చిన వ్యాకరణ వేత్త (అప్రస్తుతమవటం చేత ఇచట ఆంధ్ర శబ్ద చింతామణి కర్తృత్వ చర్చ వదలి వేయడం జరిగింది.

ఇట్లా సునిరూపితమైన విస్తారమైన శబ్ద జాలంతో తెలుగులో కావ్య రచన కుపక్రమించిన మహాకవి బహు ముఖాలుగా అభివృద్ధి చెందిన సంస్కృత భాషలోను కూలంకషమైన పరిజ్ఞానం కలవాడు, దాని యందు కావ్య రచన చేయగల సమర్థుడు సంస్కృత భాషలోని పదాలను ఏ విధంగా స్వీకరించాలో అవి ఎట్లా తెలుగు భాషా మర్యాదననుసరించి ఒదిగింప జేయాలో వేనిని ఎట్లా గ్రహించాలో గ్రహింపరాదో వివేచన చేసి రచనకు స్థిరమైన స్వరూపాన్ని ఇవ్వం సామాన్యం కాదు తెలుగు భాషకు ఉదాత్తమైన కావ్యత్వ సిద్ధిని కలిగించడం మహాకార్యమే ఈ పని చేయడానికి శబ్ద నిరూపక శక్తి నిర్ణయ బుద్ధి ప్రయోగ శీలం, ప్రామాణిక స్థాయితో పాటు ధైర్య గుణం నేర్పు అవసరం. ఇది ఉభయ భాషా కావ్య రచనా శక్తికి నిదర్శనంగా ఉంది. ఇక్కడ ఉభయ భాషలంటే తెలుగు సంస్కృతమనే. సంస్కృత భాషలో నన్నయ రచించిన గ్రంథమేదీ కన్పించదు. తెలుగు మహాభారతం అవతారిక మొదటి శ్లోకం నందంపూడి శాసన శ్లోకాలు మాత్రమే లభ్యమైనాయి.

సంస్కృత భాష లౌకికమైన సాహిత్యాది విషయాలకూ పారలౌకికమైన ధర్మ నిర్దేశ శాస్త్రాలకూ నిలయం. మహాభారతం లౌకిక పారలౌకిక భావ సంపన్నమైంది. దీన్ని తెలుగులో రచించడానికి కావలసిన భాషాశక్తిని విపుల శబ్ద శాసనుడు, రచనా శక్తిని ఉభయ భాషా కావ్య రచనాభిశోభితుడు ఎత్తి చూపుతున్నాయి. మరోటి "సత్ప్రతిభాభియోగ్య"దన్నది. ఇతని ప్రతిభ సత్పదార్థ సంబంధమైంది. అంటే నిత్య చైతన్య శీలమైంది. సృజనగుణం చేత యోగ్యత్వాన్ని పొందింది. పంచమవేదమైన మహాభారతాన్ని తెలుగులో రూపొందించడానికి అర్హమైంది. ఈ మార్గంలో తెలుగులో తొలి కావ్య సృష్టి అనంతర కాలంలో ఆదర్శ రూపంగా ప్రేరక శక్తిగా నిలిచింది.

నన్నయ వేద విహితమైన చిత్తవృత్తి కర్మ ప్రవృత్తితో పాటు లోకజ్ఞుడు కూడా. లోకాన్ని చక్కగా తెలిసినవాడని అర్థం లోకంలోని మనుషుల భిన్న భిన్నమైన మనః

ప్రవృత్తులు వివిధ స్థాయిల్లో తత్త్వాలు పరిశీలించిన వ్యక్తి. జీవితంలో ఎన్నో సాదృశ్య వైదృశ్యాలు సాధర్మ్య వైధర్మ్యాలు, స్నేహ వియోగాలూ, సుఖ దు:ఖాలూ, మొదలైన రహస్యాల్ని అవగాహన చేసుకున్న అనుభవజ్ఞుడు. ఈ అవగాహన నిర్దిష్టమైన నీతితో ధర్మంతో ఆలోచనా మార్గాన్ని పొందడం చేత "మత్యమరాధిపాచార్యుడ"యినాడు.

ఈ అంశం మహాభారత రచనా సందర్భంలో ఎంతగానో ఉపకరించింది.

2

రాజరాజ నరేంద్రుడు నన్నయతో విమల మతిని అనేకమైన పురాణాలు విన్నాను. అర్థ ధర్మశాస్త్రాలు తెలుసుకున్నాను. ఉదాత్త రసాన్విత కావ్య నాటకాలు చాలా చూచాను. అయినప్పటికీ నా హృదయం అనరవతం "శ్రీ మహాభారతంలోని" అభిప్రాయంబు విననభిలాష పెద్ద యైయుండు"నన్నాడు. కృష్ణద్వైపాయనునిచే అభిహితమైన "మహాభారత బద్ధ నిరూపితార్థ మేర్పడ తెనుగున రచియింపు మధిక దీయుక్తిమెయిన్" అని యాన తిచ్చాడు. రాజరాజ నరేంద్రుడు సహృదయుడు పండితుడు కళాభిమాని, మహాభారతం వినాలనే అభిలాష ఉత్కటంగా ఉన్నవాడు. నాటికి పూర్వమే కన్నడంలో అర్జునుడు నాయకుడుగా తన ప్రభువైన "అరికేసరి" కాతనితో సభేదాద్యవసాయం కల్గించి, జైన మతాభిమాని పంపడు (క్రీ.శ. 914) మహాభారత గాథను గ్రహించి విక్రమార్జున విజయమనే కావ్యం రచించాడు. భీమ దుర్యోధనుల గదా యుద్ధానికి ప్రాధాన్యాన్నిస్తూ చాళుక్య రాజగు సత్యాశ్రయుడు నాయకుడుగా రన్నడు (క్రీ.శ. 997-1008) సాహస భీమ విజయ" మనే కావ్యాన్ని రచించాడు. ఈ రెండు కావ్యాలు భారత కథా విషయంలో అర్థ నిరూపణంలో తత్త్వ ప్రపంచనంలో సంపూర్ణత్వాన్ని కలిగి లేవనుట స్పష్టం. తెలుగులో వ్యాస హృదయాన్ని ఆవిష్కరించే విధంగా సంస్కృత మహాభారతంలోని సంపూర్ణతను కలిగి ఉండాలని రాజరాజ నరేంద్రుని అభిప్రాయం.

మహాభారతం ఇతిహాసం, పంచమ వేదమనీ ప్రసిద్ధి కెక్కింది. "వేదోఖిల ధర్మమూలమ్", అఖిలధర్మాలకూ మూలం వేదం. మహాభారతంలో అఖిల ధర్మ ప్రపంచానికి ప్రాధాన్యముంది. పురాణాల్లో ధర్మ ప్రపంచం వైఖరి వేరు ఇతిహాసాల్లో

వేరు. వాటి ప్రణాళికలు భిన్నం. పురాణాల్లో కథలు సర్గ ప్రతిసర్గాదులతో కూడిన ధర్మ ప్రబోధం కలిగి ఉంటాయి. ఇతిహాసంలో మహోర్జితమైన కథా ప్రణాళిక నాశ్రయించి, లోకంలో భిన్న పాత్రలతో ప్రవృత్తులు ప్రవర్తనలు, వర్ణనలు వివిధ సన్నివేశాలతో మానవ జీవితం ప్రధానంగా ధర్మ ప్రపంచనం ఆవిష్కృతమవుతుంది. ఈ విధంగా ఇతిహాసాల స్థాయి పురాణాలకన్నా భిన్నమైంది. పంచమవేదమని ప్రశస్తి వహించిన మహాభారతం వైదిక లౌకిక పారలౌకిక ధర్మ ప్రవర్తనల సంగమమైన కథా స్వరూపం కలిగింది. ధర్మాధర్మాల మధ్య సంఘర్షణతో మానవ జీవితంలోని వివిధ పార్శ్వాల్ని చిత్రిస్తుంది. ఈ దృష్టితో రాజరాజ నరేంద్రుడు మహాభారతం పట్ల తన ఆసక్తిని వ్యక్తం చేసాడు. ఇదివరకే బహు భాషల్లో భారతం రచితమైంది. తమిళంలోను పెరిందేవనార్ అను కవిచే భారతం రచింపబడింది. చోళులతో గల సంబంధాన్ని బట్టి రాజరాజ నరేంద్రుడీ భాషా కావ్యాల్ని తెలుసుకొని, వాటి అసంపూర్ణతను గుర్తించాడు. ఇతర భాషల్లోను పెక్కు మార్పులతో నానా విధాలుగా వ్యాపించిన స్థితి, తెలుగులో మహాభారత రచనకు అవసరాన్ని సంకల్పింపజేసింది. అయితే ఇది వ్యాసాభిహిత పరమార్థంతో రూపొందాలనే ఈయన ఆశయం. రాజరాజునకు మిక్కిలి ఇష్టమైనవి అయిదు. ఒకటి భూదేవ కులాభితర్పణ ప్రీతి రెండు భారత శ్రవణాసక్తి మూడు పార్వతీ పతి పదాబ్జ ధ్యాన పూజా మహోత్సవం నాల్గు సంతత దాన శీలత, ఐదు శశ్వత్ సాధు సాంగత్యం. బ్రాహ్మణుడు వేద రక్షకుడు. బ్రహ్మ భావానికి ప్రతీక కాబట్టి ఇతరుల కారాధ్యుడయినాడు. భారతీయులు ఆధ్యాత్మికాదర్శానికి చిహ్నం భారత మీ వేద ధర్మాన్ని ప్రతిపాదిస్తుంది. వ్యక్తి జీవితాన్ని ధర్మబద్ధం గావించేందుకు తోడ్పడుతుంది. సమాజ శ్రేయోలక్ష్యం కలిగింది. ఇది వివిధ కథాంశాలతో కూడిన ప్రణాళికతో పాత్రల ప్రవర్తనతో జీవితాన్ని బింబిస్తూ సత్వర మాకర్షించి ప్రభావాన్ని నెరపుతుంది. పరమేశ్వరుడు సర్వ జ్ఞాన స్వరూపుడు. ముక్తి దాత. పరబ్రహ్మం యొక్క సగుణ రూపం. ఈ రూపాన్ని ఆశ్రయించి ముక్తి పొందడం సులభం. ఆధ్యాత్మిక రూపం అంత: ప్రవృత్తి నాశ్రయించింది. త్యాగం, సజ్జన సాంగత్యం బహి:ప్రవృత్తికి సంబంధించినవి. ఇవి పరమార్థాన్ని చేరుకోడానికి సరియైన స్థితికి దోహదం చేస్తాయి. ఇవి విశ్వజనీనాలు. సత్పురుషుని లక్షణాలు. ఈ ఐదు లక్షణాలు మానసికమైన పరిణతిని, ధర్మాభిముఖమైన ఆత్మరూపాన్ని

భావింపజేస్తాయి. ఉత్తమ జీవ సంస్కారం, ఉదాత్త పథ ప్రవర్తనం సత్ప్రవృత్తితో కూడిన రాజరాజ నరేంద్రుని వ్యక్తిత్వం మహాభారత శ్రవణాభిముఖంగా ప్రకాశమానమయింది. ఇది అనుసరణీయమైన ఆదర్శ ప్రభురూపం.

భారత కథా శ్రవణం ఉత్తమ దాన ఫలంతో బహు యాగ ఫలంతో సమానంగా భావితమైంది. బంగారు గిట్టలు గల కపిల గోశతాన్ని ఉత్తమ బహు వేద విప్రులకు దానం చేసిన ఫలంతో సమానంగా భావించడంలో, లౌకిక పారలౌకిక జగత్తుల సంబంధాన్ని స్థాపించడం జరిగింది. గోవు లౌకిక జీవనానికీ బ్రాహ్మణుడు పారలౌకిక జగత్తుకూ ప్రతీకలు. మానవుడు నివృత్తి మార్గంలో కర్మ కాండ సహాయంతో భగవత్ప్రసాదాన్ని పొందడానికి చేసే యాగ ఫలంతో సమానంగా భావించడంలో, వేద ధర్మాభిముఖమైన ఆత్మ రూపం ఆవిష్కృతమైంది. రాజరాజ నరేంద్రుని ఆదర్శ రాజ కర్తవ్యం, నన్నయ దర్శన శక్తి గల కవి బాధ్యత రెండు కలిసి తెలుగులో మహాభారతావరణకు దారితీసాయి.

3

అవతారికలో మరో ముఖం నన్నయ దృష్టిలో మహాభారత ప్రశస్తి. ఆకాశంలో నక్షత్రాల్ని లెక్క పెట్టడం సర్వ వేద శాస్త్రాల్ని తుది ముట్ట పొందడం, లోనికి ప్రవేశింప వీల్లేని అర్థ జలంతో నిండైన భారత భారతీ జలధిని అద్దరి దాకా ఈదడం, బ్రహ్మకైనా శక్యం కాని పని. ఆకాశంలో నక్షత్రాలు అసంఖ్యాకమైనవి, "అనంతావై వేదా:" అని వేదాల సంఖ్య అనంతం. శాస్త్ర పారంగత్వం సంపూర్ణంగా సాధ్యం కానిది. పరికరాలంకార రూపంలో సాభిప్రాయ విశేషాణాత్మకమైందీ పద్యం. అర్థ గౌరవంతో ఆకర్షిస్తూంది.

**"అమలిన తారకా సముదయంబుల నెన్నను సర్వ వేద శా**
**స్త్రముల యశేష సారము ముదంబున బొందను బుద్ధి బాహు వి**
**క్రమమున దుర్గ మార్థ జల గౌరవ భారత భారతీ సము**
**ద్రము దరియంగ నీదను విధాతృన కైనను నేరబోలునే"**

బుద్ధి బాహు విక్రమంతో దుర్గమమైన అర్థ జల గౌరవం గల భారత భారతీ సముద్రాన్ని తుది దాక ఈదడం బ్రహ్మకైన శక్యం కాదని రూపకాన్ని ప్రయోగించి, ఆ తరువాత అర్థాపత్తి చేత దాని అగాధత్వాన్ని అతి విస్తృతత్వాన్ని అసాధ్యత్వాన్ని భారత రచనా మహీయస్త్వాన్ని, భారత రచనను సాధించడంలో అమేయమైన కష్టాన్ని స్ఫురింపజేస్తూ మహాభారత ప్రశస్తి వ్యంజితమైంది. రాజరాజ నరేంద్రుని అనుమతితో విద్వాంసుల అనుగ్రహంతో తాను నేర్చిన విధంగా శక్తి కొలది ఈ కావ్యాన్ని రచిస్తానని వినయ పూర్వకమైన ప్రయత్నానికి ఉద్యమించడంలో నన్నయ ఆత్మ ప్రత్యయం ద్యోతమాన మవుతూంది. మొదట్లో శక్యం కాని దానికై సన్నద్ధం కావడంలో శంకా సముపేతుడయినప్పటికీ "అయినను" అన్న మాటల్లో వజ్ర సంకల్పముంది. రాజాజ్ఞ, విద్వజ్జనాను గ్రహం, తాను నేర్చిన విధం పట్ల ఆత్మతృప్తి తెలుగులో మహాభారత రచనకు నన్నయను ప్రేరేపించాయి. అప్పటికింకా తెలుగులో కావ్య స్వరూపం ఏర్పడలేదు. రచనా శిల్పం సిద్ధం కాలేదు. ఇవి యేర్పడడానికి భాషకు తగిన వ్యవస్థ చేకూరలేదు. ఈ స్థితిలో భారత రచనకు ఒకటి భాష- వ్యాకరణము, రెండు ఛందోరూపం, మూడు రచనా పద్ధతిలో ఉన్నత స్థాయిలో ప్రామాణికత్వాన్ని సాధించవలసి ఉంది. ఒక మార్గాన్ని తీర్చుకొని సాగవలసి ఉంది. అసలు మహాభారత రచనకన్న దీన్ని గురించి చింతనతో ప్రయత్నంతో కార్యరూపం ధరించడం నన్నయ కొక యజన యత్నమైంది.

## 4

"శ్రీవాణి గిరిజా శ్చిరాయ దధతో వక్షోముఖాంగేషుయే" మంగళ శ్లోకం, సమాజ శ్రేయస్సును కోరేది. ప్రజలకు ప్రాతినిధ్యం వహించే రాజుకే కాక అనుక్షణం సృష్టి స్థితి లయాత్మక రూపాన్ని కలిగిన సమస్త లోకాలకూ ఆశీస్సుల్ని అందిస్తూంది. ప్రేరకుడు, కవి, మూల రచన, దాని ప్రశస్తికి సంబంధించిన అంశాల చిత్రణం తరువాత "హరి హరాజ గజాననార్క" తరళాన్ని కావ్యారంభ స్తుతి పద్యంగా భావించవచ్చు. ఇది అవతారికలో అంతర్విధ ప్రారంభం. తెలుగులో కావ్య పరంపరకు త్రిమూర్తులు వారి భార్యలు తరువాత గజాననుని స్తుతి ఒరవడి అయింది. ఇక్కడ సూర్యుడు కుమారస్వామి మాతృకలు కూడ స్తుతింపబడడం విశేషం, ప్రాచీన సంప్రదాయ పద్ధతిలో "ఆదిత్య మంబికాం విష్ణుం గణనాథమ్ మహేశ్వరమ్"అని పంచాయతను

స్మరణ ప్రభావంగా గుర్తించవచ్చు. చాళుక్య రాజుల కుల దైవతాలైన షడాస్య మాతృకలకు నమస్కారం ఔచితీ పూర్ణమైంది. (తెలుగు కావ్యాల్లో ఒక కుమార సంభవంలోనే కార్తికేయుని స్తుతి ఉంది. ఇది కుమారస్వామి జన్మగాథ కాబట్టి అక్కడ ఉచితమే) క్రీ.శ. 616 సతారాదాన శాసనంలో కుబ్జ విష్ణు వర్ధనునికి పూర్వులకు కార్తికేయుడు రణాధి దేవత యని, సప్త మాతృకలు కులదైవతాలని వీరిచే రక్షింపబడుచున్నారని తెలుపబడింది. మరియు "చాళుక్యులు స్వామి మహాసేన పదానుధ్యాతులు. వారి శాసనాల్లో "స్వామి మహాసేన పాదాను ధ్యాతానాం చాళుక్యానా" మనుమాట కనిపిస్తుంది. ఈ తరళం చివరి రెండు పాదాల్లో వాల్మీకి వర్ణనం ఉంది. 1) దుర్భర తపోవిభవాధికుడు, 2) గురుపద్య విద్యకు నాద్యుడన్న విశేషణాలు క్రమంగా మొదటిది దర్శన శక్తికి రెండోది కావ్య సృజన శక్తికి సంబంధించినవి. రామాయణ మాది కావ్యం. కావ్య ప్రపంచంలో రచనా రామణీయకత చేత అనన్య కవితా గుణాల చేత నిలిచిన స్థానం అత్యున్నతమైంది, ఆదర్శమైంది. నన్నయ ప్రవాహ సదృశమైన మృదు మధుర గతి విశేషంలో, భావ దర్శనంలో వాల్మీకి నాదర్శంగా గ్రహించినట్లు కన్పిస్తుంది. ఇవి అక్షర రమ్యతలో రుచిరార్థ భావనా రూపాల్లో స్పష్టం. అయితే నన్నయ ఎన్నుకున్న ఛందోభేదం కారణంగా రచన ప్రత్యేకతను పొందింది.

**"భారత భారతీ శుభ గభస్తి చయంబుల జేసి ఘోర సం**
**సార వికార సంతమస జాల విజృంభము వాపి సూరిత తే**
**జో రుచిరాబ్జ బోధన రతుండగు దివ్య పరిశరాత్మజాం**
**భోరుహ మిత్రు గొల్చి ముని పూజితు భూరి యశో విరాజితున్"** ఇది వ్యాసుని స్తుతి. వ్యాసుడు వికసింపజేసే విద్వాంసుల హృదయకమలాలు ముకుళితం కావు. మహాభారత రచన ముందు వ్యాసుని, సభాసదుల్ని ప్రస్తుతించి ఉపక్రమించడం జరిగింది. వ్యాస మహర్షి మహాభారత వాక్సమూహమనే శుభకిరణాలచేత సంసార దు:ఖ మనే చీకటిని తొలగించే సూర్యుడు. పండితుల హృదయ కమలాలకు వికాసాన్ని కలిగించే దివ్యమూర్తి. వ్యాస సూర్యుని వాక్కిరణాలు మంగళకరాలు. లోక సుఖంకరాలు సూర్యునికీ వ్యాసునికీ ఒక భేదం ఉంది. సూర్యాస్తమయంతో చీకటి మరల ఆవరిస్తుంది. ఇక్కడ చీకటికి పునరావృత్తి ఉంది. కాని వ్యాసుడు తొలగించే సంసార దు:ఖ మనే

చీకటికి పునరావృత్తి లేదు. ఇదే విధంగా సూర్యుని ఉదయ కిరణాలకు కమలాలు వికసిస్తాయి. సూర్యాస్తమయంతో ముకుళితమవుతాయి. కాని అవి నిత్య వికసితాలై ఉంటాయి. సూర్యుని కన్నా ప్రభావో పేతమైందీ వ్యాసుని వ్యక్తిత్వం. జగత్తత్వ యోచనతో వరబ్రహ్మ భావనా మహితమైంది. అవిద్యా రూపాన్ని శాశ్వతంగా తొలగించే బ్రహ్మ జ్ఞాన రూపానికి ప్రతీక, ఇది శబ్ద గతమై పంచమ వేదమైన మహాభారత రూపంలో ఆవిష్కృతమైంది. పాండవ కౌరవుల కథ ఆధారంగా ప్రపంచితమైంది. ఇందులో ధర్మమర్మాలు, మన: ప్రవృత్తులు క్రియా భావ పర్యవసానాలు అనేకం. పద్య రచన భావ దర్శనంలో "అంబురుహగర్భుడు" వాల్మీకీ, జీవిత రూపం తత్త్వ దర్శనంతో "అంభోరుహమిత్రుడు" వ్యాసుడు కన్పిస్తారు. కావ్య దృష్టితో ఐతిహాసిక గుణంతో సమన్వితమైందీ నన్నయ మహాభారతం, కావ్యేతిహాసంగా పరిణమించడంలో ఆశ్చర్యం లేదు.

అవతారికలో దీని కనుబంధమనదగిన భారత కథా ప్రస్తావన, నన్నయ మహాభారతాన్ని యే విధంగా దర్శించిందీ తెలియజేస్తుంది. ఆ పైన రచనా ప్రణాళికకు సూచనలదగినవీ కన్పిస్తాయి. అష్టాదశ పర్వాలు కలిగిన మహాభారతం కల్పతరు సమమైంది.

**"అమితాఖ్యానక శాఖలం బొలిచి వేదార్థామలచ్ఛాయమై**
**సుమహావర్గ చతుష్క పుష్ప వితతిన్ శోభిల్లి కృష్ణార్జునో**
**త్తమ నానా గుణ కీర్తనార్థ ఫలమై ద్వైపాయనోద్యానజా**
**త మహా భారత పారిజాత మమరున్ ధాత్రీ సుర ప్రార్థ్యమై"**

అనేక విధ పదార్థ ప్రపంచ సంచితమైంది. మహాభారత మొక కల్పవృక్షం. ధాత్రీ సుర ప్రార్థనీయమైంది. వ్యాసుడనే నందనోద్యానంలో ఆవిర్భవించింది అనంతమైన కథలనే శాఖలు కలిగింది. వేదార్థమనే నిర్మలమైన నీడను ప్రసాదిస్తుంది. ధర్మం, అర్థం, కామం, మోక్షం రూపాల్లో పురుషార్థాలనే పుష్పాలతో కృష్ణార్జునుల గుణకీర్తన మనే ఫలంతో శోభిల్లింది లౌకిక పారలౌకిక చింతనా మహితంగా, రూపకాలంకార భాసురంగా కవితా రామణీయకతతో తత్త్వగాంభీర్యంతో ప్రసిద్ధి వహించిందీ పద్యం.

భారతంలో అనేక కథలు లోక వృత్తాన్ని ప్రతి బింబించేవి ధర్మా ధర్మ స్వరూప వివేచనకు తోడ్పడేవి. సమాజం ధర్మ బద్ధమైనపుడే సుఖ శాంతులు సాధ్యం. ఒక స్థితిలో ధర్మం వ్యక్తి నిష్ఠమైంది. ఇది చతుర్విధ పురుషార్థ యుతమైంది. వ్యక్తుల సమాహారమే సమాజం సమాజ ధర్మాలూ ఉన్నాయి. శ్రీ కృష్ణుడు ధర్మ కారణ భావానికీ, అర్జునుడు ధర్మ కార్య రూపానికి ప్రతీకలు. కాబట్టి లోకానికి ఆదర్శమూర్తులుగా పర్యవసించడం సహజం. అందువల్ల విఖ్యాతమైన గీతోపదేశం వీరిరువురి నాశ్రయించింది. త్రికాలాతీతమై నిలిచింది. మహాభారతం భగవద్గీతకు ఆధారకేంద్రం. ఇది మానవ మహాజీవితంతో విస్తృతమైంది. కర్మ పరిణామంతో రూపొందింది. ధర్మ చింతనతో వెలిసింది.

శౌనకాది మునులు సూతునితో, ఇట్లా అన్నారు

**"ఏ యది హృద్య, మపూర్వం బేయది, యెద్దాని వినిన ఎరుక సమగ్రం**
**బై యుండు, నఘనిబర్హణ మేయది యక్కథయ వినగ నిష్టముమాకున్"**

దీనికి సూతుడు "అట్లేని మీకు నభి మతంబైన పుణ్య కథ" చెబుతానని భారత కథ వినిపించాడు. ఇది హృద్యము, అపూర్వము, సర్వ జ్ఞానదము, అఘ నిబర్హణ మన్న నాలుగు లక్షణాలు కలిగింది. హృద్యమంటే హృదయానికి ప్రియం కూర్చేది ఇది విషయాకర్షణ చేత కథ రస భరితమైనప్పుడు సమకూడుతుంది. అపూర్వమంటే ఇంతకు పూర్వం లేనిది, కొత్తది, పూర్వం వేదాలు ఉపనిషత్తులు పురాణాలు వెలిసాయి. నీతిని ధర్మాన్ని తత్త్వాన్ని వేరువేరు విధాలుగా బోధించాయి. ఇవే భారతంలో మరో విధంగా నిబంధితమయినాయి. పెద్ద కథా ప్రణాళిక, అందులో ఉపకథలు, లోక వృత్తం, మానవమనోరీతులు, విభిన్న జీవిత లక్ష్యాలు మొదలుగా రూపొందిన నిర్మాణం కన్పిస్తుంది. నిస్సందేహంగా ఇది పూర్వం లేనిది, విశిష్టమైందీ, సర్వ జ్ఞాన సంపన్నమైంది. ఇంకా ఇంహాసంతో పాటు ఇతర శాస్త్ర సంబంధమైన బహు విషయాల చేత, ఆధ్యాత్మిక ప్రబోధం చేత సంపూర్ణమైంది. పాపాల్ని నాశనం చేసేది. అంతే మనస్సును పుణ్య భావోపేతంగా తీర్చేది. నీతి ధర్మం తత్త్వంతో నిర్మలం చేసేదని అర్థం. మొదటి రెండు విశేషణాలు గ్రంథం అంతర్బహిస్స్వరూపాలకూ చివరి రెండు విశేషణాలు గ్రంథం పరమార్థానికీ ప్రయోజనానికీ సంబంధించినవి. ధర్మ తత్త్వం

తెలిసినవారు ధర్మ శాస్త్రమని, అధ్యాత్మవిదులు వేదాంతమని నీతి విచక్షణులు నీతి శాస్త్రమని మహాకవులు మహాకావ్యమని లాక్షణికులు సర్వలక్షణమని ఐతిహాసికు లితిహాసమని పౌరాణికులు బహు పురాణ సముచ్చయమని, ప్రస్తుతించే విధంగా వివిధ తత్త్వ విదుడు, వేదవ్యాసుడాదిముని మహా భారతాన్ని విశ్వ జనీనంగా అవతరింపజేసాడు. ఇది ఒక గొప్ప జాతి భాషా సాహిత్య సాంస్కృతిక స్వరూపానికి ప్రాతినిధ్యం వహిస్తుంది.

**"న తచ్ఛాస్త్రం న తచ్ఛిల్పం న సా విద్యా న సాకళా**
**జాయతే యన్న కావ్యాంగ మహో భారో మహాన్ కవే:!**

**కావ్యాని కంగం కాని శాస్త్రం కానీ శిల్పం కానీ విద్య కానీ కళ కానీ లేదు, కవి బాధ్యత గురుతరమైంది.**

వివిధ జ్ఞాన సంపన్నుడైన కవి కావ్యంలో తత్తదుచిత సందర్భాల్లో ఆయా విషయాల్ని ప్రవేశపెట్టడం జరుగుతుంది. ఏ గ్రంథంలోను కన్పించని సమగ్రత మహాభారతానికి సిద్ధించింది. విశ్వజనీనత సంతరించుకుంది. ఇది విద్వత్సభామోదాన్ని పొందింది. ఈ విధం ఆనాటి సంప్రదాయం. రాజాస్థానాల్లో ప్రసిద్ధ పీఠాల్లో మహాపురుషుల సమక్షంలో గ్రంథ పరిచయం, పఠనం, చర్చలు జరిగేవి. సభావాతావరణం జాతి ఉత్తమత్వాన్ని సాంస్కృతిక దీప్తిని ప్రకటిస్తూంది. ఈ సత్సభలు వివేకమనే పరిమళంతో వికసించే సద్గుణాలనే కమలాలతో ప్రకాశించేవి. అందరు సేవింపదగిన (శాస్త్రాలనే) తీర్థాలు కలవి. మనస్సునాకర్షించే సచ్చరిత కలిగిన పవిత్రమైన జలాలతో నిండినవి. వీటి పట్ల అత్యంత గౌరవ భావంతో ప్రస్తుతించి మహాభారత సంహితా రచన కుపక్రమించడం జరిగింది. వివేకం, సద్గుణం, సేవ్యత్వం, సచ్చరితం, పావనత్వంతో కూడిన విద్యత్సభల్లో కవుల రచనలు చర్చితమయ్యేవి. వాటి గుణాగుణాలు అర్హతానర్హతలు నిర్ణయింపబడేవి. ప్రామాణిక వ్యవస్థను కలిగిన సత్సభల్లో నన్నయ స్థానం సమున్నతమైంది. ఎటువంటి గ్రంథమైనా ఈ సభల ఆమోదాన్ని పొందవలసిందే. పూర్వం శంకర భగవత్పాదులు కూడా తమ బ్రహ్మ సూత్ర భాష్యం ఆమోదానికి కాశ్మీరంలో సరస్వతీ పీఠాన్ని దర్శించారు. ధూర్జటి కాళహస్తీశ్వర శతకంలో

నత్కీరుని కథ యిటువంటి సంఘాల స్థితిని సూచిస్తుంది. తమిళ దేశంలో ప్రాచీన కాలంలో వివిధ ప్రదేశాల్లో మూడు పండిత సభలు నెలకొన్నట్లు తెలుస్తుంది. ఇఱైయనార్ ఆనప్పొరల్‌కు నక్కిరల్ వ్రాసిన వ్యాఖ్యానంలో ఈ విషయం చెప్పబడింది. ఒక్కొక సంఘం, దానిలో సభ్యుల సంఖ్య దాని అధ్యక్షుడు, అందులో ఆమోదింపబడిన గ్రంథాలు పాండ్యరాజు పోషణం మొదలైన అంశాలు ప్రసక్తమైనాయి. రాజరాజనరేంద్రుని కాలంలో తెలుగు దేశంలో ఇటువంటి విద్వత్సభలున్నాయనడానికి పై పద్యమే నిదర్శనం. ఇవి ఉత్తమ సాహిత్య సృష్టికి దోహదం చేసేవి. నన్నయ గ్రంథ రచన మొదట్లో వివిధ పర్వాల కథా రచనా ప్రస్తావనలో ఈ సభల ప్రసక్తి గమనించవచ్చు. "పండిత చేతో నిర్వృతి జేయుచు రెండవ పర్వమునా రమ్యమగు, "సకల సూరి సభా రమ్యంబగు తృతీయ పర్వము", "సభారంజనమై సర్వ మనోజ్ఞము నాల్గవ పర్వము" మొదలుగా పై అభిప్రాయాన్ని బలపరుస్తున్నాయి. ఇది ఉత్తమ సాహిత్య సంస్కృతీ సమాజాన్ని సూచిస్తుంది.

## 5

పంచవేదమైన మహాభారతాన్ని దేశీయ భాషలో రచించేప్పుడు అనుసించవలసిన భాష, ఛందస్సు, అనువాద పద్ధతి విషయంలో కొందరు పండితులతో నన్నయ విభేదించి ఉండవచ్చు, వారి విమర్శలను వాదాలను పూర్వ పక్షం చేసి, తన స్వతంత్ర వైఖరిని నిరూపించుకోవలసి ఉంది. ఈ క్లిష్ట స్థితిలో నన్నయకు బాసటగా నిలిచిన విద్వాంసుడు నారాయణభట్టు. ఇదో విధంగా వాద ప్రతివాదాలతో చర్చ ప్రతిచర్చలతో రణ సదృశంగా పరిణమించడం, దీనిలో నుండి నన్నయ విజయవంతంగా ఉద్గమించడం సూచితమైంది.

**"పాయక పాకశాసనికి భారత ఘోర రణంబునందు నా**
**రాయణునట్లు తానును ధరామరవంశ విభూషణుండు నా**
**రాయణభట్టు వాఙ్మయ ధురంధరుడుంతన కిష్టుడున్ సహా**
**ధ్యాయుడునైన వాడభిమతంబుగ తోడయి నిర్వహింపగన్"**

మహాభారత యుద్ధంలో అర్జునునకు శ్రీ కృష్ణుడు సహాయ పడినట్లు భారత రచనా సందర్భంలో వాఙ్మయ ధురంధరుడు తన కిష్టుడు, సహాధ్యాయి అయిన నారాయణభట్టు తోడుగా నిర్వహించడం జరిగింది. నారాయణభటుట సంస్కృతాంధ్ర ప్రాకృత కర్ణాట పైశాచి కాంధ్ర భాషల్లో మహా పండితుడు కవిరాజ శేఖరుడను బిరుదాన్ని పొందినవాడు. నందమపూడి శాసనంలో "జగదభి నుత గుణశాలి", "సరస్వతీ కర్ణావతంసుడు" "అష్టదశావధారణ చక్రవర్తి", యని నన్నయచే వర్ణింపబడినాడు. ఇతడు రాజనీతివేత్త కూడా. పద్య భావాన్ని బట్టి నారాయణుడు మహాభారత యుద్ధంలో ఆయుధం ధరించకుండానే మతివైభవ మాత్రంగా నరునకు సహాయపడి, విజయానికి హేతువయినట్లు, సంస్కృత పండిత ప్రకాండుల మహాచర్చల మధ్య ఉత్సాహ శక్తిగా వాఙ్మత్రంగా ఆలోచనా మాత్రంగా నారాయణభట్టు మహాభారత రచనకు తోడ్పడినట్లు గ్రహింపవచ్చు. నన్నయకు నారాయణభట్టు సహాధ్యాయి, ఇష్టుడు కావడం, ఈ సమర్ధనం హార్దికమైందీ నిర్వ్యాజమైందీ. తెలుగు కావ్యగౌరవాన్ని నిలిపేదిగా ప్రాముఖ్యాన్ని పొందింది. అయితే నారాయణభట్టు రచనలేవీ కనిపించవు. చారిత్రకాధారాల్ని బట్టి చూస్తే, ఇతడు కొంత కాలం పశ్చిమ చాళుక్య రాజైన త్రైలోక్యమల్ల దేవరకు మంత్రియై యున్నట్టు, క్రీ.శ్ణ 977లో నాతని కూతురైన కుపమ ద్రాక్షారామంలో వేయించిన శిలా శాసనాన్ని బట్టి తెలుస్తుంది. మత పరంగా భిన్నాభిప్రాయాల కారణంగానో లేక రాజకీయాల కారణంగానో పశ్చిమ చాళుక్యుల ఆస్థానం నుండి రాజమహేంద్రానికి వచ్చి యుంటాడని ఒక ఊహ. రాజరాజ నరేంద్రుడు నారాయణభట్టుకు "నందమపూడి" అగ్రహారాన్ని సమర్పించి గౌరవించాడు. ఇతడు కర్ణాటక దేశాన్ని వదలి వేంగీ దేశానికి వచ్చిన తరువాతనే (అనగా క్రీ.శ. 1052 తరువాత నన్నయ భట్టు తెలుగులో భారత రచనకుపక్రమించడం జరిగింది. దీనికి ముందు సంస్కృత మహాభారతాన్ని కూలంకషంగా అధ్యయనం చేయడంలో నిమగ్నమై యున్నట్లు భావింపవచ్చు. ఆ కాలంలో పండితులంటే సంస్కృతం చదివిన వారే రాజాస్థానాల్లో జనసామాన్యంలో గౌరవింపబడేవారు. దేశ భాష అభివృద్ధి చెందలేదు ఏ సాహిత్య సంపద లేదు ఇక శాస్త్ర గ్రంథాల్ని గురించి చెప్పనక్కరలేదు. సాధారణ

వ్యవహార స్థాయి నుండి ఉదాత్త రచనకు కావలసిన స్థాయికి తెలుగు భాష ఎదగలేదు. ఈ పరిస్థితుల్లో నన్నయ ఎదుర్కొన్న సమస్యలు అనేకం వీటి పరిష్కారంలో నారాయణభట్టు సహకారం సమయ సందర్భాల్ని బట్టి విషయ గౌరవాన్ని బట్టి అమేయమైంది. ఒక్క భాష విషయానికి వస్తే, తెలుగులో "మణిప్రవాళశైలి" ననుకరించాలని కొందరు, తత్సమీకరణ పద్ధతి స్వీకరించాలని కొందరు, నానా విధాలుగా ప్రచలితమయ్యే అభిప్రాయాల్ని పరిశీలించి ఒక నిర్ణయానికి రావలసి ఉంటుంది. అయితే ఏది ఎంత వరకు స్వీకరించాలి? అదీ తెలుగు భాషా స్వభావాంకి తగిన విధంగా సహజత్వానికి భంగం రాకుండా ఉండాలి. తెలుగు కావ్యభాషను సువ్యవస్థీకృతం చేయాలిసిన బాధ్యత గురుతరమైంది. ఇది జనామోదాన్ని పొందాలి. జన వ్యవహారంలోని శబ్దాల సాధుత్వాసాధుత్వాల్ని నిర్ణయించి కావ్యంలో ప్రయోగాని కర్హమైన ప్రామాణిక రూపాల్ని గ్రహింపవలసి ఉంటుంది, కొత్తవి నిర్మించుకోవలసి ఉంటుంది. వాళ్ళ అభిరుచికి భిన్నంగా ఉండకూడదు. ఈ పనికి పాండిత్యంతో పాటు వివేం అవసరం. మహాభారత రచన ఒక ఉద్యమ రూపాన్ని పొందిన మాట వాస్తవం. ఇది "మహాభారత ఘోర రణంబు నంద"న్న మాటలో సూచితం.

కన్నడంలో పద్య గద్య మిశ్ర రూపంలో కావ్యం ప్రచలితంగా ఉంది సంస్కృతంలో ఇటువంటివి చంపూకావ్యాలుగా ప్రసిద్ధమైనవి తెలుగులో స్వీకరించవలసిన పద్ధతి గురించి చర్చ జరిగి ఉండవచ్చు. ఈచంపూ విధం పొరుగు భాషలో సుపరిచితమైందీ, సంస్కృతంలో ప్రామాణికమైందీ ఇట్లే ఛందో విషయంలోను సంస్కృత రచనల్లో వాడుకలోనున్నవి గ్రహించాలా? మహాభారతంలో ప్రయోగింపబడిన వాటికే పరిమితం కావాలా? కావ్యాల్లో అనుసరించిన ఛందో విధానాన్ని గ్రహించాలా? ఏ విధంగా ఏవి స్వీకరించాలి? తెలుగులోను ఇరుగు పొరుగు భాషల్లోను వాడుకలోనున్నవి గ్రహించాలా? ఏవి గ్రహించాలి? తెలుగు భాషకు సహజంగా నప్పిన వాటిని నిర్ధారణ చేసి జనామోదాన్ని పొందిన వాటిని గుర్తించాలి. ఈ ప్రశ్నలకు సమాధానాలు సులభం కాదు. ఇవీ చర్చనీయాంశాలుగా పరిణమించడంలో ఆశ్చర్యం లేదు. ఇవి యిట్లా ఉంచి, రచనలో క్లిష్టమైన వ్యాసఘట్టాల్ని నిర్వహించడంలో ధర్మ ప్రబోధం, తత్త్వ ప్రపంచనం, కథా గమనంలో పునరుక్తుల్ని తొలగించడం, అవసరమైన చోట్ల పెంచడం, తగ్గించడం,

కొత్తవి చేర్చడం నిర్మాణ దృష్టితో ఔచిత్యాన్ని కాపాడడం తెలుగు భాషా మర్యాదల్ని సాంస్కృతిక వాతావరణాన్ని నెలకొల్పడం అవసరమైనాయి. ఇది మొత్తం మీద సమాహారంగా సమగ్రమైన ఒక మహా సంప్రదాయ మార్గంగా పరిణమించింది. విద్వత్సభల్లో నన్నయ మహాభారత రచన వినిపించినపుడు పైన పేర్కొన్న అంశాల్ని పురస్కరించుకొని, నాదోపవాదాలు చెలరేగడం సహజం. ఇదో సాహిత్య సంగ్రామం, ఒక మహాకార్యం ఆరంభించినపుడు అనుకూలవర్గంతో పాటు ప్రతికూలవర్గం ఉంటుంది. అనుకూల పక్షాన శిఖరాయమాణంగా నిలిచి, సంస్కృత కర్ణాటాంధ్ర భాషావేత్త నారాయణభట్టు సమ్యయోచిత ప్రజ్ఞతో ప్రతికూల వాదాన్ని పరాస్తం చేయడంలో నిర్వహించిన ప్రముఖమైన పాత్ర నన్నయను కృతజ్ఞతాబద్ధుని చేసింది.

"పాయక పాకశాసనికి" అన్న పద్యం ప్రక్షిప్తమని కొందరు పరిశోధకుల అభిప్రాయం దీనికి కారణాలు కొద్ది ప్రతుల్లో ఈ పద్యం కన్పించడం, నిత్య సమాసంలో అచ్‌హల్లులకు యతిని కూర్చడం అయితే కొన్ని ప్రతుల్లో కన్పించడమన్నది నిస్సంశయ ప్రమాణం కాదు పైన పేర్కొన్నయతి "ఆశ్రిత పోషణంబున" మొదలైన పద్యాల్లో అనేక సందర్భాల్లో నిత్య సమాసంలోని అచ్చుకు యతి చెల్లించడం జరిగింది.

అవతారిక చిట్ట చివర పద్యం నన్నయ మహాభారత కావ్య స్వరూప విశ్లేషణకు దిక్సూచిక. ఇది మహాకవి సృజన సూత్రంలో సాహిత్య సామాజిక పార్శ్వాలతో విశిష్టమైన వ్యక్తిత్వాన్ని రూపు కట్టిస్తూంది "సారమతిం కవీంద్రులు ప్రసన్న కథా కలితార్థ యుక్తిలో నారసి మేలు నా నితరు లక్షర రమ్యత నాదరింప, నానా రుచిరార్థ సూక్తి నిధి నన్నయభట్టు తెలుంగునన్ మహాభారత సంహితా రచన బంధురు డయ్యె జగద్ధితంబుగన్" ఇందులో ప్రసన్న కథా కలితార్థ యుక్తి, అక్షర రమ్యత, నానా రుచిరార్థ సూక్తి సాహిత్య పార్శ్వాన్నీ, భారత సంహితా రచనను జగద్ధితంగా ఆవిష్కరించడం సామాజిక పార్శ్వాన్నీ భావింపజేస్తాయి.

అవతారిక నన్నయ బహుముఖ వ్యక్తిత్వాన్ని రచనకు ప్రేరణల్ని, సామాజిక స్థితిగతుల్ని, చారిత్రకాంశాల్ని తత్కాల సాహిత్య వాతావరణాన్ని కవి కావ్య దృక్పథాన్ని సామాజిక లక్ష్యాన్ని బింబిస్తూంది. కవిలో రచనకు ముందు ఆలోచనలో పనిచేసే

కావ్య సమాలోచనా ముఖం స్పష్టం. కవిలో సృజన సమయంలో విమర్శకుడు మేల్కొనే ఉంటాడు, తన పని తాను చేస్తూ పోతాడు. ఈ పని శబ్దం ఎన్నిక మొదలుకొని నిర్వహణం, లక్ష్యం వరకు ఉచితానుచిత పరిజ్ఞానంతో, ఎప్పటికపుడు సమగ్రభావనతో రామణీయకతాభి ముఖంగా పర్యాప్తమైంది. నన్నయ మహాభారతానికి వస్తే ప్రసన్న కథ, అక్షర రమ్యత, రుచిరార్థసూక్తి, లక్షణాలతో లోకహితభావనతో సృజన సూత్రం ఆవిష్కృతమైంది.

# ప్రసన్న కథా కలితార్థయుక్తి

నన్నయ వ్యాసమహాభారతేతిహాసాన్ని కావ్యేతి హాసంగా మలచడంలో సృజన సూత్రంలో మొదటిది ప్రసన్న కథా కలితార్థ యుక్తి, రెండోది అక్షర రమ్యత మూడోది నానా రుచిరార్థసూక్తి ప్రసన్న కథా కలితార్థ యుక్తికి ప్రసన్న కథా కలితార్థ యుక్తియన్న పాఠాంతరం ఉంది.

అంటే 1) ప్రసన్నమైన కథతో కవిత్వంతో అర్థంతో కూడి యుండుట, 2) ప్రసన్నమైన కథా కవితలోని అర్థంతో కూడి యుండుట, 3) ప్రసన్నమైన కథతో కవిత్వంలోని అర్థంతో కూడి యుండుట, 4) ప్రసన్నమైన కథలో కవిత్వంతో అర్థంతో కూడియుండుట ఇవి ఒక్కొక్కటి ఒక పదంలోని అర్థానికిచ్చే ప్రాధాన్యాన్ని బట్టి కోరే సమన్వయభావాన్ని బట్టి ఏర్పడినాయి. వీటిలో కథా కవిత అంటే కథ నాశ్రయించి, కథ ప్రధానంగా ఉన్న కవిత్వం. దీనిని వస్తు కవిత అని కూడా అనవచ్చు. అయితే కథా కవిత (Narravtive Poem or Story Poem) అన్నదానికి తుల్యంగా పాశ్చాత్య ప్రభావంతో భావితమైంది, పూర్వ లాక్షణికు లెవరు ఈ విధమైన విభాగం చేయలేదు. నన్నయ నాటికి చారిత్రకాధారాల్ని బట్టి తెలుగులో ముక్తకాలు, వంశవర్ణనాదులు గల శాసన కవితయే కన్పిస్తుంది. ఒక కథ నాశ్రయించి ఉదాత్త భావ బంధురంగా కావ్యాన్ని వ్రాయడానికి నన్నయే ఆద్యుడు. సంప్రదాయ సిద్ధమైన పాఠం, "ప్రసన్న కథా కలితార్థయుక్తి" 1) ప్రసన్నమైన కథతో కూడిన, అర్థంతో కూడిన, 2) ప్రసన్నమైన కథలో ఒప్పిన, (పొందిన) లేదా సంపన్నమైన అర్థంతో కూడిన రచన. ఇక్కడ ప్రసన్న పదం ప్రధానంగా కథతో అన్వయిస్తుంది. ఆ తరువాత అర్థంతో దీని ప్రభావ పర్యవసానంగా స్ఫూర్తికి వస్తుంది. ఎందుకంటే అర్థమంటే ఇక్కడ వాచ్య లక్ష్య వ్యంగ్య రూపంలో ఉన్నది. మరోవిధంగా కథ ఉద్దేశించిన పరమార్థాన్ని, వీటిని తగిన విధంగా అర్థాన్ని బోధ్యమైన త్రివిధ శబ్దశక్తుల్ని కథా పరమార్థాన్ని, వీటిని తగిన విధంగా అర్థాన్ని బోధ్యమైన త్రివిధ శబ్దశక్తుల్ని కథా పరమార్థాన్ని ఆవిష్కరించడంగా భావించవచ్చు. పరమార్థాన్ని తద్భావగతంగా లేదా సిద్ధాంతపరంగా చెప్పడం వేరు. అప్పుడది శాస్త్ర విషయమవుతుంది. కథ నాశ్రయించి దానిలో ఇమిడ్చి ఆ మేరకు

చెప్పడం వేరు. సాహిత్య దృష్టితో మహాభారతం యోజితమైందీ. ఇట్లా సృజన కళ నిర్వహణ శిల్పం దీర్ఘ దీర్ఘ వ్యాపారంతో (దీర్ఘ దీర్ఘ తరోయం వ్యాపార:) వ్యాఖ్యానాన్ని ఆపేక్షిస్తుంది స్థూలంగా ప్రసన్నమైన వివిధ కథాంశాలతో అర్థభేదాలతో కూడిన కావ్య రచన అనవచ్చు.

మహాభారతంలో ప్రధాన కథకనుబంధంగా అనేకమైన ఆఖ్యానాలున్నాయి. ఒక్కొక్కటి ఒక్కొక్క విధంగా ప్రయోజనానుబంధాన్ని పొంది ఉన్నాయి. వీటిలో కొన్ని ప్రధాన కథతో ప్రత్యక్ష సంబంధాన్ని మరికొన్ని పరోక్ష సంబంధాన్ని కలిగి ఉన్నాయి. ఏ సందర్భానికే కథ ఎంతటి ప్రాధాన్యముందో గుర్తించవలసి ఉంది. ఉదాహరణకు శకుంతలోపాఖ్యానముంది, ఇదో మనోహరమైన ప్రత్యేక కావ్యంగా వ్రాయదగింది. కురువంశానికి భరత వంశమని పేరుంది. ఇది భరతుని వల్ల వచ్చింది. భరతుడు గొప్పవాడవటానికి శకుంతలా దుష్యంతులు కారణం. శకుంతల విశ్వామిత్రునికి మేనక యందు జన్మించిన సంతానం. విశ్వామిత్రుడు జన్మచేత క్షత్రియుడు కర్మ పరిణతి చేత బ్రహ్మర్షి అయినాడు. అతని తపస్సాధనలో మధ్య శకుంతల జన్మించింది. శకుంతలలో జననీ సంబంధమన దివ్యత్వం, జనక సంబంధమయిన ఉత్తమ లక్ష్య సాధనారూపం ఉన్నాయి. ఆపైన కణ్వ మహర్షి పెంపకంలో పెరిగింది. ఈ వాతావరణం వేరు. జపహోమ తపోమయమైంది ఈ శకుంతల మహావీరుడు ధర్మపరుడు అయిన దుష్యంతుని వివాహమాడింది. కాస్త వెనక్కు పోతే దుష్యంతుని తాత త్రసుడు దివ్యత్వ క్షత్రియత్వాలు కల మహనీయుడు. ఇతడు సరస్వతీ నదీ దేవతకు మతినారునికీ జన్మించిన వాడు. ఈ విధంగా శకుంతలా దుష్యంతులకు జన్మించిన భరతుని వ్యక్తిత్వం విశిష్టమైంది లోకాపవాద భీతిచేత సీత పట్ల శ్రీ రామచంద్రుని వలె దుష్యంతుడు శకుంతల పట్ల ప్రవర్తించాడు. సీత విషయంలో భూమి సాక్షి అయింది. శకుంతల విషయంలో ఆకాశం సాక్షి అయింది. భరతుడెటువంటి వాడో ఎంతటి వాడో తెలిపేందుకు శకుంతలోపాఖ్యానం ప్రసక్తమైంది. అయితే ఇందులో ఏ అంశాలు ముఖ్యమో వాటిపై వెలుగు ప్రసరిస్తూ, కథా పరమార్థాన్ని దృష్టిలో ఉంచుకొని నిర్వహించవలసి ఉంటుంది. భారతంలో స్థిరమైన నిశ్చయమైన అర్థాన్ని అధికమైన ధీయుక్తితో రచించాలనే రాజరాజ నరేంద్రుని ముఖతః చెప్పడం జరిగింది. ఇక్కడ అర్థమంటే పరమమైన భావం,

ఉత్తమమైన ప్రయోజనం అని తాత్పర్యం. వ్యాసుని హృదయావిష్కారంపై దృష్టిని ప్రసరింపజేస్తూంది. మూల భారతంలోని కథాంశాల్ని, పరమార్థాన్ని ప్రసన్నం చేసే నన్నయ స్వతంత్ర లక్షణంలో నిర్వహణ శిల్పం ఉంది. నన్నయ మహాభారత రచనలో ప్రసన్న కథా కలితార్థ యుక్తి ప్రధానమైన సృజనాత్మక సూత్రం.

మహాభారతంలో కథా నిర్మాణ ప్రణాళిక వ్యాసోపజ్ఞకమైందే. కాని కథా కథన విధం నన్నయ ప్రత్యేకతతో విలసితమైంది. కేవలం కథకు ప్రాధాన్యం, భారతీయాలంకారికుల అభిమతం కాదు. "నహి ఇతివృత్త నిర్వహణేన కించిత్ప్రయోజనమ్, ఇతిహాసాదేవ తత్సిద్ధేః" నన్నయ రచన కావ్యేతి హాసం, కావ్యత్వానికి అవసరమైన అంశాలతో ఇతిహాసం యోజితమైంది. ఈ యోజనాన్ని కావ్యంలో ఆస్వాదించే యోగ్యత చేత శ్రేష్ఠమైన లేదా శక్తివంతమైన, గుణంవల్ల "కవీంద్రులులో నారసి" మేలు అని ప్రశంసిస్తారు. లో నారయుటలో, అంతరమైన లోపలి భావానికి సంబంధించిన వివేచనకు ప్రాధాన్యం కలుగుతూంది. అధిక ధీయుక్తితో రచించిన కావ్యేతిహాసాన్ని "కవీంద్రులు" సారమతిలో నారసి మేలు అనడం స్వతంత్రమైన సృజనాత్మకమైన నిర్వహణ రూపం వల్లనే సాధ్యం "ప్రసన్న" విశేషణం ప్రత్యేకంగా వివేచనార్హమైంది. ప్రసన్నమంటే ప్రసాద గుణోపేతమైందని అర్థం. ఇది ఒకటి శబ్దగతమైంది. రెండు అర్థగతమైంది. కావ్యపరంగా చూస్తే ఈ ప్రసాద గుణం సర్వ రస వ్యంజక రచనకు సాధారణమైన గుణమని అలంకారిక మతం. "సమర్పకత్వం కావ్యస్య యత్తు సర్వరసాన్ప్రతి స ప్రసాదో గుణోజ్ఞేయ: సర్వ సాధారణ క్రియః ప్రసాదస్తు స్వచ్ఛతా శబ్దార్థయోః" అని ఆనందవర్ధనుడు. సర్వ రసస్ఫోరకత్వం కారణంగా ప్రసాదగుణం సర్వ రచనా సాధారణమైంది. ప్రసాద గుణేతరమైన ఓజో గుణాదులకు కొన్ని నియమాలున్నాయి. కాని ప్రసాద గుణాని కట్టి నియమాలు లేవు. ఇది సర్వ రస సమర్పకమైంది. సర్వ రస వ్యంజకమైంది సర్వ రస సాధారణమైన ప్రసాద గుణాశ్రయం చేత మహాభారతంలోని కథా ప్రపంచం వివిధాఖ్యానాలతో విలసితమైంది, ప్రధాన రసానికి భంగం కలుగకుండా వివిధ రస వ్యంజకంగా నిర్వహింపబడే దృక్పథం శక్తివంమైంది. సారమతికందుతుంది.

# ఉపాఖ్యానాలు : ఉదంకోపాఖ్యానం

ఉదంకోపాఖ్యానం ఉదంకుని గుణ వర్ణనతో ఆరంభమైంది. ఇది ఆయన సంపూర్ణ వ్యక్తిత్వానికి సూచిక. ఈ గుణాల్ని కథలో ఆయా స్థలాల్లో పొందుపరచడంతో కథకు ప్రసన్నత చేకూరింది. ఇది సృజన కళ నిర్వహణ శిల్పంలో భాగం. అతడు పంకజ భవ సన్నిభుడు, అఘ పంక క్షాళన మహా తపస్సలిలుడు, అనాతంకమతి, మునివరుడు, నిష్ఠాపరుడు జ్ఞానవంతుడు. మరియు పైల శిష్యుడు. సంస్కృతి మహాభారతంలో పైలునికి వేదుడని పేరుంది. మూలాన్ని అనుసరించి, వేదుడు ప్రవాసం వెళ్ళాడు. ఆ సమయంలో అతని భార్య ఋతుమతి అయింది. కొందరు స్త్రీలు వచ్చి ఆమె ఋతు వంధ్యత్వం పొందకుండా రక్షింపుమని ఉదంకుని కోరతారు. అతడందు కంగీకరింప లేదు. గురువు మరలి వచ్చి ఈ వృత్తాంతం తెలుసుకొని సంతోషిస్తాడు. ఉదంకుని కష్ట సిద్ధులు కలిగేట్లు ఆశీర్వదిస్తాడు. ఇంతలో విద్య పూర్తి అవుతుంది. తెలుగుభారతంలో మాత్రం విద్యపూర్తి అయిన ఉదంకుడు గురువు వద్దకు వెళ్ళి గురు దక్షిణ ఇస్తానంటాడు. అతడు వద్దంటాడు. శిష్యుడు పట్టు వదల్లేదు. గురువుకు తన భార్య కోరిక గుర్తుకు వచ్చింది. దాన్ని తాను వెల్లడించలేదు. ఆమె వద్దకు వెళ్ళి అడిగి ఆమె కోర్కె 'తీర్చు' మంటాడు. ఆమె పౌష్యుని దేవి, కుండలాలు కోరింది. ఉదంకుడు "గురుహిత కార్యధురంధరుడై" "గురుపత్నీ నియోగంబున" ఒంటరిగా "నిరాతంకమతి" కాబట్టి బయలు దేరాడు. గురువు శిష్యునకు వెనుక రక్షకుడుగా ఇంద్రుని నియమించాడు. శిష్యుని పరీక్షించడంలోను శిష్య వాత్సల్యానికి లోపం లేదు. దారిలో మహోక్షం ఎక్కివచ్చే దివ్య పురుషుడు పన్నిన వృషభగోమయ భక్షణం చేస్తాడు. అతని అనుగ్రహం పొంది త్వరగా పౌష్యుని కడకు వెళ్ళాడు. ఉదంకుడు మహాతపస్వి బ్రహ్మ సదృశుడు, వృషభ గోమయాన్ని ఎట్లా భక్షణం చేస్తాడన్న సందేహ నివృత్తికై "పన్నిన" యన్న మాట నన్నయ ప్రయోగించాడు. ఈ పని అతనికి తెలిసీ తెలియకుండా జరిగింది. ఆ పన్నిన వ్యక్తి దివ్య పురుషుడు కావడం వల్ల, అతని ప్రభావం మనస్సు నావహించిం. అతడు పన్నిన పన్నుగడలో వస్తు స్వరూపం తెలియలేదు. అతని అనుగ్రహం కార్యసిద్ధికి తోడ్పడతుందన్న విశ్వాసం ఏర్పడింది. అతడు పౌష్యుని చేరాడు. సత్కారం పొందాడు.

తాను వచ్చిన వాడు అతిథి, అతడు తెచ్చి ఈయవచ్చు. కాని, అట్లా చేయలేదు. ఆ కుండలాల్ని ఆమె నుండి "ఇప్పించికొమ్మన్నాడు. ఉదంకుని పరీక్షకు నిలిపాడు. ఆ కుండలాలు తెప్పించియిమ్మన్నాడు. పౌష్యుడు నీవయోగ్యుడవనకుండా వ్యక్తి నిర్దేశంగా కాక సాధారణ విషయంగా "నిన్ను ఆశుచివని ఎట్లా అంటాను. నీవు త్రిభువన పావనుడవు! "కాని" ఆ దేవి "పవిత్ర! పతివ్రత!" "అశుచులకు కన్పించదు" అన్నాడు. వెంటనే వృషభ గోమయ భక్షణం అశుచి హేతువుగా తెలిసికొని దానిని నివారించుకొని కుండలాలు పొందాడు. ఆమె "తక్షకుడీ కుండలాల్ని కోరుతున్నాడు. వాడు మాయా దక్షుడు, అభేద్యుడు". నీవు వాని నుండి "రక్షితముగచేసి వెళ్ళుము" "రవినిభతేజా!" యని సంబోధించింది. ఇందులో సూర్యుని తేజ: పుంజం చీకట్లను పొగొట్టినట్లుగా ఈతని తపోతేజం రక్షకుని మాయాజాలాన్ని విచ్ఛిన్నం చేయగలదన్న విశ్వాస స్ఫూర్తి ఉంది. తక్షకుని అభేద్యమైన మాయా స్వరూపం ఉదంకుని రవి నిభ తేజం ముందు తొలగిపోతూందన్న భవిష్యత్కథాంశం వ్యంజితమవుతుంది. ఆమె పవిత్ర! పతివ్రత కాబట్టి ఉదంకుని శక్తి తెలుసుకుంది! శుచివంతుడు కాగానే వెంటనే కుండలాల్ని ప్రసాదించింది. ఆమె మాటలు ఉదంకునిలో అతని శత్రువు గురించి తెలియజేసి, జాగరూకతను వెలిగించాయి. ఉదంకుడు అతిథి తన భర్త అనుమతితోవచ్చిన వాడు. బ్రహ్మతేజోమయుడు. కాబట్టి ఆమె సమయోచిత వర్తనం ఉదాత్తంగా తీర్చబడింది.

ఉదంకుడు మార్గం మధ్యలో కుండలాల్ని శుచి ప్రదేశంలో ఉంచి ఆచమనం ఆచరించే సమయంలో, నగ్నవేషధారి తక్షకుడు వానిని గ్రహించి పారిపోతూంటే, వెన్నంటి పట్టుకున్నాడు. వాడా మాయా వేషం వదలి విషధర రూపంలో భూవివరం ప్రవేశించి పాతాళ లోకం వెళ్ళాడు. అష్ట సిద్ధులు గల ఉదంకుడు వాని వెన్నంటి అహిలోకం చేరుకున్నాడు. పౌష్య మహాదేవి మాటలు యథార్థాలయినాయి. ఉదంకుడు గురుపత్నికి కుండలాలు ఇచ్చే సంతోషంలో ఉన్నాడు. తానధిక శక్తి యుక్తుడన్న విశ్వాసంతో ఉన్నాడు. తక్షకుని గురించి తెలిసినప్పటికీ అతని వల్ల ఒక వేళ జరుగబోయే అపకారం గురించి తన్ని వారణం గురించి ఆలోచన చేయలేదు. ఈ ఏమరుపాటుపై తక్షకుని మాయాదక్షత పని చేసింది. ఉదంకుడనాతంక మతి కాబట్టి, నిర్భయంగా పాతాళలోకానికి వెళ్ళి తపస్సంపన్నుడు కాబట్టి నాగపతుల్ని ప్రసన్నుల్ని చేసుకో నెంచాడు.

ఇక్కడ నన్నయ వ్రాసిన నాలుగు పద్యాలు స్తోత్రగుణం కలవి చాలా ప్రసిద్ధమైనవి, కావ్య శక్తిని భావింపజేస్తాయి. ప్రౌఢమైన పద్య శిల్పాన్ని కలిగి ఉన్నాయి.

**"బహువన పాదపాబ్ధి కుల పర్వత పూర్ణ సరస్సరస్వతీ**
**సహిత మహా మహీభర మజస్ర సహస్ర ఫణాళి దాల్చి, దు**
**స్సహతర మూర్తికిన్ జలధి శాయికి పాయక శయ్యయైన, య**
**య్యహిపతి దుష్టతాంకుడనంతడు! మాకు ప్రసన్ను డయ్యెడున్"**

అనంతుడు మహామహీభరం తాల్చే వాడు, మొదలైన విశేషణాలు అతని సత్త్వాన్ని కర్తవ్యపరాయణత్వాన్ని, ప్రభువైఖరిని, పుణ్య స్వరూపాన్ని భావింపజేస్తున్నాయి. అతని ప్రసన్నతను కోరడంలో, అపకారం పొందిన వ్యక్తి అపకారం చేసిన వానిపై అధికారికి చెప్పుకొనే లోక సహజ వర్తనం చిత్రితమైంది. ఈ విధంగా వాసుక్యైరావత తక్షకులు స్తుతింపబడినారు. సంస్కృత భారతంలో ఐరావత తక్షక స్తుతి మాత్రమే ఉంది. నన్నయ నాగుల్లో అనంత వాసుకుల ప్రాధాన్యాన్ని గుర్తించి వారిని కూడ స్తుతించాడు. ఉదంకునికి దీనివల్ల ఫలితం లభించలేదు.

అచ్చట సితాసిత తంతు పటలాన్ని అనువయించే (నేసే) ఇద్దరు స్త్రీలను, ద్వాదశారచక్రాన్ని త్రిప్పే అరుగురు కుమారుల్ని అశ్వాన్ని అధిరోహించిన మహాతేజస్వియైన పురుషుని చూచాడు. ఆ తురంగం అగ్ని, ఆ పురుషుడు పర్జన్యుడు వారిపట్ల కన్పించేటుల ప్రభావం నెరపింది గురువే. ఆ పురుషుని చూడగానే "అభిమతార్థ సిద్ధి" అవుతుందన్న భావం కలిగింది. అతనిపై మనస్సు కేంద్రీకరించాడు. ఆ దివ్య పురుషుని విపులార్థవంతమైన మంత్రాలలో భక్తితో స్తుతించాడు. దివ్య పురుషుడు ప్రసన్నుడైనాడు. ఈ నాగకులం తనకు వశం కావాలని కోరాడు. దీనికి సమాధానంగా "ఈ అశ్వ కర్ణ రంధ్ర ధ్మానం చేయ"మన్నాడు. ఉదంకుడు తనకు తక్షకుని వలన జరిగిన అపకారాన్ని వివరించాడు. తక్షణం దివ్య పురుషుడు చెప్పినట్లు అశ్వ కర్ణ రంధ్ర ధ్మానం చేసి నాగ లోకాన్ని అగ్ని జ్వాలామయం చేసాడు. ఆ బీభత్సానికి భయ భ్రాంతుడై తక్షకుడు వెంటనే కుండలాల్ని తెచ్చి ఉదంకుని కిచ్చాడు. వాటిని గ్రహించి, దివ్య పురుషుడు అనుగ్రహించిన "మనసుకంటే గాడపు కంటె వేగమైన" హయాన్ని అధిరోహించి వచ్చాడు సమయం దాటకుండా గురుపత్నికి కుండలాల్ని సమర్పించాడు.

అపుడు గురువు తనకేమి తెలియనట్లు, "ఈ యున్న పౌష్యుప్రోలికి పోయి కడుం పెద్ద దవ్వు పోయిన యట్లాయత విమల తపోమహిమా! యిన్ని దినంబు లేల మసలితి! చెపుమా?" అని ప్రశ్నించాడు సంస్కృతంలో "వత్సోత్తంక! స్వాగతంతే! కిం చిరం కృతమ్" అని మాత్రం ఉంది. దీన్ని నన్నయ తెలుగు భాషా స్వభావాని కనుగుణమైన సంభాషణ పద్ధతిలో పౌష్యుని శిష్య వాత్సల్యానికి ప్రతిబింబంగా చిత్రించాడు. "ఈయున్న" అన్నది సామీప్యార్థ బోధకమైంది. తెలుగు నుడి కారంతో అలరిస్తూంది. "విమల తపో మహిమా!" "అన్న సంబోధనంలో నీవు తపో మహిమ కలవాడవు; ఇంత ఆలస్య మెట్లా జరిగిందన్న భావం, తనలోని శక్తి పరిమితుల్ని ఉదంకునికి గుర్తు చేస్తూంది.

శిష్యునికి క్రమంగా కాల స్వరూపాన్ని వివరిస్తూ అతడు పొందిన అనుభవంలో నిహితమైన దివారాత్రాలు మొదలుగా కాలస్వరూపాన్ని వివరిస్తాడు. ఉదంకుడు ఉత్తమ సంస్కారం గల జీవి. తపశ్శక్తి కలవాడే కాని సర్వజ్ఞుడు కాడు. గురు ముఖత: శిష్యునకాజ్ఞానం ప్రపంచింపబడింది. అయినప్పటికీ "ఇంద్రుని గాంచి అమృతాశివగుట నీ కభిమతార్థ సిద్ధి అయ్యె" నని తన సర్వజ్ఞత్వాన్ని సూచిస్తూనే, శిష్య వాత్సల్యంతో తాను వెనుక నుండి సర్వము నిర్వహించిన విధం, తాత్కాలికమైన కష్టా లెదురైనా చివరకు విజయాన్ని పొందడంలో గురు కృపాహేతువు వ్యంజితమవుతూంది. ఈ ఉపాఖ్యానంలో కథాంశాల్ని నడిపేందుకు నన్నయ ఆవలంబించిన పద్ధతి సంస్కృత భారతంలోని అభిప్రాయాన్ని వివరించేదిగా కొత్త అంశాలతో దీప్తి తెచ్చేదిగా ఉంది. కథా పరమార్థాన్ని ప్రసన్నం చేస్తూంది. ఇందులో శుచిత్వం, తపశ్శక్తితో పాటు గురువు అనుగ్రహంతో ఉత్తమ కార్యాన్ని సాధించవచ్చునన్న అభిప్రాయం ప్రకటితమైంది. మానవ శక్తుల పరిమితుల్ని, దివ్య శక్తుల పరిధుల్ని అవగతికి తెస్తూ జీవితంలో ఉపకారం, ఉదారత, త్యాగం, ఆవిష్కృతమైనాయి.

ఇందులో సత్కర్మ ప్రాముఖ్యం భావితమైంది ఈ లక్షణాలు రచనా విశేషంచేత కథలో వివిధాంశాల ప్రసన్నతకు తోడ్పడుతున్నాయి. కథా విషయానికి వస్తే ఉదంకుడు సర్పయాగానికి బీజ భూతమైన పాత్రను నిర్వహించడం ప్రధాన కథతో ఉపాఖ్యానాల అనుబంధాల్ని స్థాపిస్తూంది.

# సర్పయాగం

ఉదంకుడు తక్షకుని అపరాధానికి ప్రతీకారం చేసే సంకల్పంతో జనమేజయుని సమీపించాడు. బహు కాలం తపస్సు చేసాడు. కార్యసాధన కనుకూల సమయం కోసం చూచాడు. దీనికి కద్రూ శాపం సహకరించింది. అతడు మహాతపస్వి, కర్మజ్ఞుడు. కాని పరిహరణ సమర్థుడు కాడు. పైగా అపరాధిని దండించుట రాజధర్మం. ఈ అపరాధి తనకే కాదు రాజు పట్ల కూడ అపరాధం చేసాడు. కాబట్టి జరగవలసింది రాజపరంపగా జరిపించాలను కోవడంలో, నిర్దుష్టత, నిశ్చయత్వం, సముచితత్వం గురించి ఆలోచన కనిపిస్తుంది. ముందు "మిత హిత సత్య వాక్య! జనమేజయ!" అని సంబోధించి, "వంచనోన్నత మతి, అతి కుటిల స్వభావుడు, పరాత్మవివేక శూన్యుడు" తక్షకుడు కారణంగా జరిగిన అపకారాన్ని పేర్కొన్నాడు. సంబోధనలో మానవ రాజ ధర్మం, విశేషణాల్లో తక్షకుడు దండ్యుడు దండించుట రాజ ధర్మం అన్నది ఉదంకుని అభిమతం. జనమేజయుడు మితమైనా హితంగా పరిణమించే సత్యం మాట్లాడే స్వభావం కలవాడు. తనపట్ల అభిముఖ్యాన్ని కలిగే విధంగా చేయడమే ఉదంకుని ప్రధానోద్దేశం. తన కపకృతి చేసిన వాడు. తక్షకుడు వంచన క్రియలో ఉన్నతమైన మతి, ఎదురుగా నిల్చే శక్తిలేదు. కుటిల స్వభావుడు. పాములు వంకరగా పోవడమే కాని తిన్నగా పోవు. పరాత్మ వివేకం లేనివాడు. ఇది చేయవచ్చు ఇది చేయకూడదన్న వివేచన లేనివాడు అత్యల్పుడు ఉదంకుడు, "అదియునుగాక" అన్న చిన్న వచనంతో మలుపు తీసుకొని పరీక్షిత్తుకు తక్షకుడొనర్చిన అపకారాన్ని వివరించాడు. మొదట చెప్పింది తనకు సంబంధించింది. దీన్ని స్వార్థ మనుకోవచ్చు. ఇపుడు చెప్పేది స్వార్థం కాదు ఇతరులకు సంబంధించింది. మహాగుణ సంపన్నుడైన నీ తండ్రిని తక్షకుడు చంపాడనడంలో జనమేజయునిలో పితృహంతకుని పట్ల క్షమ వహించడానికి వీల్లేని స్థితి కల్పితమైంది. ముందుగా అపకృతికి గురియైన వ్యక్తి గుణ గణాలు మనసున కెక్కించి ఆ తరువాత అపకారం చేసిన వ్యక్తి పట్ల క్రోధాన్ని జ్వలింపజేయడం జరిగింది. పరీక్షితుడు సామాన్య వ్యక్తి కాడు. "అనవరతార్థ దాన యజనాభిరతుడు, భరతాన్వయాభివర్ధనుడు, సకల ప్రజా హిత విధానుడు, ధనం జయ సన్నిభుడు, అతిదాంతుడు" మొదలైన విశేషణాలు వినగానే పితృ ప్రేమతో వంశ గౌరవ భావంతో

ధర్మాభిమానంతో మనస్సు కదలింది. మహానుభావుడైన పితృదేవునికి, ఒక "భుజగజాల్మ్"ని వల్ల మృత్యువు సంభవించడం దు:ఖానికి కోపభావం తోడైంది. ఈ విధంగా ఉదంకుని మాటలు జనమేజయునిలో ప్రతీకార గుణాన్ని ప్రేరేపించాయి. నన్నయ కథా రచనలో జనమేజయునిలో పితృ గుణ వంశ గౌరవ కీర్తనంతో ఆనంద స్థితి పితృ దుర్మరణంతో సంధుక్షితమైన విషాద స్థితి చేకూరాయి. పైకి మౌనంగా ఉన్న జనమేజయునిలో లోలోపల జరిగే మానసికమైన పరివర్తనం ఊహకు వదలి వేయబడింది. తక్షకు డేక విప్రసంబోధన నెపంతో ఈ పనిచేసాడు. "నీవును భూసురాపాదిత సర్పయాగం"లో సర్ప జాతిని భస్మీకృతం చేయవలసిందిగా సూచించాడు. అతడు స్తుతించినప్పటికీ సర్పజాతిలో ఒక్కరు ప్రసన్నం కాలేదు అయితే జనమేజయుని విషయంలో తక్షకు డొక్కడే అపరాధి. తజ్జాతిని నిర్మూలించాలనే ప్రతిపాదనను "ప్రల్లదుడైన యొక్క కులపాంసను చేసిన దాన తత్కులం బెల్లను దూషితంబగు యేమి అపూర్వమ"ని సహేతుకంగా సమర్థిస్తాడు. సర్పయాగ భావనకు జనమేజయుని మనస్సులో నాటడంలో కథారచన మానవ సహజమైన ఆలోచనతో ప్రవర్తనతో ప్రసన్న తరమవుతూంది.

ఇక్కడొక విషయం, ఉప కథల్లోని అంశాల్ని ప్రధాన కథతో అనుసంధించడంలో, ఒక విధంగా ఉపకథ ప్రయోజనాన్ని విస్తృతి పరచడంలో నన్నయ అవలంబించిన కథా కథన శిల్పం విశిష్టమైంది. ఇది సృజన కళపై ఆధారపడింది, నిర్వహ శిల్పంతో శోభాకృతి పొందింది. పై పద్యంలో దుర్యోధనుడు హేతువుగా పరిణమించిన మహాభారత కథ మెరుపు తీగెలా మెరుస్తుంది. ఇక్కడ లోక సామాన్య విషయం చేత విశేషమైన ప్రధాన కథా విషయం దీపితమవుతూంది.

(2)

సర్పయాగం భారతేతిహాసానికి భూమిక వంటిది. సర్పయాగానికీ మహాభారత కథకూ గల సంబంధం మౌలికమైన తత్త్వ విషయోపేతమైంది. పంచమ వేదమైన మహాభారత పరమార్థానికి అప్రత్యక్ష సంబంధం కలిగిన సంగ్రహ బింబంగా తీర్చబడింది.

మహాభారత కథ జీవుల వివిధ కర్మల సంపుటి, ఇది కథా రచనలో వర్ణితమైంది, వివృతమైంది, వ్యాఖ్యాతమయింది. కర్మానుభవం ఎంత వారికైనా అపరిహారణీయ మయింది. కర్మ సూత్రమాధారంగా సర్వ భారతీయ చింతన సాగింది. ఇదే సర్పయాగ

కథా ప్రయోజనం. జీవునికి ఫల హేతుకమైన కర్మ అనివార్యమైంది ఏ కర్మాచరణ మున్నంతవరకు ఫలమేదో రూపంలో పొందడం జరుగుతుంది. నైష్కర్మ్య సిద్ధి చేత జీవుడు ముక్తుడవుతాడు. వేద లక్ష్యమిదేమోక్షం!

సర్పయాగంలో కర్మ ఫలాన్ని అనుభవించింది సర్పాలు! భారత కథలో మానవులు! మానవులకూ ఇతర జీవులకూ భేదముంది. మానవేతర జీవులకు కర్మలు క్రియామాత్రాలు. వాటి ఫలం క్రియను బట్టి కలుగుతుంది. మానవుల విషయంలో ఒక్క క్రియకే కాక, దాని వెనుక నున్న సంకల్పానికి ప్రాధాన్యం ఉంది. ఫలాకృతి జీవితంలో భావనా వ్యాపారం లేదా సంకల్పం రూపాన్ని బట్టి ఉంటుంది. మానవునికి భావన లేదా సంకల్పం ఉంటుంది. కాబట్టి ముక్తి కవకాశముంది. మనస్సు సర్వేంద్రియ ప్రవర్తకమైంది. దీనితో ఒక్క మానవ జీవి మాత్రమే స్వస్వరూపం తెలుసుకొని ఆత్మజ్ఞానాన్ని పొందే అవకాశముంది. ఇతర జీవులకీ సామర్థ్యం లేదు. స్వయంభువు ఇంద్రియాలను బహిర్ముఖాలుగా సృష్టించాడు. అవి లోపలికి చూచేందుకు సమర్థవంతమైనవి కావు. లోని అంతరాత్మను తమకు తాముగా దర్శింపలేవు. కావున వాటిని అంతర్ముఖంగా పరిణమింపజేసిన ధీరుడు, ప్రత్యగాత్మానుభవాన్ని పొందుతాడు. ఈ ధీరత్వం అంతర్ముఖీన శక్తి గల మానవ జీవికే సాధ్యం. అనివార్యమైన కర్మల్ని దేహమున్నంత వరకు అనుభవించి చివరకు పునరావృత్తి రహిత మొనర్చుకునే వీలుంది. వేద ధర్మానికి ఆయువు పట్టయిన 1. జీవుడు, 2. కర్మ, 3. పునరావృత్తి. 4. ముక్తి సంపుటి గురించి చేయబడిన వ్యాఖ్యానమే మహాభారతం. సర్పయాగంలో సర్పజీవుల కన్న మహాభారత కథలో మానవ జీవలది పై స్థాయి. ఒక్క తక్షకుని వలన సర్ప ప్రళయం జరిగింది. ఒక్క దుర్యోధనుని వలన కౌరవ వంశ వినాశనం జరిగింది. ధర్మ సంచరాణాని కక్కడ ఉదంకుడు, ఇక్కడ పాండవులు ప్రతీకలు కుల వినాశన కారణభూతులైన పాంసను లొక్కరే, అక్కడ తక్షకుడు, ఇక్కడ దుర్యోధనుడు. "ప్రల్లదుడైన ఒక్క కుల పాంసను జేసిన దానతత్కులం బెల్లను దూషితం బగుటయేమి యపూర్వము" అన్న మాటల్లోని ఆంతర్యమిది. అయితే ఇందులో మరో విచిత్రముంది. సర్ప ప్రళయంలో సర్పకులమెల్ల నశింపలేదు. ఆస్తీకుని వల్ల మధ్యలో ఆగిపోయింది. దీనికి కారణం సర్పకులంలో కొందరి ధర్మ ప్రీతియే. కద్రువను తల్లిగా మన్నించి నప్పటికి అధర్మ క్రియకు పాల్పడని పాములున్నాయి. వారి ధర్మప్రీతి కులాన్ని రక్షించింది. ధార్తరాష్ట్ర

కులంలో ఎవరికి ధర్మ ప్రీతి లేదు. కాబట్టి చివర దాక సాగింది. మహాభారతంలోని ధర్మాధర్మ నిరూపణకు సర్పయాగ కథ భూమికా ప్రాయంగా ఉంది. ప్రధానమైన తత్త్వప్రపంచంపై దృష్టిని ప్రసరింపజేస్తూంది.

ఉదంకుని అభిప్రాయాన్ని జనమేజయుడు తన మంత్రులతో సంప్రదించాడు. సర్ప యాగ మారంభించాడు. యజ్ఞం మొదలైంది. యాజ్ఞికుల మంత్రాలతో సంజ్వలితమైన హోమ ప్రభావం వల్ల సితాసిత పీతారుణ వర్ణ దేహులు ఏ త్రి పంచ సప్త నవ నానా మస్తకులు నాగేంద్రులు అగ్నిలోపడి బూడిద కావడం మొదలైంది. ఆస్తీకుడు తల్లియైన జరత్కారువు మాట విని వాసుకి ప్రముఖుల్ని ఆశ్వాసించి, సకల వేద వేదాంగ పారగులయిన విప్రవరులతో జనమేజయుని యజ్ఞశాలలోకి ప్రవేశించాడు. అతడు లోపలికి ప్రవేశిస్తూనే స్వస్తి వచన పూర్వకంగా జనమేజయుని కొనియాడాడు. ఈ సందర్భంలో నన్నయ రచనా శిల్పం ఆరు పద్యాల్లో విస్ఫుటమయింది. మొదట పారీక్షితుని ప్రశంస, యజ్ఞ వర్ణనం, యాజకోత్తమ ప్రశస్తి కృష్ణద్వైపాయన కీర్తనం, అగ్నిభట్టారక స్తుతితో సమయోచితంగా నన్నయ కథాంశాల నిర్వహణ శిల్పాన్ని నిరూపిస్తూంది. ఇది ప్రస్తుత విషాద స్థితిని నివారించేందుకు శాంత స్థితి కభిముఖంగా ప్రవర్తమానమయింది. సభలో నున్న వారినందరి దృష్టిని తన వైపు మరల్చే ప్రభావ శీలంగా పరిణమించడం విశేషం. సత్పురుషుడైన జనమేజయుడాకర్షితుడై, "మునీంద్రా! నీకేమి ఇష్టం! దానిని ఇస్తాను అడుగు" అన్నాడు. వెంటనే ఆస్తీకుడు "మానిత సత్య వాక్య" అని సంబోధించి అభిమన్యు కులోద్వహుడవు "శాంతమన్యు సంతానుడవు" అని జనమేజయుని వ్యక్తిత్వాన్ని కొనియాడాడు ఉద్దేశించిన ఫలసిద్ధికై ప్రయత్నించాడు. ఈ సంబోధనం విశేషణాల్లో ప్రతి పదం సాభిప్రాయం కలిగిందే కాక, జనమేజయుని మనస్సుపై పనిచేసింది. ఆ సమయంలో విశేష స్థితి ఏర్పడింది. మొదట అతని సత్యవాగ్వైభవాన్ని పేర్కొని తానడుగబోయేదాన్ని నెరవేర్చే బాధ్యతను నిలిపాడు. వెంటనే "అభిమన్యు" శబ్దం చేత ముందు క్రోధం దాని కభిముఖుడుగా చిత్రించి, ఆపైన "శాంతమన్యు" శబ్దం చేత క్రోధ శాంతి (శాంతించిన క్రోధం) లక్ష్యంగా తాను వచ్చిన కార్యాన్ని స్ఫురింపజేసాడు. మరో విషయం కొనియాడబడిన సత్య వాక్యము కలవాడు అభిమన్యుడు కులాన్ని ఉద్ధరించినవాడు. శాంత మన్యు సంతానుడు ఈ మూడింటిలో మొదటిది వ్యక్తిగతమైంది, రెండోది మూడోది కులంలోని మహాపురుషుల తేజో రూపాన్ని

కీర్తి ప్రతిష్ఠల్ని పొందింది పరంపరాగతమైంది. ఈ విధంగా జనమేజయుని మనో రూపాన్ని క్రమంగా పరివర్తనకు లోను చేసే ప్రయత్నం దశలు దశలుగా కన్పిస్తుంది. ఇది ఫలించింది. దీనితో సర్పయాగం ఉపసంహరింపబడింది. ఆస్తీకుని అభిమతం పూర్తి అయింది. ఇది నిజంగా ఎవరి చేతలోను లేదు పాముల కర్మ ననుసరించి జరగింది. ఈ పరిస్థితుల్లో చావ వలసిన పాములు చనిపోయాయి. మిగులవలసినవి మిగిలాయి. నన్నయ ఈ దృష్టితో కద్రూశాపం రచించాడు. జనమజయుడనే రాజు చేసే "సర్పయాగం నిమిత్తంబున పాములు పంచత్వము సని యెడుమని కద్రువ యురగములకు శాపమిచ్చింది. కద్రువ మాటల్లో ఒక విశేషముంది. కద్రువ సామాన్య పద్ధతిలో 'పాములు' అన్నమాట వాడింది, కాని మీరందరు అని అనలేదు. పాములనడం వల్ల దుష్టమైన ఉరగాలకే ఈ శాపం వర్తించింది. వాటి మృత్యువుతో సర్పయాగ మాగింది. దీన్ని "ఉద్దత నాగేంద్రుల"న్న మాటలో నన్నయ సూచించాడు. దీన్ని బట్టి కథలో భిన్న భిన్న స్థలాల్లో ఉన్న విధాంశాల్ని తగిన విధంగా సంయోజించి కథా పరమార్థాన్ని ప్రసన్న మొనర్చడాన్ని నిర్వహణ శిల్పంలో భాగంగా గుర్తించవచ్చు.

ఇట్లా ఎన్నో అంశాలు ఒక దానితో మరొకటి ముడిపడి, ఎంతటి వ్యక్తి చేతిలోను లేని జీవిత గమన రహస్యాన్ని భావింపజేస్తున్నాయి. సనామమయిన జరత్కారువుకు జరత్కార మునికి జన్మించిన ఆస్తీకునిచే సర్పయాగ మాగవలసి ఉంది, ఇది బ్రహ్మవచనం కూడాను. బహు క్లిష్టమైన అల్లికలో ఇట్లా ఎక్కడెక్కడో పరచబడిన సందర్భాల్ని గుర్తించి భవిష్యద్విషయాలు తత్పూర్వమే నిర్ణీతమయి సర్వం తదభిముఖంగా ప్రవర్తించడం జరుగుతుందన్న విషయం అక్లిష్టంగా ప్రయోజన సహితంగా సమున్మీలితం కావడం జరిగింది. కథా గమనంలో అర్థ స్ఫూర్తిలో ప్రసన్నతకవకాశం కలుగుతూంది. ఏ జీవుడు స్వతంత్రుడు కాడు. ఒక స్థితి చేత నడిపింపబడతాడు పాలింపబడతాడు, ఇది కర్మ బంధురమైంది. ఈ సర్పయాగ కథా తత్త్వం మానవ జీవితానికీ వర్తిస్తూంది. మహాభారతం మానవ జీవిత గతి విశేషమే. ఇది నన్నయ రచనలో బాగా గుర్తింపబడింది, వ్యాఖ్యాతమయింది.

# శకుంతలోపాఖ్యానం

సంస్కృత మహాభారతం విస్తృతమైన ఇతిహాస గ్రంథం. ఇందులో ప్రధానకథతో పాటు ప్రత్యక్ష సంబంధం దగ్గరి సంబంధం దూరపు సంబంధం కలిగినవి, అనేకమైన ఉపాఖ్యానాలున్నాయి. ప్రధాన కథను నిర్వహించే పద్ధతికీ ఈ కథల్ని తీర్చే తీర్పుకీ భేదముంది. ఇది కూడా వాటి ప్రధాన్యాన్ని బట్టి అప్పటి ప్రయోజనాన్ని బట్టి భిన్న భిన్నంగా తీర్చబడతాయి. ప్రధాన కథలో సన్నిహితమైన సంబంధమున్న కథలను నన్నయ తీర్చే తీరు ఉదంకుని కథ సర్పయాగ కథల్లో స్పష్టం. మహాభారతంలో ఉపాఖ్యానాల్లో మకుటాయమానమైంది, శకుంతలోపాఖ్యానం. వ్యాస మహాభారతంలో ఈ ప్రధానమైన కథను గ్రహించి సంస్కృతంలో కాళిదాసు "అభిజ్ఞాన శాకుంతలం" నాటకాన్ని లోకోత్తరంగా రచించాడు. కొన్ని మార్పులు ప్రవేశపెట్టాడు. ఈ నాటకంలో శకుంతల కథయే ప్రధానం. మహాభారతంలో ప్రధాన కథ వేరు. శకుంతలోపాఖ్యానం ప్రధాన కథ కాదు. ఈ భేదం వల్ల రచనలో భేదం సహజం. మూలాన్ని కాదనడానికి వీల్లేని నన్నయ, శకుంతలోపాఖ్యానాన్ని తనదైన సృజనాత్మక కళను నిర్వహణ శిల్పాన్ని ప్రదర్శించాడు. తనకు ముందున్న కాళిదాసు అభిజ్ఞానశాకుంతలం కూడా పరోక్ష ప్రభావాన్ని నెరపే వీలుంది. నన్నయ భారతంలో శకుంతలోపాఖ్యానం తనదైన ముద్రను పొందింది. "అనన్య సాధారణ గుణయుక్తు"డైన దుష్యంతుని బాల్య వర్ణనంతో ఆరంభమైంది. ఈ గుణాలు బాల్య చేష్టల్లోను యౌవనోత్సాహంలోను క్షత్రియోచితంగా విస్తరింపబడినాయి. ఆ తరువాత ఆత్మాయత్తమైన భూవలయంపై పరిపాలనా శక్తి చిత్రితమైంది. ఈ సందర్భంలో "సూర్య కిరణాలు గాలి చొర రాని మహారణ్య దేశాళితో పేర్కోడంలో విశేషముంది. అరణ్యాలు తాపసాశ్రమాల కాస్థానాలు. శకుంతలా దుష్యంతుల సమాగమం ఇక్కడే జరిగింది. "ఆదిక్షత్రచరిత్రనేలె" అతని రాజ్యం ఉంది. రుజ క్షయం శారీరకాలు. శోకాదులు మానసికాలు, కథలో లోకాపవాద భీతి వల్ల ప్రధాన పాత్రకు శోకాదులు కలుగనున్నాయి. సాధారణంగా సాగిపోయే జీవితం గురించి ఎవరికీ పట్టింపు ఉండదు. అసాధారణ స్థితిలోనే ఆసక్తి ఉత్సుకత వ్యగ్రత ఏర్పడతాయి. అపుడే నీతి ధర్మం న్యాయం గురించి ఆలోచన మొదలవుతుంది.

సాధారణ స్థితి నుండి విశేష విపరీత వ్యతిరేక స్థితుల్లోనే కథ పట్ల అభిలాష కలుగుతుంది. కథలో మలుపు కథకు విశిష్టత చేకూరుతాయి.

ఒకనాడు దుష్యంతుడు మృగయా వినోదం కోరి ఆదిత్య హయాల కంటే వేగం గల వాహనాలు గల రథంపై అరణ్యానికి వెళ్ళాడు. వేటలో అలసిపోయాడు. ఆ వనశోభకు ముగ్ధుడై ముందుకు వెళ్ళాడు. 'అతి రుచిరాగతుండయిన యాతనికిన్ హృదయ ప్రమోద మాతతముగ నవ్వనంబున లతా లలనల్ మృదులానిలావ వర్జిత కుసుమాక్షతావళులు సేసలు పెట్టిన యట్టులయ్యె, సంపత దళినీ నినాద మృదుభాషల దీవన లొప్పు నిచ్చుచున్" ఆ సమయంలో మిక్కిలి మనోహరుడైన అతిథి దుష్యంతుడు, అతని హృదయం సంతోషం కలిగేట్టుగా ఆవనంలో తీగెలనే స్త్రీలు ప్రవర్తించాయి. ఎట్లాగంటే, కదలే తుమ్మెదల ఝంకార మృదు శబ్దాల చేత దీవెన లిస్తూ, మంద మారుతం చేత రాలే పూలను తలబ్రాలుగా పోస్తూ అలరించాయి. ఈ సన్నివేశంలో అతిథి మర్యాద స్వాగతం దీవెనలు తలబ్రాలు కలిసిన స్థితి కల్పన, మంగళమయ వాతావరణంలో వైవాహిక స్ఫూర్తిని కలిగిస్తూంది. దుష్యంతుని ప్రవేశం విధి చోదితమయిన, విశేష ఘటనకు సూచికగా చిత్రితమయింది. దీని మూలంగా వనశోభా వర్ణనం చేయబడింది.

**"మారుతా కలితాస్తత్రద్రుమా: కుసుమ శోభితా:**
**పుష్ప వృష్టిం విచిత్రాం తు, వ్యసృజంస్తే పున: పున:**
**దివ స్పృశోథ సంఘుష్టా: పక్షిభిర్మధురై స్వనై:**
**విరేజు: పాదపాస్తత్ర విచిత్ర కుసుమాంబరా:"**

ఈ ప్రకృతి వర్ణనతో పాటు రూపకాలంకార రమణీయంగా తెలుగులో శుభాస్పద వాతావరణం కల్పితమైంది. తత్కాల వసంత శోభను మానిని ఛందస్సులో ఆశ్రమ రూపాన్ని కవిరాజ విరాజితం ఛందస్సులో వర్ణించాడు. విశేష వృత్తాన్ని ప్రయోగించి విశేష స్థితిని తలపించడంతో రచనకు స్వతంత్రమైన సృజన దీప్తి వచ్చింది. ఇది దుష్యంతుడు పొందిన విశేష మానసిక స్థితిని, సంతోష భావనను సూచిస్తూంది. దుష్యంతుడు పూర్వం, అనేకాశ్రమాలు దర్శించి ఉండవచ్చు, కాని జగత్పావనమైన

ఈ ఆశ్రమ ప్రభావం, వేరుగా ఉంది. అతని జీవితంలో గొప్ప మార్పుకు హేతువు కానుంది. కథలో వచ్చే మలుపును సూచించటానికి విశేష వృత్తాలు వాడబడినాయి. ఇంకా దుష్యంతుని మనస్సుపై కలిగించిన అపూర్వ ప్రభావాన్ని సూచించటానికి కూడా విశేష వృత్తాలు పనికి వచ్చాయి. తరువాత ఆశ్రమ వర్ణనం కణ్వుని మహత్తును చిత్రిస్తూంది. ఇక్కడి దృశ్య పరంపర ఆ ఋషిని దర్శించే కోరికను కలిగించింది. పరిజనాన్ని వదలి తానొక్కడే లోనికెళ్ళాడు. "తన్వి! పయోజ దళాయతాక్షి సంకుల మిళితాళి నీల పరికుంచిత. కోమల కుంతలన్ శకుంతల"ను చూచాడు. ఆశ్రమానికి వచ్చే ముందు "సంపతదళినీ" సమూహాన్ని చూచాడు. ఈ అనుభవం అతని మనస్సులో నిలిచింది. ఇపుడు శకుంతల కుంతలాల్లో పర్యవసించింది. కవి వర్ణనం దుష్యంతుని మనోభావం రెండూ ఐక్యమయిన భావనా విధం ఇది. ఆశ్రమంలోని ప్రకృతికీ శకుంతలకూ విడదీయరాని సంబంధముంది. ఇరువురూ కణ్వముని పోషణలోని వారే. పెంపుడు బిడ్డలే, ఆశ్రమంతో శకుంతల సంబంధం దేహ మనోగతమైంది.

మూలంలో దుష్యంతుడు "శూన్యం దృష్ట్వా తదాశ్రమమ్, ఉవాచ క ఇహేత్యుచ్చైర్వనం సన్నాద యన్నివ"యని ఉంది. శూన్యమైన ఆశ్రమాన్ని చూచి "ఎవరిక్కడ?" అని బిగ్గరగా ప్రతిధ్వనించేలా పలికాడు. నన్నయ దీన్ని తొలగించాడు. కణ్వుడు కులపతి! అతడా సమయంలో లేకపోయినా మిగిలిన వారెవరో బాధ్యతల్ని వహించడం జరుగుతుంది. ఆశ్రమంలో పిలువకుండానే శకుంతల దర్శం కావడం కణ్వ మహర్షి బాధ్యతల్ని స్వీకరించిన మూర్తిగా సహజత్వాన్ని పొందడం జరిగింది ఆమె దుష్యంతుని అనంత విలాసమును జయంతుని వలె చూచింది. సంభ్రమాన్ని పొందింది. అతనిలో రాజ లక్షణం కన్నా వైయక్తిక లక్షణం ఆమెకు నచ్చింది. అయితే తరువాత దుష్యంతుడని తెలియడంతో అనుభూతి స్పందనానికి బదులు సంభ్రమం సహజం. నిజాని కామె రాచకన్యే. ఆశ్రమ వాతావరణంలో పెరిగింది. అర్ఘ్య పాద్యాలు సమర్పించింది. కుశల మడిగింది. దుష్యంతుడు "అక్కన్యకం జూచి" అనడంలో ఆమె కన్యాత్వమాతని దృష్టికి వచ్చింది. కణ్వుడడవికి పండ్లు తేవడానికి వెళ్ళాడు. తమ రాక తెలిస్తే వారిపుడేవస్తారన్నది. అతని రాక కణ్వుని కెట్లా తెలుస్తూంది? ఎవరైనా వెళ్ళి చెప్పాలి! ఇది కేవలం మర్యాదా వాక్యం. వారు వచ్చే వరకు ఇక్కడ ఉండవలసిందిగా

సూచన. ఆమె రూప లావణ్య గుణ సౌందర్యానికీ ఆశ్రమానికీ పొత్తు కుదరడం లేదు. "నీ వెవరవు? ఇక్కడి కేల వచ్చితివి?" అని ప్రశ్నించాడు. దుష్యంతుని లోను శకుంతలలో కలిగినట్లు గానే సౌందర్యగతమైన మనోభావం కలిగింది. ఆమె దుష్యంతుని ప్రశ్నకు సమాధానంగా "జగతీ వల్లభ!" సంబోధనం రాజధర్మాన్ని "ధర్మ స్వరూపుడు" "జగదారాధ్యుడు" విశేషణాలు కణ్వుని మహనీయత్వాన్ని సమాజంలో గౌరవాన్ని తలపిస్తున్నాయి. వీటి అవసరం మును ముందు వస్తుంది. "కణ్వస్యాహం! భగవతో దుష్యంత! దుహితా మతా" అని మూలం. భగవంతుడైన కణ్వుని దుహితగా పేర్కొబడింది. దుష్యంతుని జగతీ వల్లభత్వానికి సమానంగా కణ్వుని జగదారాధ్యత్వం ప్రసక్తమైంది. కణ్వునికి దీన్ని మించి అగణిత ధర్మ స్వరూపం అధికం. శకుంతల అనుకోకుండా ధర్మ స్వరూపాన్ని దుష్యంతుని దృష్టికి తేవడంలో భవిష్యత్తు కథా గమన దృష్టితో ఔచిత్యముంది. అయితే అప్పుడు మాత్రం ఏదో సామాన్యమైన సంభాషణ వాక్యం వలెనే ఉంది. ఆ పైన కథలో ప్రాధాన్యం వహిస్తుంది.

శకుంతల విషయం దుష్యంతుని సందేహంలో ముంచింది. "ఇది మునికన్య యేని?" హృదయం ఈమె యందు లగ్నమైందేమి? ఈ మాటలు నమ్మలేను. ముని విజితేంద్రియుడని లోక ప్రసిద్ధి. నిజం తెలుసు కోవాలని నిశ్చయించుకుంటాడు. సందిగ్ధావస్థలో పడిన వయస్సు బయటికి రావాలనే ప్రయత్నం! తనపై ప్రత్యయంతో సాగే ఆలోచన! దుష్యంతుని ఉదాత్త గుణాన్ని తలపిస్తాయి. అభిజ్ఞాన శాకుంతలంలోను ఈ సందిగ్ధావస్థ మరింత ఉత్కర్షాజనకంగా చిత్రితమైంది.

"ఆసంశయం క్షత్ర పరిగ్రహక్షమా, యదార్య మస్యా మభిలాషి మే మన: సతాం హి సందేహ పదేషు వస్తుషు, ప్రమాణమంతః కరణ ప్రవృత్తయః" ఈమె క్షత్రియ పరిగ్రహ యోగ్యయే! సంశయం లేదు! ఎందుకంటే ఈమె యందు నా మనస్సు అభిలాషను పొందింది సందేహాస్పదమైన వస్తువుల విషయంలో సత్పురుషులకు అంతః కరణ ప్రవృత్తులే ప్రమాణం!" దీనితో పాత్ర స్వరూపంపై పైకెదిగింది.

"తాను సత్పురుషుడు! అయోగ్యమైన పని చేయదన్న ఆత్మ ప్రత్యయం ఉంది. చివరకు అంత: కరణాన్ని ప్రమాణంగా స్వీకరించడంలో సమస్య

పరిష్కారమయింది. ఇది సామాన్యులకు సాధ్యం కానిది. నన్నయ దుష్యంతుని ఆత్మ ప్రత్యయాన్ని సత్పురుష లక్షణాన్ని కొన్నిపరిధుల్లో ధ్వనింపజేసాడు.

కణ్వుని "హృదయ నందిని" శకుంతల తన జన్మ ప్రకారం వివరించింది. ఆమె రాజపుత్రి అని తెలియడంతో అతని మనస్సు మన్మధ బాణాలకు గురి అయింది. తుమ్మెదలు వ్రాలడంతో చలించే కమలాకృతి పొందింది. "ఇది ముని కన్య యేని?" అని సందేహాస్పదస్థితిలో ఆగింది, శకుంతల జన్మ రహస్యం తెలిసి "ఇది మునినాథ కన్య యని" సందేహ నివృత్తితో ముందుకు నడిచింది. రెండు చోట్ల ఒకే విధమైన ఎత్తుగడతో పద్యాలు రెండూ నిర్మితమయినాయి. మెదటి దానిలో సందేహం, ఆలోచన, ఔత్సుక్యం, ఆవేదన, రెండో దానిలో సందేహ నివృత్తి, స్పందనం, ఉల్లాసం ఆశ్వాసనం అనుభవానికి వస్తాయి.

దుష్యంతుడు తన యందు శకుంతల అనురాగాన్ని ఉపలక్షించాడు. "ఈ వల్కలాజినాలకు ఈ విటప కుటీ వాసానికీ నీ రూప కాంతి నిర్మల గుణాలు తగినవేనా? అని ప్రశ్నించాడు. "ఈ ముని వల్లె"లో ఉండటం దేనికి? "అనురాగ మొప్పగా భామిని! నాకు భార్యవయి" అని స్పష్టంగా తన మనోవాంఛను వ్యక్తం చేసాడు. "అశేష రాజ్య లక్ష్మీ మహనీయ సౌఖ్యాల్ని అనుభవింపుమని" ఆహ్వానించాడు. ఆమె లజ్జతో అవనత వదన అయింది. ఇట్టులనియె "పతికి", పతి శబ్దానికి 'రాజ', అర్థముంది కాని "భర్త" అర్థమందే రూఢం, కణ్వుడు తప్పకుండా అంగీకరిస్తాడనే నిశ్చయంతో "కరుణానిరతులు", "ధర్మ స్వరూపులు" వచ్చి "యిచ్చిన పాణి గ్రహణము సేయుమ"ని పలికింది. దుష్యంతు డామెను ఒప్పించాడు. తన కుమారుని "యౌవ రాజ్యాభిషిక్తు జేయగా వరం కోరింది. అతడు ఒప్పుకున్నాడు. ఆమె గాంధర్వ వివాహాని కంగీకరించింది. ఇక్కడొక విషయం. ఆమె "వరము ప్రసన్న బుద్ధి నవవద్యముగా నిమ్మ"ని కోరింది. ఏ అరమరికలు లేకుండా, మొగమాటం లేకుండా తరువాత ఏవిధమైన సమస్యలు లేవనెత్తకుండా, నిష్కల్మషమైన అంతరంగాన్ని ఆపేక్షించింది. దోష రహితంగా ఉండాలని పలికింది. సంతాన మనగానే తనతోపాటు భర్త ప్రమేయం గౌరవం ప్రశస్తి కూడా చేరుతాయి. ఇది ఇరువురికి చెందింది. మును ముందు కథలో అపవాద భయం దృష్ట్యా "ప్రసన్న బుద్ధి" యన్న ప్రయోగంలోని ఆంతర్యం

నన్నయ కథా నిర్వహణ శిల్పాన్ని సూచిస్తూంది. మూలంలో శకుంతల బ్రహ్మీవివాహాన్ని కూడ కోరినట్లుంది. కథకు దీని ఆవశ్యకత లేదు. కాబట్టి నన్నయ వదలి వేసాడు.

దుష్యంతుడు వెళ్ళిపోయాడు. ఆమెలో ధైర్యం సడలింది. తమ గాంధర్వవివాహం కణ్వునికి తెలియకుండా జరిగింది. అతడు ఒప్పుకోవచ్చునన్న ధైర్యమున్నప్పటికీ, భయపడింది. దుష్యంతుని సమీపంలో భయభావం లేదు. అప్పుడున్న మానసిక స్థితిలో రాగ భావం తప్ప మరేమి లేదు. తనను ప్రేమించిన వ్యక్తి దగ్గరలో లేడు. ఇది వివాహ విషయం. స్త్రీ పురుషుల శాశ్వతమైన బంధానికి ప్రతీక. తనకూ సంతానానికి గౌరవాన్నిచ్చేది. తనకు సమాజంలో స్థాయిని కల్పించేది. మూలంలో దుష్యంతుడు భయపడినట్లుంది. బాధ్యతను గుర్తించిన పురుషుడు కాస్త భయపడడం కూడా సహజమే.

కణ్వుడు వచ్చాడు, లలిత శృంగార భావంతో లజ్జావనత వదనయై భీతయై యున్న కూతురును చూచాడు. దివ్య జ్ఞానంతో సర్వం తెలుసుకున్నాడు. శకుంతల పూర్వ స్థితికీ ఇప్పుడున్న స్థితికీ భేదం ఉంది. ఆమెలో మార్పు కన్పిస్తూంది. శృంగార భావంతో లజ్జతో, భయంతో ముప్పిరి గొన్నది. అతడు ఉదార హృదయంతో వర్తించాడు. ఆమెకు జన్మించిన వ్యక్తి చక్రవర్తి అవుతాడని గుర్తించాడు. వరం కోరుకొమ్మన్నాడు. ఆమె "తన చిత్తం ధర్మము నందుండునట్లు, పుత్రుడు దీర్ఘమైన ఆయువు ఐశ్వర్యం బలంతో వంశకర్త" అవాలని కోరింది. తాను చేసిన పని దోషయుతం కాదు, ధర్మ బద్ధమైందన్న విశ్వాసం కన్పిస్తూంది. మొదటి దానిలో కణ్వాశ్రమంలో పెరిగిన వ్యక్తిత్వం ఉంది. రెండో దానిలో తాను చేసిన పనికి (గాంధర్వ వివాహానికి) చిహ్నంగా ఉత్తమ క్షత్రియ భావన ఉంది. మొదటిది పరానికీ రెండోది ఇహానికి సంబంధించింది. ధర్మ బద్ధమైన చిత్తం వ్యక్తిని సమున్నత స్థితికి చేరుస్తుంది. "విధి చోదితమైన పరిస్థితి నుండి శకుంతల ప్రకాశమాన వ్యక్తిత్వంతో ఉద్గమించిన విధం నన్నయ రచనలో ప్రసన్నాకృతిని పొందింది. ఇంతవరకు శాంతంతో ఆపైన శృంగార భావ సమర్పకంగా సాగిన కథ కొత్త మలుపు తీసుకోబోతూంది.

ఇంతవరకు కథ నడచిన పద్ధతి వేరు ఇక ముందు నడచే తీరు వేరు. ఇక్కడి నుండి కరుణాభిముఖంగా ధర్మ భావోపేతంగా నడవడం గమనించవచ్చు. ఈ మలుపును

సూచించడానికే శకుంతల ధర్మ బద్ధమైన చిత్తం ప్రసక్తమైంది. దౌష్యంతితో శకుంతల దుష్యంతుని కడకు వచ్చింది. దుష్యంతుడు జనాపవాద భీతి చేత శకుంతల తనకు తెలియదన్నాడు. అతడామెను పలకరించనే లేదు. ఆమె ఆశ్చర్యపడింది, నిశ్చేష్టు రాలయింది. ఆశ్రమంలో కన్పించిన దుష్యంతునికీ సభలో కన్పడే దుష్యంతునికీ పోలిక లేదన్నట్లుంది. ఇతని చూపులు విరసంగా క్రూరంగా ఉన్నాయి. రాజులు "నవప్రియులు పల్కరించినంతనే నమ్మరాదు కాబోలు", శకుంతల మనస్సులో ఆలోచనలు పరిభ్రమిస్తున్నాయి. సభలో ప్రథమ దర్శనంతోనే పూర్వం తాను చేసిన పనికి పశ్చాత్తాపం చెందాలిసిన స్థితిని కల్పిస్తూంది. కాని తాను చేసిన తప్పేమిటి? ఆవ్యక్తిని విశ్వసించడమే. కొడుకును చూపి పూర్వ వృత్తాంతాన్ని స్మరింప జేయాలనుకుంది.

"బాలార్కతేజుడగు నీ బాలుడు నీ కొడుకు!" వీని పౌరవ కుల రత్నాలంకారు, ఉదారు, గణాలయు అభిషేకంతో యువరాజును చేయుమని కోరింది. ఈ మాటల్లో పూర్వమిచ్చిన వరాన్ని జ్ఞాపకం చేయడం జరిగింది. తన హక్కును సాధికారికంగా చెప్పినట్లయింది. అతడు పూర్వం చెప్పిన వాటిలో రాజ భోగానుభవాలున్నాయి. కాని వాటిని పేర్కొలేదు. వాటిని పేర్కోవడం వల్ల స్వార్థం కన్పిస్తుంది. కాబట్టి శంకకు వీలు కలుగుతుంది. నీ కొడుకని సమర్పించడంలో, పుత్ర విషయకమయిన ధర్మాన్ని సూచిస్తూంది. తనను గుర్తింపకపోవచ్చు. కాని తమ ప్రణయ ఫలాకృతియైన కొడుకును ఎఱుగడ పోవడమేమిటి? ఈ విధమైన ఆలోచనకవకాశమిస్తూందీ రచన. ఆమె మాటల కతడు "నే నెరుంగ నిన్ను! ఎక్కడి దానవు? ఊరక అనుచితము లేల పల్కెదవు" ఎక్కడి నుంచి వచ్చితివో అక్కడికే పొమ్మని నిష్కర్షగా చెప్పాడు. ఈసందర్భంలో "దానినంతయు నెరింగియు నెరుంగని వాని పోలె" అని నన్నయ రచన. హేతువు చెప్పలేదు. గుప్తంగా ఉంచబడింది. 'పోలె' అన్న కవి మాటలో దుష్యంతుని అంతర్గతార్థం స్ఫురణకు వస్తుంది.

కథలో దీనివల్ల ఉత్సుకత పెరుగుతుంది. అతని మాటల కామె దు:ఖార్తయైంది; కోపారుణ లోచన అయింది. అధర్మానికి ఆమెలో కలిగిన కోప స్థాయి "విమల యశోనిధీ! యని సంబోధించటంలో వ్యక్తమవుతూంది. ఈ సంబోధన దుష్యంతుని అయశోనిధిత్వాన్ని

సూచిస్తూంది. ఇతని యశస్సు పూర్వం విమలమే, కాని ఇప్పుడు అధర్మం చేత కలుషితమవుతూంది. కణ్వుని ఆశ్రమంలో పెరిగిన వ్యక్తిత్వానికి తగినట్లుగా ఆమె మాటలు పరమోన్నతంగా ఉన్నాయి. వేదాలు పంచభూతాలు ధర్మువు సంధ్యలు అంతరాత్మ యముడు చంద్ర సూర్యులు పగలు రాత్రి యనే మహపదార్థాలివి, పురుష వృత్తాన్ని పరిశీలిస్తూ ఉంటాయి! ఇవి ఉండగా తనను తాను రహస్యంగా ఉంచుకోడానికి సమర్థుడగునా? యని ప్రశ్నించింది. దుష్యంతునికీ విషయం తెలియంది కాదు అతడనన్య సాధారణ గుణ యుక్తుడు. అయినప్పటికీ అతనిలో కదలిక లేదు శకుంతల తన పట్టు వీడలేదు. అచంచల విశ్వాసంతో తుది విజయం తనదే నన్న అధ్యయవసాయ చిత్త వృత్తి గల వ్యక్తిగా రచనలో పరిణమింపచేయడం జరిగింది. "విపరీత ప్రతిభాష లేమిటికి నుర్వీనాథ! ఈ పుత్ర గాత్ర పరిష్వంగ సుఖంబు సేకొనుము. చందనము చంద్రజ్యోత్స్నయుం పుత్ర గాత్ర పరిష్వంగము నట్లు జీవునకు హృద్యంబే! కడున్ శీతమే" యని హృదయ వేద్యంగా పలికింది. ఇంత వరకు మాట్లాడింది, బుద్ధి పక్షంగా ఉంది. ఇపుడు మాట్లాడింది, హృదయ పక్షంగా ఉంది. ఆర్ద్ర భావోపేతంగా ప్రసరించింది. ముక్తాహారాదులు బాహ్య తాపాన్ని పోగోట్టేవి. పుత్ర గాత్ర స్పర్శ అంతస్తాపాన్ని పోగొట్టేది. ఇది జీవునకు సంబంధించింది. పుత్రుడు తండ్రి స్వరూపమే! తన వ్యక్తిత్వ స్ఫూర్తి బింబమే. కాబట్టి తండ్రికి పుత్ర స్పర్శ మహానంద హేతుకమైంది. జీవున కింత కన్న హృద్యమైన సుఖానుభూతి లేదు.

మూలంలో **"న వాససాం న రామాణాం నాపాం స్పర్శ స్తథా విద:**
**శిర శ్చాలింగ్యమాన: స్పర్శ స్సూనో యధా విధ:"**

అన్న వ్యాస హృదయం నన్నయ సృజన సూత్రంలో భావ రూపంతో తెలుగు పద్య రచనా శిల్ప శోభను పుణికి పుచ్చుకొంది. భావ సౌందర్యంతో తీర్చిన కళా కృతిని పొందింది. పై పద్యంలో "ఉర్వీనాథ" సంబోధనం, దుష్యంతుని ప్రభు పరమైన వ్యక్తిత్వాన్ని భావింపజేస్తుంది. ప్రభు ధర్మాన్ని నిర్వర్తించే బాధ్యతను జ్ఞాపకం చేస్తూంది. దుష్యంతునితో భర్తృ వ్యక్తిత్వం ఏ కారణం చేతనో మరుగున బడింది. భార్యను కాదని నిరాకరించింది. గాంధర్వ వివాహాన్ని తలపుకు తెచ్చి శకుంతల పరిస్థితిని చక్క దిద్దడానికి బహు విధాలుగా ప్రయత్నించింది. కాని సఫలం కాలేదు. అందువల్ల రాజ వ్యక్తిత్వాన్ని

ఆశ్రయించింది. తన భర్త మరియు రాజు ఇక్కడ ఒక్కడే అయినాడు. పుత్ర గాత్ర పరిష్వంగంతో భర్తృ వ్యక్తిత్వాన్ని, ఉర్వీనాథ లక్షణంతో రాజ వ్యక్తిత్వాన్ని నన్నయ వివిధాంశాల కనుగుణంగా మలచి కథా గమనానికి అనన్యమైన ఆకర్షణను సిద్ధింపజేసాడు. ఈ రెండు కాక సుత శతం కంటె ఒక్క సూనృత వాక్యం మేలని సత్యాన్ని ఆశ్రయించింది. సూనృతాన్ని గురించి చెప్పనక్కరలేదు. కాని ఆవ్రతం ఔపచారిక మయితేనే ప్రమాదం! అదే జరిగింది. దుష్యంతుని "సూనృత వ్రత" అని సంబోధించింది. కాని ఫలితం లేకపోయింది! అసత్య వ్రతుడుగానే కనిపించాడు. దుష్యంతుడామె మాటల్ని అసత్య భాషణాలు, అనుచితాలని త్రోసి పుచ్చి; అధర్మయుక్తాలైన పలుకులు పలుక వద్దన్నాడు. ఈ మాటలు విన్న శకుంతల తన అదృష్టాన్ని నిందించుకొంది. సమాష్పలోచనయై పుత్రుని తోడ్కొని వెనుదిరిగి పోవనుద్యుక్తురాలయింది. దైవమే శరణ మనుకొంది. ఆ సమయంలో దివ్యవాణి శకుంతల చెప్పింది "సత్యమ"ని ఆమె సాధ్వి, సద్వినుత, మహాపతివ్రత"యని, "వీడు నీకును శకుంతలకున్ ప్రియనందనుండు సే కొను భరియింపుమ"ని వినిపించింది. ఎంతగానో తాను ప్రయత్నించింది, కాని ఫలితం కలగలేదు.

దైవమే శరణమని జీవితాన్ని సమర్పణం గావించింది. మానవయత్నం వ్యర్థమైంది. దైవ శక్తి శరణాగతయైన శకుంతలను రక్షించింది. దుష్యంతుడు తన విచిత్ర ప్రవర్తనకు మూల కారణమైన జనాపవాద భీతిని గూర్చి చెప్పాడు. మానవ ప్రయత్నం ఎంత ఉన్నప్పటికీ విధి దైవం అన్న రెండు కీలకమైన శక్తి స్థానాల్ని పురస్కరించుకొని కథ నడిచింది. వ్యాస హృదయాన్ని సమగ్రంగా ప్రసన్నంగా ఆవిష్కరించే నన్నయ సృజన సూత్రానికి కళారూపం శకుంతలోపాఖ్యానం.

# కుమారాస్త్ర విద్యా ప్రదర్శనం

పీఠికా ప్రాయమైన భాగాన్ని వదలితే ప్రధాన భారత కథ కుమారాస్త్రవిద్యా ప్రదర్శనం నుండి మొదలవుతుంది. మహాభారతంలోని ప్రధాన కథ పాండవ కౌరవులకు సంబంధించింది. ఇక్కడ కౌరవ్యులంటే ధార్తరాష్ట్రులని భావించాలి. ఈ కథ కొక విధమైన ముగింపు కురుక్షేత్ర సంగ్రామం. ముగింపు అయిన కురుక్షేత్ర సంగ్రామానికి అంకుర ప్రాయమైంది, కుమారాస్త్ర విద్యా ప్రదర్శనం. సంగ్రామానికి బీజ రూపమైన ఘటనలు విద్యా ప్రదర్శనకు ముందే జరిగాయి. కాని స్పష్టతను పొందిందీ ఘట్టంలోనే. ఈ ఘట్టం బీజ ప్రాయమైన స్థితిని దాటి అంకుర స్థితికి దారితీసింది. ఇది క్రమంగా పెరిగి సుదృఢమైంది.

పాండురాజు మరియు మాద్రి మరణానంతరం పాండవులు హస్తినలోకి ప్రవేశించే ఘట్టంలో పౌరుల మనోభావాలు ప్రకటితమైనాయి. వారు దేవతా వరప్రసాదం వల్ల జన్మించిన వారని, భుజ విక్రమ పాండు కిశోరులని, ఆకారవిశేషం చేత ప్రకాశించే తేజస్సు చేత సాధారణ మానవులు కారని పాండురాజు మరణంతో, పాండు రాజు పుత్రులని, అభిమాన పాత్రులయ్యారు. పాండవుల పట్ల పౌరులకు సహానుభూతి కూడ ఉంది. ఇది ప్రజాపరమైన అంశం.

పాండవ ధార్తరాష్ట్రులు క్రీడారతులై పెరుగుతూన్న సందర్భంలో, నన్నయ

**"తన సుతులు పాండుసుతులని మనమున భేదింప కతిసమంజస భావం**
**బున నొక్క రూప కా జేకొని యుండె పాండురాజు కొడుకుల ప్రీతిన్"**

పాండవ ధార్తరాష్ట్రుల మధ్య భేదభావం పొడసూప లేదు. ధృతరాష్ట్రుడు కూడ యే భేద భావం లేకుండా ఒకే రూపంగా భావించాడు. అయితే దుర్యోధనుడు పాండవుల్ని వారణావతానికి పంపాలని కోరిపుడు "ఏ నెల్ల ప్రొద్దు నా యెదలో దలతు నీ యభిప్రాయంబ" యన్నప్పుడు భేద భావం స్ఫుటమవుతుంది. దీనికి ధృతరాష్ట్రుని పుత్రేషణ కారణం. మూలంలో ఈ సందర్భంలో ధృతరాష్ట్రుని దుర్భావం

విపులంగా వర్ణితమైంది. నన్నయ రచనలో ధృతరాష్ట్రుడు సమయ వేది, గభీరుడు, ప్రజ్ఞా చక్షువుగా కన్పిస్తాడు. ధృతరాష్ట్రుని ప్రేమలో పాండురాజు తనయులు "వినయాన్వితులు", కుమార క్రీడారతులై పెరుగుతున్నారు. పాండవుల శీలం తొలిసారిగా ప్రసక్తమైంది. క్రీడల్లో ఎల్లపుడు భీమునిదే పై చేయి. అతడు మహాబలవంతుడు. "ఉద్ధతులు" రాజసుతుల్ కీడ్పడ దొడగిరి. రాజసుతులంటే ధార్తరాష్ట్రులు. వీరిశీలం కూడా ఉల్లేఖితమైంది. పాండవులు వినయాన్వితులు, ధార్తరాష్ట్రులుద్ధతులన్న మూలాంశాలు రెండు కేంద్ర బిందు స్థానాలుగా స్థిరపడ్డాయి. క్రీడల్లో దుశ్శాసనాదులు భీమునిచే బాధితాత్ములైనారు. దుర్యోధనుడు దీనికి ప్రతిక్రియ చేయ తలపెట్టాడు. దుశ్శాసనునితో శకునితో సంప్రదించాడు (అప్పటికి కర్ణుడు రంగం పైకి రాలేదు). దుర్యోధనుడు.

**"ఉపాంశు వధ చేసి మధ్యము మదోద్ధతుల జంపి ని**
**స్స పత్నముగ ధర్మనందను నశక్తు బంధించి యే**
**న పాండవముగా సముద్ర వలయాబఖిల క్షోణి మ**
**త్కృపాణ పటుశక్తి నత్యధిక కీర్తినై యేలెదన్"**

ధార్తరాష్ట్రుల ఆలోచన హఠాత్తుగా క్రీడా జగత్తునుండి రాజ్య జగత్తుకు మారింది. అ పాండవం చేయడంగా రాజ్యాన్ని విస్తృతపరచడంగా మంత్రాంగం రూపొందింది. దుర్యోధనుని మాటలు "పృధ్వి" విశేష వృత్తంలో ప్రకటితమైనాయి. సముద్ర వలయాఖిల క్షోణికై, రాజ్య విస్తృతికై చేసిన ఆలోచన కాబట్టి నన్నయ పృధ్వి ఛందస్సులో విశేషమైన గతి విశేషంతో రాజకీయ పరివర్తనా ముఖాన్ని బయట పెట్టాడు. ఈ వాంఛయే భవిష్యత్సర్వ కథా పర్యవసానికి మూల కారణమైంది. ఇక్కడి నుండి దుర్యోధనుని నాయకత్వంలో సర్వోహలు, సర్వప్రయత్నాలు భూభాగంకై రాజ్యధికారంకై సాగాయి. ఈ విధంగా "పాప బుద్ధి యందు కృతనిశ్చయు"డైన దుర్యోధనుడు పెద్దలైన భీష్మ విదురులకు తెలియకుండా జాగ్రత్తపడ్డాడు. భీముని కపాయం సేత తలపెట్టాడు. న్యాయానికి ధృతరాష్ట్రునికి కూడా తెలియకుండా జాగ్రత్త పడాలి. కాని తండ్రికి తెలిపినా పరవా లేదన్న దుర్యోధనుని నిర్లక్ష్య వైఖరితో ధృతరాష్ట్రుని పుత్రప్రేమ సూచితమవుతూంది. మొట్ట మొదలు భీమునికి చేసిన అపకృతి నిద్ర

పోతూన్న యాతని లతా పాశాలతో కట్టేసి గంగ మడుపులో తోసి వేయడం జరిగింది. భీముడు బంధనల్నివీడి ముక్తుడై పైకి వచ్చాడు.

**"కర్మ బంధనములు గ్రక్కున బాయుడు పుణ్య గతికి పురుషునట్లు"**

బంధనాలు వీడి భీముడు నీటిలో నుండి పై కెగసి వచ్చాడు. కర్మబంధాలు బాసి పుణ్యగతి పొందే పురుషునకు క్షతిలేదన్న భావం తత్త్వపరమైంది. భీముని పట్ల మొదటి అపకృతి నిష్ఫలమయింది, మిగతావి ఇట్లే జరుగనున్నాయి. సందర్భాన్ని పురస్కరించుకొని తాత్త్వికమైన విషయాలు నిక్షేపించే పద్ధతి మహాభారత రచనలో తరుచుగా కన్పిస్తుంది. మూలంలో విషాన్నం పెట్టి భీముని గంగలో ద్రోయించినట్లు, అతడు పాతాళానికేగి సశక్తుడై తిరిగి వచ్చినట్లుంది. దీనిని నన్నయ వదలివేసాడు. ఆ విషం భీమునికి జీర్ణమయిందని, రెండోసారి విష ప్రయోగాన్ని పరిగణన లోకి తీసుకున్నాడు. మరొకటి పాములచే అధికంగా కరిపించడం. భీమునికి చేసిన యెగ్గులన్ని నిష్ఫలమయినాయి. దుర్యోధనుడు సిగ్గు పడినాడు. మరో విధమైన అపాయాల్ని ఆలోచింపవలసియుందని భావించాడు. మరో విషయం, దుర్యోధనుడు భీమునికి విషాన్నం పెట్టించినపుడు అది తెలిసిన యుయుత్సుడు (ధృతరాష్ట్రునికి వేశ్య యందు జన్మించినవాడు), వారించినట్లు చెప్పమడింది. ఇతడు మహాభారత యుద్ధంలో ధార్తరాష్ట్రుల్ని వదలి పాండవుల వైపు చేరాడు. యుయుత్సుడు మొదటి నుండి ధార్తరాష్ట్రల దుర్మార్గాలను నిరసిస్తాడు యుయుత్సుని ప్రస్తావన మూలంలో ఉంది. కథకే యంశా లెక్కడెక్కడ ఉపయోగపడతాయో వాటిని సముచితంగా గ్రహించి మూలానుసరణంగా కథకు ప్రసన్న చేకూర్చే నన్నయ పద్ధతిలో ముందు వెనకల్ని సర్వ సమగ్రంగా యోచన చేసిన ప్రణాళిక కనిపిస్తుంది. ఇది నిర్వహణ శిల్పంలో భాగంగా వర్తిస్తుంది.

తరువాత కృప ద్రోణాచార్యుల వద్ద రాజకుమారులు అస్త్ర విద్యాభ్యాసం చేసారు. ఇంతవరకు భీముడొక్కడే దుర్యోధనునకు ప్రధానంగా ఈర్ష్యాస్థానమైనాడు. అతని చంపిన ధర్మనందనుడశక్తుడవుతాడని దుర్యోధనుని అభిప్రాయం. కాని ద్రోణుని వద్ద అస్త్ర విద్యాభ్యాసం చేసే సందర్భంలో మరొకడు సిద్ధమైనాడు, అతడు ద్రోణునకు

ప్రియశిష్యుడు. పుత్రప్రాయుడు, సకల ధనూరహస్యాలు అతనికి ద్రోణుని నుండి సంక్రమించాయి. కాబట్టి భీమునితోపాటు అర్జునుడు కూడా దుర్యోధనునకు ప్రబలమైన ఈర్ష్యకు స్థానమైనాడు. కాని ఈ విషయం దుర్యోధనునిలో గుప్తంగా ఉంది. భీముని పట్ల చేసిన అపకృతులు నిష్ఫలమయినాయి. అందువల్ల తమకు కలసి వచ్చే కాలం కొరకు ప్రతీక్షించడం జరిగింది. దుశ్శాసన శకునులతో కలిసి ఉపాయాల్ని అన్వేషించడం మొదలైంది. ఆ కాలం, ఆ ఉపాయం కుమారాస్త్ర విద్యా ప్రదర్శన సమయంలో దుర్యోధనుని చేతి కందినట్లయింది.

కుమారాస్త్ర విద్యా ప్రదర్శనానికి పాండవ ధార్తరాష్ట్రుల మనః ప్రవృత్తుల రూపాన్ని బట్టి చర్య ప్రతి చర్యల గతిని బట్టి ప్రాధాన్యం కలిగింది. పాండవులు "వినయాన్వితులు", ధార్తరాష్ట్రులుద్ధతులవడం వల్ల ఘర్షణ అనివార్యం. అస్త్ర విద్య ప్రారంభమైనప్పటి నుండి పాండవ ధార్తరాష్ట్రుల్లో ఒకరి నొకరు అధిగమించాలనే ఉద్దేశ్యం ఇనుమడించింది. "అలఘుపరాక్రసమేతు లధిక స్పర్ధన్" కుమారులు విలు విద్యను నేర్చుకుంటున్నారు. "స్పర్ధయా వర్ధతే విద్యా" యని సూక్తి. స్పర్ధ విద్య వరకు పరిమితం కాకుండా ఇక్కడ వైషమ్యంతో వైయక్తికంగా మారింది. ఇరు పక్షాలేర్పడి బలాధిక్య నిరూపణకు దారి తీసింది. ఇది కుమారాస్త్ర విద్యా ప్రదర్శనంలో ప్రస్ఫుటమైంది. మరో విషయం, భవిష్యద్భారత కథకు కీలక ప్రాయుడైన కర్ణుడీ ఘట్టంలో రంగంలోకి ప్రవేశించడంతో దుర్యోధనుడన్వేషిస్తున్న ఉపాయరూపం చేతి కందినట్లయింది. ప్రధాన పాత్రల మనోభావ సమర్పకంగా భవిష్యద్భారత కథా గమనానికి కొత్త మలుపు తెచ్చింది.

అస్త్ర విద్యా ప్రదర్శనకు రంగం సిద్ధమైంది. భీష్మాదులు ధృతరాష్ట్రులు రాణివాసం, అధికృతులు, ప్రజలు వారి వారి స్థానాల్లో ఆసీనులయ్యారు. ఆచార్యులు ద్రోణుని వెనుక ప్రదర్శనకు సన్నద్ధులై జ్యేష్ఠానుపూర్వంగా రాజ కుమారులు రంగ ప్రవేశం చేసారు. తమ తమ విద్యా కౌశాల్యాన్ని ప్రదర్శించారు. భీమ దుర్యోధనులు విద్యా ప్రదర్శనకై సన్నద్ధులయ్యారు. ఉద్యద్గదాహస్తులై ప్రవేశించారు. "మహామత్సరంబున. క్రుద్ధ గంధ సింధురంబులం బోలె" గదా నైపుణ్యాన్ని ప్రదర్శి,చడం మొదలు పెట్టారు. "అథ తౌ నిత్య సంహృష్టౌ సుయోధన వృకోదరౌ" అని మూలం.

దీనికి నన్నయ "సంహృష్టౌ"కు బదులు "మహామత్సరంబున" అని అదనంగా "క్రుద్ధ" అని పదాల్ని ప్రయోగించాడు. ఇవి వాళ్ళ మనస్సుల్లోని ఈర్ష్యా వైర భావాల్ని సూచిస్తున్నాయి. ఈ మార్పు ఇంతకు ముందు మూడుమారులు (నన్నయ రచనలో) ఉపాంశు వధకు గురి అయిన భీముడు దీనికి హేతువైన దుర్యోధనుడు ఉన్న మానసిక స్థితుల్ని బట్టి సముచితంగా ఉంది.

**"అవనీ చక్రము పాద ఘాత హతి నల్లాడంగ నత్యుచ్ఛ భై**
**రవ హుంకార రవంబునన్ వియదగారంబెల్ల భేదిల్ల పాం**
**డవ కౌరవ్య గదా విఘట్టన మకాండ ప్రోత్థమై భావి పాం**
**డవ కౌరవ్య రణాభిసూచన పటిష్ఠం బయ్యె ఘోరాకృతిన్"**

వారు కౌశలం ప్రకాశింపగా ఆరంభించిన గదా యుద్ధం భావి పాండవ కౌరవరణాన్ని సూచించేదిగా పరిణమించింది. ఇది వారిరువురికి మాత్రమే పరిమితమైందిగా లేదు. సర్వ పాండవ సర్వ కౌరవ భవిష్యత్తుకు సంబంధించిందిగా మారింది వారిరువురి గదా విఘట్టనం విద్యా ప్రదర్శన సందర్భాని కనుకూలంగా లేదు, అకాండ ప్రోత్థమయింది. యుద్ధ సమయంలో ఉత్పన్నం కావలసిన స్థితి విద్యా ప్రదర్శన వేళ పొటమరించింది. హఠాత్తుగా అనుకోకుండా యేర్పడిన స్థితి పాండవ కౌరవ్యులను రెండు పక్షాలుగా చీల్చింది. దాన్ని చూచే ప్రజల్లోను ఈ వైఖరి కన్పించింది. "జనుల పక్షపాత జనిత పరస్పర క్రోధ వచనంబులు విని", ద్రోణుడు, "రంగ భంగ భయంబున నశ్వత్థామం బంచి వారి నిద్దఱ వారించి"నాడు. ప్రజల్లోను ఇరు పక్షాలేర్పడినాయి. భీమ దుర్యోధనుల గదా విద్యా ప్రదర్శనం రణ స్థాయి నందుకుంది. ద్రోణుడు వారించడం వల్ల ఆగిపోయి భీముని చంపగలనన్న భావం దుర్యోధనునిలో నిశ్చయాకృతి పొందింది. కాబట్టి ఇక భీముని గురించి భయపడనవసరం లేదు. ఇక అర్జునునికి ప్రతిస్పర్ధి గురించి యే ఆలోచన మిగిలింది. అతడు దొరికితే ఆలోచనకు సంపూర్ణత చేకూరుతుంది. భీమునికి తాను కౌరవుల దుష్కృత్యాల నుండి కాపాడుకోగలనన్న ప్రత్యయం కలిగింది. అవని అల్లాడేట్లు వినిపించే పాదఘాతాహతా శబ్దం, ఆకాశమనే మహా గృహం పగిలేట్లు వినిపించే భయదమైన హుంకార ధ్వని శాంతించింది. భీమ దుర్యోధనులు ప్రదర్శన స్థలం నుండి నిష్క్రమించారు.

ఇంతవరకు అర్జునునకు సముడు లేడు. ద్రోణుడు "నా ప్రియ శిష్యుండయిన యర్జును ధనుః కౌశల్యంబు చూడుండ"ని సభాసదుల్ని ఉద్దేశించి పలికాడు. అర్జునుని రంగ ప్రవేశం ఉత్కంఠ భరితమైన క్షణాలకు సముత్సాహ రూపాన్ని ఇచ్చింది.

"హారి విచిత్ర హేమ కవచావృతుడున్నత చారు చాప రే
ఖోరు భుజుండు భాస్వదసితోత్పల వర్ణుడు, సేంద్రచాపశం
పారుచి మేఘమో యనగ పాండవ మధ్యము డొప్పె బద్ధతూ
ణీరుడు రంగ మధ్యమున నిల్చి జనంబులు తన్ను జూడగన్"

మనస్సును హరించే బంగారు కవచం ధరించాడు. దీర్ఘమైన సుందరమైన ధనుస్సు వహించాడు. పొడవైన బాహువులు కలిగి ఉన్నాడు. ఉజ్వలమైన నల్ల కలువ రంగుతో, ప్రకాశిస్తున్నాడు కట్టిన అమ్ముల పొదులతో ఆకర్షిస్తున్నాడు. ఇంద్ర ధనుస్సు మెరుపుతో కూడిన మేఘమోయనేట్లు వచ్చి రంగ మధ్యంలో నిలిచాడు. జనులు పరమాద్భుత చిత్తులై గొప్ప అనుభవాన్ని పొందారు. ఏక కంఠంతో పొగిడారు. భీమ దుర్యోధనుల విద్యా ప్రదర్శంలో వలె భిన్నాభిప్రాయాలు లేవు. కారణం అర్జునుడొక్కడే ఇప్పటివరకు ప్రతిస్పర్థి కనిపించలేదు. ఈ పద్యం ఉత్పలమాలావృత్తంలో వ్రాయబడింది. అర్జునుడు "అసితోత్పల వర్ణుడు" కాబట్టి దానికి తగినట్లుగా అతని వర్ణించడానికీ స్వీకరించిన ఛందో రూపానికీ సామ్యం ఉంది; సమంజసంగానూ ఉంది. ఈ వృత్తంలో ఉత్పల పద ప్రయోగం చేత ముద్రాలంకార మవుతూంది. ప్రజల్లో చెలరేగిన స్తుతి కోలాహలం విని ధృతరాష్ట్రుడు, విదురుని "ఇదేమ"ని? ప్రశ్నించాడు. అతడు వివరించాడు. చెవులున్నందుకు పాండు పుత్రుల విద్యా శక్తులు వినడంతో ఫలాన్ని పొందిన సంతోషాన్ని ప్రకటించాడు. వారిని పృథారణి నుండి పుట్టిన పాపారణ్యాన్ని దహించే త్రేతాగ్నులుగా భావించాడు. "ధన్యోస్మ్యనుగృహీతోస్మి రక్షితోస్మి మహామతే! పృథారణి సముద్భూతై స్త్రీభి: పాండవ వహ్నిభి:" మూలంలో ఉన్న విషయంతో పాటు ధృతరాష్ట్రుని వ్యక్తిగతమైన ఆనందంతో ప్రజాసంబంధమైన సద్భావనతో సమభావం పట్ల తృప్తితో నన్నయ కథాంశాన్ని ప్రసన్నం చేయడం జరిగింది. ప్రజల్లో తన పెంపకం గురించి వ్యతిరేకమైన అభిప్రాయం లేనందుకు ధృతరాష్ట్రునికి పరోక్షంగా తన పెద్దరికానికి పీటవేస్తున్నట్లనిపించింది. మరో విధంగా చూస్తే స్వపుత్రుల

స్వరూపం తనకు తెలుసు వారికి పాండు సుతులవల్ల ఆపదరావచ్చు. ఇది అరణ్యాన్ని అనలంలా దహించవచ్చు. ఈ అనలం సామాన్యమైంది కాదు. దేవతా ప్రసాదం వల్ల సిద్ధించింది. పుత్ర ప్రేమయన్న బలహీనత వల్ల స్వపుత్రుల్ని కట్టడి చేయలేకపోతున్నాడు. పైకి పాండవుల్ని పొగడినట్లనిపించినను, ధృతరాష్ట్రుని మాటల వెనుక నున్న మానసికమైన బాధ స్ఫురణ కందుతూంది. అర్జునుడు అస్త్ర విద్యా వైశారద్యాన్ని ప్రకటించి సభాసదుల్ని ఆశ్చర్యచకితుల్ని చేసాడు. ప్రజలందరు సంభ్రమం చెందగా భుజాస్ఫాలన శబ్దం వినిపించింది. అది శైలప్రకరంపై పడిన వజ్రాయుధ ధ్వనియో అన్నట్లుంది పాండవులు ద్రోణాచార్యులను సమీపించారు. సుయోధనుని తమ్ములు వేష్టించారు. అందరి చూపులు రంగద్వారం వైపు ప్రసరించాయి, ఇంతలో

**"సాల ప్రాంశు నిజోజ్జ్వలత్కవచ్చు శశ్వత్కుండలోద్భాసితున్**
**బాలార్క ప్రతిమున్ శరాసనధరున్ బద్ధో గ్రనిస్త్రింశు శౌ**
**ర్యాలంకారు సువర్ణ వర్ణు ఘను కర్ణాఖ్యున్ జగత్కర్ణపూ**
**ర్ణాలోలద్గుణు జూచి చూపరు ప్రభూతాశ్చర్యులై రందరున్"**

**"సహజం కవచం బిభ్రన్ కుండలోద్ద్యోతితానన:**
**సుధనుర్బద్ధ నిస్త్రింశ: పాద చారీవ పర్వత:**
**సింహర్షభ గ జేంద్రాణాం బల వీర్య పరాక్రమ:**
**దీప్తి  కాంతి ద్యుతి గణై స్సూర్యేందుజ్వలనోపమ:**
**ప్రాంశు: కనక తాలా భస్సింహ సంహననోయుజే**
**అసంఖ్యేయ గుణశ్శ్రీమాన్ భాస్కరస్యాత్మ సంభవ:**

మూలంలో పాదచారియైన పర్వతం వలె మొదలుగా ఉన్న వర్ణానాంశాల్లో నుండి ఆ సందర్భానికి తగిన భావ జాలంతో నన్నయ పద్యాన్ని నిర్మించాడు. సాలవృక్షం వలె ఉన్నతుడు. సహజమైన కవచ కుండలాలతో ప్రకాశిస్తున్న వాడు. బాల సూర్యుని పోలినవాడు. ధనుస్సును ధరించినవాడు. కట్టిన ఖడ్గం కలవాడు శౌర్యమే అలంకారంగా కలవాడు. బంగారు ఛాయ కలవాడు కర్ణుని జూచి అందరు ఆశ్చర్యాన్ని పొందారు. అర్జునుని వర్ణనకు దీటైన విధంగా కర్ణుని వర్ణనం చేయబడింది. కర్ణుడు ముందుగా

భుజాస్ఫాలనం చేసాడు. ఒక అరచేతితో భుజాన్ని బలంగా తాడించడం ఆస్ఫాలనం. ఒక భుజం పర్వత స్థానీయం, ఒక చేయి దంభోళిస్థానీయం పర్వతంపై (ఇంద్ర) వజ్రాయుధపాతం చేత పూర్వం రెక్కలు తెగిన పర్వతాలవలె చేయగల సమర్థుడని అర్థం మరో విధంగా పర్వత దంభోళి ప్రస్తావన భుజ వినాశనాన్ని సూచిస్తుంది. ఈ ఆస్ఫాలనం చేసే వ్యక్తి కర్ణుడే తన భుజ వినాశనానికి తానే మూల కారణం అంటే స్వయం కృతాపరాధాల ద్వారా వివిధ శాపాల్ని పొందాడు; ఇవే కర్ణుని నాశనం చేసేవిగా పరిణమిస్తాయన్న దూర భావం లేకపోలేదు. ఈ సందర్భ,లో కర్ణుని జీవిత రహస్యం నుండి అనేకమైన దుర్విధికి చెందిన అంశాలతో కూడిన ప్రతి కూలస్థితి ఈ ఉత్ప్రేక్షాలం కారంలో అనుమీయమానమవుతూంది. మూలంలో,

**"మందీభూతే సమాజే చ వాదిత్రస్య చ నిస్వనే**
**ద్వార దేశాత్ సముద్భూత: మహాత్మ బల సూచక:**
**వజ్ర నిష్పేష సదృశ: శుశ్రువే భుజ నిస్వన:**
**దీర్యంతే కింను గిరయ: కిం స్విద్భూమిర్విదీర్యతే**
**కింస్విదాపూర్యతే వ్యోమ: జలధారా ఘనైర్ఘనై:**
**రంగస్యైవం మతి రభూత్ క్షణేన, వసుధాప"**

భుజ నిస్వనం వజ్ర నిష్పేష సదృశంగా భావితమైంది. వీర విద్యా ప్రదర్శనకై వచ్చిన వాడు కర్ణుడు, అదీ అర్జునునకు ప్రతి వీరుడుగా స్థాపించుకోవాలి కాబట్టి గిరులు విదీర్యమవుతాయా? భూమి విదీర్యమవుతుందా? అన్నట్లు భుజ నిస్వన వర్ణనం చేయడం సముచితంగా ఉంది. నన్నయ మూలాన్ని సంగ్రహ పరచి అభిప్రాయాన్ని ప్రభావవంతగా చెప్పాడు. నిజానికీ రంగానికి రక్షకుడు ద్రోణుడే దుర్యోధనునిచే రక్షింపబడడానికా? అంటే ఏ మైనా వారికి దుర్యోధనుని నాయకునిగా మాత్రం స్థాపిస్తూంది. పాండవులు ద్రోణుని సమీపించారు. ఈ సందర్భాన్నిబట్టి విద్యాగురువే ఆశ్రయణీయుడు. ధార్తరాష్ట్రులు సుయోధనుని చేరటంలో ఒక సామంజస్యముంది. భీమునిచే తాము క్రీడల్లో బాధితులైనపుడు సుయోధనుడే ప్రతిక్రియకు ప్రయత్నించాడు. ఉపాయాల్ని పన్నాడు. తమకు అండగా నిలబడినాడు. ద్రోణాదుల కన్న సుయోధనుని యందే విశ్వాసం దీన్ని నన్నయ పూర్వమే సూచించినాడు. ఇక

పాండవులు ద్రోణుని చేరటంలో ఒక ఔచిత్యముంది. అస్త్ర విద్యా ప్రదర్శన మయ్యేంతవరకు ద్రోణుని మాటే శిరోధార్యం. అతని ముందుంచుకునే రంగ ప్రవేశం చేసినారు. కాబట్టి దీని నిర్వహణ బాధ్యత ద్రోణునిదే.

మరో విషయం; ధార్త రాష్ట్రులు దుర్యోధనుని పరివేష్టించినారన్న సందర్భంలో మూలంలో,

**"స తైస్తదా భ్రాతృభిరుద్యతాయుధైర్గదా గ్ర పాణి స్సమస్థితైర్వృత:**
**బబౌ యధా దానవ సంక్షయే పురా పురందరో దేవ గణై స్సమావృత:"**

దానవ వినాశన సమయంలో దేవ గణాలతో సమావృతుడైన పురందరునితో దుర్యోధనుడు పోల్చబడినాడు. ఇది భవిష్యత్కథానుకూలం కాకపోవడం వల్ల నన్నయ దీనిని పరిహరించియుండవచ్చు. వ్యాసుడు మరో దృష్టితో అంటే భవిష్యత్కథపై దృష్టితో కాక, తత్కాలంలో స్థితి ననుసరించి వ్రాయడం జరిగింది. ఇదొక లౌకికమైన వ్యవహార జగత్తుకు సంబంధించిన దృష్టి కోణంలో సముచితమే.

పూర్వం ప్రజలు కర్ణుని గుణాలు విన్నారు కాని చూడలేదు, విన్న దాని కన్న చూచినపుడు వారు ఎక్కువ ఆశ్చర్యానుభూతి పొందారు. ఇపుడు తాము విన్న గుణాలకు సమంగా అంతకన్న మిన్నగా కన్పించవచ్చు. సామూహిక మనస్తత్వ ప్రభావమీ సందర్భంలో చిత్రితమైంది. కర్ణ వర్ణనంలో పద్యం చివర "ఘను" అన్న మాట వాడబడింది. ఘనుడనగా మహనీయుడు, గొప్పవాడని అర్థం. కవచ కుండలాలే మహనీయత్వాన్ని తెలుపుతున్నాయి. ఇక విగ్రహం సంగతి చెప్పనక్కరలేదు. ఇది ఘన శబ్దంలో సూచితమైంది. ఘన శబ్దానికి మేఘమని అర్థముంది. ఇంతకు ముందు అర్జునుని వర్ణిస్తూ మేఘంతో పోల్చడం జరిగింది. కర్ణుడు అర్జునునితో సమానుడని చెప్పడానికి "ఘన" శబ్దం ఉపయుక్తమయిందనుకోవచ్చు. ఒకటే భేదం! అర్జునుడు మేఘమో! అన్నట్లనిపించాడు. కర్ణుడు ఘనుడే మేఘమే కర్ణుడు సూర్యసంతానమవడంవల్ల బాలార్క ప్రతిముడగుట సమంజసమే. అతడు శౌర్యమే అలంకారంగా కలవాడు అపరిచితుల్ని చూచినపుడు మొట్ట మొదట ఆకర్షించే లక్షణం ఔన్నత్యం. '3సాలప్రాంశువు"తో కర్ణుని

పొడగరితనం దీన్ని అనుసరించి ప్రభావోపేతమైన అనుభవానికి గురిచేసేవి సహజ కవచ కుండలాలు! మొట్ట మొదట ఆకర్షించాయి.

ఇతడెవరో దైవ ప్రసాద రూపంగా కన్పించడం సహజం! అర్జునుని చూచి పరమాద్భుత చిత్తులయినారు. కర్ణుని చూచి ప్రభూతాశ్చర్యులయినారు అద్భుతమన్నది ఒక రసం. దాని స్థాయి భావం విస్మయం. అనగా ఆశ్చర్యం. "అపూర్వ వస్తు దర్శనా చిత్త విస్తారో విస్మయో మత:" అపూర్వ వస్తు దర్శనం వల్ల కలిగే చిత్త విస్తారం విస్మయం. "అలౌకిక వస్తు దర్శనాది జన్మా ఆశ్చర్యాఖ్యో విస్మయ:" అలౌకిక వస్తు దర్శనం వల్ల కలిగే యాశ్చర్య చిత్త వృత్తి విశేషం విస్మయం ఆశ్చర్యం ఒక భావమే. భావమంటే చిత్త వికారమన్న మాట ఇది చివరి వరకు రసస్థాయి నందుకునేంతదాకా స్థిరంగా ఉంటే స్థాయి భావమవుతుంది. ఈ దృష్టితో చూస్తే కర్ణుని చూచినపుడు కలిగింది మనో వికారమే. ఆ మనో వికార మాశ్చర్యం. ఇక్కడ ఇది కేవలం "భావం" మాత్రంగా నిలిచిపోయింది. అర్జునుని విషయంలో "పరమాద్భుత చిత్తులయినారనడంలో రస స్థాయినందుకోవడం సూచితమయింది. అర్జునుని విషయంలో ఈ భావానికున్న స్థాయి కర్ణుని విషయంలో లేదని అర్థం దీనిచే అర్జునునితో కర్ణుడు సమానుడు కాడన్న భావం సూక్ష్మంగా స్ఫురింపజేయబడింది. నన్నయ అర్జునుని విషయంలో "అద్భుత" పదాన్ని కర్ణుని విషయంలో "ఆశ్చర్య" పదాన్ని ప్రయోగించి ఈ భేదాన్ని సూచించాడు. కథా రచనలో సందేహాన్ని పోగొట్టాడు. నిర్వహణ శిల్పంతో సంక్లిష్టతను తొలగించి ప్రసన్నతను సిద్ధింపజేసాడు. కర్ణుడు "జనుల నందరిని నదల్చి జొత్తించి రంగ మధ్య భాగంలో నిలిచాడు. ఎంతో ఆకర్షణీయంగా ఉన్న కర్ణుని చూడగానే ప్రజలు చుట్టు చేరి ఉంటారు. వాళ్ళను అదల్చడంలో నాయకత్వ లక్షణం స్పష్టం వాళ్ళను నియమించడం జరిగింది. వెంటనే ముందుకు వచ్చినట్లుంది. ఇది ముందుకు చొచ్చుకొని పోయే చొరవ స్వభావం చిత్రితమైంది. మూలంలో దత్తేనావకాశే అని ఉంది అంటే ముందుకు పోవడానికి ప్రజలు చోటు లేదా దారి ఇవ్వగా రంగభూమి ప్రవేశించాడని అర్థం. కృప ద్రోణులకు నమస్కరించాడు. ఇది కర్ణుని గురుభక్తికీ, మర్యాదా ప్రవృత్తికీ నిదర్శనం.

కర్ణుడు ప్రవేశించిన కార్యం వేరు అందుకుపక్రమించాడు. "నీవే కడు నేర్పు కాడవు కాదు, మేము కూడ కొన్ని అభ్యసించాము, నీవు ప్రదర్శించిన విద్యలన్ని వీరులు చూచి "మేలు మేలని" పొగడే విధంగా చూపిస్తాము. అని తెలుగు భాషా సహజమైన ఆధిక్షేప పద్ధతిలో రచన సాగింది. కర్ణుని మాటలు అర్జునునికి కోపం సిగ్గు దుర్యోధనునికి ప్రీతి, ప్రజలకు విస్మయం కలిగించాయి. ద్రోణునిచే నాజ్ఞప్తుడయి కర్ణుదర్జునుడు చూపిన విద్యలన్ని శ్రమ రహితంగా ప్రదర్శించాడు. మూలంలో "తతో ద్రోణాభ్యనుజ్ఞాత: కర్ణ: ప్రియరణస్తదా యత్కృతం తత్ర పార్థేన తచ్చకార మహాబల:" యని "ప్రియరణ:" "మహాబల:" విశేషణాలతో కర్ణుని వీర వ్యక్తిత్వాన్ని భవిష్యద్భారత కథా దృష్టితో మూర్తి కట్టించడం జరిగింది.

అర్జును నెదిర్చే మహావీరుడు కన్పించాడన్న సంతోషంలో సుయోధనుడు కర్ణుని కౌగిలించుకొని "నాతో బద్ధ సఖ్యుండవై నాకును బాంధవులకు హితంబు సేసి నన్నుం కురు రాజ్య బేలించి నాయైశ్వర్యంబుపయోగింపుమ"ని కోరాడు. స్నేహం చేయడం హితం చేయడం ఐశ్వర్యం ఉపయోగించుకోవడం సామాన్యవిషయాలే. కాని "నన్నుం కురురాజ్యంబేలించి" యనటంలో విశేషముంది. తాను రాజ్య మేలుట కాతని సహాయమవసరమని భావం. తానేలుటకెదో అడ్డంకి ఉంది. ఆ అడ్డంకి పాండవులు, ముఖ్యంగా పాండవ మధ్యముడు. తన కోరికను బట్టి చూస్తే తాను క్రిందవుతూన్నట్లుంది, కాబట్టి బద్ధ సఖ్యతలో ఈ భేదం ఉండదు. ఇది సుయోధనుని గభీర రాజనీతి చతురతకు నిదర్శనంగా ఉంది. మూలంలో మరో విధంగా ఉంది.

"స్వాగతం తే మహాబాహో! దిష్ట్యా ప్రాప్తోసి మానద స్నేహం చ కురు రాజ్యం చ యథేష్ట ముపభుజ్యతామ్" సుయోధనుని గౌరవము నిలిపేందుకు అదృష్టవశాన ప్రాప్తించినావు. కురు రాజ్యాన్ని యథేష్టంగా అనుభవించవలసింది. కురురాజ్యమింకా పూర్తిగా తన వశం కాలేదు. కాని రాజ్యంలో నీవు యథేచ్ఛగా కావలసింది పొందవచ్చు నన్న భావం. ఇది కర్ణుని పట్ల తన సంపూర్ణ గౌరవాన్ని సూచించడమే కాని వేరు కాదు. 'కురు రాజ్య మేలించి', అన్నమాట కర్ణుని సహాయ సహకారాలు కురు రాజ్యమేలడానికెంత అవసరమో దాని ప్రమాణాన్ని మనస్సులో నిలుపుతూంది. సుయోధనుని మాటను

కర్ణ ‘డొడంబడినాడు” ఈ ‘రాజలోకము నీవును చూడ పార్థుతో ద్వంద్వ యుద్ధం సేయవలయు”నని అందరు వినేట్టుగా కర్ణుడు పలికాడు. దీనికి అర్జునుడు “సభలకు పిలవబడకుండా బలవంతంగా వెళ్ళి పాప లోకానికి పోవగోరే వారి వలె మాట్లాడుతున్నావు. ఎదుటి వారి బలాన్ని స్వబలాన్నీ ఎరగవు” అని అన్నాడు. కర్ణుడు “ఈ రంగభూమి అస్త్ర విద్యా విశారదులకెల్ల సామాన్యమ”ని పలికాడు. ఇరు పక్షా లేర్పడినాయి. అర్జునుడు కర్ణుడు కొంతసేపు ద్వంద్వ యుద్ధం చేసారు. ఇంతలో కృపుడు వచ్చి వారిద్దరి మధ్య నిలచాడు. అర్జునుని కుల గోత్రాదులు చెప్పి నీ కులగోత్రాదులు చెప్పి నీ కులగోత్రాదులు చెప్పమన్నాడు. కర్ణుడు తలవాల్చాడు. దుర్యోధనుడు లేచి వచ్చి రాజవరుడైన అర్జుననితో రాజు మాత్రమే గాని యీతడు యుద్ధం సేయగా వీలు లేకపోతే ఈ క్షణంలోనే అంగ రాజ్యమిస్తానని భీష్మధృతరాష్ట్రులకు చెప్పి వారి అనుమతితో కర్ణుని అంగ రాజ్యానికి పట్టాభిషేకం చేసాడు. ఈ మహాగౌరవానికి కర్ణుడు పరమ హర్షితుడయినాడు. అతడు సంకట స్థితిలో ఉన్నాడు. ఈ స్థితి నుండి రక్షించిన వ్యక్తికి ఆజన్మాంతం కృతజ్ఞతా బద్ధుడు కావడం సహజం. ఇందరు క్షత్రియ వరుల సమక్షంలో మహీశుని చేసినందుకు “నీ కేమి యొనర్తు” చెప్పమన్నాడు. సుయోధనుడు “నాతో స్నేహం చేయవలసింది. ఇదే ఇష్టమ”న్నాడు. కర్ణుడు దీనికంగీకరించాడు. ఈ స్థితిలో సూతుడు వచ్చి కర్ణుని కౌగిలించుకున్నాడు. భీముడు కర్ణుని సూతకులుడని ఆక్షేపించడం, సుయోధనుడు సమాధానం చెప్పడం జరిగింది. అంతలో సూర్యాస్తమయమయింది. అందరూ తమ తమ నివాసాలకు వెళ్ళారు. ఈ ఘట్టాన్ని ముగిస్తూ నన్నయ వ్రాసిన పద్యం.

**“వినుత ధనుర్విద్యావిదు ఘను కర్ణు సహాయు బడసి కౌరవ విభు ద**
**ర్జును వలని భయము సెడి ఔమ్మున జేయిడి నిద్ర వోయె ముదితాత్ముండై”**

**మూలంలో “దుర్యోధనస్యాపి తదా కర్ణమాసాద్య పార్థివ**
**భయ మర్జున సంజాతం క్షిప్ర మంతరధీయత”**

పై పద్యంలో మూడు పాదాల్లో, భావం మూలంలో ఉందే. నాల్గవ పాదంలో రొమ్మున చేయి వేసుకొని నిద్ర పోవడమనే తెలుగు జాతీయ ప్రయోగంతో పూర్వ పాదాల్లోని భావానికి దీప్తి కలిగింది. ఏదో ఒక పెద్ద బాధననుభవిస్తూ, అది తొలగించేదుకు పలు ఉపాయాలతో సతమతమవుతూ, దారి దొరకని వ్యక్తికి హఠాత్తుగా బాధ తొలగే మార్గం దొరికింది. అప్పుడు అతని మనస్సు తేలిక పడుతుంది. గాలిలో తేలిపోతుంది! సుఖ నిద్రను పొందుతుంది. ఆ విషయంలో శాంతమవుతుంది. కర్ణుడు దుర్యోధనుని జీవితంలో నెరపబోయే పాత్ర కృతజ్ఞతా పూర్వకమైంది స్నేహ బద్ధమైంది. వీరోచితమైంది. అన్నిటికన్నా త్యాగ భావంతో ప్రకాశించింది. మహాభారత కథా గమనాన్ని వేగవంతం చేసింది. ఈ దృష్టితో నన్నయ కుమారాస్త్ర విద్యా ప్రదర్శనం వ్యాస హృదయానికి, రమణీయ కళారూపం ప్రసన్న సుందరంగా ఆవిష్కృతమైంది భవిష్యత్తులో మహా రణానికి భూమికగా దర్శనమిస్తుంది.

# సుహృద్ద్యూతం

సుహృద్ద్యూతంతో మహాభారత కథ కొత్త మలుపు తిరిగింది. ఇంతవరకు దుర్యోదనుడు పాండవులకు చేసిన యెగ్గులన్ని విఫలమయినాయి. అవి సర్వులకు తెలిసినవి కావు. ఇచ్చటి నుండి ప్రారంభమైనవి సర్వులకు తెలిసేట్లుగా రూపొందాయి. చాల వరకు పాండవుల్ని కష్టాల పాలు చేయడంలో సఫలమయినాయి. కొత్త మలుపు తిరిగే కథలో సుహృద్ద్యూత ఘట్టం ప్రాధాన్యం కలిగి ఉంది. సుహృద్ద్యూతం రెండు మార్లు జరిగింది. మొదటిది సుహృద్ద్యూతం పేరుతో ఆరంభమైంది. దుర్హృదయ ద్యూతంగా పరిణమించింది. రెండోసారి ద్యూతం ఇటువంటిదే పైకి అనుకున్నా మొదటి దాని ప్రభావం ఉండనే ఉంది.

సుహృద్ద్యూతంలో కీలకమైన పాత్ర ద్రౌపది. ఈ ఘట్టంలో పాండవుల ఓటమి కన్నా ఆమెకు జరిగిన అవమానం ముఖ్యమైంది. ఈ ఘట్టంలో పాండవులు దాస్యం నుండి విముక్తులవడం కూడా ద్రౌపది వల్లనే జరిగింది. ఒక మహా గ్రంథం ఆధారంగా రచనను కావ్య గుణాలతో తీర్చడంలో కవిపై బాధ్యత సామాన్యమైంది కాదు. మూల భాష నుండి రచించేప్పుడు ఎన్నో ప్రశ్నలు తలెత్తుతాయి. భాష మొదలుకొని అంతరార్థాల దాకా పర్యాప్తమై ఉంటాయి. స్థూల దృష్టిని వదలి సూక్ష్మ దృష్టి నవలంబించవలసి ఉంటుంది. ఈ ఘట్టంలో ద్రౌపది ప్రవేశించిన సందర్భంలో, ఆమెను చూచి గాంధారి కోడండ్రు విస్మితులయినారు.

**"అఖిల లావణ్య పుంజంబు నబ్జభవుడు మెలతగా దీని యందు నిర్మించె నొక్కొ**
**కాని నాడిట్టి కాంతి యే కాంత లందు నేల లేదని, సామర్ష హృదయులైరి"**

ఈ పద్యం ద్యూతానికై పాండవులు హస్తినకు వచ్చిన సందర్భంలోది. గాంధారి కోడండ్రు ఆమె సౌందర్యానికి అమర్ష వహించారు. మూలంలో

> **"యాజ్ఞసేన్యాః పరామృద్ధిం దృష్ట్వా ప్రజ్వలితామివ**
> **స్నుషాస్తాధృతరాష్ట్రస్య నాతి ప్రమనసోభవన్"**

ధృతరాష్ట్రుని కోడండ్రు ఆ వెలిగే ద్రౌపది అభివృద్ధిని చూచి సంతోషించలేక పోయారు. ద్రౌపది వైభవం వారి అసంతుష్టికి కారణమైంది. ఈ వైభవం పాండవులంతటి వారికి పత్ని కావడంగా భావించవచ్చు. ఇది సహజం కూడా అయితే నన్నయ చెప్పిన కారణం లావణ్య రూపం. ఆమర్ష అంటే కోపం, ఓర్వలేనితనం, ద్రౌపది సౌందర్యం తమలో ఎవరికీ లేనందుకు కోపం, ఓర్వలేనితనం కలిగాయి. దీనివల్ల నన్నయ రచనలో మార్పులోని ఆంతర్యం సూక్ష్మమైంది. గాంధారి స్నుషలు కూడ వైభవ సంపన్నులే. కాబట్టి వైభవం కన్నా సౌందర్యంపై దృష్టి ప్రసరింపబడింది. వైభవ మాత్సర్యం కన్నా సౌందర్యగతమైన అసూయ సముచిత మనిపించింది. మరో వైపున, దుర్యోధనుడు పాండవులకు అవమానాన్నే కోరేవ్యక్తి. ఆపద విషయం మొదటి నుండీ ఉన్నదే. అతని లక్ష్యం పాండవుల వినాశనం. ఈ పద్యం వెను వెంటనే "పాండవ కౌరవు లతి ప్రణయ గౌరవంబున నద్దివసంబు సలిపిరి" యన్న మాటలో కౌరవులు తమ మనస్సులో భావం బయట పడకుండా ప్రవర్తించాలని తెలుస్తూంది. దీన్ని లోపలి భేదాల్ని పైకి కనిపించనీకుండా సాధారణ మర్యాదల్ని పాటించే రాజ కుటుంబంలోని వాతావరణంగా పేర్కోవచ్చు.

తెల్లవారింది ధృతరాష్ట్రుడు నిర్మించిన సభా భవనాన్ని దుర్యోధనుడు ధర్మజునికి చూపాడు. "తద్విభూతికి" ధర్మజుడు మనసులో సంతోషించాడు. (మూలంలో ఈ అంశం ప్రస్తావింపబడలేదు.) ద్యూతారంభంలో పాండవ కౌరవుల మనోరూపాన్ని సూచించి నన్నయ రాబోయే కథకు ప్రసన్నమైన మార్గం వేసాడు. దుర్యోధనుడు ధర్మరాజును సుహృద్ద్యూతాని కాహ్వానించాడు. ఈ సందర్భంలో దుర్యోధనుడు ధర్మరాజుతో రెండు మారులే మాట్లాడాడు. ఒక మారు సుహృద్ద్యూతానికి ఆహ్వానించినపుడు, రెండోమారు తనకు బదులు శకుని ఆడతాడన్నపుడు. ఈ రెండు సందర్భాల్లో దుర్యోధనుడు ధర్మరాజుని "అనఘ" అనే సంబోధించాడు. అంటే "పాపరహితుడా" అని అర్థం తాను చేయకూడదనిదేదో చేయనుంది దుర్యోధనునికి తెలుసు, జంకు, సంకోచం, అతని మనసులో కలిగాయి. ధర్మజు డెటువంటివాడో అతనికి తెలుసు పైగా తాను చేసే దుష్కృత్యం పట్ల అనుమానం రాకుండా చూచుకోవలసి

ఉంది. ఈ కారణంగా మాట్లాడిన రెండు మారులు పాప సంబంధమైన ఊహతో ఎదుటి వ్యక్తి పాప రహితత్వాన్ని సూచిస్తూ మాట్లాడడం జరిగింది. మూలంలో

"తేషు తత్రోపవిష్టేషు సర్వేష్వథ నృపేషుచ
శకుని స్సౌబలస్తత్ర యుధిష్ఠర మభాషత"

శకునే ధర్మజుని జూదానికాహ్వానించినట్లుంది. ధర్మజుడు కూడ శకునికే ద్యూత దోషాలు చెప్పాడు. వారు కొంత సేపు వాదించుకొన్నారు. చివరకు ధర్మజుడు జూదమాడేందుకు ఒప్పుకొన్నాడు. కాని నన్నయ దుర్యోధనుడే ధర్మజుని జూదానికాహ్వానించినట్లు వ్రాసాడు. ద్యూతానికి సంబంధించిన లాభ నష్టాల్ని అనుభవించవలసిన వ్యక్తి దుర్యోధనుడే. అందువల్ల దుర్యోధనుడే ఆహ్వానించడం సహజం. ధర్మరాజు ద్యూత దోషాలు చెప్పేప్పుడు శకుని కల్పించుకొని వాదించి చివరకు ధర్మజునొప్పి,చినాడు. అందువల్ల "అస్మిన్ సమాగమే కేన దేవనం భవిష్యతి" ఇక్కడ చేరిన వాళ్ళలో ఎవరితో దేవనం అంటే ద్యూతక్రీడ జరుగుతుంది అని అడుగవలసి వచ్చింది. శకునియే మొదట ఆహ్వానిస్తే అతనితోనే ఆడవచ్చు. మొదట దుర్యోధనుడు ధర్మజునడగడంలో "సుహృద్ద్యూతం బిందొనరింతమ"న్నాడు. మంచి మనస్సుతో లేదా స్నేహంతో ఆడే ద్యూతం వల్ల భేదాలు వైషమ్యాల కవకాశం లేదు. కాబట్టి తనలో యే విధమైన వక్రత పాపచింతన లేదని భావింపజేయడానికే సుహృద్ద్యూత మనడం జరిగింది. ఇది అనఘ సంబోధనం వంటిది. ధర్మజున కేమాత్రం సందేహం కలగకూడదనే దుర్యోధనుని అభిమతం. అయితే శకుని రెచ్చగొట్టడంతో, యుధిష్ఠిరుడు చివరకు సుహృత్ద్యూతమ"నే ఉక్రమించాడు. ధర్మజుడు మాయా ద్యూతంలో క్రమ క్రమంగా సర్వం కోల్పోయాడు. తమ్ముల్ని తనను ఓడిపోయాడు. మూలంలో ఓటమి నొందిన ప్రతివస్తువు వ్యక్తి విపులంగా వర్ణితమైనాయి. నన్నయ ప్రధానాంశాల్ని మాత్రమే స్వీకరించాడు. ధర్మజుడు చివరకు ద్రౌపది నొడ్డి ఓడిపోయాడు. ఈ సందర్భంలో ద్రౌపదిని గూర్చి నన్నయ "మహోత్పల దళ చారునేత్ర", 'కులభామ' యని మొదటిది సౌందర్యాన్ని రెండోది పాతివ్రత్యాన్ని సూచిస్తాయి. మూలంలోని సుదీర్ఘ వర్ణనం కుప్తీకరింపబడింది. ఆమె లావణ్య రూపానికి గాంధారి స్నుషలు "సామర్ష హృదయులయి"నవారు ఆమె విధి వైచిత్రి కాశ్చర్య మతులు కావడం సహజం.

ద్యూత విజయాహంకారంలో దుర్యోధనుడు విదురునితో ద్రౌపదిని సభకు తోడ్కొని రమ్మని చెప్పాడు. విదురుడు దుర్యోధనుని పాపకర్మను నిందించాడు. అవనీతల సామ్రాజ్యోత్సవానికి యోగ్యమైన సతి ద్రౌపది! పాండవ ధర్మపత్ని! "అవమానము సేయనేమి! యనపాశ్రయయే"యున్నాడు.

"నహి దాసీత్వ మాపన్నా కృష్ణా భవితు మర్హతి
అనీశే నహి రాజ్ఞేషా పణే న్యస్తేతి మే మతి:!"

దాసీత్వం పొందడానికి కర్హురాలు కాదు. పతి రహిత కాదు. ఈ శబ్దం దైవాన్ని కూడ సూచిస్తోంది. ఈమె రాజ్ఞి. పణంలో న్యస్తమైందని అభిప్రాయాన్ని ప్రకటించాడు. ఆమె కాశ్రయాన్ని ఇచ్చే పతులు దాసులైనారు. ఇక ఈశ్వరుడు ఆశ్రయం దుర్యోధనుడు ప్రాతికామిని ద్రౌపది వద్దకు పంపాడు. ఆమె "మున్ను తన్నోడినన్నోడనా? లేక నన్నోడి తన్నోడెనా?" ధర్మజు నడిగిరమ్మన్నది. పరాజయ దు:ఖితుడు. ధర్మజుడు మౌనం వహించాడు. "ఇక్కడికి వచ్చియే తెలుసుకొమ్మని చెప్పు"మన్నాడు దుర్యోధనుడు. "సుందరి" పాంచాలేంద్ర తనయను తోడ్కొని రమ్మన్నాడు. ద్రౌపదిని గూర్చి "సుందరి" అన్న మాటనుబట్టి దుర్యోధనునిలో ఆమె సౌందర్యాకర్షణ దాగి ఉంది. 'పాంచాలేంద్రసుత', యజ్ఞసంభవ. అసాధారణ వ్యక్తిని అవమానం పాలు చేయడంలో అల్పుడు పొందే సంతోషం అమేయమైంది. దీనికి ధర్మాధర్మ ఔచిత్యానౌచిత్య ప్రసక్తి ఉండదు. పూర్వం కుమారాస్త్రా విద్యా ప్రదర్శనానంతనరం ద్రోణ ప్రేషితులు దుర్యోధనాదులు ద్రుపదునిచే పరాభూతులయినారు. ఆ ద్రుపదుని కూతురు, దాసియైంది. ద్రుపదుని పేరుతో కాకుండా పాంచాలేంద్రునిగా, ఈమెను ఆ రాజు సుతగా పేర్కొని సభకు తెమ్మనడంలో పూర్వవైర ప్రభావం ఉంది. ద్రుపదుని జయించలేడు కాబట్టి ఏదో ఒక విధంగా అతని కూతురును అవమానించడంలో ఉపశమన తృప్తి అధిక్షేపమనోరూపం స్పష్టం. మూలంలో రెండు మారులు ప్రాతికామి ద్రౌపది వద్దకు వెళ్ళి తిరిగివచ్చాడు ధర్మరాజు దుర్యోధనుడు చేయదలచుకుంది ఊహించి ద్రౌపదిని సభకు రమ్మని దూత ద్వారా చెప్పి పంపుతాడు.

"యుధి ష్ఠిరస్తు తచ్ఛృత్వా దుర్యోధన చికీర్షిత:
ద్రౌపద్యాః సమ్ముఖం ప్రాహిణోత్ భరతర్షభ!"

నన్నయ ఈ అంశాన్ని స్వీకరించలేదు. దు:ఖాభిభూతుడై ధర్మజుడు మౌనం వహించడంలోని ఔచిత్యముందని తలచాడు. ధృతరాష్ట్రుడు ద్రౌపదిని మన్నించి పాండవుల్ని దాస్య విముక్తుల్ని చేసే వరకు ధర్మరాజుకు మౌనమే శరణ్యమైంది. దుర్యోధనుడు దుశ్శాసను బిల్చి 'ద్రౌపదిని తోడ్కొని రమ్మ'న్నాడు. దుశ్శాసనుడు రావడం చూచి ద్రౌపది గాంధారి వద్దకు పరుగెత్తింది. అతడామె అభ్యంతరాల్ని వినలేదు. "నీవేక వస్త్రవైననేమి? విగతవస్త్రవైననేమి"యని దుర్భాషలాడాడు. "కురుకులాపశదుడు, రాజసూయావబృథంబు నందు వసుధామరమంత్ర పవిత్ర వారి ధారావళి జేసి పావనములైన శిరోజములందు దెమల్చి, పాపావహు డీడ్చి"సభకు తెచ్చాడు. వాని దుష్టత్వాన్ని పర్యాయ వాచకయు చేసి నన్నయ పాపాచరణాన్ని వర్ణించాడు. "సభ్యాస్సర్వే నినిందేరన్ మనోభిర్ధృతరాష్ట్రజమ్" సర్వ సభ్యులు ధృతరాష్ట్రుజుని మనస్సుల్లో నిందించారు. "సంభ్రాంతులయ్యారు" సభ్యులు మానసిక స్థితితో పాటు ఆశక్తతను నన్నయ సూచించాడు.

ద్రౌపది సభను చూచింది. కర్ణ దుర్యోధనశకుని సైంధవాది "దుష్ట భూయిష్టంగా" కన్పించింది, "కోప లజ్జా పరవశ'యైంది. కురువృద్ధుల్ని సంబోధించి, "ధర్మజుడు ధర్మపదం తప్పి ప్రవర్తిస్తాడా? ఈ దుర్జనుడు, అవిచారపరుడు, దుర్మదుడు" చేసిన పనికి మౌనం వహించిన సభను గ్హరించింది. "ఇది ఉచితంబు కాదనక" కురు ముఖ్యుల సమక్షంలో "దుర్జనుడయి వీడు నన్ను నవమానిత చేసెడి", సర్వ ధర్మ సంవిదులన నున్న యీ భరత వంశము నేడధర్మ సంపద నతినింద్య మయ్యె"నని బాధను ఆవేదనను ప్రకటించింది. ఎవ్వరు సహాయపడే స్థితి కన్పించలేదు. అపుడు "భూమిని భీతయై" కృష్ణుని తలచింది. మొదటి పద్యంలో సభికులకు ప్రశ్న వేసింది. ఇది ధర్మరాజు ధర్మ నిష్ఠ ననుసరించింది. ఆ సభకు తెచ్చిన వ్యక్తి అవివేకం దౌష్ట్యం ప్రసక్తమైనాయి. సమాధానం కోసం ఎదురు చూచింది. సమాధానం రాలేదు. అపుడు గర్హించింది. సభికుల్ని మరచింది. "ఆప్తజన శరణ్యు"డైన "జగన్నాథు జనార్దను"ని

తలచింది మూలంలో ద్రౌపది భీష్మ ద్రోణుల్ని నిందించడం కర్ణ దుర్యోధనుల పరిహాసం, భీష్ముని అనిర్ధారణ భాషణం మొదలయినవి తొలగించి నన్నయ స్థితి నంతటిని సారభూతంగా ఆలోచనాత్మకంగా చిత్రించడం జరిగింది. లో నారసి మేలు నా అన్న మాట ఇటువంటి రచనా సందర్భాలకు బహుధా అన్వయిస్తుంది.

ద్రౌపది ఆర్తురాలు. ఆమె చూచేది ఒక్కడే శ్రీ కృష్ణుడు! అతడు జగత్తుకు నాథుడు, శరణు వేడదగిన వాడు. పైగా జనార్దనత్వమున్నవాడు. "జనై: అర్ద్యతే యాచ్యతే ఇతి జనార్దన:", జనులచే కోరబడే వాడు, హితార్థమై యాచింపబడేవాడు. ఇంకా జనాన్ దుష్ట జనాన్ పీడయతి దుష్టులైన జనాల్ని బాధించేవాడు నశింపజేసేవాడు. ఈ కారణంగా జనార్దన శబ్దం పరమౌచితీవంతంగా ఉంది. ద్రౌపదీ హితార్థం, దుష్ట నాశనంశిష్ట రక్షణం ఆప్త జన శరణ్య స్థితిలో గర్భితమైనాయి. మూలంలో ద్రౌపది స్తుతి దీర్ఘంగా ఉంది.

**"గోవింద! ద్వారకా వాసిన్ కృష్ణ గోపీ జన ప్రియ:**
**హే నాథ! హే రమానాథ! వ్రజనాథార్తి నాశన!**
**కౌరవార్ణవ మగ్నాం! మా ముద్ధరస్వ జనార్దన!**
**కృష్ణ కృష్ణ మహా యోగిన్! విశ్వాతన్! విశ్వభావన!**
**ప్రపన్నాం పాహి గోవింద! కురు మధ్యేవసీదతీమ్"**

మహాపదలో ఉన్న ద్రౌపది పరిపరి విధాలుగా శ్రీకృష్ణుని పరమేశ్వరత్వాన్ని ద్యోతమానం చేస్తూ సముద్రంలో మగ్నమైన తన్ను ఉద్దరించే, ప్రపన్నురాలైన తన్ను రక్షించే సర్వశక్తిమత్వాన్ని విశ్వసిస్తూ చేసిన ప్రార్థన. సంస్కృత మహాభారతం వెలసిన కాలానికీ, వ్యాస మహర్షి పరమోద్దేశానికీ, తగిన విధంగా ఉంది. తెలుగు మహాభారతం వెలసిన కాలం వేరు, నన్నయ సృజన సూత్రం వేరు, నిర్వహణ కళ వేరు. రెండింటిని పోల్చేప్పుడు ఎన్నో అంశాల్ని దృష్టిలో పెట్టుకోవలసి ఉంటుంది. వాటి స్వతంత్ర వ్యక్తిత్వాల్ని ప్రయోజన పరిమితుల్ని గుర్తించవలసి ఉంటుంది. ఈ కారణంగా నన్నయ సృజన కళవేరుగా పర్యవసితమయింది.

సభికుల మౌనం మధ్య నుండి వికర్ణుడు ద్రౌపది "అధర్మ విజిత" యని నిరూపిస్తూ "జరిగిన పని అన్యాయ" మన్నాడు. దానికి కర్ణుడు "ఇది అనేక భర్తృక! కావున బంధకి! విగత వస్త్రను చేసి తెచ్చినప్పటికి ధర్మ విరోధం లేదని" సమాధానమిచ్చాడు.

**"ఇయం త్వనేక వశగో బంధకీతి వినిశ్చితా**
**అస్యాస్సభాయామానయనం న చిత్రమితి మే మతి:"**

ఈమె అనేకుల వశమై ఉండేది. కాబట్టి బంధకి అని వినిశ్చితం. ఈమెను సభలోకి తీసుకొని రావడంలో చిత్రమేమి లేదు. సంస్కృతంలోని "చిత్రమేమి లేదు" అన్నదానికి "ధర్మ విరోధం లేదు" మొదలుగా నన్నయ రచనలో వ్యాఖ్యాన పద్ధతి కన్పిస్తూంది. కర్ణుని ధర్మ దృష్టి వేరు దుర్యోధనుని పట్ల స్నేహ భావ కృతజ్ఞతాబద్ధ తీరాల మధ్య సరిస్తూంది. ఈ మాట దుర్యోధనునికి ప్రోత్సాహకరమైంది. దుశ్వాహసనుని కాజ్ఞ లభించింది.

ద్రౌపది సభను గర్హించిన తరువాత మరి మాట్లాడలేదు. జనార్దనుని స్మరిస్తూంది. దుశ్శాసనుడు వస్త్రాలపహరింప ప్రారంభించాడు. అపుడు "ఒలువంగ బడియు, మున్నుపనీతయై తద్వస్త్రంబు నట్టి వలువ లలితాంగి జఘనమండలము బాయక యొప్పుచు"నుంది. ఆమె కట్టిన వస్త్రం కట్టినట్లుగా కన్పిస్తూంది. వస్త్రమామె శరీరం నుండి వీడిన భావనే కలగడం లేదు. వస్త్రాలు కుప్పగా పడినవి వస్త్రాపహరణం జరిగిన స్థితి కన్పించలేదు. మూలంలో

**"ఆకృష్యమాణే వసనే ద్రౌపద్యాస్తు విశాంపతే**
**తద్రూప మపరం వస్త్రం ప్రాదురాసీదనేకశ:**
**నానా రాగ విరాగాణి వసనాన్యథ వై ప్రభో**
**ప్రాదుర్భతి శతశః ధర్మస్య పరిపాలనాత్"**

ద్రౌపది ధరించిన వస్త్రం ఆ కృష్యమాణమవుతూంటే, అదే రూపానికి చెందిన మరో వస్త్రం అనేక మార్లు ఏర్పడింది. ధర్మ పరిపాలనార్థం నానా రాగ విరాగ

వసనాలు ఉద్భవించాయి. నానా రాగ విరాగాలైన వసదంలో భ్రాంతి స్థితి కల్పితమైంది. ఇది ధర్మ పరిపాలనార్థం జరిగిందనడం వ్యాసమహర్షి రచనా దృష్టితో సమంజసమైంది. తెలుగులో కావ్య ప్రభావం వల్ల ఈ సందర్భంలో తాత్త్విక ప్రసక్తి పరిహరింపబడడం మానవలోక స్వభావాన్ని చిత్రించడం సముచితమైంది.

"తదద్భుతతమం వీక్ష్య సర్వే మహీభృతః శశంసుర్ద్రౌపదీం తత్ర కుత్సంతో ధృతరాష్ట్రజం" అని మూలం. ఆ అద్భుత దృశ్యాన్ని సర్వ మహీభృతులు చూచి, ద్రౌపదిని ప్రశంసించారు. ధృతరాష్ట్రజుని నిందించారు. నన్నయ రచనలో "సభ్యులెల్ల నుదిత సమ్మదులైరి". ద్రౌపది వస్త్రాపహరణంలో దుశ్శాసనుడు కృతకృత్యుడు కానందుకు ద్రౌపదికేయపకృతి జరగనందుకు, సభ్యులు పొందిన మానసిక స్థితి సూచితమైంది. ద్రౌపదికి భగవదాశ్రయముంది. భగవత్కృప చేత మహాపద నుండి ముక్తయైంది. "ఆపత్సు అభయదం కృష్ణం మనసా చింతయామాస" ఆపదల్లో అభయాన్ని ప్రసాదించే కృష్ణుని మనసా చింతించినదైవ ఫల స్వరూపం ద్రౌపదీ రక్షణం, ధర్మరక్షణం కలిగింది.

ద్రౌపది నొడ్డినందుకు ధర్మజునిపై మండిపడే భీముడు దుశ్శాసనుని అపకృత్యాన్ని కోపరక్తాంతనయను"డై,

**"కురువృద్ధుల్ గురు వృద్ధ బాంధవు లనేకుల్ చూచుచుండన్ మదో**
**ద్ధురుడై ద్రౌపది నిట్లు చేసిన ఖలున్ దుశ్శాసనున్ లోక భీ**
**కర లీలన్ వధియించి తద్విపుల వక్ష శ్శైల రక్తౌఘ ని**
**ర్ఘర ముర్వీపతి సూచుచుండ నని నాస్వాదింతు నుగ్రాకృతిన్"**

అని శపథం చేసాడు. అందరూ చూస్తూ ఉండగా ఇట్లు చేసిన దుశ్శాసనుని నెత్తురు నాస్వాదిస్తానన్న ప్రతిజ్ఞ అందర్ని చకితుల్ని చేసింది. "ఇట్లు చేసిన" మాటలో దుశ్శాసనుడు చేసింది ఊహకు వదలివేయబడింది. అది వాచ్యం కాలేదు. అది చేసిన వాడు మదోద్ధరుడు, ఖలుడు. కాబట్టి అవశ్యం శిక్షార్హుడే. దాని ప్రమాణం పనికి తగిన విధంగా ఉంది. పద్య రచనలో భావం రెండున్నర పాదాల దాకా సాగదీయబడి భీమసేనుని గుండెల్లో గూడు కట్టుకున్న కోప కారణం తదుపశమనంతో

కార్య సూచన కలిగింది. దుశ్శాసనుడు జ్ఞాపకం రావడంతో అతనికి విధించే మరణ శిక్ష విధానం భయ భీభత్స రూపాన్ని పొందింది. పద్యంలో ఒకే ఒక ఓజో గుణ సమాసంలో ఉగ్రమైన మానసిక రూపం దాన్ని అనుసరించిన వాక్యంలో నిబిడమైన వైరభావం రూపు కడుతున్నాయి. విదురుడు కలగజేసుకొని "ద్రౌపదికి ధర్మ విదులు సమాధానం చెప్పాల"న్నాడు. ద్రౌపది "తాను దాసియా? కాదా"? అని అడిగింది. దీనికి భీష్ముడు "ధర్మజుడే ఈ ధర్మ సందేహాన్ని తీర్చగలవాడ"న్నాడు.

రాధేయుడు పూర్వ పద్ధతిలోనే మాట్లాడాడు. దుర్యోధనుడు ద్రౌపదికి తన పృధూరుతలాన్ని సైగ చేసాడు. దాన్ని దూరం నుండి భీముడు చూచాడు. అతడా సమయంలో కౌరవ కురఖిలకు మృగేంద్రుని వలె భాసించాడు. లయ సమయ దండ ధరుని వలె నిర్దయ వహించాడు. ఆ భీమాకృతికి సభలోని ధరణీశులకు విస్మయం భయం సంభ్రమం కలిగాయి.

**ధారుణి రాజ్య సంపద మదంబున కోమలి కృష్ణ జూచి రం**
**భోరు నిజోరు దేశమున నుండగ బిల్చిన యిద్దురాత్ము దు**
**ర్వార మదీయ బాహు పరివర్తిత చండ గదాభిఘాత భ**
**గ్నోరు తరోరు జేయుదు సుయోధను నుగ్ర రణాంతరంబునన్"**

అని శపథం చేసాడు. పూర్వం కన్నా ఈ శపథంలో కోపం అత్యుత్కటత్వాన్ని పొందింది. భావం తీవ్రత్వాన్ని వహించింది. ఓజో గుణంతో పద్యం రౌద్రాన్ని రూపు కట్టిస్తూంది. రౌద్ర రస వ్యంజనానికి శార్దూల మత్తేభ స్రగ్ధరాదులే సరియైన వన్న అభిప్రాయముంది. కాని పై పద్యం ఉత్పమాల ఇదే ఛందస్సులో పదాల కూర్పుతో గణాలపంపకంతో శైలిలో భేదంతో రౌద్ర రసాన్ని కూడ సాధించవచ్చునన్న అభిప్రాయాన్ని పుష్టినిస్తూంది. నన్నయ పద్య రచనా శక్తిని ప్రదర్శిస్తూంది.

ఇంతలో అరిష్ట సూచనలు కన్పిస్తాయి. ధృతరాష్ట్రుడు దుర్యోధనుని భంగిస్తాడు. ద్రౌపదిని అనునయిస్తాడు. శాంత వచనాలతో వరాలు కోరుకొమ్మంటాడు. ద్రౌపది ధర్మ రాజాదుల దాస్య విముక్తి కోరింది.

సుహృత్ ద్యూతంలో జరిగింది సర్వం విధి ప్రేరితమైంది. ద్యూతం వల్ల దుష్ఫలితాలు తెలిసి కూడ ధర్మజుడు దానికి పూను కోవడం విధి వశమే. నన్నయ ఈ అభిప్రాయంతో "జూదంబున నయ్యెడు దోసం బెరంగియు దైవాను శాసనంబున దాని కభిముఖుండయి"నట్లుగా పేర్కొన్నాడు. మూలంలో "విధిశ్చ బలవాన్ రాజన్! దిష్టస్యాస్మి వశే స్థితి:" అని ధర్మజుడు శకునితో అంటాడు. మూలంలో ధర్మజ పాత్ర చేత తెలుగులో కవి ముఖత: చెప్పబడింది. మూలంలో ధర్మరాజు పురుష ప్రయత్నాన్ని వదలినట్లు కన్పిస్తుంది. నన్నయ రచనలో పాత్రను స్పృశించకుండా పురుష ప్రయత్నాన్ని మంచి దైవం పనిచేస్తుందన్న తాత్వికాంశతో కథ ప్రసన్నమైంది. నన్నయ ప్రత్యేకత కథలోని సూక్ష్మాంశాల నిర్వహణంలో ఉంది. దీనికి మూలం మరియు అనుసృజన వెలువడిన కాలం, కవి అభిప్రాయం, మొదలైన అంశాల అధ్యయనం వివేచన అవసరం. ఈ కారణంగా పోలికలో నకారాత్మకమైన దోష విమర్శకు ప్రాధాన్యం పనికిరాదు. ఈ దృష్టితో నన్నయ సృజన – నిర్వహణ స్వరూపాన్ని లోకజ్ఞత మానవ పరిమితుల చిత్రణం ఆధారంగా తెలుసుకునే ప్రయత్నం చేయబడింది. ప్రసన్న కథా కలితార్థయుక్తి తెలుగు కావ్య ప్రపంచంలో నన్నయ స్థాపించిన ప్రత్యేకమైన సృజన గుణ సూత్రం (Concept) గా సమాలోచనంలో నిలుస్తుంది.

# అక్షర రమ్యత

క్షరం అంటే నాశనం. నాశనం కానిది అక్షరం. రచనలో నశ్వరం కాని రమ్యత అక్షర రమ్యత. కావ్యంలో శాశ్వతమైన ముద్రతో ఒక మారు వింటే లేదా చదివితే మళ్ళీ మళ్ళీ వినాలనీ చదవాలనీ అనిపించేది. మనస్సులో చిరత్వాన్ని పొందింది. అక్షర భాషా విషయకంగా వర్ణ విషయంలో రూఢం. అక్షరాల సముదాయం వాక్యం. ఇది స్థూలమైన క్రమం. వాక్యం, పదం, అక్షరం వరుసలో అక్షరం చిన్న విభాగం. అక్షరాల సంయోజనంలో విశిష్టత వల్ల ప్రత్యేకత వల్ల రమ్యత సిద్ధిస్తూంది. ఇది కావ్య శోభా హేతువై ఆకర్షణ శీలంతో గుణమయమవుతూంది. "ఇతరులక్షర రమ్యత నాదరింప నన్నయ మహాభారత సంహితా రచన బంధురు డయినాడు.

"సారమతిన్ కవీంద్రులు ప్రసన్న కతా కలితార్థయుక్తిలో నారసి మేలం"టారు. ఇతరులంటే పద్యంలో ముందు పేర్కొన్న కవులు కానివారు. పరిశేష న్యాయం చేత శాస్త్రమతులైన పండితులు, సహృదయులు అభిలాషులు, "ఇతరుల" క్రిందికి వస్తారు. పండితులు పరంపరను నిలిపేవారు. సహృదయులు కావ్యాన్ని నిలిపేవారు. అభిలాషులు వ్యాప్తి కారకులు. పాఠకులు శ్రోతలు పై ముప్పురికీ వర్తిస్తుంది. ఆనాటి సభల్లో నన్నయ పేర్కొన్న ఈ మూడు తరగతులకు చెందినవారూ ఉన్నారు. అక్షర రమ్యత ఆలంకారికులు పేర్కొన్న శ్లేష ప్రసాద మాధుర్యాది కావ్య గుణాల్లో లేక పోవచ్చు కాని దీని చేతనే అంటే అక్షర విన్యాస విశిష్టత చేతనే భిన్నత్వం వల్ల గుణా లేర్పడతాయి. ఈ సందర్భంలో ఏ గుణానికైనా అక్షరాన్ని కనీస విభాగం (Minimum Unit) గా గుర్తిస్తే (మంత్ర శాస్త్రంలో గమనించవచ్చు) దీనికి సమాధానం సులభంగా దొరుకుతుంది. దీన్ని బట్టి స్థూలంగా అక్షరాల కలయిక పదాల సహయోగం చేత గుణం రీతి శయ్యాదులకు మూలం ఈ అక్షర రూపంగా గుర్తించవచ్చు. కవిత్వ విశ్లేషణలో సూక్ష్మ స్థితుల్లో వేటి కవి ప్రత్యేక వ్యక్తిత్వంతో భాసిస్తాయి.

నన్నయ సంహితాభ్యాసుడు. కాబట్టి స్వరాల ఆరోహణావరోహణ విధానం బాగా తెలుసు. ఉభయ కావ్య రచనాభిశోభితుడవడం వల్ల సంస్కృతాంధ్ర భాషల్లోని

కావ్య సౌందర్య మర్మం తెలుసు సత్ప్రతిభాభియోగ్యుడు కావడం వల్ల సృజనాత్మక రహస్యం తెలుసు. మూల స్థాయిలో అక్షరాల సంయోజనం విన్యాసం, గతి రూపం సమాహారంగా రమ్యత నెరిగే సూక్ష్మమైన మనోనుభవం పరిశీలన కందుతాయి.

నన్నయ రచనలో అక్షర స్వర సంబంధమైన అభిహితత్వం ఈ క్రింది సందర్భంలో ప్రస్ఫుటమవుతూంది. విగత జీవుడై పడి ఉన్న శుక్రుడు కచుని చేత సజీవితుడయినాడు. ఇది యేవిధంగా ఉందంటే, "ఉచ్చారణ దక్షు చేత నభిహితంబగు శబ్దంబు నట్ల వోలె" ఉచ్చారణ దక్షుని చేత చక్కగా పలుకబడిన వేద శబ్దం వలె వెలిగాడు. వేద పఠనంలో శబ్దానికి ప్రాణం ఉచ్చారణం. ఇది శబ్దంలోని అక్షర స్వర గతమైంది. ఇది ఉదాత్తానుదాత్త స్వరితాలతో కూడింది. ఉచ్చారణలో అక్షరాల్లో స్ఫుటత్వం స్పష్టత ఒక క్రమంలో అభివ్యక్తితో శబ్దంలోకి, శబ్ద సంబంధంతో పాదం వాక్యంలోకి క్రమించడం సహజం. నన్నయ సంహితాభ్యాస ప్రభావంతో భారత రచనలో స్వర వర్ణ సంయోజనంలో ఆకర్షణ శక్తి సిద్ధించింది. అది కావ్య దృష్టితో అక్షర రమ్యతగా భావితమైంది. ఇది నన్నయోపజ్ఞకమే అనడానికి కారణం, మూలంలో

"దృష్ట్వా చతం పతితం బ్రహ్మ రాశిం ఉత్థాపయామాస మృతం కచోపి" అని సామాన్యంగా ఉంది. మృతుడై క్రింద పడిపోయిన బ్రహ్మమూర్తిని చూచి కచుడు సంజీవితుజేసాడు (మేల్కొల్పాడు) తెలుగు భారతంలో మహా కవి దర్శనంలో అపూర్వ శక్తి చేత శబ్దంలోని అక్షరం, జీవశక్తిని పొందుతూంది. శబ్దమయమైన కావ్యం బయటికి అక్షర రమ్యత చేత ప్రకాశమానమవుతూంది. అయితే లోన అక్షర శక్తి ప్రభావం మంత్ర శాస్త్రంలో ప్రసిద్ధమైంది.

శబ్దం యొక్క సార రూపం నాదం. నన్నయ రచనలో నాద శక్తి అనుభవానికి వస్తుంది. అక్షర సంయోజనం, దాని గతి విశేషమావిధంగా ఉంటుంది. శ్రవణ సహనం నుండి శ్రవణ పేయమయింది నాదం. ఇది సంగీతంలో ముఖ్యమైంది. అయితే నన్నయ కావ్య సృష్టిలో శబ్దగతి నాద శక్తి చేత రమ్యతను పొందింది. సామాన్య విశేష ఛందోరూపాలు లయాత్మక నాద మాధుర్య సౌభాగ్యంతో ప్రత్యేకతను కలిగి ఉన్నాయి. "కూజంతం రామ రామేతి మధురం మధురాక్షరమ్" అన్న వాల్మీకి

స్తుతిలో శబ్దంలో కనీస విభాగం నుండి ఆరంభం కావడం గమనార్హం. నన్నయ అక్షర రమ్యతకిది వర్తిస్తుంది. వాల్మీకి గురు పద్యవిద్యకు అద్యుడు, కేవలం ఛందో పరిజ్ఞానం చేతనే పద్య విద్య సిద్ధించదు. గురు లఘ్వక్షరాల సంయోజనం విన్యాసం వాటి బరువు, తూగు, గతి, భావానుబంధం మొదలైన అంశాలు సౌందర్యాన్ని సమగ్రతను చేకూరుస్తాయి. నన్నయ తెలుగులో కావ్య గతమయిన పద్య విద్య కాద్యుడు. ముక్తకం వేరు కావ్య నిర్మాణం వేరు. పద్య విద్య తెలుగు మహాభారత కావ్యేతిహాసంలో విస్తృతి వైవిధ్యం సంపూర్ణత రామణీయకతో ఆదర్శంగా నిలిచింది.

నన్నయ రచనలో అక్షర రమ్యత సమతాభావ సుగమంగా ఎక్కడ చూచినా అనుభవానికి వస్తుంది. ఇది ఎంతో వైవిధ్యమైంది కూడా.

**"గంగాధర పింగ జటా! సంగమ మంగళ విశాల చటుల తరంగన్**
**గంగానది సేవించెను! గంగా ద్వారమున విగత కల్మషు దగుచున్"**

ఇది అర్జునుడు తీర్థ యాత్రలకు వెళ్ళి గంగా నదిని సేవించిన సందర్భంలోనిది. ఈ యాత్రలో అతడు ఉలూచిని చిత్రాంగదను సుభద్రను వివాహమాడతాడు. అన్ని మంగళ మయాలే. ఈ శుభస్థితులు గంగానది నుండి ప్రారంభమవుతాయి. ఉలూచి అక్కడే వలచింది. గంగ శివుని జటా సంగతి కలిగింది. గంగాధరుడయినాడు. ఇది సభార్యుడయిన శివుని స్ఫురింపజేస్తుంది. పవిత్రమైన గంగను ధరించడం వల్ల గంగాధరుడయినాడు. జటా ధరత్వం చేత తీర్థయాత్రలో ఉన్న అర్జునుడు మన ఊహలో నిలుస్తాడు. బిందు పూర్వకమైన సరళాక్షరాలు పాదారంభంలో నాద సన్నిహితంగా వినిపిస్తాయి. శబ్దాలంకారంగా గోచరించినా దీని కతీతమైన ఆద్యంత నాద ప్రసార రీతి చేత అక్షర రమ్యతా గుణాన్ని భావింపజేస్తుంది పద్యం.

"కమ్మని లతాంతములకున్మొనసి వచ్చు మధు పమ్ముల సుగీత నినదమ్ములెసగెం...

చందన తమాల లతలందు నగరు ద్రుమము లందు కదళీ వనము లందు లవలీ...

ఈ రెండు లయగ్రాహి పద్యాలే, పద్యాల పేరు విశిష్టమైన లయను స్ఫురింపజేస్తుంది. ఇందులో ప్రాస స్థానంలోనే కాక ఇతర చోట్ల కూడ ప్రాస

ఉపయోగింపబడింది. ఈ రెండు పద్యాలు వసంతాన్ని వర్ణించేవి. కథలో వసంత శోభ పాండురాజు మరణానికి దారి తీసింది. పాండురాజు మనస్సు మోహమయం కావడానికి యోగ్యమైన స్థితికై విశేష వృత్తం గ్రహింపబడింది. ఈ పద్యాల్లో లయాత్మకమైన పద విన్యాసం మానసికమైన ఉల్లాసాన్ని కలిగిస్తూంది. కథాగతమైన పాత్రచర్యకవసరమైంది. నన్నయ అక్షర రమ్యతకు చక్కని ఉదాహరణగా నిలిచింది.

ఇది కథాంశానికీ పాత్రమనోరూపానికీ సముచితంగానూ ఉంది.

**"నీల గిరీంద్ర శృంగమున నిర్మలమైన సువర్ణ వల్లరీ**
**జాలము వోని పింగళ విశాల జటా చయ మొప్పగా వచ**
**శ్రీలలితుండు వచ్చి నిలిచెన్ హరి నీల వినీల విగ్రహా**
**రాళ రుచుల్ వెలుంగగ పరాశర సూనుడు తల్లి ముందటన్"**

ఈ పద్యంలో గురువులుపయోగించాలిసిన చోట ఎక్కువగా దీర్ఘాక్షరాలుప యుక్తమైనాయి. మొదటి పాదంలో ఇకార దీర్ఘాక్షరాలు ఔన్నత్యాన్నీ రెండో పాదంలో ఒకటి తప్ప మిగిలినవి అకార దీర్ఘాక్షరాలు వైశాల్యాన్నీ స్ఫురింపజేస్తున్నాయి. వీటికి సంబంధించిన భావం వరుసగా రెండు పాదాల్లో చెప్పబడింది. ఇకార దీర్ఘాలైన నీ రీలు శృంగౌన్నత్యాన్ని భావింపజేస్తున్నాయి. ఈ అనుభవం వినేప్పుడు లేదా చదివేప్పుడు అవగతమవుతుంది. ఈ పద్యంలోని అక్షర రమ్యత మహనీయుని విశిష్టమైన వ్యక్తిత్వాన్ని సాక్షాత్కరింపజేస్తూంది.

శబ్దాలంకారాలకు చెందిన శ్లేష మరియు ఛేక, వృత్తి, స్ఫుట, అర్థ, యమకాను ప్రాసలకు చెందిన అక్షర రమ్యత రచన కాకర్షణనిస్తుంది. నన్నయ భారతంలో ఒక్కొక్క పద్యం ఒక్కొక్క విధమైన అక్షర రమ్యతా గుణంతో నన్నయ మహా నిర్మాణ వ్యక్తిత్వాన్ని ప్రత్యక్షం చేస్తూంది. అక్షర రమ్యత ఆద్యంతం నాద గాంభీర్యంతో ప్రవాహ సమత్వంతో నన్నయ సృజన సూత్రంలో భాగమైంది. నిర్వహణ శిల్పాన్ని పొందింది. స్వతంత్రమైన ప్రతిపత్తి కలిగింది. అలంకార శాస్త్ర ప్రపంచంలో వివేచనార్హమైందీ, విమర్శనా జగత్తులో సమాలోచనా యోగ్యతను పొందిందీ.

# నానా రుచిరార్థ సూక్తి

నానా రుచిరార్థ సూక్తి నిధి యన్నది నన్నయ బిరుదు. నానా రుచిరార్థ సూక్తిమత్వం నన్నయ మూడో కవితా గుణంగా భావితమైంది. బహు మనోహరాలైన అర్థాలతో కూడిన సుభాషితం అనీ బహు మనోహరమైన అర్థాన్ని ఇచ్చే చక్కని మాట అనీ చెప్పొచ్చు. ఈ సూక్తి కథానుబంధంగా ఉంటుంది. పద ప్రమాణం నుండి వాక్యం మరియు పద్య పాదాలు పద్యం దాక విస్తరించవచ్చు. ఇటువంటి సూక్తులకు నన్నయ నిధి. దీన్ని త్రవ్విన కొద్దీ అంటే ఆలోచించిన కొద్దీ అనర్ఘమైన రత్నాలు లభిస్తాయి. ఈ లక్షణం ప్రసన్న కథా కలితార్థ యుక్తి, అక్షర రమ్యత కన్న భిన్నమైంది. మొదటిది కథా కథన సంబంధి. రెండోది అక్షర పద ప్రయోగ సంబంధి. ఈ మూడోది భావార్థ సంబంధి. స్థూలంగా అర్థాంతరన్యాసాలంకారాన్ని తలపిస్తూంది. కథా పరమార్థంతో పెనవేసుకొని ఉంటుంది. మొదటి గుణంలో అంతర్భవించే దానివలె కన్పిస్తుంది. కాని అది సరి కాదు. ఎందుకంటే మొదటిది కథ ప్రసన్నమవడానికి సంబంధించిన అంశాలకు మాత్రమే చెందింది. మరో విషయం ఈ మూడో గుణం రచనా నిష్ఠంగా కాక బిరుదం రూపంలో కర్త నిష్ఠంగా చెప్పబడింది. ఇది కర్త వ్యక్తిత్వాన్ని సూటిగా భాసింపజేస్తూంది. దీనికి కారణం కవి ఆత్మ భావాన్ని స్ఫురింపజేస్తుంది. విడిగా నైతే ముక్తకాల్లో కొంత వరకు సూక్తి లక్షణం కన్పిస్తుంది. అయితే కావ్య రచనలో కథాంశాలకు చెందిన అప్పటి స్థితి, పాత్ర, లోకవృత్తి, కవి వైఖరి ననుసరించి అవతరిస్తుంది. లోకానుభవంలో విశేష స్థితిలో వ్యక్తి భావనలో సార్వజనీన సర్వసాధారణ తలంపై సూక్తి అవతరిస్తుంది. దీన్ని సుభాషితంగాను గ్రహించడం జరిగింది. సూక్తి కథా పరిధిని దాటి ఆలోచనకు ప్రేరేపిస్తుంది. అసామాన్య లక్షణంతో ఆలోచనను వెలిగిస్తుంది. విశ్వజనీనత్వాన్ని ప్రకాశింపజేస్తుంది కూడా.

నన్నయ భారతంలో సూక్తి వస్తువునో సంఘటననో పాత్రనో ఆశ్రయించింది. సార్వకాలిక సార్వదేశిక ప్రయోజనస్ఫూర్తితో వ్యాఖ్యానార్హమై అలరిస్తూంది. సు+ఉక్తి=సూక్తి; చక్కని ఆలోచనతో, మంచి అనుభవంతో ఉక్తమైంది (చెప్పబడింది) (భాషితమైంది). మంచి మాట హితం చేకూర్చేది, శ్రేయస్సును లక్షించేది సన్మార్గం

చూపేది. ఇది జీవితంలో అనుభవం మీద ఆలోచనపై సారభూతంగా ఆవిష్కృతమవుతుంది. సంస్కృతంలో భర్తృహరి సుభాషిత త్రిశతి ఇటువంటి సూక్తుల్ని ఒక చోట చేర్చిన రచనా రూపం. వీటిలో కొన్నిటిలో తత్త్వ నిరూపణం అధికంగా ఉంది. కావ్యంలో ఆయా సందర్భాల్లో ప్రయోజన సహితాలైన సూక్తులు తత్త్వ ప్రకాశనమే కాకుండా భావగతమైన ఆనందానుభూతిని కలిగిస్తాయి. ఒక కథలో ప్రసక్తమైనపుడు విడిగా చెప్పినదాని కన్న ఎక్కువ శక్తివంతంగా మనస్సుపై పని చేస్తాయి. లోక స్వరూపాన్నీ అవగతం చేస్తాయి. ఇవి కావ్య నిర్మాణంలో భాగంగా పర్యవసిస్తాయి. ఇవి సహజంగా కథాంశంలో ఇమిడినట్లు రచించడం చేత నిర్మాణ గుణం చేత ఆలోచనాదిశలో తత్త్వ ప్రకాశంతో పాటు ఆనందానుభూతికీ దారి తీయడం చేత నన్నయకు 'నానా రుచిరార్థ సూక్తి నిధి' యన్న బిరుదం అన్వర్థమవుతూంది. ఇది కథా ప్రసన్నతకు దీప్తి నిస్తుంది.

సూక్తి రచనకు లోకజ్ఞత విషయంలో బాగా ఉపకరిస్తుంది. నన్నయ లోకజ్ఞుడు. లోక స్వభావాన్ని బాగా అర్థం చేసుకున్నవాడు. సూక్తికి ఆలోచన వివేకం అనుభవం అనుభూతి గుణాలతో వైవిధ్యం సిద్ధిస్తుంది.

సూక్తులు రెండు విధాలుగా కన్పిస్తాయి. ఒకటి రచనలో కథతో ప్రత్యక్ష సంబంధం కలిగినవి. రెండు కథతో ప్రత్యక్ష సంబంధం లేనివి. అంటే కథాంశంలో విషయ పర్యవసితం కాకుండా సూక్తి స్వతంత్ర రూపాన్ని భావింపజేస్తాయి. మొదటిది కథాంశంలో విషయ పర్యవసితమయి పరిమితిని భావింపజేస్తుంది. ఉదాహరణకు, కద్రువ తన కుమారులకు వినతతో తాను చేసిన పందెం గురించి చెప్పింది. ఆ తెల్లని అశ్వరాజం వాలాన్ని నల్ల చేస్తే వినత నాకు దాసి అవుతుందని పలికింది. పాములు తమలో తాము విచారణ సలిపాయి. అధర్మానికి సుముఖులు కాలేదు. ఈ సందర్భంలో

**"తల్లి పనిచెనని యధర్మువు సేయంగ నగునె, యెఱుక గలరె ముగుద లెందు"**

తల్లి పనిచిందని అధర్మం సేయదగునా? యని ప్రశ్న. తల్లి నియోగించిందని అధర్మం సేయరాదన్న ధర్మ విషయం సార్వకాలికమైంది. సార్వదేశికమైంది. ఇది పాత్రముఖంగా ఉక్తమైంది. కథాంశంలో పర్యవసితమైంది. కథలో తల్లి కొడుకుల్ని

అధర్మానికి ప్రోత్సహిస్తూంది. ఇది సరికాదన్న ఆలోచన పాముల్లో కొందరికి కలిగింది. దీనికి "ఎఱుక గలరె మగువ లెందు" అని సమర్థక వాక్యం. ఇది అర్థాంతరన్యాసాలంకార విశేషం. సామాన్యం చేత సమర్థింపబడింది.

ఇచ్చట విశేషమేమంటే తల్ల పనిచినా పాములు అధర్మం చేయకుండా ఉండడం, 'తల్లి కన్నా దైవం లేదన్న' మాటను పరాస్తం చేయడం వల్ల విశేష స్థితిని పొందుతూంది. ధర్మ పరమైన ఈ సూక్తి కథా పర్యవసాయి అయ్యే అంశంగా నెలకొంది. కాబట్టి కథతో ప్రత్యక్ష సంబంధమున్న సూక్తి. కథకు గమనరేఖనిస్తూంది.

కొన్ని సూక్తులు తమ ప్రత్యేకతను భాసింపజేస్తాయి. "విపరీత ప్రతిభాషలేమిటికి?" అన్న పద్యంలో "జీవునకు హృద్యంబే కదున్ శీతమే"యన్నది. దుష్యంతుడు నిరాకరించిన సందర్భంలో పుత్ర సహితంగా ఎదుట నిల్చిన శకుంతల దౌష్యంతి గాత్ర స్పర్శ ఈ సమస్యను పరిష్కరిస్తుందన్న భావంతో అన్నది. జీవునికి అన్నింటికన్నా పుత్ర స్పర్శ హృద్యమైంది. ఇంతకన్నా మరో ఆనంద లేదు. మూలంలో జీవ స్వరూప ప్రసక్తి లేదు. ఈ సూక్తి కథాంశ పర్యవసాయి కన్నా శకుంతలా భాషణం (తమ వాదానికి సమర్థకంగా) గా రూపొందింది. ముక్తాహార కర్పూరాదుల సంస్పర్శ సుఖం శరీర సంబంధి, పుత్ర స్పర్శ భౌతికాతీతమైంది. సార్వదేశికమైంది. ఈ సూక్తికి మూలం "ఆత్మా వై పుత్ర నామాసి" అన్న వైదిక భావన. జీవ స్వరూపం కథలో ఒక సమస్యకు పరిష్కార సూచకంగా పరిణమించింది. ఈ విధంగా కథతో సంబంధం కలిగి ఉంది. తన ప్రత్యేకతను నిలబెట్టుకుంటూంది. కథాంశానికి దీప్తినిస్తూంది.

ఇంకో విధమైన సూక్తి సూటిగా ఆకర్షించే గుణం కలిగింది. కథతో ప్రత్యక్ష సంబంధం ఉండదు. మరి కొన్ని సూక్తులు ప్రధానంగా విషయాన్ని తలపింపజేస్తాయి.

**"ధర్మ రహితులైన ధార్తరాష్ట్రులకు రాజలక్ష్మి సుస్థిరంబు గాదు**
**ధర్మ తనయ! నిన్ను తద్రాజ్య సంపదల్ వలచి తమకు తాము వచ్చి పొందు"**

ఇది విదురుడు ధర్మజునితో చెప్పిన మాట. భవిష్యత్తుపై ఆశను భావింపజేస్తూంది. ఇందులో చెప్పదలచిన ప్రధాన భావం ధర్మ రహితుల కైశ్వర్యం స్థిరంగా ఉండదు. ధర్మవంతు లైశ్వర్యాన్ని చివరకు తప్పకుండా పొందుతారు. ఇది

ధార్తరాష్ట్రులు ధర్మతనయుడన్న కథాగతమైన వ్యక్తుల్ని ఆశ్రయించి చెప్పబడింది. పాండవాగ్రజుని 'ధర్మతనయు'డని ధార్తరాష్ట్రుల్ని పేర్కొన్నపుడు ధర్మ రహితులని ధర్మాధర్మ స్వరూపంతో సూక్తి భాసిస్తూంది. "ఎల్ల వారు నెరుగ రెల్ల వానిని", అందరు అన్ని విషయాలు ఎరగరు ఋతుపర్ణుడు బాహుకునితో (నలుడు) అన్న మాటలివి. బాహుకుడశ్వ హృదయ విద్య ప్రదర్శించాడు. ఋతుపర్ణుడు అక్ష హృదయ విద్య ప్రదర్శించేందుకు ఉత్సాహితుడయినాడు. అందరికి అన్ని విద్యలు రావు. ఒకరి కొక విద్య తెలిస్తే మరొకరికి మరో విద్య తెలుస్తుంది. కథలో పాత్రల నాశ్రయించి చెప్పబడింది.

**"కారణంబు లేక దారుణుం డయి సాధు హింస సేయు కుజను డెల్ల వారి**
**కప్రియుండు కాక యప్రియ లక్షణం బొండు గలదే! తలప నుత్తములకు"**

ఉత్తముల లేనివారంటూ ఉండరు. వారి కందరు ప్రేమ పాత్రులే. కాని నిష్కారణంగా సాధు హింస చేసే కుజునుడు మాత్రం వారికి అప్రియుడు. ఇంతకు మించి అప్రియ లక్షణం వేరే ఏముంటుంది? ఇది మానవ స్వభావం పై ప్రవర్తనలో ఆదర్శ గుణంపై దృష్టితో చెప్పిన సూక్తి, సర్వత్ర అన్వయ యోగ్యమైంది.

సూక్తులు కథలో విషయానికీ పాత్రకూ ఉద్దేశానికీ దీప్తినిస్తాయి. పోషకంగా పరిణమిస్తాయి. ఈ విధంగా ఒక్కొక్క సూక్తిని వివరిస్తూపోవచ్చు. నన్నయ రచనలో వైవిధ్య భరితమైన సూక్తి ప్రపంచం నీతి ప్రాయంగానే కాక, కావ్య శోభాకరంగాను ఉంది. ఈ విశిష్టత చేత "నానా రుచిరార్థ సూక్తి నిధి" బిరుదం సముచితత్వాన్ని పొందుతూంది. నన్నయ నానా రుచిరార్థ సూక్తి ప్రశస్తి, బిరుదంగా ఖ్యాతమైంది. సృజన సూత్రంలో అర్థవంతమైంది, అభివ్యక్తిలో రుచిరత్వం కలిగింది. నానా రుచిరార్థ సూక్తి నన్నయ మార్గదర్శిత్వానికి మరో వెలుగు చిహ్నామవుతూంది.

నన్నయ సృజన కళ నిర్వహణ శిల్పం మహాభారత రచనలో ప్రసన్న కథా కథనం, అక్షర రమ్యత, నానా రుచిరార్థ సూక్తి సమన్వయంతో, వేద ప్రతిపాదితమైన వ్యాస హృదయాన్ని ప్రతిపాదిస్తూంది, కావ్య ప్రయోజనమైన రసానందానిన్నీ జగద్ధితత్వాన్ని ఆవిష్కరిస్తూంది. మహాకవి ప్రతిభా శక్తి చేత తెలుగు భాషలో స్వతంత్ర రూపంతో తనదైన సృజన సూత్రంపై నిర్మాణరూపం దర్శనమిస్తూంది.

# తిక్కన కృతులు
# సృజన రూపం - నిర్వహణ శిల్పం
# అవతారికలు

కవి బ్రహ్మ తిక్కన మొదటి కృతి నిర్వచనోత్తర రామాయణం. సంస్కృత భాషలో మహాకావ్యాలు వచన రహితాలు. నన్నయ చంపూ పద్ధతిననుసరించాడు. తరువాత సర్వాంధ్ర కవులకు మార్గదర్శకమైంది. ద్విపద శతక కవుల్ని వదిలితే పూర్వ కవుల్లో నిర్వచన కావ్యం వ్రాసిన కవి తిక్కన ఒక్కడే. అయితే మహాభారతం పది అయిదు పర్వాలు చంపూ పద్ధతినే తిక్కన రచించాడు. ఆ కాలంలో చంపూ పద్ధతికున్న ప్రశస్తి అటువంటిది.

తిక్కన నిర్వచనోత్తర రామాయణం వాల్మీకి రామాయణంలో సప్తమకాండ ఆధారంగా ఆవిష్కృతమైంది. ఇందులో రావణాదుల జన్మ వృత్తాంతం రామపట్టాభిషేకం అనంతర గాథ వర్ణితం. పూర్వ రామాయణాన్ని తిక్కన తాత మంత్రి భాస్కరుడు రచించాడని అభిప్రాయం ఉంది. మంత్రి భాస్కరుడు గుంటూరు విభుడు. సార కవితాభిరాముడని తిక్కన వర్ణించాడు. ఇతడు పూర్వ రామాయణం రచించిన ఆధారాలేమి లేవు. నిర్వచనోత్తర రామాయణ కావ్యారంభం, సంస్కృత శ్లోకంతో జరిగింది. "శ్రీరాస్తాం మనుమ క్షితిశ్వర" మరియు "కిమస్థిమాలాం" అనేవి రెండు శ్లోకాలు మాత్రమే తిక్కన సంస్కృత కవుల స్తుతిలో తిక్కనను కూడా చేర్చింది. తిక్కన ఉభయకవి మిత్రుడు సంస్కృత గ్రంథం వ్రాసి ఉండవచ్చుననో, సంస్కృతంలో కావ్యం వ్రాయ గల సమర్థుడనో ఆ రెండు శ్లోకాల్ని దృష్టిలో పెట్టుకొని గౌరవభావం చేతనో పేర్కొని ఉంటుంది. తిక్కన భారతంలోని విరాట పర్వం మాత్రం తెలుగు పద్యంతోనే మొదలైంది. నిర్వచనోత్తర రామాయణం మనుమసిద్ధికి కృతీశ్వరుని చేయడం జరిగింది. తిక్కనను 'మామ' వరుసతో మనుమసిద్ధి పిలిచేవాడు. "నిన్ను మామ యనే దానికి తగినట్లుగా భారతీ కన్యక" నిమ్మని కోరాడు. మనుమసిద్ధికి తిక్కనపై గల ప్రేమాభిమానం నిర్వ్యాజమైంది. ఈ కావ్యం వ్రాసే కాలంలో "కవితా విలాస విస్తర మహనీయుడు",

భారతం వ్రాసే కాలానికి "కవిత్వ తత్త్వ శక్తిని, కవితా గుణాలను గురించి, వ్యక్తిత్వం గురించి.

**"అమలోదాత్త మనీష నే నుభయ కావ్య ప్రౌఢి పాటించు శి**
**ల్పమునన్ పారగుడన్ కళావిదుడు... మహేశ్వరాంఘ్రి కమల ధ్యానైక శీలుండ"**

నని చెప్పుకున్నాడు. ఇది ఆత్మ శ్లాఘాపరంగానే కాక శివభక్తి తత్పరతను ప్రకటిస్తుంది. "ఉభయ కావ్యప్రౌఢి" సంస్కృతం తెలుగు భాషల్లో లేదా మార్గ దేశి పద్ధతుల్లో కావ్య రచనా సామర్థ్యాన్ని భావింపజేస్తుంది. జాను తెనుగు మరియు దేశి కవితను ప్రచారంలోకి తెచ్చిన వారు శివకవులు. తెలుగు భాషలో శివకవులందరు వీరశైవులు కాదు. వీరి దృష్టిలో శైవ మతం ప్రధానం, కావ్య శోభాకర గుణాల పట్ల శ్రద్ధ తక్కువ కావ్యం ప్రజలకు సన్నిహితంగా సుబోధకంగా ఉండేందుకు జన వ్యవహారంలో ఉన్న పదాల్ని పద బంధాల్ని, సామెతల్ని విరివిగా వాడి దేశి పేరుతో సాహిత్యాన్ని సంపన్నం చేశారు. శబ్దశాసనుడు నన్నయ శబ్ద రాశిని సంస్కరించి ఉపయోగితను కలిగింపజేసి, వ్యవస్థ నేర్పరచి భావనా బలాన్ని కావ్య లక్షణాల్ని తెలుగు భాషకు సిద్ధింపజేసి, మార్గ కవిత్వానికి ఆదర్శమయ్యాడు. కాలం గడచే కొద్ది శివకవుల దృష్టి భేదాన్ని బట్టి యేర్పడిన ఈ రెండు వాదాల మధ్య సమన్వయాన్ని సాధించే ప్రయత్నం జరిగింది. దీనికి తిక్కన నాయకత్వం వహించడం జరిగి ఉంటుంది. దీనికి కుకవుల్ని దుర్విటులతో పోల్చి నిరసించిన సందర్భంలో వ్రాసిన పద్యంలో కావ్య శైలి, రస నిర్వహణం, కావ్యానందమనే మూడు అంశాల్ని ప్రతిపాదించడం జరిగింది. పలుకుల పొందిక ఉండడం, రసభంగం లేక పోవడం, హృదయాన్ని అలరించడమనేవి కావ్యపరంగా అన్వయం కుదురుతాయి. ప్రాతవడ్డ మాటలంటే జనవ్యవహారంలో లేని, కేవల నైఘంటుక శబ్దాలు కావచ్చు. మారుమూల పదాలు కావచ్చు. తెలుగులో కవిత్వం చెప్పే కవి అర్థానికి తగిన మాటల్ని తీసుకోవాలి. "వళి ప్రాసల్ని పులిమి పుచ్చక" సహజంగా ఉండేట్లు నిలపాలి. కావ్యం సరసుల సహృదయుల చెవికెక్కాలి. ఈ విధంగా సత్కవీంద్ర మార్గాన్ని మనస్సులో నిలుపుకున్నాడు. సరసమైన మధురమైన మాటల కూర్పుతో సుప్రసాద గోచరంగా బహు విధార్థ తాత్పర్యంగా కావ్య రచనకు పూనుకున్నాడు. ఇది నన్నయ మార్గం.

ప్రసాద గుణోపేతం. బహురుచిరార్థ భాసురం. తిక్కన కావ్యారంభంలో సూరుల కింపు గూర్చే ప్రతిజ్ఞలు చేసాడు. జాత్యమిగామి ఒప్పయిన శ్రుత్యను రూపమని ప్రాస పద్ధతికి విరుద్ధంగా ఒప్పుకోకపోవడం అనేవి. శివకవులకు ప్రాస పద్ధతికి విరుద్ధంగా ఒప్పుకోకపోవడం అనేవి. శివకవులకు ప్రాస విషయంలో కతిపయ హల్ సామ్యముంటే చాలు. పద్యం వచనం రెండు భిన్న సాహిత్య ప్రక్రియల పట్ల నిశ్చితమైన అభిప్రాయం కన్పిస్తుంది. ఈ రెండిటి స్వభావం, ఉపయోగం ప్రయోజనం భిన్నమని విశ్వసించిన కవి. ఈ దృక్పథమే వచనం లేకుండా ఉత్తర రామాయణాన్ని పద్యంలో వ్రాయడానికి ప్రేరేపించింది.

**"లలిత పద హృద్య పద్యంబులన కథార్థంబు ఘటిత పూర్వాపరమై**
**యలతి యలతి తునియల కాహళ సంధించిన విధంబు నమరగ జేయున్"**

కథార్థ సంయోజితమైన పూర్వాపర రూపంలో, లలితమైన పదాలతో హృద్యమైన పద్యం చిన్న చిన్న విభాగాలుగా కాహళ ఊదితే వచ్చే నాదంతో చెప్పబడింది. ఒకటి కథాయోజనం, రెండు అభివ్యక్తి విశేషంగా కన్పిస్తాయి. కాహళ వాద్య విశేషం. ఇది ఊదినప్పుడు ధ్వని ఆగి ఆగినట్లు తరగలు తరగలుగా పైకి విభాగాలుగా కన్పించినా నాద సాంతత్యంతో అలరిస్తుంది. కాహళ దేశీయమైంది. తిక్కన పద్య రచనా రూపాన్ని సూచిస్తుంది.

**"అలవడ సంస్కృత శబ్దము, తెలుగు పద విశేషణంబు తేటపడంగా**
**పలుకు నెడ లింగ వచనంబులు భేదింపమికి మెచ్చు బుధ జనము కృతిన్"**

ఇందులో దోషాలు శివకవులపై విమర్శ రూపాలే, తెలుగు వాక్యంలో సంస్కృత పదాలు వాక్యాలు జొప్పి,చడం, శాంత ప్రాస వాడడం, విశేషణ విశేష్య లింగవచనాల భేదాన్ని పాటించకపోవడం, వళులు ప్రాసలు పులిమి పుచ్చడం నిరసింపబడినాయి. నన్నయ మార్గంలో లక్షణ సహితం నియమ బద్ధమయిన రచనకే తిక్కన ప్రాధాన్య మిచ్చినట్లు స్పష్టం. కావ్య రచన గురించి స్పష్టంగా అభిప్రాయాలు ప్రకటించడం చేత నిర్వచనోత్తర రామాయణం అవతారిక తిక్కన కావ్యాను శీలనానికెంతో ఉపకరిస్తుంది.

# తిక్కన మహాభారతం : అవతారిక

"శ్రీయన గౌరినా బరగు" తెలుగు పద్యంతో తిక్కన మహాభారతం, విరాటపర్వంతో ఆరంభమైంది. ఈ మహాకవి తాత్త్విక పథంలో సాక్షాత్కరించే శివ కేశవుల అభేదం ఉదాత్తమైన పరిణత మనోరూపాన్ని కలిగింది. ఇది వైదిక ధ్యాయిత కిచ్చమెచ్చు పరతత్త్వ భావనా మహితమైంది. క్రతు నిర్వహణం పంచాయత పూజనం అద్వైత భావనతో విశిష్టమైంది. ఒక్కమారు పర్యాలోకనం చేసే స్థూలంగా వైష్ణవానికి దక్షిణ దేశం ఆటపట్టయింది. శైవానికి కన్నడ దేశం నిలయమయింది. ఇది వీర రూపం ధరించింది. ఆంధ్రదేశంలో వీటి తీవ్రత కన్పించదు. ఈ రెండింటి సమన్వయంతో పరమార్థాన్ని గుర్తించే సమభావం నెలకొంది. బ్రహ్మ విష్ణు మహేశ్వరుల మూర్తి త్రయానికి భేదం పాటించని సంప్రదాయాన్ని సాహిత్యంలో నన్నయ స్థిరపచాడు. అయితే తిక్కన కాలంలో దేశంలో శైవవైష్ణవ భేద భావాలు తలెత్తాయి. అవైదిక చిహ్నాలు ప్రబలాయి కవిబ్రహ్మ తిక్కన "విష్ణు రూపాయ నమశ్శివాయ"యని వీరిరువురికభేదాన్ని గుర్తించే పరతత్వాన్ని కొల్చి "విద్వత్సంస్తవనీయ భవ్య కవితావేశుడు", "విజ్ఞాన సంపద్విఖ్యాతుడు" "అర్థిలోక హిత నిష్ఠ"ను వహించి "ధర్మాద్వైతస్థితి" రచించిన మహాభారతాన్ని ఆంధ్రీకరింప సంకల్పించాడు. ఇంతకు ముందు "మహితాత్ముడు", "ఆంధ్ర కవితా విశారదుడు" నన్నయ భట్టు మూడు కృతులాంధ్రీకరించాడు. తిక్కన "హృదయాహ్లాది చతుర్థ మూర్చిత కథోపేతమై"న విరాటపర్వం మొదలుకొని పది అయిదు పర్వాలు రచించే ప్రజ్ఞామతి అయినాడు. ఈ పర్వాలు మొత్తాన్ని ప్రబంధ మండలిగా భావించడం విశేషం. ఈ ప్రబంధ మండలి కథినాథునిగా ఎవరి నెన్నుకోవాలన్న ఊహతో నిద్రించే వేళ తండ్రి కొమ్మన సాక్షాత్కరించాడు. పూర్వం తిక్కన రచించిన.

**"కిమస్థి మాలాం కిము కౌస్తుభం వా, పరిష్క్రియాయాం బహుమన్యసే త్వమ్**
**కిం కాలకూటః కిము వా యశోదాస్తన్యం తవ స్వాదు వద ప్రభోమే"**

అన్న శ్లోకాన్ని జ్ఞాపకం చేసాడు. హరి హరనాథుడే పద్యాన్ని అవధరించి భక్తవత్సలుడై తిక్కన పట్ల దయాళుడై కృతార్థుజేయ సంకల్పించాడని చెప్పాడు. నాక లోక నివాసియైన తనకు తన దివ్య చిత్తంలోని అభిప్రాయాన్ని తెలుసుకునే శక్తిని

ప్రసాదించాడని, విజయం చేయడం చూపాడు. ఆ వైపు చూస్తే కరుణా రసం పొంగి పొరలే విధంగా శశిరేఖ నుండి అమృతం జాలువారుతూంది. హరి నీల పాత్రికలో సురభి చందనం వలె నాభిని ధవళ పంకజం మెరుస్తూంది, లోక రక్షణకు చిహ్నా మన్నట్లుగా గరళ చ్ఛాయ కన్పిస్తూంది. ఉదయాద్రిపై భాను బింబమన్నట్లుగా వక్షస్థలంపై కౌస్తుభ రత్నం విలసిస్తూంది. గంగానది కాళింది కలిసిన కాంతి శోభిల్లే శాంతమూర్తి సాక్షాత్కారం జరిగింది. తిక్కన దండ ప్రణామం చేసాడు. ఆ దేవుడు వ్యాస మహర్షి కృతి పంచమ వేదమైన మహాభారతాన్ని తెలుగు భాషలో నిర్మింపుమని ఆజ్ఞాపించాడు. ఈ కార్యం "భవ్యపురుషార్థ తరు పక్వఫలం" కదా! అందుకై దీనికి కృతి పతిత్వ మర్థించి వచ్చానన్నాడు. దీనికి ముందు వైదిక మార్గాన నిష్ఠతో వర్తించడం, భేదం లేని భక్తితో సంచరించడంతో, హరి హర నాథ స్మరణతో తిక్కన మనస్సు మహాభారత రచనా యోగ్యతను పొందింది. హరిహర నాథుని సమ్మోదం, కావ్య రస సంస్తుతి ఈ సందర్భంలో తిక్కన ఆత్మ శక్తిని ప్రకాశింపజేస్తున్నాయి. తిక్కన తన తండ్రి కొమ్మన అనుమతితో "నీ కారుణ్యం చేత నా చిత్తం బహు మహితమైంద"ని కృతజ్ఞత ప్రకటించాడు. జన్మాంతర దు:ఖాలు లేకుండా జేసి సుఖాత్ము జేయవలసిందిగా ప్రార్థించాడు. ఆ దివ్య "మార్గాన్ని చూచే వెలుగు ప్రసాదించాను" అనగానే సంతోష హృదయంతో మేల్కొన్నాడు. "జన్మ తరించింది, పుణ్యచరిత్రుడనయ్యా"నని భావించాడు. భక్త కోటికి "నేర్చిన భంగి చెప్పి వరణీయుడు నయ్యెదన"ని, మహా కవిత్వ దీక్షా విధి నొంది పద్యాల్లో గద్యాల్లో మహా రచనకు సంకల్ప చిత్తుడయినాడు. మహాభారతావతారికను పరిశీలిస్తే నన్నయ తిక్కనల రచనా సంకల్ప ఒకటేననిపిస్తుంది. రచనా వ్యక్తిత్వాలు వారి వారి స్వతంత్ర గుణం చేత వేరు కావచ్చు.

మానవుడు కర్మ బంధం నుండి విముక్తి పొందినప్పుడే మోక్షం లభిస్తుంది. జన్మాంతర దు:ఖం తొలగి మోక్షాన్ని పొందడానికి రెండు మార్గాలు పేర్కొనబడినాయి. ఒకటి జ్ఞానమార్గం, రెండోది కర్మమార్గం. స్థిత ప్రజ్ఞుడు కర్మల్ని ఆచరించే పని లేదు. కాబట్టి యే బంధం లేదు. వీరి సంఖ్య చాల స్వల్పం. స్థిత ప్రజ్ఞులకు ప్రపంచం అసత్కల్పంగా మృషా ప్రాయంగా స్వప్నతుల్యంగా అనుభవానికి వస్తుంది. "నేను బ్రహ్మం, ఇదంతా బ్రహ్మం. దీని కన్న భిన్నమైంది లేదు." ఈ భావంతో విజ్ఞాన

వహ్నిచేత ద్వైతవనాన్ని దగ్ధం చేసి భేదారణ్యాన్ని తొలగించి) అద్వితీయుడవుతాడు. స్థిత ప్రజ్ఞుని లక్షణం.

**"అసత్కల్పం మృషాప్రాయం, స్వప్న తుల్యం భ్రమోదితమ్"**

**"బ్రహ్మైవాహ మిదం సర్వ మితి విజ్ఞాన వహ్నినా**
**దగ్ధ్వాద్వైతవనం సమ్యగద్వితీయో భవేత్"**

– మహా వాక్య దర్పణం

దేహమున్న చోట కర్మాచరణం తప్పదు. జనకాదులు సైతం ఈ మార్గంలోనే సిద్ధి పొందారు. శారీరకంగా మానసికంగా చేసే చేష్టయే కర్మము. సాధారణ దశలో కర్మ రహితమైన లిప్త ఉండదు. ఈ స్థితి పరబ్రహ్మమునెరిగిన వారికి సాధ్యం. అయితే బంధ విముక్తి ఎట్లా కలుగుతుందన్న ప్రశ్నకు భగవద్గీతలో సమాధానం దొరకుతుంది.

**"యోగస్థః కురు కర్మాణి సంగంత్యక్త్వా ధనంజయ**
**సిద్ధ్యసిధ్యోః సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే**
**కర్మజం బుద్ధి యుక్తాహి ఫలం త్యక్త్వా మనీషిణః**
**జన్మ బంధ వినిర్ముక్తాః పదం గచ్ఛన్త్యనామయమ్"**

భగవద్గీత అ. 1. శ్లో. 48–51

దేహధారి ఒక్క క్షణమయిన కర్మచేయకుండా ఉండలేడు. కావున నీఅ యోగస్థుడవై కర్మ చేయవలసింది. ఫలంపై ఆసక్తిని వదిలేయి. కర్మలకు సంబంధించిన సుఖదుఃఖాలపట్ల సమభావం కలిగియుండాలి. ఈ సమత్వమే యోగం. సమబుద్ధితో చేసే కర్మకే పాప పుణ్యస్పర్శ కలగదు. జనన మరణాదులు బాధించవు. లౌకిక వర్తనంలో సుఖదుఃఖ సమభావ చిత్తంతో ఉండడమే కార్యకుశలత్వం, ఆచరణీయం, అని శ్రీకృష్ణుని ఉపదేశం.

తిక్కన హరిహరనాథ చిత్రణంలో అస్థిమాలను కౌస్తుభాన్నీ; కాలకూటాన్ని యశోదాస్తన్యాన్నీ సమంగా భావించే చిత్తవృత్తి, వైదికధ్యాయిత కిచ్చుమెచ్చు పరతత్త్వ ప్రభావోపేతమైంది. కవిబ్రహ్మ కర్మయోగి. అద్వైతమంటే ద్వైతము కానిది. జీవుడు

పరబ్రహ్మము వేరు కాదని అభిప్రాయం. ధర్మాలనేకం వైయక్తిక సామాజిక స్త్రీ పురుషాది ధర్మాలెక్కడికక్కడ పరిమితుల్ని కలిగి ఉన్నాయి. అన్నింటిని కలిపి స్థూలంగా ఇహలోకానికి సంబంధించినవి పరలోకానికి సంబంధించినవిగా విభజింపవచ్చు. మొదటిది ప్రయో మార్గం రెండోది శ్రేయో మార్గం. ధర్మాద్వైత స్థితి ధర్మ స్వరూపాన్ని వీడకుండా శ్రేయో మార్గాన ప్రయాణింపజేసేది.

మహాభారతం లేఖ్యంబయిన అమ్నాయం. వేదం వ్రాయబడదు, ఉచ్చరితమవుతుంది. కాబట్టి శ్రుతియని పేరు. వేదాలు అలేఖ్యాలు వేదతుల్యమైంది భారతం. పంచమవేదంగా ప్రసిద్ధమైంది. కాబట్టి లేఖ్యం సంస్కృత మహాభారతంలో తెలుగు మహాభారతంలో పరమార్థమొకటే కాని ప్రతిపాదనా పద్ధతిలో నిర్వహణ వైఖరిలో భాషా ఛ్ఛందోరూపంలో, భేదముంది. కాల దేశ పాత్రల్ని బట్టి అనివార్యమైంది. ధర్మాద్వైత స్థితి ఆనాటి దేశకాల పరిస్థితుల కనుగుణంగా వ్యాఖ్యాతమయింది. కన్నడ దేశంలో బసవేశ్వరుని వీర శైవ ప్రభావం తెలుగు దేశంలో ప్రసరించింది. మార్గ కవిత్వానికి భిన్నంగా దేశి – ద్విపద కవిత్వం వెలువడింది. పాల్కురికి సోమనాథాదులీ దిశలో మత వ్యాప్తికి సాహిత్యాన్ని సాధనంగా గ్రహించారు. బసవపురాణం పండితారాధ్యచరిత్ర మొదలైన ద్విపద కావ్యాలు వెలువడినాయి. అటు రామానుజాచార్యులు తదనుయాయులు వైష్ణవమత వ్యాప్తికి సాహిత్యాన్ని ఉపకరణంగా ఎన్నుకున్నారు. రంగనాథ రామాయణం ద్విపద కావ్యం వెలువడింది. దేశంలో శైవులు వైష్ణవులు ఆవేశ పూరితులై ప్రచారాలకు సన్నద్ధులయినారు. పరస్పర ద్వేషభావం నెలకొంది. మతాల్లోని ప్రధానమైన ఉద్దేశం లుప్తమైంది. ఈ క్లిష్ట స్థితిలో తిక్కన హరిహర రూపకల్పన చేసి, ఆ దివ్య మూర్తిని ప్రబంధ మండలి కధినాథుని చేసి మహాభారత రచనోద్యుక్తుడు కావడంతో శైవ వైష్ణవ సామరస్య సంధానశీలక వాతావరణం ఏర్పడే అవకాశం కలిగింది. తిక్కన రచనలో మార్గ దేశి సమన్వయంతో అద్వైత భావన భిన్నమైన మరో వ్యాఖ్యానానికి దారి తీసింది. నన్నయ ఉదాత్త కావ్య మార్గాన్ని తెలుగు భాషా స్వరూప స్వభావాల్ని రెండిటిని మేళవించి ఆంధ్రావళి మోదం పొందేట్లుగా ఒకటిగా రూపొందింపజేయడం దీని ప్రత్యేకత.

తిక్కన సృష్టించిన స్వప్న వృత్తాంతాన్ని తరువాత కవులనేకులనుసరించారు. కావ్య సంప్రదాయంగాను పరిణమించింది. ఈ ప్రభావంతో నాచన సోమనాథులు తమ కృతుల్ని హరిహర నాథునకు అంకితం చేయడం జరిగింది. నన్నయ భారతానికి షష్ఠ్యంతాలు లేవు. దీనికి రాజరాజ నరేంద్రుడు శ్రోతమాత్రమే. తిక్కన భారతానికి హరిహరనాథుడు కృతిపతి, శ్రోత లవడం వల్ల మొదట్లో షష్ఠ్యంతాలు ఆశ్వాసాంతాల్లో సంబోధనాంతపద్యాలు కన్పిస్తాయి. ఒక్కొక్క పర్వం స్వయం సంపూర్ణ విభాగ దృష్టితో ప్రబంధంగా, పదునైదు పర్వాలు కలిసి ప్రబంధ మండలిగా భావించడం జరిగింది. ఇది ఇతిహాస రూపం కన్నా కావ్య రూపాన్ని భావింపజేస్తుంది. ప్రబంధ శబ్దం సంస్కృత సాహిత్యంలో కావ్యం లేదా నాటకాన్ని సూచిస్తుంది. ఉదాహరణకు కాళిదాసు "భాససౌమిల్లక ప్రబంధానతిక్రమ్య" మొదలుగా అన్వయింపవచ్చు. ఈ అవతారికలు తిక్కన సృజన కళకూ నిర్వహణ శిల్పానికీ సూచికలుగా ఉన్నాయి.

# తిక్కన మహాభారతం : నిర్వహణశిల్పం

## విరాటపర్వం : పాండవుల సభా ప్రవేశం

ఉత్తాలమైన భావ పరంపర ప్రగాఢమైన సంవేదన బాహ్యాంతర్జగత్తుల అనుభవం కల్పన పాత్ర చిత్రణం మనః ప్రవృత్తి ప్రకాశంతో అక్షరాకృతి వహించిన మనోహర కళాశిల్పం తిక్కన భారతం. సంస్కృత రచనకనుసరణమైనా స్వతంత్రమైన వ్యక్తిత్వం కలిగింది. నన్నయ వేదత్రయ మూర్తుల భావన, తిక్కన హరిహరనాథ తత్త్వం వేరు కావు. ఆయా కాలాల్లో అవసరమైన ప్రయోజన రూపాన్ని పొందాయి. నన్నయ "మహాభారత బద్ధ నిరూపితార్థమేర్పడేట్లు; తిక్కన అమ్మహాకావ్యంబు నర్థంబు సంగతంబు సేయ సంకల్పించి; ఉద్యమించారు. ఇరువురి లక్ష్యం వ్యాస హృదయాన్ని ఆవిష్కరించడమే. ఇది తిక్కన రచనలో కావ్య కళా శిల్ప విధానం కలిగింది.

తిక్కన కాలం నాటికి సుమారు నాలుగు వందల సంవత్సరాల పూర్వమే ఆనందవర్ధనుని ధ్వని సిద్ధాంతం ప్రశస్తి కెక్కింది. అభినవ గుప్తుని లోచనం రసాలంకార వస్తు ధ్వనుల్లో రస ధ్వనికి పట్టాభిషేక మొనర్చింది. దీనికి సాహిత్య లోకం విస్తృతామోదం లభించింది. తిక్కన రసమార్గానుయాయి. "కావ్య రసము కొనియాడుచు", "నానా రసాభ్యుదయోల్లాసి" మొదలైన సూచికలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తాయి. ఒక్కొక్క పర్వం ఒక్కొక్క ప్రబంధంగా తీర్చాడు. వీటి సమాహారాన్ని "ప్రబంధ మండలి"గా పేర్కొన్నాడు. రచన విషయానికి వస్తే పాత్ర చిత్రణం సంభాషణా నైపుణ్యం మనస్తత్వ ప్రకాశనంతో సన్నివేశ కల్పన సహృదయుల్ని ఆకర్షిస్తుంది.

తిక్కనలో ఈ అంశాల రమ్యమైన సృజన రూపమే కావ్య కళా శిల్పం. సంస్కృతంలో మహాభారతమితిహాస గ్రంథం. దీన్ని కావ్యంగా మలచేందుకెంత ప్రయత్నించినా ఇతిహాస లక్షణాలు పూర్తిగా పరిహరించే వీల్లేదు. కాబట్టి తెలుగులో కవిత్రయం చేత కావ్యేతిహాసంగా రూపొందింది. సౌందర్య సమున్మీలనం కళ. దీన్ని ఆకర్షవంతం చేసే గుణం శిల్పం. ఇది కావ్య దృష్టితో ఔచిత్యాన్ని ప్రయోజనాన్ని

కలిగింది. కవి సృజన శక్తి చేత ప్రత్యేకతల్ని పొందుతుంది. ఈ సందర్భంలో స్థూలంగా సృజన కళ – నిర్వహణ కళగా నిర్దిష్టమైంది.

విరాట పర్వ ప్రబంధం, "హృదయాహ్లాది", "రసోపేతం", "నానా రసాభ్యుదయోల్లాసి"గా పేర్కొబడింది. వీటిలో ఆహ్లాద కారణమైన కళ, ఆత్మభూతమైన రసం, దాని పరిణామం, నిర్వహణ నైపుణితో శిల్పం విశ్లేషణ కందుతాయి. పాండవులు వనవాసం గడిపారు. అజ్ఞాత వాసం మిగిలింది. ఇది క్లిష్టతరమైన కథా సందర్భం.

**"కథం విరాట నగరే మమ పూర్వ పితామహాః**
**అజ్ఞాత వాస ముషితాః దుర్యోధన భయార్దితాః"**

అని జనమేజయుడు ప్రశ్నించాడు.

**"మహిత సముజ్జ్వలాకృతులు మానధనుల్ జనమాన్యులంగనా**
**సహితముగాగ నేమిగతి సమ్యగుపాయ నిగూఢ వృత్తిమై,**
**సహితులక ప్రభేద్యమగు నా పదమూడగునేడు మత్పితా**
**మహులు చరించి రంతయు క్రమంబుగ నా కెరుగంగ చెప్పుమా!"**

పద్యం పై శ్లోకానికి సుందరమైన వ్యాఖ్యానం. ఈ చిత్రణకు ఎన్నుకొన్న ఛందోరూపం కూడా ఒక కారణం, నాలుగు దీర్ఘ పాదాల్లో పై శ్లోకంలోని భావం నిబంధించడంలో విస్తరణతో పాటు కళాత్మకత సంతరించుకోవడం విశేషం.

పాండవులు సముజ్జ్వలమైన ఆకృతులుకలవారు. మానం ధనంగా కలవారు జనం చేత గౌరవింపబడే వారు, అనే విశేషణాలు మూల వ్యాఖ్యాన విస్తరణ రూపాలే. ఇవి ఆరంభంలో వ్యక్తిత్వస్ఫోరకాలై రచనలో కళాత్మకను పొందాయి. వీరి సముజ్జ్వలత్వం అజ్ఞాతవాసమనే చీకటిలో ప్రకాశించింది. ఎట్టి విపత్కర పరిస్థితుల్లోను గౌరవ భంజకంగా వర్తించరు. ఇట్టి విశిష్ట ప్రవృత్తి వల్లనే జనులు గౌరవించడం జరిగింది. అన్నింటి కన్న ముఖ్యమైంది వీరి "సమ్యగుపాయ నిగూఢ వృత్తం" పాండవుల "ఉపాయ బుద్ధి" అజ్ఞాతవాసంలో కాపాడింది. ఈ పర్వంలో ద్రౌపది ప్రధానమైన స్త్రీ పాత్ర. కాబట్టి ఈ ప్రత్యేకతను సూచించేందుకే "అంగనతో కూడుకొని", అన్నమాట. అహితులు

సదా వీరిని గుర్తించేందుకు పొంచి ఉన్నారు. వారు ప్రభేదించడానికి వీల్లేకుండా చరించడం గొప్ప విషయమే. మూలంలో "దుర్యోదన భయార్దితా:" అని ఉంది. తెలుగులో నేరుగా ఈ ప్రసక్తి లేదు కాని సూచన ఉంది. దుర్యోధనుడు పాండవుల పట్ల పరమ దుష్టుడుగా ప్రవర్తిస్తున్నాడు కాబట్టి అతని నుండి భయం సహజం. దీన్ని తిక్కన "ఉపాయ నిగూఢ వృత్తం"లో అంతర్భవింపజేయడం జరిగింది.

విరాట నగరానికి కొంత దూరంలో పాండవులు శమీవృక్షంపై ఆయుధాలు భద్రపరిచారు. ధర్మజుడు నరునకు తనకు దక్క ఇతరులకు "విషవిస్ఫురిత భుజగ భంగి భయం కర మూర్తులు తాల్చి యుండ"వలసిందిగా ప్రార్థించాడు. భీముడు "ధార్తరాష్ట్ర కుల భీషణ రోషుడు" అతని చిత్త మెపుడెట్లు వర్తిస్తుందో నని భయపడి, "ధర్మార్జునులకు మాత్రమే కన్పింపవలయు"నని అస్త్రాదిదేవతల్ని ప్రార్థించాడు. రాబోవు కథలో రెండు ముఖ్య విషయాలున్నాయి. మొదటిది కీచక వధ ఇది వత్సరం మధ్యలో జరిగింది. రెండోది ఉత్తర గోగ్రహణం, ఇది వత్సరం చివర జరిగింది. ధర్మజు మాటల్లో అర్జును దధిక సంయమనశీలి; తనతో సమానుడన్న భావన స్ఫురిస్తుంది. భీముని వైపు చూచి కౌగిట చేర్చుకున్నాడు.

ధర్మజుడు యతీంద్ర వేషంలో విరటుని కొల్వుకు వచ్చాడు. విరటునికి "వ్రేగయి" తోచాడు. ప్రజల్ని యేలగల తేజం అనుభూతమయింది. నమస్కరించి సగౌరవంగా ఆశ్రయమిచ్చాడు. అజ్ఞాత వాసారంభంలోనే కావ్య నాయకుని తేజః ప్రతిపాదనంతో పాత్రకు వైలక్షణ్యం చేకూరింది. ధర్మజుడు తన పేరు కంకుభట్టని తెలిపి ద్యూతపరాజితుడు ధర్మసుతుని సఖుడు ద్విజుడు, వినోదకరుడుగా తన్ను పరిచయం చేసుకున్నాడు. "ఒక్క సంవత్సరకాలం ఉండి యెగ్గు చేసిన వారిని జయింప"బోతానన్నాడు. ధర్మజుని విరాట సభా ప్రవేశం గుప్తంగానే కాక ఉదాత్త సమన్వితంగాను జరిగింది. తరువాత భీముడు వంటవాడుగా ప్రవేశిస్తాడు. అతని "రూపాతిశయానికి" విరటు డాశ్చర్యపడతాడు భీముడు "దేవా! నీ చిత్తంబునన్ మెచ్చునట్లే వందన్ కడునేర్తున"ని విన్నవించాడు. భీముని నిజస్వరూపం గుప్తంగా ఉంచబడింది. విరటుడు భీముని పట్ల కూడ వినయం అవలంమించాడు. భీముడు దానికి మోమడ్డంగా కదల్చి" నా కవి యెల్లనేల? ధర్మసుతుడు నన్ను పెద్దగా చూచేవాడు! ప్రియమందేట్లుగా పాకం

సేయగలన"న్నాడు. పైగా "బలవంతుడను, చూపులకు సంతోషం కలిగేట్లు శూరత పోరుదు"నన్నాడు. ఒకటి పాకం సేయగల నేర్పు, రెండు శౌర్యంతో మల్ల విద్యలో ప్రావీణ్యం ఇతని వ్యక్తిత్వంలో భాగాలు. మొదటిది తన కాశ్రయమిచ్చే నరనాథునికి ప్రియం చేసేది. రెండోది సింహబలునితో తలపడే విధం సూచించేది. "వలసినచో నుండెద లేనిచో వలసిన కడకేగెదన"న్నాడు. విరటుడు సానునయంగా "ఇమ్మెయి నిలుచుటె ఇష్ట" మన్నాడు. భీముని నిష్కపట వైఖరి స్వయం శక్తి పట్ల విశ్వాసం విరటుని ఆకర్షించాయి. ఆ తరువాత అర్జునుడు పేడి రూపంలో సభా ప్రవేశం చేసాడు. తిక్కన చేసిన వర్ణనమపూర్వం.

**"మంచు మరుగు పడిన మార్తాండుడును బోలె**
**నీరు గలిసి యున్న నిప్పు వోలె వేషధారి యైన విష్ణుండు వోలెను"** కన్పించాడు.

మంచు తాత్కాలికమైంది. పొద్దెక్కడంతో అదృశ్యమయి పోతుంది. పొద్దు పైకి రావడంతో వేడి కిరణాలకు నీరు ఇగిరిపోతుంది. నిప్పు తన సహజ గుణాన్ని పొందుతుంది. విష్ణుమూర్తి మోహినీ వేషధారి అయినపుడు స్థితి ఇటువంటిదే. విష్ణుత్వం కన్పించలేదు. అందమైన సాధారణ స్త్రీవలె కన్పించాడు. అట్లాగే అర్జునుడు శాపవశాన పేడి రూపాన్ని ధరించాడు. మార్తాండునిలోని ప్రకాశం నిప్పులోని ఔజ్వల్యం విష్ణువులోని దివ్యశక్తి అర్జునునిలో ప్రకృతంగుప్తంగా ఉన్నాయి. దుర్విధి వల్ల పేడి రూపం ధరించవలసి వచ్చింది. తిక్కన ఆరంభంలోనే అర్జునుని మహావ్యక్తిత్వాన్ని స్ఫురింపజేసాడు. ఉత్తర గోగ్రహణం నాటికి అజ్ఞాతవాస సమాప్తితో మార్తాండుడు పై పైకి వచ్చే సరికి మంచు విడిపోతుంది. నీరు ఇగిరిపోతుంది. తత్కాల ప్రయోజనాని కుపయోగపడిన వేషం తొలగిపోతుంది. విరటుడా వేషంలో మహానుభావత్వం రాజసం జగత్పూజ్యం దర్శించాడు. జాగ్రత్తగా చూస్తే "ఆడు చందం" కూడా కాదనుకున్నాడు. అర్జునుడు "తన పేరు బృహన్నల యని కన్యల కాట నేర్పగలన"ని విన్నవించాడు. విరటుని ఆశ్చర్యానికి సమాధానంగా అర్జునుడు ఈ రూపం "శాపమున వచ్చె పురాకృత కర్మ భావ్య మెవ్వాడును నేర్చునే తొలగవైనగ" అని విధి బలీయత్వాన్ని పేర్కొన్నాడు. ఇదొక దుర్యోగఫలం. శాపం అయినా అజ్ఞాత వాసంలో ఎంతో ఉపయోగకరంగా పరిణమించింది. అర్జునుని ఎవరు అనుమానించడం గాని, గుర్తించడం గాని జరగలేదు.

విరటుడు బృహన్నలను అంత: పుర స్త్రీ సమూహంతో మెలగవలసిన పనిలో తన కూతురునకు సంగీత నాట్యాభినయం నేర్పించుటకై ఉద్యోగించాడు. ఇది "ఇరువురి మర్యాదలకు భంగం లేకుండా" జరిగింది. ఆ తరువాత నకులుడు అశ్వపాలకుడై వచ్చాడు. ధర్మసుతుడు పెంచెనని తురంగ శాస్త్ర పారంగత్వాన్ని తెలిపాడు. అనుమానం కలిగితే వెళ్ళి పోతానన్నాడు. విరటుడతని తురంగ శాల కధిపతిని చేసాడు. ఆ తరువాత సహదేవుడు గోప వేషంలో విరటుని సమీపించాడు. విరటుడాతని తేజస్సు కాశ్చర్యమైంది. "నా సేవా పరిపాలన సేయు"మన్నాడు. "ధర్మపుత్రు పశుగణాల్ని పాలించే వాడిన"ని విన్నవించాడు, విరటు సభాప్రవేశం పాండవుల మహనీయత్వానికి భంగం కలగకుండా నిర్వహింపబడింది. వీరు కోరిన పనుల్లో నిలవడానికి వీరటుడే ఎంతో సంకోచించాడు. పై స్థాయి బాధ్యతల్ని అప్పగింపజూచాడు కాని వారంగీకరింపలేదు. అందరికీ ధర్మరాజుతో గల ఆత్మీయమైన సంబంధం విరటుని మరింత ఆకర్షించింది.

పాండవులు దేవతా ప్రసాద మూర్తులు. వారెంత మారువేషాల్లో ఉన్నా సహజమైన దివ్య తేజం రాజ లక్షణం స్ఫుటంగా కన్పిస్తూంది. ఇవి విరటునిలో నిర్వ్యాజమైన గౌరవ భావాన్ని నిలిపాయి. ఈ అసామాన్య లక్షణంపై లోక వృత్తానికి తగినట్లుగా, తిక్కన ఈ ఘట్టాన్ని నాటకంలో పాత్రల ప్రవేశంతో సమానంగా సన్నివేశరమణీయంగా నిర్వహించిన నిర్మాణ రూపం పరిశీలన కందుతుంది.

# సైరంధ్రీ ప్రవేశం

ద్రౌపది అజ్ఞాత వాసంలో సైరంధ్రీ ప్రముఖ పాత్ర నిర్వహింపబోతుంది. తదనుగుణంగా ఆమె విరటుని సభా ప్రవేశం జరిగింది. అయితే ముందుగా సైరంధ్రీ జాతి వేషంలో పరిచారికా రీతిలో పురంలో అడుగిడింది. మొయిలు కప్పిన అమృతాంశు కళ వలె మంచు సోకిన సరోజిని వలె ధూమం క్రమ్మిన దీప కళిక వలె ధూళి క్రమ్మిన లతిక వలె, గంధకారికా వేషంలో ఉంది. ఉజ్వలత్వం మరుగుపడింది. రాజ వీధిన కదలింది. పౌర జనం పరిపరి విధాలుగా గుసగుసలు పోయారు.

**"పఱ మొయిల్ కప్పిన పాడఱి నును కాంతి కదలిన యమృతాంశు కళయు వోలె**
**పెను మంచు మీద పర్విన వికాసము దప్పి చెలువు గుందిన సరోజిని విధమున"**

అమృతాంశు కళ ప్రసన్నతకూ శీతలతకు, సరోజిని సౌందర్యానికీ సౌకుమార్యానికీ, దీప కళిక తేజస్సుకు, ఆకర్షణకు, లతిక శరీరత్వానికీ లావణ్యానికీ ప్రతీకలు. ఇవి దూరంగా చూచి ఆనందింపదగినవే కాని స్వంతం చేసుకోదగినవి కావు. ఆమృతాంశు కళ దూర భావం చేత ఎత్తులో ఉండడం చేత జ్వాలా శిఖ చేత దాహకత్వాన్ని, లతిక మరో వస్త్వాశ్రమం చేత తోడు బలాన్ని సూచిస్తాయి. ఇవి పరోక్షంగా ద్రౌపది అపూర్వ వ్యక్తిత్వాన్ని, ఇప్పుడున్న కాంతి "పాడఱి", "వికాసము దప్పి", మెరుగు 'నలిగి మాసి" "తొంగలించుట మాని" ఈ స్థితి చేత అజ్ఞాత వాస యోగ్యమై ఎవరూ అనుమానించడానికి వీల్లేని రూపం వ్యజింతమవుతోంది. ఈ స్థితి మొగిలు, మంచు, పొగ, దుమ్ముచేత కప్పబడింది. గంధకారికా పరిచారికా వేషంలో సైరంధ్రి పౌరజనాన్ని ఆకర్షించింది. ఇది కొత్త మనిషి అవడంవల్ల, రాజ మహిషిలోని దాగని రాజత్వం వల్ల, సహజంగా ఆమెలో ఉన్న దివ్య రూపం (యజ్ఞ సంభవ కాబట్టి) వల్ల చూచే వారి మనస్సు పరిపరి విధాలుగా విచిత్రమైన భావానికి లోనయింది. ఈ రచన తిక్కన స్వోజ్ఞకమే "ప్రజలు ఈమె రోహిణియేమొ? అరుంధతియేమొ మనుష్య జాతి యేనా? ఈ హరిణాక్షి!" యన్న సందేహ చిత్తులయ్యారు. "నీ వెవరవ"ని కొందరు సాహసించి అడిగారు. "ఎవరు కడుపు కూడు" పెడితే, "కట్ట చీర" నిస్తే వారి కడ పనులు చేస్తానంది. ఆమె మూర్తి విశేషానికీ మాటలకూ పొంతన కుదరడం

లేదు. "ఇది పలుక నగునె" యని ఆమె మాటల ఔచిత్యాన్ని ప్రశ్నించారు. విరాట రాజ్ఞి మందిరం ప్రవేశానికి పూర్వమే, సైరంధ్రీ రూపంలో ఉన్న ద్రౌపది వ్యక్తిత్వం వారనుకోకుండా జనంలో చర్చకు నిలిచింది.

సుధేష్ణ గవాక్షం నుండి ఆమెను చూచింది ఆకర్షితయైంది. ఆమెను "నెమ్మితో తోడ్కొని రండ"ని ప్రౌఢాంగనల్ని పంపింది. వినీతయైన ఆ స్త్రీ ప్రజల మధ్య "వెక్కస" పొందుతూన్నట్లు కన్పించింది. రాజమాత మనస్సు ఆర్ద్రమైంది. ఆమె గురించి ఉత్సుకత కలిగింది. సహాయం చేసే భావమేర్పడింది. ఆ స్త్రీని చూడగానే సుధేష్ణ కొక అనిర్వచనీయమైన అనుభూతి కలిగింది. ఆమెను గురించి ప్రశ్నించింది. "సైరంధ్రి జాతి, పేరు మాలిని, నీవు ధర్మవర్తివి. కాబట్టి నేను నేర్చిన పనులు చేస్తూ నీ వద్ద ఉంటాను" అంది "ఇదొక సంవత్సర కాలం" అని తన కథ చెప్పింది. ఇందులో పంచక సనాథత్వం, పరాభవత్వం పేర్కొబడినాయి. ఆమె అజ్ఞాత వాస నియమ బద్ధయైంది. ఈ మాత్రం రహస్య గోపనం అవసరం.

సైరంధ్రి అంటే స్వచ్ఛందమైన వర్తనాన్ని కలిగింది, స్వవశురాలు. "సైరంధ్రీ స్వైరం స్వచ్ఛందం వర్తనం దధాతి" పరగృహంలో గంధ లేపనాది ప్రసాధన దర్పణాది శిల్ప కర్త్రియైన స్త్రీ. ఇది వ్యవహారార్థం "సైరంధ్రీ పరవేశ్మస్థా స్వవశా శిల్ప కారికా పరగృహస్థా స్వతంత్రా ప్రసాధన దర్పణాది స్త్రీ శిల్పకర్త్రీ సైరంధ్రీత్యుచ్యతే." ఇక్కడ ఆమె స్వచ్ఛందమైన ఒకరికి లొంగి యుండనవసరం లేని స్వతంత్ర స్థితిని భావింపజేస్తూంది. "పురుష పంచక సనాథ, ఒక్క కారణంబున... ఈడ్వంబడి" యన్నమాట ద్రౌపది కథను స్మరింపజేస్తుంది. అయితే సనాథత్వం తాను ఒంటరిగా లేదు తన వెనుక పురుష బలముందన్న ధైర్యాన్ని "ఈడ్వబడుట" తనకిపుడు ఆశ్రయ సహాయం అవసరమన్న కరుణాత్మకమైన భావాన్ని వ్యంజింపజేస్తున్నాయి. ఆ వల్లభులెవరు? ఆ విరోధు లెవరు? మొదలైన ప్రశ్నలు, అపుడామె మాటల్ని బట్టి ఉన్న దయనీయ స్థితిని బట్టి సుధేష్ణ వివరంగా అడగలేక పోయింది. కాని విశ్వాసం కుదరలేదు.

ఈ పురికి రావడానికి కారణం "బొంకక" చెపుమాయని నిష్కర్షగా పలికింది. ఆమె మాటలకు ద్రౌపది చలించలేదు దరహసితయైంది. ఇది ఆమె ముఖానికొక అలంకారంగా భాసించింది. "శ్రీకృష్ణుని దేవి కడ" ఆ తరువాత "పాంచాలి కడ" వర్తించానని చెప్పింది. "నీచపు పనులకు తన చాలిమి", తెలుసుకొని పాత్రంగా ఆచారం తప్పకుండా వర్తింపుమని కోరింది. సుధేష్ణ విశ్వసించినట్లు కన్పించింది. కాని మరో సందేహం తలెత్తింది. ఈమె "రూపాతి మనోజ్ఞ" త్వాన్ని చూచి "నృపతి యువ్విళ్ళూరు" తాడేమొ. సంస్కృత భారతంలో "రాజా విరాట: శుశ్రోణి! దృష్ట్వా వవురమానుషమ్ విహాయ మాం వరారోహే! గచ్ఛేత్ సర్వేణ చేతసాయం హి త్వమనవద్యాంగి; తరళాయతలోచనే ప్రసక్త మభివీక్షేథా: సకామ వశగో భవేత్" "నన్ను వదలేయవచ్చు నిన్ను చూచి సకామ వశుడవుతాడు మొదలయిన భావన సంక్షిప్త పరచడమే కాక మరో విధంగా చెప్పడం జరిగింది. నిర్భర విధ్వంస దశావిర్భావం తెచ్చి" కోడానికి ఏ స్త్రీ సిద్ధపడదు. ద్రౌపది తన పతుల లఘు పరాక్రమం గల గంధర్వులని "నీచమతి"ని సహింపరని పలికింది. స్థూలంగా చూస్తే ఈమాటల వల్ల సుధేష్ణకు కోపం రావాలి, కాని రాలేదు. సూక్ష్మంగా చూస్తే నీచ మతుల్ని మాత్రమే "వీడక" చంపుతారు. తన పతి సన్మతికాదని ఎట్లా అంటుంది. దీనికి అభిజాత్యం, రాజ్ఞీదర్పం అడ్డువస్తాయి. పైగా అంతటి బలశాలురు కలిగిన ఈమె తనకు, తమ రాజ్యానికి పెద్ద అండగా తోడ్పడవచ్చునని భావించవచ్చు. తన భర్త రాజ్యగత శక్తి తెలుసు! పైగా సైరంధ్రి తన పతులు "సింధుర సదృశతనున్నను, సంధుల సంధు లెడలించి చంపు" తారని చెప్పింది. ఆమెకు మనస్సులో భయం వేసి ఉండవచ్చు. ఈ మాటలు అనపేక్షంగా వచ్చిన వయినప్పటికి భవిష్యత్సూచక వధకు సంబంధించిన సూచన సంయోజితమైంది. సుధేష్ణ పైకి ఏమి మాట్లాడలేదు, గంభీరంగా ఉంది.

**"మనమున నూరడిల్లు మనుమానము మానుము, నన్ను నేలుమే**
**పనుల నుదాత్త నాగరక భంగుల నీ మది కెక్కునట్లు నే**
**ర్పును భయ భక్తులున్ మెఱయ రూపుగ జేసెద తజ్ఞులైన స**
**జ్జనులు నుతింప వర్తనము సాధులు వృద్ధులు మెచ్చ సల్పెదన్"**

ద్రౌపది తన విశ్వసనీయతను, సామర్థ్యాన్ని నాగరక విధాన్ని, వినయ భావాన్ని సాధు జన ప్రశంసనీయమైన వ్యక్తిత్వాన్ని స్పష్టపరచింది. పూర్వం కూడా "నా నేర్చు పనులు" అన్న మాట వాడింది. అంటే చేతనయిన పనులనియు, నేర్చుకొనిన పనులనియు అర్థం. ఇవి నిర్వహించే ఉదాత్త నాగరక భంగిని దాని సత్పర్యవసానాన్ని చిత్రిస్తుందీ పద్యం. తన పనిని విషయం తెలిసిన వారు మెచ్చుకుంటారు. వారు సజ్జనులు అంటే ఇక్కడ మంచిమర్యాద తెలిసిన వారనీ ఇంకా అజ్ఞాత వాస రహస్య వేత్తలని అభిప్రాయముంది. తన నుండి తీసుకోవలసిన పనుల స్వరూపం కూడ ఇందులో చెప్పక చెప్పబడింది. దీనితో తన పతులనురాగంతో మేలు చేయడం కూడా ప్రసక్తమైంది.

సైరంధ్రికి పనులు చెప్పడంలో ఉదాత్తమైన నాగరక మర్యాదాతిక్రమణం జరిగింది. దాని పర్యవసానమే కీచక వధ. ఆమె మాటల్లో కవి నేర్పు చేత ఈ స్థితి స్థగితమైంది. సైరంధ్రీ మాటలకు సుధేష్ణ సంతోషించడమే గాక, కష్టాల్లో నున్నదని గ్రహించి "ఊరడిల్ల పలికింది". ఏదో లోకసామాన్యంగా తను మాట్లాడినట్లు ప్రవర్తించింది. తన అనుమానం తీరింది. తన భర్త రాజ్యానికవసరమైన పరోక్ష సహాయం కన్పించింది. సైరంధ్రి వెనుక నున్న పురుషబలం తమ శత్రువుల పట్లనే ప్రదర్శితమవుతుందన్న అభిప్రాయం సహజం. ఇంతకు మించి ఆ పాత్ర ఊహించలేదు. ప్రస్తుతం అవసరం కూడా లేదు. మొదటి ఆశ్వాసంలో కథాంశాల నిర్వహణం రెండ ఆశ్వాసంలోని కథకు ప్రణాళికగా సిద్ధపరచడం జరిగింది. ఇది తిక్కన నిర్మాణ కళ.

# రసాభ్యుచిత బంధం : కీచక వధ

అజ్ఞాత వాసం పూర్తి అవడానికింకా పదిహేను రోజులు మాత్రం మిగిలింది. అక్కగారిని చూడడానికి వచ్చిన సింహబలుడు అనతి దూరంలో ఉన్న సైరంధ్రిని చూచాడు. అతడు "రూపాభిమాని నానాభరణ ధరణ శీలుడు, దుర్విదగ్ధుడు బల గర్వితుడ"ని వ్యక్తిత్వ పరిచయం జరిగింది. బాహ్య రూపమందు మాత్రమే అభిమానం కలవాడు. అంత:కరణంతో పనిలేదు. వివిధాలంకారాన్ని ధరించే తత్త్వం కలవాడు. బయటి స్వరూపాన్ని ఇనుమడింపజేసి తళుకు బెళుకులందు మక్కువ కలవాడు. మౌర్ఖ్యంతో పాటు భౌతిక శక్తి చేత గర్వం కలవాడు. ఈ వ్యక్తిత్వం కల వ్యక్తి ప్రవర్తన దాని పర్యవసాన మెట్లా ఉంటుందో ఊహకు వదలి వేయబడింది.

**"అక్కజమైన చెల్వమును నాత్మకు వ్రేగయి పొల్పు పొల్తిపై**
**నెక్కొను చూడ్కి గ్రమ్మఱుప నేరక యూరక"** నిలిచాడు.

ఆశ్చర్యకరమైన సైరంధ్రీ సౌందర్యం ఆత్మకు బరువుగా మనస్సుకు బాధగా తాపంగా "వ్రేగు" అన్న మాట అతడా సౌందర్యాన్ని భరింపలేని స్థితిని చిత్రిస్తుంది. అతడనేక సౌందర్యవతుల్ని చూచాడు. ఈమె భిన్నంగా ఉంది. కారణమామె యజన సంభవ, పతివ్రత, ఒక సౌందర్యరూపాన్ని చూచి మెచ్చుకోవడం వేరు; దానిని అనుభవించాలనుకోవడం, స్వంతం చేసుకోవాలనుకోవడం వేరు. ఇందులోను క్రమం అక్రమం ఉన్నాయి ఇది లోక దృష్టితో చూడవలసి ఉంటుంది. సింహబలుని దుర్విదగ్ధ బల గర్వ స్వభావం ఇంత దూరం ఆలోచించనీయలేదు. అతని మనస్సు చలించింది. శరీరం ఆశ్చర్యభావంతో చేష్టలుడిగింది.

ఈ అనుభవం అతనికి కొత్త. మొదట ఆత్మకు వ్రేగయి పొల్చింది. తరువాత శరీరాన్ని స్తంభింపజేసింది. ఆ తరువాత ఉరిలో చిక్కినట్లయింది. ఇక మిగిలింది మృత్యువు. ఇది వాచ్యం కాకూడదు. అవలేదు. కావ్య రస పరంగా అతని హృదయమనే మృగం సైరంధ్రీ రూపమనే ఉరికి తగిలింది. కాముడనే వేటకాని బారిన పడింది. సింహబలుని మనస్సులో పర్యవసానాపేక్షితంగా ఉద్భవించిన శృంగార రస రూపం

స్పష్టం. అతనికామె మన్మథుని అయిదు బాణాలు కరగి ఒకే ఆకృతి పొందిన రమణీయ చైతన్య రూపంగా తోచింది.

"ఇయ్యింతి ప్రాపున నయ్యనంగుడు పార్వతీశు నైనను దక్క నేల కున్నె" మొదలుగా పార్వతీశుడు శచీ ప్రియుడు భాషావిభుడు, ఇందిరాపతి యని పత్నీ సహితంగా పేర్కొనడం వారి అనపాయత్వాన్ని సూచిస్తూంది. శివుడు ఇంద్రుడు, బ్రహ్మ, విష్ణువుల్లో ఆమె సౌందర్య భాగ్యానికి నోచుకున్నదెవరో యాతనితో సరిఅవునో కాదో కాని, ఇది పురాతన పుణ్యవృద్ధికి ఫలసిద్ధిగాను భావితమైంది. "ఈమె పతి ఎవరో?" అన్న ఆలోచనకు దిగాడు. ఒక్కొక్క అనుభవ స్థితి ఉగ్గడించుటగా తల్లడించుటగా ఓరగించుటగా అప్పళించుటగా ఓరగి,చుగా కళవళించుటగా పరికించుటగా బహు సూక్ష్మ సూక్ష్మంగా వర్ణించడం గమనార్హం. సింహబలుడు మానసికమైన స్థిరత్వాన్ని కోల్పోయాడు. ఆమెను గురించి ఆలోచన చేసి చేసి ధైర్యం చెదరి తల్లడిల్లాడు. ఊహలు ప్రక్కకు నెట్టాడు. కోర్కెలు మూగి అంగలార్చాడు. సాహసింప నుద్యుక్తుడయినాడు. అక్కడున్న జనులను పరికించాడు. కళవళం చెందాడు. ఎంతటి కామాంధుడయినా జన సమక్షంలో బలాత్కరించే సాహసం చేయడు. రాజ కుటుంబ గౌరవ మర్యాదలు కనీస స్థాయిలో పాటించవలసి ఉంటుంది. కీచకుని మనో వ్యాపారంలో కాముకుని మనస్తత్వ విశ్లేషణం కనిపిస్తుంది. సైరంధ్రి యాతని వికార చేష్టల్ని గమనించింది. ఆమె "రోసిన"డెందాన్ని తెలుసుకొనే స్థితిలో లేడు. ఆమె "మాసిన తనం"తోని రహస్యాన్ని ఎరగడు. ఇవి శృంగార రసాభిగమ్యాలు కావు. వెరవక తననే చూస్తూన్నాడని, ఆమెకు భయంతో చెమటలు పడుతున్నాయి. ఈ అనుచితమైన కృత్యంలో విధాతృ బలీయతకు నివ్వెరపాటు చెందుతూంది. ఏ ఉపాయం తోచక ముఖం పాలిపోతూంది. ఇచ్చట దిక్కెవరు లేరన్న భయంతో వణుకు పుడుతూంది. ఇది ఆమె స్థితి. ఇతడు ఆ స్థితిని చూచి మదన వికృతి యని సంతోషపడుతున్నాడు. కారణం "వివేకహీనుడ"వడం వల్ల "రాగ రస నిమగ్ను"డవుతున్నాడు. పాత్ర మానసిక స్థితి కనుగుణంగా శరీరంలో కలిగే మార్పును తిక్కన ద్రౌపది దృష్టితో కరుణాన్ని, కీచకుని దృష్టితో శృంగారాన్ని ఒకేచోట రెండింటి సమావేశ రూపాన్ని చిత్రించాడు. ఇదొక విచిత్ర రస సమావేశం సృజనకళాకృతి.

**"హస్యోభవతి శృంగారాత్ కరుణో రౌద్ర కర్మణః**
**అద్భుతశ్చ తథా వీరాత్, బీభత్సాచ్చ భయానకః"**

శృంగారం నుండి హాస్యం, రౌద్ర కర్మ నుండి కరుణం వీరం నుండి అద్భుతం, భీభత్సం నుండి భయానకం పుడతాయి. కీచకుడు తననేమి చేస్తాడో అన్న భయం ఆమె పొందిన దయనీయ స్థితితో కరుణం, భయ నిరాసక యత్నంతో వీరం పరిణమింప పోతున్నాయి. రసాభాస శృంగారంతో విచిత్ర రస సమ్మేళనం పర్యవసితమౌతుంది. అతని దృగ్గోచులామెను చుట్టి వేసాయి. సర్వానుభవం నేత్రేంద్రియంలో కేంద్రీకృతమైంది. సింహబలుడనంగు పట్టి యాడే జంత్రం"వలె నున్నాడు. అతని చూపు ఆమె శరీర కాంతి వెల్లువలో మునిగింది. కెంగేలు లేయెండపై పర్వింది. ముద్దుమొగం మెరుగుల్ని చుట్టుకుంది. రెప్పలపై కప్పు చీకట్లో కలిసింది. ఇది రజోగుణం నుండి తమోగుణంలోకి పరివర్తనం చెందే పాత్ర మనోగుణాన్ని చిత్రిస్తుంది.

**మూలంలో "తాం దృష్ట్వా దేవ గర్భాభాం చరన్తీం దేవతామివ**
**కీచః కామయామాస కామ బాణేన పీడితః"**

"దేవగర్భాభాం, దేవతామివ" అన్న మాటలతో ఇతిహాస రచనకు తగిన విధంగా వర్ణితమైంది. తెలుగులో కావ్య కల్పనా సముచితంగా చిత్రితమైంది. కీచకుని కామ భావన సౌందర్యానుభూతి ఆ పాత్ర శరీరవర్ణనమాధారంగా మనోరూపంతో ప్రకాశితమయింది. ఈ విధానం తరువాత వచ్చిన తెలుగు కవులకు మార్గ దర్శకమైంది. కథాగతంగా పాత్రల ప్రవర్తనతో దీన్ని రూపొందించడం రస సమంచితంగా తీర్చడం తిక్కన విశేషం.

కీచకుడు సుదేష్ణతో సైరంధ్రి గురించి అడిగాడు. ఆమె తన తమ్ము"డనంగ శర దళిత హృదయుడ"ని తెలుసుకుంది. అతని చిత్తాన్ని మరల్చే ప్రయత్నం చేసింది. ఆమె సద్బుద్ధికిది తార్కాణం. పైగా ముందుగా సైరంధ్రి వెనుక నున్న బలశాలురను గురించి తెలియడం కూడా ఒక కారణం.

అతడు నిలువలేక పోయాడు. ద్రౌపది యున్నచోటికి వెళ్ళాడు. అతడు "సత్త్వహీనుడు కావున" యని తిక్కన, అంటే రజస్తమో గుణయుతుండని, మంచితనం

లేని వాడని, వివేకం లేని వాడని అర్థం. వివేకం జ్ఞానం వల్ల కలుగుతుంది. ఆలోచన దీనికి ఆధారం. కామ వివశత్వం వల్ల, దుర్బుద్ధి వల్ల వివేక శక్తిని కోల్పోయాడు. ఆమె సమీపంలో "అట్టాడ" మొదలు పెట్టాడు. ఇది చంచలత్వాన్ని నిగ్రహ రహితత్వాన్ని సూచిస్తూంది. సైరంధ్రి కీచకుని మాటలు విని, విననట్లుగా నిర్వికారయై ఊరకుంది. అతడు "నిన్ను చక్కగా చూడలేకపోతున్నాను మాట నాలుక తుదికి రావడం లేదు. నీ చేయి పట్టే ప్రయత్నంలో కేలు వణకుతూంది. నీ మనస్సు పట్టు పడడం లేదు." ఆలస్యం చేస్తే మన్మథుడు చంపేస్తాడు "మగుడ నన్ను బడయ వచ్చునె యెన్ని యుపాయములను" అని తన ప్రాముఖ్యాన్ని తెలియజేయడం జరిగింది. చూపు మాట చేత మనస్సు సరిగా సుస్థితిలో పని చేయడం లేదు. ఈ మార్పు యాతని దౌర్బల్యాన్ని అంటే సత్త్వరహితత్వాన్ని సూచిస్తూంది. ఇదొక విధమైన అల్పమైన శృంగార భావ చమత్కృతిగా భావించవచ్చు. కొంత అసత్యం ఉండవచ్చు. ప్రేమ భయం సంశయం స్వాధిక్యంగల భావనలలో చొఱవదనం వాచాలత్వంతో కూడిన గుణాలతో తీర్చబడింది. సైరంధ్రి దుర్వారమైన పరిభవానికి లోనయింది. మానసిక వికారాన్ని బయటికి కన్పించనీయలేదు. తనను తానుపశమింప జేసుకుంది. వీడు దురభిమానియై ఉన్నాడు. వేగిరపడటం "వెఱవు కాదు", నేర్పుతో తప్పించుకోవాలనుకుంది. లేని పక్షంలో అజ్ఞాత వాస ప్రతిజ్ఞకు భంగం కలిగే స్థితి ఏర్పడవచ్చు. ఆమె ప్రవర్తన ఉదాత్త గుణంతో పాటు కార్య నిర్వహణ దక్షతను ప్రతి ఫలింపజేస్తూంది. "నీకు తగిన దానను కాన"ని సజనత్వాన్ని ఆడపుట్టువుల్ని పేర్కొంది. కాని అతని పట్ల ఈ మాటలు వ్యర్థమైనాయి. అతడు నిశ్చయబుద్ధితో వరసతీ సంగమ పాపాన్ని ఓర్వవచ్చు కాని పచ్చవిల్తుని తూపుల కోర్వజాలన"ని ఖండితంగా చెప్పాడు. ఇంతకు సైరంధ్రీ పాత్ర సహనం శాంతంతో వర్తించింది. ఇక్కడ ఒక మలుపు తీసుకుంది. తానవలంబించిన సహన శాంతి విధానాని కతడు వినేట్లు లేదు. ఆమె మరో మార్గాన్ని అవలంబించింది.

**"దుర్వారోద్యమ బాహు విక్రమ రసాస్తోక ప్రతాప స్ఫుర**
**ద్గర్వాంధ ప్రతివీర నిర్మథన విద్యాపారగుల్ మత్పతుల్**
**గీర్వాణాకృతు లేవు రిప్పు దోర్లీలన్ వెసంగిట్టి గం**
**ధర్వుల్ మానము ప్రాణమున్ గొనుట తథ్యం బెమ్మెయిన్ కీచకా"**

యని గర్జించింది. ఆమె మనస్సులోని సముత్కట కోపాన్ని వ్యంజింపజేసే పద సమాస సంఘటితమైన శార్దూల విక్రీడిత వృత్తం ఓజో గుణయుతమై పద్య రచనా శిల్ప ప్రౌఢిమను సంతరించుకుంది. ఈ పద్యాన్ని గురించి యెంతైనా వ్యాఖ్యానం చేయవచ్చు. ఇందులోని "పారగుల్", మత్పతుల్", "దోర్లీలన్", "గంధర్వుల్" మాటలు విరుపులు ఆమె సింహబలుని ఆదలించి వేసే లక్షణాన్ని దుష్కర ప్రాసతో భావతీవ్రతను పద్యాంతంలో "కీచకా" సంబోధనం ఆమెలో ఆలక్ష్యాన్ని తిరస్కారాన్ని స్ఫురిజేస్తున్నాయి. మూలంలో,

"కామ వేగోద్ధతాంగేన గంధర్వాః పతయో మమ
తే త్వాం నిహన్యుః కుపితాః సానుబంధమమర్షిణాః
దుర్లభామనుమన్వానో మా వీరై రభిరక్షితామ్
పతిష్యస్య వశః తూర్ణః పక్వం తాళ ఫలం యథా"

స్వేచ్ఛా రూపం గల వేగోద్ధతులైన నా పతులు కుపితులై నిన్ను చంపేస్తారు. నేను వీరుల చేత రక్షితురాలను. వారి వశమై పండిన తాటి పండు వలె కింద పడిపోతావు అంటే నాశనమవుతావని అర్థం. మూలంలో ఉపమానం సముచితంగా ఉంది. తాటి చెట్టు ఉన్నతమైంది. అదే విధంగా సింహబలుడు తాను చాలా గొప్ప వాడనుకుంటున్నాడు కాని కర్మఫలం పక్వమై క్రింద పడుతుంది. ఎవరు ఆపలేరు. తిక్కన రచనలో అవలంబించిన విధానం వర్ణనాత్మకమైంది. పద్య రచనా శిల్ప శోభితమైంది. మూలంతో తులనాత్మక పరిశీలనం వల్ల ప్రయోజనం లేదు. తెలుగు రచన కవిత్రయం అవలంబించిన భాష భావన ఛందస్సు అభివ్యక్తి (చాల ముఖ్యమైంది) విధం కారణంగా రచన స్వతంత్రమైన రూపాన్ని పొందింది. సమాహారంగా సృజన కళతో నిర్వహణ శిల్పం వేరైంది.

సింహబలుడామె మాటల్ని త్రోసి పుచ్చాడు. తన బలంపై విశ్వాసాన్ని ప్రకటించాడు. ఇంతవరకు పరాజయ మెరగని ఉద్ధతుడు. ఆమె హితం చెప్పింది "అందని మ్రాకుల పండ్లకై యత్నించి చెడిపోవద్దని పలికింది. "వివేక హీనుడా"యని సంబోధించింది. అతడేమి చేయడానికి తోచక అక్కగారి కడకు వెళ్ళాడు. సింహబలుని

దుష్ప్రవృత్తి దానికి సమాంతరంగా సైరంధ్రి ఆత్మ విశ్వాసం ఈ సన్నివేశంలో పాత్రల చర్య ప్రతిచర్య వైఖరుల్ని సూచిస్తున్నాయి.

సుదేష్ణ సింహబలుని పట్ల కనికరం చూపింది. అతడు తగదన్న వినేట్లు లేడు ఉపాయం దొరకడం లేదు సోదరుని పట్ల ప్రేమ, ఏదేని అపాయం వల్ల భయం అతని మౌర్ఖ్యం పట్ల జాలి, తనలో విచికిత్స కారణంగా ఆందోళనకు లోనయింది. మరోసారి వారించి చూడాలని నిశ్చయించుకుంది. నిన్ను "అనురక్తి కొలుచు" స్త్రీలున్నారు "నీరసాకార"ను "కోరదగునె"యని సైరంధ్రి పట్ల వైముఖ్యాన్ని కలిగించే ప్రయత్నం చేసింది. కాని అతడు వినదలచుకోలేదు. సైరంధ్రి సౌందర్యాన్ని.

"గండు మీలకు బుట్టి కాము బాణములతో గలసి యాడెడు నట్టి కన్ను గవయు"

మొదలుగా వర్ణించడం మొదలు పెట్టాడు. సౌందర్యం ఆకర్షణ సమ్మోహన లక్షణాల్ని గుర్తింపజేసాడు. సుధేష్ణ మొదట్లో సింహబలుని వారించింది. చివర కతని కోర్కె కంగీకరించింది. అదీ పరసతీ ప్రాప్తికి చెందిన అధర్మంతో కూడింది ఆమె మనస్తత్వం విచిత్రమైంది. దీని పర్యవసానం సుధేష్ణ యెరుగదనడానికి వీల్లేదు. బల విక్రమ గంధర్వుల్ని పేర్కొంది. చివరకు "నిజాసక్తి భోగింపుమ"న్న దశకు వచ్చింది. ఒక వ్యక్తి బంధు ప్రేమలో వాత్సల్యంలో దుష్ట కార్యానికెట్లు తల ఒగ్గేది చిత్రితమైంది. ఆమెలో సద్గుణం లేక పోలేదు. అది ఛిన్నమైంది. కాళ్ళపై బడిన తమ్ముని లేవదీసింది. అశ్రునేత్రయైంది. గంధర్వుల వల్ల తమ్మునికే ఆపద మూడుతుందోనన్న భయం, తాను చేసే పని పట్ల దోషభావం, ఆమెను కలచివేసాయి. వీడికెట్లాగైనా "చావు నిజంబ"ను కొంది. ఇది మన్మథబాణాల వల్లనో? గంధర్వులవల్లనో? ప్రస్తుతానికి మన్మథ బాణాల నుండి తప్పించింది. ఆసవానికై "నీకడకు పుత్తెంతు"నని పంపివేసింది. అతడక్కడ ఉండకూడదు, తన కీర్తికి భంగం కలుగవచ్చు.

సైరంధ్రిని కీచకునింటికి పంపటం సుధేష్ణ కర్తవ్యమయింది. దీనికో ఉపాయం పన్నింది, కీచకుని యింటి నుండి "వాచవి" యగు "వారుణి" త్వరగా జని కొని రమ్మంది. సైరంధ్రి ఈ పనికి భయాందోళనం చెందింది. "కొనిరమ్మా! చూతము నీ గమన వేగము" అంది. ఇప్పుడు నిరాకరించే అవకాశం లేదు. అక్కడ నిలిచే

పనేలేదు, ఏమి జరుగుతుందోనన్న భయమక్కరలేదు. సైరంధ్రి మానసిక స్థితి వర్ణితమైంది. ఎద భీతిల్లింది. మేను స్వేద పూర్ణమైంది. విచారం కలిగింది. పోననడానికి వీల్లేదు. పోవడం ఉచితం కాదు. సందిగ్ధావస్థలో పడింది. నేర్పుతో దీన్ని పరిష్కరించుకోవాలి. సుధేష్ణ పని కాదంటే బ్రతుకెట్లా? కీచకునింటికి వెళ్ళితే అవమానం పాలవుతుంది! పెద్దవారు తమ నాశ్రయించిన సాధువుల్ని రక్షించాలి, కీర్తి పొందాలి. లేకపోతే అపకీర్తి పాలవుతారన్నది. దీనికి సమాధానంగా 'నే కోరే మద్యం ఉత్తమమైంది. కాబట్టి గౌరవం చేత నీకీ పని ఒప్పజెపుతున్నా'నంది. కీచకుని పట్ల సదభిప్రాయాన్ని కలిగించే ప్రయత్నం చేసింది. ఆజ్ఞాపించే స్థితి నుండి ప్రార్థించే స్థితికి చేరుకుంది. సైరంధ్రి ఇక పెద్ద తడవు పెనంగజనద"ని భావించి, అంగీకరించింది. బంగారు కలశాన్ని తీసుకొని "ఆర్తమూర్తియై" కదలింది. సుధేష్ణ తనపనికై సైరంధ్రిపై అధికారం కన్నా ఆదరం, గౌరవం, అభ్యర్థనతోనే ప్రవర్తించింది. సైరంధ్రికి దీని వెనుక నున్న పన్నుగడ తెలుసు! తెలిసీ అంగీకరించక తప్పలేదు. సుధేష్ణకు తప్పని వర్తనం తమ్ముని వల్ల; సైరంధ్రికి తప్పని వర్తనం అజ్ఞాత వాసం వల్లనే అయితే ఇవి అసాధారణ పరిస్థితికి దారి తీసాయి.

కౌరవ సభలో మానభంగ సమయంలో పరమాత్ముడు రక్షించినట్లు ఇపుడు కూడ అతని పైనే భారం వేసింది. "పిడుగు పడిన వానికి కొరవి" అంటుకున్నట్లు భావించింది. మందిరం వెలువడింది. కర్మసాక్షిని చూచింది. "కరుణతో రక్షింపుమ"ని ప్రార్థించింది. సూర్యుడు కరుణతో రాక్షసుని పంపాడు. అతడు అదృశ్యాకారంలో ఆమె రక్షణార్థం వెన్నంటి ఉన్నాడు. ఇప్పుడు కాలం సైరంధ్రి కనుకూలంగా ఉందన్న విషయాన్ని తెలియచేస్తోంది. కాలమనగా పరమేశ్వరుడు. అతని అనుగ్రహం లభించింది. దీని పర్యవసానం పాఠకుల ఊహకు వదలి వేయబడింది. సైరంధ్రి "బెబ్బులి యున్న పొదలోకి" లేడి వలె సింహబలుని నిలయం ప్రవేశించింది. ఇక్కడ బెబ్బులి ఉందని తెలిసే వచ్చింది. ఈ స్థితి అనివార్యమైంది. అతడామె వచ్చే మార్గాన్ని చూస్తూ, ఆమె కన్పించగానే తొట్రుపాటు పొందాడు. సంతోషం కలిగింది. ఎదపై హారాలు సవరించుకున్నాడు. ఆమె నాకర్షించే ప్రయత్నం చేసాడు. "నన్ను నీబంటుగా నేలు మింక నీ సిగ్గు తెర యేల నీ క"ని ప్రలపించాడు. ఆమె "ధీర" యగుట వల్ల ఆ మాటల్ని గణింపలేదు. "దేవి ఎదురు చూస్తుంది, మదిర పోయుడ"న్నది. అతడామె

మాటలు లక్ష్యపెట్టలేదు. "ఇతరుల చేత పంపింతు"నన్నాడు. అంతకంత కతిశయించు "తమకంతో" పట్టుకొన్నాడు. ఆమె తననుసరించియున్న అదృశ్యాకార రాక్షసుని బల ప్రవేశంతో విదల్చి వేగంగా మందిరం నుండి బయటపడింది. విరటుని సభ వైపు పరుగిడింది. అతడు ఆమె వెంట బడ్డాడు.

"సమద వారణము జంగమ లత వెనుకొని సరభసంబుగ బట్ట జను విధమున" మొదలుగా అత్యుదగ్రుడయిన సింహబలుడు పరుగిడే సైరంధ్రిని వెన్నంటే దృశ్యం తిక్కన వర్ణించిన విధం కవితాత్మకమైంది. అతడు సమద వారణం, క్రూర దానవుడు, ఘోరగృధ్రం ప్రబల బిడాలంతో పోల్చబడినాడు. అట్లే సైరంధ్రి జంగమలత, భూచారిదేవతా స్త్రీ సుకుమార నాగాంగన, బాల శారికతో పోల్చబడింది. అతని యందు మద క్రూర ఘోర ప్రబలతా గుణాలు, ఈమె యందు కోమలత్వ సౌందర్య సౌకుమార్య మౌగ్ధ్య గుణాలు, పరస్పరం విరుద్ధమైనవి. ఈ రెండింటి మధ్య స్నేహం సమన్వయం ప్రసక్తి లేదు. ఈ పద్యం పూర్వం దుశ్శాసనుని చేష్టను తలపిస్తూంది. అప్పటికన్న ఇప్పటి స్థితి క్లిష్టమయింది. ఏమాత్రం అవివేకంగా ప్రవర్తించినా అజ్ఞాతవాసానికి భంగమవుతుంది. పై పద్యంలో అమానవీయమైన జంతు లక్షణంతో దానవ ప్రవృత్తితో సింహబలుని మూల మనోరూపం సూచితం. వెనుక నుండి వచ్చి కోపంతో ఆమె తలపట్టి "మహోగ్రవృత్తి", కూలదోసాడు. అప్పుడామె అదృశ్యరక్షకుడు, సింహబలుని "డొల్ల" వేసాడు. ఇది ఆమె తన్ను త్రోసి పొరల జేసినట్లు భావించాడు. క్రిందబడి లేచి కుంఠితుడై విస్మయం చెంది కోపావేశపరుడయి తిరిగి పోయాడు. ఈ స్థితిలో జనులు చూస్తారని, నిలవద్రొక్కుకొనే ప్రయత్నం చేసాడు. అతడు లేచి వెంట బడతాడన్న భయం సహజం కాబట్టి వెంటనే ఆలోచింకుండా విరటుని సభలోకి వెళ్ళింది. అతనిలో కామభావం నుండి కోప భావానికి మారిన స్థితి కన్పిస్తుంది. ఈ విచిత్రమైన సంఘటనను తిక్కన మనో భావ చిత్రణాత్మకంగా నాటకీయమైన అంతరసంభాషణంతో కథా నిర్వహణ గతమైన కవి ప్రమేయ వాక్యాలతో నిబంధించాడు. ఇది అపూర్వ నిర్మాణయుతమైంది.

# II

కీచకుని నిర్గమనానంతరం మరో క్లిష్టమైన ఘట్టం ఆరంభమైంది. మనోవల్లభ అవమానాన్ని తన అన్నతో పాటు భీముడు కూడ చూశాడు. రౌద్ర రూపాన్ని వహించాడు.

**“కనుగొని కోప వేగమున కన్నుల నిప్పులు రాల నంగము**
**ల్దనరగ సాంద్ర ఘర్మ సలిలంబులు క్రమ్మ నితాంత దంత పీ**
**డన రటదాస్య రంగ నికట భ్రుకటీ చటుల ప్రవృత్త న**
**ర్తన ఘటనా ప్రకార భయద స్ఫురణా పరిణాహ మూర్తియై”**

“నేలయు నింగియు తాళముల్‌గా జేసి యేపున రేగి వాయించి యాడ”, నప్పళించుచు ప్రళయ కాలానలాకృతి భీముడు భయంకరుడయ్యాడు. ఈ రెండు పద్యాలు ఓజోగుణ భూయిష్ఠమైన రచనతో రౌద్రరసాన్ని వ్యంజింపజేస్తున్నాయి. మొదటి పద్యం చంపక మాలా వృత్తం. వృత్త దృష్టితో రౌద్రానికి పనికి రాదు. శార్దూల విక్రీడితాదులు పనికివస్తాయి. పద్యంలో ఒకటే సుదీర్ఘ సమాసముంది. ఇది పద్యాన్ని గాఢబంధం కలదిగా పరిణమింపజేస్తుంది.

**“రౌద్రాదౌ మధ్యమ సమాసా సంఘటనా,**
**కదాపి ధీరోద్ధత నాయక సంబంధ వ్యాపారాశ్రయేణ దీర్ఘ సమాసాపి వా”**యని

ధ్వన్యాలోకంలో ఆనందవర్ధనుడు రౌద్రరస నిర్వహణంలో రచన, మధ్యమ సమాస సంఘటన రచన ఒకపుడు ధీరోద్ధత నాయక సంబంధం చేత దీర్ఘ సమాస రచన కూడా ఉంటుంది. రెండోది సీసపద్యం. ఇందులో దీర్ఘ సమాసమే లేదు. ఇది రౌద్రరసాన్ని ఎట్లా వ్యంజింప జేస్తుందని ప్రశ్న! సూక్ష్మంగా పరిశీలిస్తే ఈ ఓజోగుణం భావ వేగానికీ భావ తీవ్రతకూ సూచకంగా ఉంది. సమాస ఘటన లేకుండా కూడా దీన్ని సాధింపగలిగితే దీర్ఘ సమాస ఘటనావసరం ఉండదు. కేవలం అలంకార శాస్త్ర నిర్వచనాల్ని ఆశ్రయించినంతమాత్రాన అభివ్యక్తి సంపూర్ణం కాదు. ఇది కవి ప్రతిభాధీనమయింది. రచనా శక్తికి సంబంధించింది. సమాస విరహితమైన పదాల్లో

పదాల విరుపులతో పదాల సంయోజనంతో రౌద్రరసాన్ని అభివ్యక్తం చేయడం జరుగుతుంది. తిక్కన రచనలో ఇది ఇక్కడ పాత్ర ప్రవృత్తి ప్రవర్తనతో సంబంధం కలిగి ఉంది. భీముడు పండ్లు కొరుకుచు, బొమముడి పాటుతో భయంకరాకృతి దాల్చిన విధం వర్ణితమైంది. దీన్ని వ్యంజించే రచనాశిల్పం సహృదయుల్ని రౌద్ర రసాభిముఖంగా ప్రవర్తింపజేస్తుంది. రెండో పద్యంలో కోప పరిణామ దశలు ఒక ప్రమాణంలో భావితమైనాయి. భూమ్యాకాశాల్ని తాళాలుగా జేసి వాయించి ఆడేందుకు, కుల పర్వతాల్ని ఒకదానితో మరొకటి తాకేట్లు తన్ని ఆడేందుకు ఏడు సాగరాల్ని అక్కడక్కడ జల్లి బురద మై నలది కొనేందుకు నాలుగు దిక్కుల్ని ఒక చోట చేర్చి పిడిచికొనేందుకు బ్రహ్మాండ భాండాన్ని పగుల వేసేందుకు ప్రయత్నించే విధంగా భీముడు అతిశయించాడు. ఇది భాగవతమైన ఓజోగుణంతో ప్రభావ రూపమైంది.

దీనికి కారణ రూపమైంది మొదటి పద్యం. కళ్ళ నుండి నిప్పులు రాలాయి. శరీరం ఉప్పొంగింది. చెమటలు క్రమ్మాయి. పండ్లు పటపట కొరికాడు. కనుబొమలు ముడిపడినాయి. భయద పరిణాహాకృతి పొందాడు. అసమానం అవిచారత్వం అతిశయత్వం ఈ స్థితికి తగినవి కావు. వృకోదరుడు కీచకుని గర్వ మణచదలచాడు. “మయాపర: ప్రచండశ్చపలో హంకార దర్ప భూయిష్ఠ: ఆత్మ శ్లాఘావిరతో ధీర: ధీరోద్ధత: కథిత:” అని సాహిత్య దర్పణం. ధీరుడైన ఉద్ధతుడు భీముడు అతని పని కనుజ్ఞనీయవలసిన వ్యక్తి ధర్మజుడు! పూర్వం ధర్మజునితో మాటలాడుచు ద్రౌపది, భీమాదులను గురించి, “భవదాజ్ఞా నిగళంబున... పరాక్రమంబు విడిచి.. చెరపడిన సింహ శిశువుల భంగి” (ఆం. భా. అరణ్య ప. ఆ-1 ప. 211) నున్న విషయం జ్ఞాపకం వస్తుంది. ఇది నన్నయ రచన. తిక్కన రచనలో ఆ దగ్గరలో నున్న ఉన్నత వృక్షాన్ని చూచి ఆరుణాననంతో ధర్మజుని చూచాడు. (భారత రచనలో కవిత్రయం సృజన సూత్రం నిర్వహణ దృష్టి ఒకటే నన్న దాని కనేకమైన ఉదాహరణలు చూపవచ్చు) ధర్మజుడు సమయ భంగాన్ని తలచి కన్నులతో వారించాడు.

**“వలలుం డెక్కడ చూచె నొండెడ నసే వ్య క్షామ్రజముల్ పుట్టవే**
**ఫలితంబై వర శాఖలొప్పగ ననల్ప ప్రీతి సంధించుచున్**

**విలసచ్ఛాయ నుపాశ్రిత ప్రతతికిన్ విశ్రాంతి గావింపగా**

**గల యీ భూజము వంట కట్టియలకై ఖండింపగా నేటికిన్"** అని నిగూఢ భాషణంతో భీముని కోపాన్ని విరమింపజేసాడు. కథా గమనంలో ప్రస్తుతానికి మించిన రౌద్రాన్ని శాంతంలోకి పరిణమింపజేసిన విధం ధ్వన్యుపస్కారకమైంది. వలలు డెక్కడ దేన్ని చూడరాదో అక్కడ దాన్ని చూచాడు. వంట కట్టెలకు మరొక చోట పనికి మాలిన చెట్లు చాలా ఉన్నాయి. పండ్లతో పెద్ద కొమ్మలతో విశాలమై ఆశ్రితులకు నీడనిస్తూ శ్రమను పోగొట్టే సంతోషపరచే ఈ చెట్టును నరకడం ఉచితమా? యని ప్రశ్న. దీనికి సమాధానం భీముడే స్వయంగా నిర్ణయించుకోవాలి. తమకు నీడ నిచ్చిన విరటుని ఆశ్రయాన్ని భంగించడం తగదు. కీచకుని సంహరించడం "ఒండెడ" కాని ఇచ్చుట కాదు. వాడు వంట కట్టె వలె సులభంగా విరువదగినవాడు. ఇదీ మరో చోటనే. ఏ పనికైనా సమయౌచిత్యం, స్థానౌచిత్యం ముఖ్యం. ప్రస్తుతం మరీను. ధర్మజుని సమయోచిత భాషణం, భీముని అజ్ఞాబద్ధుని చేసింది. మూలంలో

**"ఆలోకయసి కిం వృక్షం! సూద! దారుకృతేన వై**

**యది తే దారుభి: కృత్యం! బహిర్వృక్షాన్నిగృహ్యతామ్"**

వృక్షాన్ని ఎందుకు చూస్తున్నావు! నీకు కట్టెలతో పని ఉంటే బయటనున్న మరో చెట్టు నుండి గ్రహించు" మూలంలోని నిగూఢత్వం చెదరకుండా తెలుగులో వ్యాఖ్యాతమయింది. ఎన్నుకున్న వృత్త పరిధికి తగినట్లుగా భావం సంభాషణ రూపంలో పెరిగింది. సన్నివేశానికి కావ్య రామణీయకత చేకూరింది. అంగిరసాన్ని మించి అంగరసం విస్తరింపబడకూడదు. ప్రాస్తావికమైన రౌద్రం బహు సులభంగా శాంతంలోకి పరివర్తితమయింది. రస నిర్వహణ శిల్పంలో భాగం ఇది క్లిష్టమైన వన నిర్వహణకు సంబంధించింది. వ్యాసోద్దిష్టాన్ని తిక్కన నానా రసాభ్యుచిత బంధంగా హృద్యంగా నెరవేర్చాడు.

సైరంధ్రి "ఎలతీగ కప్పిన పరాగం వలె" ధూళి క్రమ్మి, పద్మ దళాలపై "మంచు జారిన"ట్లు కళ్ళ నుండి అశ్రువులు జారుతూ లేచింది. దైన్యావస్థను పొందిన ద్రౌపది సౌందర్య రూపం ప్రకృతి గతమైన రమణీయ వస్తువుల యోజనతో భావితమైంది. ఈ

వర్ణనం కరుణాత్మక స్థితికి కవితా రూపాన్ని సిద్ధింపజేసింది. "ఐదుగురు గంధర్వపతులు తన భంగపాటు చూచి మిన్నకుండుట ఆశ్చర్యకరమ"ని ఆక్షేపించింది. కోపావేశంలో ఈ మాటలు సాధారణ మానవ స్వభావోచితాలే. విరటుని మనస్సు బాధ పడింది. సింహబలుని నిరోధింపశక్తి కలవాడు కాదు. కావున విరటున సాంత్వనోక్తులు పలికి వెళ్ళిపోయాడు. ఆమె మాటలు ప్రజల్ని రాజును ఆలోచింపజేసాయి. "ఈ శుభలక్షణాంగి సైరంధ్రి ఎట్లుయైనదని, దుష్ట దైవ మింత కష్టాన్ని కలిగిస్తూందా?" అని రాజు సమక్షానే ఇది జరిగిందని సుధేష్ణ ఉపేక్షయే కారణమని పరిపరి విధాలుగా తలచారు. ప్రజల్లో ఈ భావన మునుముందు కీచకుని మరణానికెవ్వరు చింతించని స్థితికి దోహదం చేస్తూంది. రాజమందిరంలో వ్యక్తికే భద్రత లేదు. ఇక సామాన్యుల సంగతి చెప్పనవసరంలేదు. లోక సహజమైన ఆలోచనతో సన్నివేశం అసమర్థుడైన రాజును వదలి జన కేంద్రంగా మారింది. అయితే ధర్మజుడు మాత్రం జన నాయకుడు, కాబట్టి సభ్యులు "నీ తెఱగెఱిగిరి ఇక సుధేష్ణ సదనమునకు జనుమ"న్నాడు. ఎంత కష్టం వచ్చినా పతివ్రతలు "శంకసెడి" ధిక్కరింపజనునె"యని హెచ్చరించాడు. సైరంధ్రి కదల్లేదు. ధర్మజుడు "నాట్యకత్తె వలె ఇట్లునికి తగునె" మళ్ళీ అన్నాడు. సైరంధ్రి నచటి నుండి పంపడమే అతని ఉద్దేశం. "నా మగడు నటుడు, నేను నటిని"యని బాష్పనేత్రయై కంపిత శరీరయై కదలింది సుధేష్ణ కడకు వెళ్ళింది.

"తగునె" యన్న మాట సాభిప్రాయం. ఇప్పుడున్న స్థితిని బట్టి బహు జాగ్రత్తగా మసలు కోవడం అవసరమన్న భావం ధ్వనితమవుతుంది. తన మగలు నటులు, ఆమె నటియే. ఈ నటన అజ్ఞాత వాసం పూర్తి అయ్యేవరకు సాగవలసిందే నాపతి "కితవుడు" మొదలుగు సమాధానం ఆమె తత్కాలంలో ఉన్న దీన స్థితి కారణంగా ఆవేశంలో ఉద్గమించినవి. అయితే ఇది అపకారకంగా పర్యవసించే అవకాశముంది. ధర్మజుని మాటల్లో భయకారణమైన దీన్ని నివారించే వివేకం స్ఫుటమవుతూంది. ఈ సన్నివేశం, మనస్తత్వ ప్రకాశానాత్మకంగా సందర్భోచితంగా తీర్చిన కావ్య శిల్పంతో రాణిస్తూంది.

# III

సుధేష్ణ సైరంధ్రిని చూచి ఏమి ఎరగనట్లు మాట్లాడింది. కీచకుని ఇంటికి పంపినపుడే తెలుసు. సుధేష్ణ ముఖత: సైరంధ్రి వర్ణనంలో తమపై మాటరాకుండా తిప్పికొట్టడంలో ఆమె నిపుణత వ్యక్తమవుతూంది. “ధరణీ పరాగంబు! సోకి నీ శరీరం అందం తరిగింది” మొదలుగా ఎవరు ఎక్కడ నీకు “కీడొనర్చిరి” “వారి జంపుదు నొంపుదు భంగపరతు” నని ఏమోమో మాట్లాడింది. ఈ మాటలు దోష సహితమైన సుధేష్ణ మనోరూపాన్ని బింబిస్తున్నాయి. సైరంధ్రి మాట్లాడకపోవడంలో ఒక అంశముంది. సభా సమక్షంలో ఆవేశంలో ఎక్కువగా ఆమె మాట్లాడింది. ధర్మజుడు మందలించాడు. ఇప్పుడు శాంతించింది. ఆలోచన మొదలైంది గుప్త స్థితిని కాపాడే బాధ్యత తనది కూడ. ఆమె నేరుగా సుధేష్ణ వద్దకే వచ్చినట్లయితే ఎట్లా ఉండేదో! అంటే ఆ ఆవేశంలో పరిభూత స్థితిలో తప్పకుండా మాట్లాడేది. సుధేష్ణ ప్రవర్తనను నిరసించేది. ఇపుడా దుస్థితి తప్పింది. సాలోచన అయింది.

సభలోకి ప్రవేశించినప్పటి స్థితికీ, సుధేష్ణ కడకు వచ్చినప్పటి స్థితికి కొన్ని సామ్య భేదాలున్నాయి. తిక్కన రెండు చోట్ల సీస పద్యాలనే ఉపయోగించాడు. సుధేష్ణ కడకు వచ్చేప్పటికి “తలపోత” వల్ల ముఖం చిన్నవోయింది. ఉద్వేగం కోపం తగ్గింది దు:ఖం కాస్త ఉపశమించింది. ఈ మానసిక పరివర్తన కనుగుణంగా రచనా శిల్పంలో మార్పు కన్పిస్తుంది. సుధేష్ణ సైరంధ్రిని చేడియ, చెలువ, యుగ్మలి, వెలది యని పరిపరి విధాలుగా ప్రేమ ఒలకబోసింది, సహాను నూతిని ప్రకటించింది. ఈమె కపకృతి చేసిన వారిని శిక్షించే ఒకే భావాన్ని పలు మాటల్లో ప్రదర్శించింది. ఆమె చేయగలిగిందే అయితే ఇంత దూరం వచ్చేది కాదు. కాని మాటకారితనంలో సశక్తయే. నిజంగా సుధేష్ణకేమి తెలియకపోతే ఇంతగా మాట్లాడే అవసరం లేదు. తాను చేసిన దోషాన్ని కప్పిపుచ్చే మానసిక క్రియ దీర్ఘ ప్రసంగానికి దారి తీసింది. సైరంధ్రి అమాయకురాలు కాదు, చాల సంగ్రహంగా “నీ వెరంగియు ఎరుగమి భావించిన నింక నేమి పలుకం గల దాన వినుమ”ని చాల సంక్షిప్తంగా వివరించింది దీనికి సమాధానంగా.

సుధేష్ణ "ఖేదము దక్కుమీక్షణమ కీచకు దండితు జేసి నీకు నాహ్లాద మొనర్తున"ంది. కాని దండించువాడు రాజు. ఆ రాజు జరిగింది చూచాడు. ఏమీ చేయలేకపోయాడు. సైరంధ్రి మాట్లాడే పద్యంలో ఒక చమత్కారముంది. రెండోపాదం చివర "మత్స్యావనీ"యని ఆగి, మూడో పాదం మొదలు "శుని" యని "మత్స్యావనీశుని" పదం విచ్ఛేదాన్ని పొందింది. అర్థమాత్ర కాలిక విశ్రాంతితో 'శుని' యన్నది ప్రత్యేక పద భ్రాంతిని కలిగిస్తూంది. తదాస్థానపతిత్వాన్ని సూచిస్తూంది. (నన్నయ సభాపర్వంలో శిశుపాల వధ సందర్భంలో శిశుపాలుని మాటల్లో "కేశవ" నాలుగో పాదం మొదలు 'శవ' పదస్ఫూర్తి కలిగేట్లు వ్రాయబడింది. శిశుపాలుడు కృష్ణుని నిందించే సందర్భంలోనిది. సంస్కృతంలో నున్న పాదాంత విశ్రాంతి నియతి తెలుగులో లేకపోవడం వల్ల పద్య రచనలో ఇటువంటి చోట్ల ఉపకారకంగా ఉంటుంది.) సుధేష్ణ తన మిథ్యాదికారంతో సైరంధ్రిని ''నయంబున'' సమాధానపరచింది. 'నయంబున'కు బదులు "భయంబునకు"యని పాఠాంతరముంది. (మహాభారతం వావిళ్ళవారి ప్రతి – ముద్రణం 1961). సుధేష్ణకు భయం ఎట్లాగో ఉంది. ఇది పైకి కన్పించనీయలేదు. ప్రస్తుతం సైరంధ్రిని శాంతింపజేయాలి. ఇది సుధేష్ణ తక్షణ కర్తవ్యం. కాబట్టి "నయంబున" పాఠమే సముచితం తన పరిజనంలో ఒకరు బాధకు గురి అయినప్పుడు తాను తొలగించలేనని తెలిసినను, తొలగించే విధంగా ఓదార్చడం సహజం, ఇది విజ్ఞతగల రాజ పరివారం నీతి కూడా. సుధేష్ణ రాజ్ఞి ఈ కారణంగా "అత్యాదరంగా" సైరంధ్రిని అనునయించింది. సుధేష్ణ "అసత్య సంవాదిని పూన్కి" సైరంధ్రికి తెలుసు. అందుకని ఆమె మాటల పట్ల అంతగా ఆదరం చూపలేదు.

"కళావంతులు మత్పతులు కలరు," – వారు "మన:ఖేదా"న్ని పోగొట్టగలరు. పౌర జనుల పట్ల రాజు తీర్పవలసిన బాధ్యతను కూడా తీరుస్తారన్నది. రాజు అసామర్థ్యాన్ని గురించి స్పష్టం చేసింది. ఈ మాటలకు సుధేష్ణతో పాటు పరిజనం "వెఱగొందారు. సుధేష్ణ "నివ్వెఱ"పోయింది. ఆమె ఇంతవరకు చేసిన అనునయం, అశ్వాసనం వ్యర్థమయినాయి. మనస్సు ఆపదను శంకించింది. పరిజనం కీచకుని నీచత్వాన్ని తలచి ఆ ఆపద "కొడబడి"నారు.

సైరంధ్రి మజ్జన భోజనాదులు విసర్జించింది. దీక్ష పూనిన దానివలె ఉంది. ఈ ఘట్టం ప్రధానంగా పాత్రల మానసిక స్థితిగతుల్ని ఆశ్రయించి, లోక సహజమైన ప్రవృత్తిని చిత్రిస్తుంది. దీనికి తగిన సంభాషణలో నైపుణితో ప్రకాశిస్తుంది.

## IV

ద్రౌపది కన్నీరుతో ఆలోచనలో పడింది. భీముని తలచుకుంది. మేని ధూళి కడిగింది. ధౌత పరిధానం ధరించింది. కీచకుని చంపగలవాడెవరో నిశ్చయ మయ్యేవరకు, మేని ధూళి కడగలేదు. పరిధానం మార్చలేదు. మహానసానికి వెళ్ళింది. అతడు కళ్ళు మూసికొని ఉన్నాడు. అతనిపై చేయి వేసింం. నాపై "దయమాలితవ"న్నది. ఆమె పాణి స్పర్శ కతడు సంపూర్ణంగా మేల్కొన్నాడు. ఆమె నుండి మాట వినాలనే కోరికతో "ఇంత పొద్దేల యిచ్చటి కేగుదేర"యని ప్రశ్నించాడు. నీకు తెలియదా! తెలిసి అడగడం దేనికన్నది. ఔచిత్యాన్ని ప్రశ్నించింది. నిష్ఠురోక్తులాడింది. ముఖత: చెప్పి తన పనికొప్పించడానికి సిద్ధ పడింది.

"ఎఱిఁగి యెఱింగి నన్నడుగ నేమిటి కిప్పు డెఱింగి యంతకున్
మఱచుట కల్గెనే? నది వినం బనిలేదటు గాక యున్న రూ
పెఱిగియు నేన చెప్ప విన నిష్టము గల్గుట చాల లెస్స, య
త్తెఱఁగెఱిగించెదన్ వినుము తెల్లముగా మొదలింటి నుండియున్"

సైరంధ్రి ఉన్న మానసికమైన క్లిష్టస్థితి, సంభాషణా చతురత, ఈ పద్యంలో వ్యక్తమవుతూంది. ఆమె ప్రవర్తనలో కాస్త కోపం, ప్రేమ, నివేదనం, ఏదో తృప్తి లక్ష్య సాధనకై ప్రయత్నం కన్పిస్తాయి. "దుర్వాదోద్యమ" పద్యం ఈ సందర్భంలో ఉల్లేఖితమయింది. ఈ పునరుక్తిలో భీముని బాహు విక్రమాన్ని, ప్రతివీర నిర్మథనత్వాన్ని జ్ఞాపకం చేయడమే, తన మాటను నిలపవలసిన బాధ్యతను గుర్తు చేయడం ముఖ్యం కీచకుడు పతుల శక్తిని కించపరచడంతో పాటు, అతడు "తన్నంగ నెట్టుల సూడ నేర్పె ధర్మసూనుడపుడ"న్నది. భీముడు దీనికి సమాధానంగా "ధర్మసూతుడు వారణ చేయకున్న సమయభంగము జరిగియుండెడిద"ని సమర్థించాడు. ఇది ప్రధాన కథలోని ధర్మజ నాయకగుణాన్ని దీప్తిమంతం చేస్తుంది. భీముడు ఆలోచనామతియై ధర్మజుని సమర్థించి కీచకుని సంహరించే మార్గాన్వేషణకు పూనుకున్నాడు. అతడు తన పరిధి యెరిగిన

వీరుడుగా కన్పిస్తాడు. ద్రౌపది భీముని మనోభావం గుర్తించింది. కేవలం కనుసైగలతో భీమునంతటి వీరుని వారింపగలిగిన శక్తి సామాన్యం కాదు. తాను పడిన మహాకష్టమట్లు మాటలాడించింది. కాని ధర్మజుని ఔన్నత్యం తెలియనిది కాదు. కేవల మర్త్యుడే కాదు! దివ్య మూర్తియని ధర్మసుతుడని ప్రశంసించింది.

"ఎవ్వాని వాకిట నిభ మద పంకంబు రాజభూషణ యశోరాజి నడపు" మొదలుగా గుణవర్ణనం చేసింది. ఈ పద్యం భావనాపటిమచేత పద్య రచనలో పాదాల ఎత్తుగడ, ఎత్తుగీతి చేత శైలిలో కళాత్మకత చేత ఉదాత్త భావన చేత అనితరమైంది. ద్రౌపది మనస్సులో దాగిన ధర్మజుని విశిష్ట వ్యక్తిత్వాన్ని ప్రత్యేకంగా ఎత్తి చూపుతూంది. "నీకు తగిన భంగి రహస్య భంగం కాకుండా ఆరి భంగం చేయుమని" భీముని కోరింది. సుధేష్ణకు పనులు చేయడంలో "పాణి తలముల్ పలు కాయలు కాచె చూచితే!" యని అశ్రు పూరిత నయన అయింది. తన వక్షంపై వాలిన ఆమె ముఖం తుడిచి ఆ చేతులు తన ముఖాన చేర్చుకొని అనునయించాడు. ఈ సన్నివేశం హృదయ స్పందనాత్మకమైంది. ఎవరి పరిమితులు వారికున్నాయి. ఎవరిపై నిందమోపడం సముచితం కాదు. పైన దైవం ఉందన్న విశ్వాసం ద్రౌపది వ్యక్తిత్వాన్ని ఉదాత్త బంధురమైన స్థాయిలో నిలుపుతూంది. అంతలో కీచకుడు తెగటారక పోతే "ఉరినైన, నీరనైన అగ్నినైన విషంబునైన మేనుదొరగెదన"ని పలికింది. ఈ మాటలామె పడిన దుఃఖౌత్కట్యాన్ని బాధాగాఢత్వాన్ని దృష్టిలో పెట్టుకొని నిర్ణాయక స్థితికి వచ్చిన పాత్ర వైఖరిని సూచిస్తున్నాయి. ఎవరడ్డుపడినా "నీవ కరుణ కాచితేని", కాక కీచకుని మరణం తథ్యమన్నాడు.

ఈ మాటలామెకు ఊరటనిచ్చాయి. ఉదయమవుతూంది. జనులు మేల్కొంటారని భావించి మునుమందు ద్రౌపది ప్రవర్తించే పద్ధతిని ఉపదేశించి కీచకుని వధించే విధానం సూచించి పంపాడు. ఇక్కడొక విషయం, భీమునికి తన లోపం తెలుసు. అది ఉద్రేక స్వభావం. దాన్ని గుర్తించి ప్రవర్తించడం ఇందులో విశేషం. భీమునిలో ఆలోచనాగతి కార్యసాధనాగుణం ప్రత్యేకంగా పేర్కొదగినవిగా తిక్కన రచనలో స్పష్టం. కథాగమనంపై కన్నా పాత్రల చర్య ప్రతిచర్యపై దృష్టి మరల్చడం ఇచ్చటి నిర్వహణ శిల్పం. ఇది సంభాషణ ప్రతిసంభాషణలతో దీప్తమై సన్నివేశకల్పనతో నాటకీయతకు సన్నిహితమైన లక్షణాన్ని భావింపజేస్తూంది.

# కీచక వధ

## I

కీచక వధ నిర్ణయానంతరం రచనలో శిల్పం మరో విధమైంది. ప్రకృతి వర్ణనం, కథాగమనం, పాత్ర చిత్రణంతో ముప్పిరిగొంది. ద్రౌపది పరిభవానికి ఎదలో వేదన పొందే సరసి వేడి "నిట్టూర్పులోయన", నెత్తమ్మివిరుల నుండి "కొత్త తావి వెడలింది." ఇది ప్రభాత వర్ణనం రాత్రి అంతా ద్రౌపది పొందిన స్థితి, ప్రభాత స్పర్శతో ఆమెలో ఆశారూపం దీప్తమయింది. కీచక వధకు పూర్వం వర్ణితమైన సూర్యోదయాస్తమయోద్యాన విహారాదులు తరువాత కవులకు ముఖ్యంగా ప్రబంధకవుల కాదర్శాలయినాయి. పద్యంతోపాటు వచనం అలంకారిక శోభను పొందింది. "మును కడ వచ్చి... యింపునం గదియ విదగ్ధ విటజనంబుల మనంబులం దిగిచు లలనా లోచనంబులును" మొదలుగా బాణుని కాదంబరి రచనను తలపిస్తుంది. అయితే సంస్కృతపదాల్లో కాకుండా తెలుగు పద్యాల్లో భావాభివ్యక్తిని విజయవంతంగా నిర్వహించడం తిక్కన ప్రత్యేకత. ఇది తెలుగు భాషా శక్తిని ప్రకటిస్తూంది.

సూర్యోదయ వర్ణనం తాత్త్విక భావనతో సంపన్నం కావడం పరిణతమైన కవి భావనాశక్తికీ ఆదర్శ రూపానికీ నిదర్శనంగా ఉంది.

**"నీరజాకరములు నిష్ఠమై జేసిన భవ్య తపంబుల ఫల మనంగ**
**హరిహర బ్రహ్మ మహానుభావంబు లొక్కటిగాగ కరగిన గుటిక యనగ**
**అతుల వేదత్రయ లతికా చయము పెను పొంద బుట్టెడు మూల కంద మనగ"**

భానుబింబం పూర్వాద్రిపై వెలిగింది. నీరజాకరాలు తపస్సు ఫలంగా హరిహర బ్రహ్మైక్య రూపంగా వేదమూలంగా భావితమైంది. సూర్యుని అనుగ్రహ రూపమే కీచకుని నుండి సైరంధ్రిని రక్షించింది. సూర్యుడిచ్చట అనురాగానికీ ధర్మానికీ, జాగృతికీ, ఆనందానికి ప్రతీక. ఈ ఆలోచనకు బీజభూతంగా ఉందీ పద్యం. ప్రకృతి వర్ణనంతో పాటు తత్త్వ ప్రకాశనం, కథాస్ఫూర్తితో ప్రస్తుతమై,ది.

మరునాడు ఉదయం కీచకుడు సింగారించుకొని మదన కంపితుడై సుధేష్ణ మందిరానికి వెళ్ళాడు. క్రిందటి రోజున జరిగిన పరాభవాన్ని మరచాడు. కొత్త ప్రయత్నం మొదలు పెట్టాడు, ఆలోచనా నిమగ్నుడైనాడు. సైరంధ్రిని పొందాలని సింహబలుని నిశ్చయం. అతని వధించాలని ద్రౌపది లక్ష్యం. అతని చూడని విధంగా చిత్తంలో బెదరకుండా తన పనిలో ఉంది. భీముని మాటలు తలచుకుంది. కీచకుని దీనోక్తులు విన్నది. అవి ప్రార్థనామయంగా ఉన్నాయి. అతనిపట్ల మెత్తబడినట్లు కన్పించింది. "రహస్య భంగం కాకుండా అనుభవింపుమ"న్నది. సంకేత స్థలాన్ని సమయాన్ని నిశ్చయించింది. ఒంటరిగా రావాలంది. లేకపోతే నేనక్కడ నిలవనని, "గట్టి" చేసింది. అతని పంపివేసింది.

"ఆమె మహానసశాలకు వెళ్ళింది జరిగింది భీమునికి చెప్పింది. భీముడు ప్రశంసించాడు. ఇది దుస్సాధ్యంబయిన విరుద్ధ కార్యం. దీన్ని సంఘటించావు. ధర్మజుడు మెచ్చేట్లుగా పగ సాధించడం సామాన్యమా! కాదు, "వాడు నీకు ప్రీతిగా చచ్చు"ని, "వాడు చచ్చుట తథ్యమ"ని ఆమెలో విశ్వాసాన్ని పెంచాడు. ధైర్యాన్ని నెలకొల్పాడు. ఆమె పథకాన్ని ప్రశంసించాడు. ఇక్కడో చిన్న సందేహం, అది నివృత్తి చేయబడింది. "అవనీ చక్రము సంచలింపగ దివంబల్లాడ" రౌద్రం బేర్పడ చూపుతానన్నాడు. ద్రౌపది సమయభంగమవుతుందని భయపడింది. భీముడు "ప్రకాశ రహస్య విభేద బుద్ధి" నాకా సమయంలో కలుగుతుందా? "ఓపిన భంగి నిగూఢ వృత్తి"తో "పదిలంగా "ఉపాయం"గా తెగటారుస్తానన్నాడు. ఎవరైనా తాను చేయబోయే పని గురించి చెప్పేదానికీ, ఆ సమయాన్ని బట్టి చేసేదానికి భేదముంటుంది. అదే ఇక్కడ సంభావ్యం ఏదేని పని గురించి కంటే ఆ పని చేసేప్పుడు భీముని శాంత మనస్కత, ఆలోచనా వైఖరితోపాటు ధర్మజుడనే చెలియలి కట్టచే నియమింపబడే రౌద్ర సముద్ర వ్యక్తిత్వం మన దృష్టికి వస్తాయి. ద్రౌపది నేర్పుననుసరిం0 భీముని వీరోచితమైన తీర్పు జరుగనుంది.

ఈ మధ్య కీచకుడు నిలువ లేక పోయాడు. అతని విరహం, ఉద్యాన వన విహారం సూర్యాస్తమయం తమస్సు వర్ణనం కన్పిస్తాయి. కాముకుని చిత్తవృత్తితో విరహాతురుని శృంగార లీలా విశేషాల కల్పన ఎదురవుతుంది. "కెంగేలు కేలితో

కీలించి నెయ్యంపు మాటల దగుమాటలార్తు" మొదలుగా తాను చేయబోయే చేష్టా భావనాలోలుడయ్యాడు. సూర్యుడస్తమించడేమో అనిపించింది. రోజు నిలిచి పోయినట్లైంది. శృంగారాభిలాషతో కామ భావనతో క్రీడాలోల గుణంతో కాలం గడిచింది. రాత్రి వచ్చింది. అతనికిది బహు సుందరంగా తోచింది. ముఖ్యంగా విట చిత్త వృత్తులకు సంతోషదాయకమైంది. కామాంధ ప్రవృత్తుడయిన కీచకునికి జన్మచరితార్థకమైనట్లుంది.

## II

చీకట్లు క్రమ్మాయి. భీముడు "తలచీర" "ఆయితం" చేసుకున్నాడు, సిద్ధమయ్యాడు తన రూపం ప్రకాశమానం కాకుండా సైరంధ్రి రూపం వహించాలి. ఇటువంటి సూక్ష్మాంశాల్ని కూడ తిక్కన వదలలేదు. "పెండ్లికి పిలిచినట్లు" వెడలడం శృంగార భావ సమర్పకమైంది, ఇక భీముడు అనుకున్నవిధంగా మనస్సులో పొంగే శత్రు వధోత్సాహాన్ని తలపిస్తూ, సంగరోత్సవరభసం బయటపడకుండా, ద్రౌపదీ రమణుడు "విక్రమ దురంధరత"తో నాట్యశాలకు వెళ్ళాడు. ద్రౌపదిని ఆపద నుండి కాపాడి సంతోషం కలిగించేవాడన్న భావం పై విశేషణంలో పొందుపరచబడింది. ద్రౌపది వివాహ సందర్భంలో పాండవులామెతో గడిపే సమయ నియతి ననుసరించి అజ్ఞాత వాస వత్సరంలో భీముడు ద్రౌపదీ రమణుడు ఇది తత్కాలోచిత ప్రయోగమయినప్పటికి, కథాగతమైన సూక్ష్మాంశాన్ని కూడ కలిగింది.

నాట్యశాల ప్రవేశించి నాలుగు మూలల కలయ పరికించాడు. కీచకుడేమైనా తనకు తెలీకుండా పన్నుగడ వేసాడేమో! జాగ్రత్త అవసరం. ఇతరులెవరైనా ఉన్నారేమో! అనుమానం సహజం. "ధ్వాంతాకారిత"మైన నివేశనంలోకి ప్రవేశించాడు. గోడలు నేల స్తంభాలు ఇవి ఏజ గుర్తింపరాని విధంగా తమోమయంగా ఉంది. ఈ సందర్భంలో రెండు పద్యాలున్నాయి. మొదటిది భీముని నిర్భీకత్వాన్ని నిశ్చలత్వాన్ని కోపనత్వాన్ని విక్రమధౌరంధర్యాన్ని జాగరూకతను రెండోది తమస్సును చీల్చుకొని పోయే ఉదగ్రత్వాన్ని సాహసాన్ని నిర్భయాన్ని నిశ్చయాన్ని సూచిస్తున్నాయి. భీముడు లోపలికి వెళ్ళి ఉత్తర లీలా పర్యంకంపై శయనించాడు. సైరంధ్రి దాని కనతి దూరంలో ఓసరిలి ఉంది.

ద్రౌపది నక్కడ నిలపడంలో తన కపకృతి నొనరించిన వాని మృత్యువును స్వయంగా చూడడంలో ఉండే ఆనందం ఆమేయమైంది. భీముని సమయ భంగం కాకుండా జాగ్రత్తపడడం, నిగూఢవృత్తి సడలకుండా కాపాడడం అవసరం. "సతి కేలుపట్టుకొని" ప్రవేశించడంలో ఆమెకు తన శక్తిని విలాసకరంగా చూపడం, చీకటిలో దారి తప్పకుండా ఉండడం, ఒకరి గతికి మరొకరు ఉత్సాహపోషకంగా ఉండడం, గమనించవచ్చు, మూలంలో.

**"భీమోఽథ ప్రథమం గత్వా రాత్రౌచ్ఛన్నః ఉపావిశత్**
**మృగహారీవా దృశ్యః కృద్ధస్తత్ర వినిశ్వసన్**
**కీచకశ్చాప్యలంకృత్య యథా కామమపావ్రజత్**
**తాం వేళాం నర్తనాగారం పాంచాలీ సంగమాశయా"**

ఇట సైరంధ్రి విషయం వదలి వేయబడింది. ఈ కథాంశాన్ని ప్రౌఢ వర్ణనా రమణీయంగా తిక్కన తీర్చాడు. (మహర్షి వ్యాసుని దృష్టిలో ప్రాధాన్యమున్న అంశాలకు కవిబ్రహ్మ తిక్కన దృష్టిలో లేకపోవచ్చు. ఇది రచన మొత్తం మీద పర్యాలోచన చేయవలసిన విషయం. కాబట్టి ఖండఖండాలుగా తులనాత్మక పరిశీలనం సముచితం కాదు.) కీచకుడు మదన వికారోల్లాసంతో, ఆసవ పాన మత్తుడై "సింగమున్న గుహా నికేతనానికి శీఘ్రంగా వచ్చే మాతంగం వలె" నాట్యశాలలోకి ప్రవేశించాడు. ఈ పోలిక కీచకుని మరణాన్ని ధ్వనింపజేస్తూంది. అతడు "స్వాంతము బాహు గర్వ ఘన సంతమసాంధము గాగ" శంక లేకుండా, "అహంకృతి"తో మండపాభ్యంతరం ప్రవేశించాడు. స్వాంతాన్ని బాహు గర్వమనే చీకటి క్రమ్మింది. శంక కలగలేదు. అహంకారం మునుముందు నడుపుతూంది. భీముడీశాలలోకి ప్రవేశించే ముందు నాలుగు వైపుల పరిశీలించాడు. జాగ్రత్త పడినాడు. అతనిలో వివేచనకు స్థానం లభించింది. కీచకుని వర్తనం దీనికి భిన్నంగా ఉంది. భీముడు కీచకుడు ప్రవేశించే విధం క్రమంగా శార్దూల విక్రీడితం, ఉత్పలమాల" వృత్తాలుపయోగింపబడినాయి. రెండింటిలో బిందు పూర్వకమైన 'త'కార ప్రాసం సమానం ఇరువురు సమాన బలశాలురే. మన: ప్రవృత్తులు వేరు, ఇది వృత్తాల భిన్నత్వంలో సూచితం మొదటి వృత్తంలో వర్ణితమైన వ్యక్తి ముందు రెండో వృత్తంలో వర్ణితుడైన వ్యక్తి అధ:కరింపబడడం

లక్షితం ఎట్లాగంటే స్వాంతానికి భయాన్ని కలిగించే ఆ స్థలానికి వ్యాకులమై ఉన్న భీముడు ప్రవేశించాడు. స్వాంతం బాహుగర్వమునే చీకటిలో కన్పించకుండా ఉన్న స్థితితో కీచకుడు ప్రవేశించాడు. భీముని స్వాంతం అంధం కాదు. ప్రకాశాన్ని కోల్పోలేదు. ఈ భేదం భీముని అధిక్యాన్ని విజయాన్ని నిలుపుతూంది.

కీచకుడు సెజ్జ చూచి "రయంబున" చేయి చూచాడు ఆలస్యం చేయదలచు కోలేదు. అరణ్యంలో కన్పించే మాతంగాన్ని సింహం చంపడం వేరు. మాతంగమే సింగమున్న చోటికి రావడం వేరు. సింగమున్నదని తెలీదు. కారణం అతని స్వాంత ఘన సంతమసాంధమైంది. తిక్కన సహేతుకంగా పర్యవసాన దిశను సూచించడం గమనించవచ్చు. కేవల వర్ణన వేరు, వర్ణనకు కథాంశాన్ని పాత్ర మూలతత్త్వాన్ని జోడించి అలంకార గ్రథనం చేయడం వేరు. ఇది విశిష్టమైంది. తిక్కన చరమో బహుధా కన్పిస్తుంది. కీచకుడు చేయి చాచగానే భీమునిలో కోప వేగం అతిశయించింది. కాని "అవికార నిగూఢ నిజ ప్రకారుడై" సంయమనం వహించాడు. ఇది కీచకుడు కొంత సంభాషించటాని కవకాశం కలిగింది. తన రూపాన్ని లావణ్యాన్ని విలాసాన్ని వివేకాన్ని పొగడుకోవడం మొదలు పెట్టాడు. తనచే ప్రార్థితయైంది, "తన్నేలిన జవరాలామె యొక్కతె"! యని ప్రశంసించాడు. కీచకుని శృంగార వర్తనకిది చరమరేఖ ఇక్కడి నుండి రౌద్ర రసం ఆరంభమవుతుంది. ఒక రసం నుండి మరో రసానికి మారేప్పుడు హఠాత్తుగా స్థితిని ప్రవేశ పెట్టకుండా మధ్య కొంత హాస్యరసాన్ని కల్పించడం జరిగింది. కీచకుని ప్రియోక్తులు విని భీముడు "ఇట్టివాడవు" అంటే తనను తాను పొగడకునే అల్పుడవని అర్థం. నా వంటి స్త్రీని వెదకి కూడ ఎక్కడా నీవు పొందలేవని నిగూఢమైన మాటలతో కీచకుని  ఆకర్షించడం మొదలు పెట్టాడు.

**"నా యొడలు సేర్చినప్పుడు నీ యొడ లెట్లగునొ దాని నీవెరిగెదు!**
**నన్నే యబలల తోడిదిగా జేయ దలచితివి! తప్పు చేసితి కంటే!"**

"నను ముట్టి నీవు వనితల సంగతికి పోవు వాడవె!" ఈ మాటలు ఆ వినుచున్న సైరంధ్రికి హాస్యం కలిగిస్తున్నాయి. కాని వీటిలో భీముని మనసులో దాగిన కోపం జరుగబోవు భీకర కృత్యం దాని విపరీత పరిణామం స్ఫురిస్తూనే ఉంది. ఇట్టి వాడవంటే కామం చేత అంధుడవు, 'నిన్ను నీవు పొగడుకొనేవాడవు

జరుగుతూన్నది తెలియని వాడవు అవివేకివని అర్థాంతరాలు నేను పురుషుడనని నీకు తెలియదు. నా శరీరం తగలగానే దాని సుఖ స్వరూపం తెలుసుకుంటావు. అంటే మృత్యువు పాలవుతావు నన్ను తాకిన తరువాత మరో స్త్రీని పొందలేవు, అంటే ప్రాణం నిలిచి ఉంటే కదా! పొందేది. తనువు పొందిన ఫలాన్ని అనుభవిస్తావు. అంటే కీచకుడు కోరేది శృంగారం, అతడు పొందనుంది మరణం. శృంగారం నుండి సన్నివేశం హాస్యానికి పరివర్తితమయింది. కాని నిజానికి హాస్యం వెనుక గాఢమైన భవిష్యదాపదసూచన ఉంది. భీముడు పలికిన మాటలు ద్రౌపది వినుటకు కూడ ఉద్దేశింపబడినాయి. మూలంలో –

**కీచకుడు : "అకస్మాన్మాం ప్రశంసంతి సర్వా గృహగతా**
**స్త్రియః! సువాసా దర్శనీయశ్చ నాన్యోస్తి!"**
**భీమసేనుడు : దిష్ట్యాత్వం దర్శనీయోసి దిష్ట్యాత్మానం ప్రశంససి**
**ఈదృశశ్చ త్వయా స్పర్శో దృష్టపూర్వో న కస్యచిత్!**

తెలుగులో ఈ భావాల్ని పెంచి చూపడం జరిగింది. భీముడు వెంటనే లేచి రోష కఠిన హాసం చేసాడు. కీచకుని తలపట్టి వంచాడు. కీచకుడు భీముని గంధర్వునిగా భావించాడు. అతని బుజాలు పట్టుకొని నేలపై పడవేశాడు. దేహాన్ని మోకాళ్ళతో ఆదిమాడు. భీముడు దండతాడిత భుజగం వలె లేచి కీచకుని పట్టుకున్నాడు. సమయం భంగమవుతుందని భయంతో చప్పుడు సేయని నిగూఢ ప్రహారాలకుద్యమించాడు. కీచకుడు కూడ తన కీర్తి ప్రతిష్ఠలకు భంగం గలుగుతుందనుకున్నాడు. రహస్య విమర్దన కుపక్రమించాడు. ఇరువురు వారి వారి భయ హేతువుల వల్ల ఒకే విధమైన రణ వైఖరి నవలంబించారు. మూలంలో –

**"తయోర్భుజ నిష్పేషా దుభయో ర్బలినోస్తథా**
**శబ్దస్సమభవద్ఘోరో వేణుస్ఫోట సమో యుధి**
**తతస్తద్భవనం శ్రేష్ఠం ప్రాకంపత ముహుర్ముహు:**
**బలవచ్చాపి సంకృద్ధావన్యోన్యం తావివ గర్జనమ్"** వారిరువురి భుజ నిష్పేషం వల్ల వేణుస్ఫోటసమంగా శబ్దం జనించింది. దాని కాభవనం మాటిమాటికి కంపించింది నిశ్శబ్దమైన రాత్రి ఈ మహాధ్వనికెవ్వరైనా మేల్కొంటారు. భయభ్రాంతులవుతారు. ఈ

విషయం బయట పడవచ్చు కాబట్టి ఇరువురు వారివారి భయ కారణాల్ని పురస్కరించుకొని నిగూఢ రహస్య ప్రకారాలుగా యుద్ధం చేయడ మనే ఔచితీవంతమైన హేతుయుతమైన కల్పనతో రచనసాగింది.

అనిలజుని బలం హెచ్చింది. పల్లవ ప్రసూన ఫలభరితమైన చెట్టును కూల ద్రోసే మత్త గజం వలె భీముడు వివిధ రత్నాలంకార భూషితుడైన కీచకుని నేల కూల్చాడు. అతనికి కీచకుని వికృతపు చావుపై వేడుక పుట్టింది. తల, భుజాలు, కాళ్ళు శరీరంలోకి జొనిపి నుగ్గు చేసి చక్కని ముద్ద చేసాడు. ఈ చర్యలో ద్రౌపది పరాభవం వల్ల కలిగిన కోపం పరాకాష్ఠ నందుకుంది. "దుష్టుడై" యన్నమాట దుష్టుని పట్ల దుష్ట వర్తనాన్ని ప్రకటిస్తూంది. ద్రౌపది అక్కడే సమీపంలో ఉంది. ఇదంతా చీకట్లో జరిగింది. ఆమె కాతని చావు గురించి చెప్పి "అనలము గూఢ యత్నమున" అచటికి తెచ్చి కీచకుని చూపాడు. ఆమె ఆశ్చర్యంతో భయంతో సంతోషంతో శవాన్ని చూచింది. కీచకుని మరణం పట్ల సంశయ నివృత్తికై అనలం తెచ్చి చూపడం జరిగింది. విన్న దాని కన్న చూచిన దాని వల్ల తృప్తి అధికంగా ఉంటుంది. "భీత మృగేక్షణ!" "భీము డాయజని" యని తిక్కన! కీచకుడు బ్రతికియున్నంతవరకు ఏదో ధైర్యంగా ఉంది. అతడు చనిపోవడంతో భీత అయింది. భీముని దగ్గరికి వెళ్ళింది. ఏమి జరుగుతుందో నన్న భయం సహజం! వెంటనే ధీరచిత్తయింది. ముక్కుపై వ్రేలు వేసుకొని "దీనికై కీచక! యింత సేసితి! అనుకొన్నది" స్త్రీ సమాజమైన రీతిలో పాత్ర చిత్రితమైంది అతనికి తగిన శాస్తి జరిగినందుకు తృప్తి పొందింది. శాంతి వహించింది. ఈ సందర్భంలో విలక్షణ చిత్తయై అనడానికి బదులు విదగ్ధ చిత్తయైయని పాఠాంతరం ఇది సరికాదు. తరువాత కీచకుని గూర్చి ద్రౌపది జాలిని సూచిస్తూ పలికిన పలుకు లామె విలక్షణ చిత్తయైతేనే సరిపోతాయి. విదగ్ధత్వం కన్నా విలక్షణత్వానికే ఆస్కారముంది. దీనికై అన్న మాటలో అతడు చేసిన సర్వ పూర్వ వృత్తాంతం ఇమిడి ఉంది. "సుఖిత్వం పొందుదుగాక!" అన్న మాటలో జాలి, తృప్తి "ఇట్లు గాకుడుగనే" అన్న మాటలో దుష్కర్మకు తగిన ఫలం వెంటనే అనుభవానికి రాకమానదన్న భావంతో దైవబలంపై విశ్వాసం, మనిషిగా కీచకునిపై జాలి పాత్ర చిత్రణలో చివరి మెరుపులు!

"చింతా శల్యము బాసెనే! బలోత్సేకంబు నీ కెక్కెనే శాంతిం బొందెనె రోష పావకుడు! దుశ్చారిత్రునిం జూచితే సంతోషించితె" భీముడన్న మాటల ప్రశ్నల్లో

సమాధానాలు కూడ ఇమిడి ఉన్నాయి. సమాధానాలు వాచ్యం కావు. అనుభవగమ్యాలు మాత్రమే". ఇదీ తిక్కన రచనలో పాత్ర ప్రధానమైన రచనా శిల్పం.

ఈ సందర్భంలో పద్యం దీర్ఘాక్షరాలతో లఘువాక్యాలతో యోజితమైంది. భీముని మహోత్సాహాన్ని సంతోషాన్ని తృప్తిని ప్రియ భాషణతో కూడిన ప్రేమను బింబిస్తూంది. ఈ వృత్తం శార్దూల విక్రీడితం. పూర్వం నర్తనశాల ప్రవేశించినపుడు పద్యాలు భీమ కీచకుల విషయంలో ఈ విధమైన బిందు పూర్వకమైన తకార ప్రాసంతో ఉండటం గమనార్హం. భీమ విషయకమయిన ఈ పద్యం కూడా శార్దూల విక్రీడితమే. భీమ విషయికమయిన అప్పటి పద్యం కూడ శార్దూల విక్రీడితమే. ఈదృగ్విధ వృత్త ప్రాస ప్రయోగ విధంలో తత్సన్నివేశ ప్రారంభోపసంహారాల కొక యేకత్వం సమకూర్చబడింది. తిక్కన ఛందశ్శిల్ప వేతృత్వానికి నిదర్శనంగా ఉంది. పద్య చివర 'పయోజాననా' సంబోధనం ద్రౌపది ముఖంలో బింబించే మనో వికాసాన్ని తెలుపుతుంది. "నీ యుత్తమ నాయకత్వ మెరిగి నిను కొనియాడనే నెంత దాన"నని భీమునితో కర్ణ రసాయనంగా పలికింది. పై పద్యంలో భీముని ధైర్య గౌరవ సాహస పరాక్రమాలు పేర్కోబడినాయి. ఇవి చూడ, తలపోయ మెచ్చ, సంస్తుతి యొనర్ప పాత్రమైనవి. కీచక వధ ఘట్టం విస్మయశోభితమైంది.

మరో విషయం భారతంలో ప్రధాన నాయకుడు భీముడు కాడు. అంగిరసం విస్మయంకాదు. రౌద్రం కాదు. ఇతడు మహాకథలో ఏకదేశమైన ఒక సన్నివేశంలో నాయకుడుగా కన్పిస్తాడు. ఇది ఏక దేశమైన ప్రబంధ ఘట్టానికన్వయిస్తుంది. ద్రౌపది పాత్ర తత్కాలంలో కార్యదృష్టితో పరిమితమైంది. ఆ క్రింది పద్యంలో భీముని "యుధిష్ఠిరానుజు" డనడంతో ధర్మజుని నాయకత్వాన్ని స్థాపించడం జరిగింది. "విస్మయరసం" గురించి కూడా ఈ విధమైన వ్యాఖ్యానం అవసరమవుతూంది. ఈ రసాభ్యుచిత బంధంలో కీచక నిష్ఠంగా శృంగార రసాభాసం, ద్రౌపది నిష్ఠంగా కరుణం కీచకవధ సందర్భంలో రౌద్రాద్భుతాలు, సమయభంగ దృష్టితో పరిమితమైన భీముని వీరం ధర్మజుని శాంతం సంధానితమయినాయి. కాబట్టి ఈ "ఉర్జితకథ" నానా రసాభ్యుదయోల్లాస లక్షణాన్ని పొందింది. శాంతంలో పర్యవసితమైంది. ఇది తిక్కన సృజనకళకు నిర్వహణ శిల్పానికీ ప్రాతినిధ్యం వహిస్తూంది.

# ఉద్యోగపర్వం

## రాయబారాలు

తిక్కన పదునేదు పర్వాల ప్రబంధ మండలిలో ఉద్యోగ పర్వం రెండోది. కవిబ్రహ్మ రాజనీతి లోకవృత్త వేతృత్వానికి మెరుగుటద్దం వంటిది. పాండవుల ధర్మనిరతి వ్యవహారప్రజ్ఞ శ్రీకృష్ణుని లౌకిక పారలౌకిక తత్త్వ విన్యాసం అభివ్యక్తమైన కావ్యేతిహాసం. ఉద్యోగ పర్వంలో ప్రధానాంశాలు మూడు. ఒకటి పురోహిత రాయబారం రెండోది సంజయ రాయబారం. మూడోది శ్రీకృష్ణ రాయబారం. వీటి స్వరూప స్వభావాలొక్కటి కావు. పురోహిత రాయబారం మధ్యవర్తులనదగినవారి చేత జరిపింపబడింది. దీనితో పాండవులకు నేరుగా సంబంధం లేదు. ఇది ద్రుపద పురోహితుని చేత సాగింపబడింది. రెండోది సంజయ రాయబారం. కౌరవుల ద్వారా, ధృతరాష్ట్రుడు సంజయుని పాండవుల వద్దకు పంపడంతో రూపొందింది. ఇది ఉభయ పక్ష దృష్టితో వారి సమ్మతిని పాటించలేదు. శ్రీకృష్ణ రాయబారం పాండవుల ద్వారా నెరపబడింది. ధర్మరాజు శ్రీకృష్ణుని కౌరవుల వద్దకు పంపింది, ఉభయ పక్షాల్ని దృష్టిలో ఉంచుకొని సాగింది. ఈ మూడు రాయబారాలు విఫలమయినాయి. అభిమన్యుని వివాహానికి వచ్చిన రాజన్యుల సమావేశంతో ఉద్యోగపర్వం ఆరంభమయింది.

శ్రీకృష్ణుడు రాజన్యుల సమక్షంలో దుర్యోధనుని కడకు దూతను పంపే ప్రసక్తి తెచ్చాడు. అతనికి దీని పర్యవసానం తెలియకపోదు. కాని రాజనీతి దృష్టితో అనుసరించవలసిన విధానమిది. దూత నెవరు పంపాలి? ద్రుపదుడు తన పురోహితుని పంపడానికి సిద్ధపడ్డాడు. ఈతని "చతుర వచన రచన కఱపి" దుర్యోధనుని కడకు పంపడానికి నిశ్చయమైంది. శ్రీకృష్ణునికి కౌరవులు పాండవులు ఒకటే. తమ నేర్పు కొలది ధరణి నేలడం ఇష్టం, తటస్థంగా ఉన్నాడు. అయితే ధర్మపక్షం, ధర్మ రక్షణ మతని కర్తవ్యం అందుకే చొరవ తీసుకున్నాడు.

ద్రుపదుడు "హితుడు మతిమంతుడు చతుర వచన కోవిదుడు సమయజ్ఞుడు ఉన్నత వంశవర్ధనుడు ఇంగితవేది నెచ్చెలి సుకృతి"యైన పురోహితుని పాండవార్థం

ధృతరాష్ట్రుని కడకు పంపాడు. పురోహితున కుపయుక్తమైన విశేషణాల్లో ఉత్తమ రాయబారి లక్షణాలెక్కువగా ఉన్నాయి. భీష్మాదులు, కొందరు దొరలు భృత్యులు పాండవుల పక్షాన మొగ్గ చూపుతారన్న ఆశ కూడా లేకపోలేదు. దీన్ని నిర్వహించడానికి ఇంగితజ్ఞుడు అవసరం. పైగా పురోహితునికి కేవలం హితైక దృష్టి తప్ప రాజకీయ వ్యవహారాలతో సంబంధం ఉండదు, ఉండకూడదు. అట్టి వాడే ఎన్నుకోబడినాడు.

## (1)
## పురోహిత రాయబారం

పురోహితుని రాయబారం రాయబారపరిధి కన్న అధిక ప్రయోజనాన్ని ఉద్దేశించింది. ధృతరాష్ట్రుని సభకు వెళ్ళి విషయం చెప్పి రావడం మాత్రమే కాదు. దుర్యోధనునకు సహాయభూతులుగా నున్న గురు భీష్మాదుల మనస్సులను పాండవుల వైపు తిరిగేట్లు చేయడం కూడా. ఈ ఊహతో ద్రుపదుడు, అవసరమైనచో కొన్ని దినము "లచటనిలువుమ"ని పురోహితుని పంపాడు. పురోహితుడు హస్తినకు వెళ్ళగానే సభ జరుగలేదు. శ్రీకృష్ణుని సహాయం కోరడానికి అర్జున దుర్యోధనులు ద్వారకకు వెళ్ళారు. దీన్ని బట్టి ముందుగానే కౌరవపాండవులు రణ సమాయత్తు లవుతున్నారని తెలుస్తోంది. ఈ విధంగా యుద్ధమనివార్యమన్న పరిస్థితుల్లో పురోహితుడు రాయబారం నిర్వహించాడు. కృప ద్రోణ విదుర గంగాసుతుల్ని ధృతరాష్ట్ర దుర్యోధనుల్ని వ్యక్తిగతంగా కలిసాడు. వ్యక్తిగత స్థితి వేరు, సభా స్థితి వేరు. సభ అనడంతోనే సామూహికమైన స్థితిలో సమస్యలు కొత్త రూపాల్ని ధరిస్తాయి. పురోహితుడు పేర్లు చెప్పకుండానే "వంచన మెయి మహిగొన్న తెఱగెఱుగుదురు కాదె!" యని పాండవులకు జరిగిన అన్యాయాన్ని పేర్కొన్నాడు. దీనికి పెద్దరాజు అంటే ధృతరాష్ట్రుడు "ఇయ్యకొనియె!" అంగీకరించాడు. "నే నేమనంగ నేర్తు!" యన్న కాకువు చేత ఈ రజు రాజ కుల మర్యాదను బట్టి పెద్దవాడు కావచ్చు కాని ధర్మ గతంగా కాదని సూచించాడు. ద్రౌపది యవమానం వనవాసం పేర్కొని కౌరవ పాండవుల వృత్తాంతాన్ని పరిశీలించి ధృతరాష్ట్రునికి హితవు చెప్పవలసిందిగా సేనాపతుల్ని కోరాడు. ఒకవేళ యుద్ధం జరిగితే, మంత్ర రక్షణ కళా ప్రావీణ్యుడు కృష్ణుడు పాండవుల పక్షాన ఉండగా వారికసాధ్యం లేదు. కాబట్టి "వారిని పిలిచి కొంత భూమి యిచ్చి మనుడ"ని ముగించాడు.

ఈ మాటల్లో కీలమైన పాత్ర స్వరూపాన్ని సూచించేవి శ్రీ కృష్ణునికి వేసిన విశేషణాలు. అతడు "వివిధోపాయ పరాయణుడు, రిపు వీర్యోపహార ప్రవణోద్యోగుడు, మంత్ర రక్షణ కళా ప్రావీణ్యుడు, ధైర్య వివేకాది గుణోత్తరుడు, విద్యా జాల సంవేది" యన్నవి. పాండవుల ప్రస్తావనలో వారి ఆయుధాల్ని గురించి చెప్పాడు. శ్రీ కృష్ణుని ప్రసక్తిలో విశేషాయుధమైన చక్రం పేర్కొనలేదు. దీనికి కారయం కొన్ని రోజుల ముందు దుర్యోధనునితో నే నూరక నిరాయుధ వ్యాపారత నుండి వాడ పరమాప్తుడనై" యన్న శ్రీకృష్ణుని మాటలు. అపుడు దుర్యోధనుడు సమర కోవిదులు, చాపాధ్యాయుధదారులైన నారాయణాభిధానుల్ని కోరుకున్నాడు. అర్జునుడు నిరాయుధ వ్యాపారం గల శ్రీకృష్ణుని ఎన్నుకున్నాడు. ఇది పురోహితునికి తెలుసు. దుర్యోధనాదుల మనస్సులో భయాన్ని కలిగించడానికి దీనితో సంధికి రావడానికి శ్రీకృష్ణుని గుణ గణాలు పేర్కోడం జరిగింది. భారత రణ పర్యవసానం శ్రీకృష్ణునిపై ఆధారపడిందన్న విషయాన్ని కాల స్వరూపుడైన విప్రుని ముఖత: వెలువడింది. దీనిలో పరమార్థం తెలుసుకునే చిత్త సంస్కారం కౌరవులకు లేదు. కాబట్టి వ్యర్థం కాక తప్పదు.

భవిష్యత్ ద్రష్టగా అవతరించిన పురోహితుడు చతుర వచన రీతి రాజనీతిని కూడ ప్రదర్శించాడు. ముందు వ్యక్తిగతంగా మాట్లాడి విదుర భీష్మాదుల్ని "ప్రసన్ను"ల్ని చేసుకున్నాడు. ధృతరాష్ట్రుని "అభిముఖు"ని గావించుకున్నాడు. ఆ తరువాత సభా నివేదనానికి పూనుకున్నాడు. ఈతని ప్రయత్నంతో ధృతరాష్ట్రుడు ప్రసన్నుడు కాలేదు. "అభిముఖుడ"య్యాడు. అంటే ఒప్పుకోడానికి సిద్ధంగా లేడు వినడానికి సిద్ధపడినాడన్న భావాని కవకాశ మిస్తూంది. ధృతరాష్ట్రుడు అవలంబించే కౌరవ పాండవ భేద భావం కూడ సూక్ష్మ గతిలో సూచిత మవుతూంది. అయితే భీష్ముడు "ప్రశాంతిమై మనముల నీసు దక్కి మృదు మార్గాన్ని" అనుసరించడం భాగ్యం కాదా! యని పురోహితునితో "నీ వాక్యము విప్ర స్వాభావికమై యిట్లు శ్రుతికి పురుషంబైనన్" ప్రకృత కార్య విషయంలో సభకు ఇష్టమవుతుందా? అని ప్రశ్నించాడు. "నిండు మనంబు నవ్య నవనీత సమానము పల్కు దారుణాఖండల శాస్త్ర తుల్యమన్న "నన్నయ పద్యం ఇచ్చట జ్ఞప్తికి వస్తుంది. మహాభారత రచనలో కవిత్రయ మార్గం ఒకటే నన్న విషయాన్ని నిలుపుతూంది. అయితే భీష్ముడు పురోహితుని మాటల్లో సత్యాన్ని కాదనలేదు. శ్రుతి పరుషత్వం విప్ర స్వాభావికమని సమర్థనం. అసలు విషయం పట్ల ఆలోచనకు పురికొల్పుతూంది.

సభ్యుల దృష్టిని ప్రధాన విషయం వైపు మరల్చడం కూడా భీష్ముని ఉద్దేశం కావచ్చు. వెంటనే "కవ్వడి నెఱ కిన్క కెట్టి మగ వారును నోర్తురె!" యని అర్జునుని ప్రశంసించాడు. కర్ణుడీ మాటల్లోని పారుష్యాన్ని కనిపెట్టాడు. దుర్యోధనుని బాహాటమైన వ్యతిరేక ప్రవర్తనకు కర్ణుడే కారణం. అర్జునునకు కర్ణుడు ప్రతిద్వంద్వి యన్న ఆలోచనను పరాస్తం చేయడం కూడా కన్పిస్తుంది. భీష్ముని అర్జున ప్రశంస కర్ణునికి కోప కారణమైంది. దీన్ని కప్పి పుచ్చి దుర్యోధనునకయి శకుని జూదంబు గెలిచే! దీన నేమి తప్పు!" తండ్రి పాలు మాకు తగు నంచు రాక తప్పుగాక!" యని దోషారోపణ కుపక్రమించాడు. భీష్ముడు పాండవుల్ని సమర్థించాడు. ఇది పురోహితుని దౌత్య ఫలితం భీష్ముడు ప్రసన్నుడవడం జరిగింది. ఈ వాదం నుండి పరిస్థితిని ధృతరాష్ట్రుడు భీష్ముని భక్తితో అనునయించి మరల్చాడు. రాధేయుని 'ప్రియము దోప కినిసి" వారించాడు. "ప్రియము దోప" అన్న మాటలో ధృతరాష్ట్రుడు మానసికంగా కర్ణుని పక్షం, అయితే నలుగురిలో పెద్దల సమక్షంలో ఇట్లా చేయకూడదని మాత్రమే. భీష్ముడందరిలో పెద్దవాడు. తానే ఏమియు అనలేదు. ఇక కర్ణుడెంత? కర్ణుని కోపగించడంలో ధృతరాష్ట్రుడు సమయోచితమైన నీతిని ప్రదర్శించాడు. "ద్రుపద పురోహితుని"తో మాట్లాడాడు. ఇక్కడ ధృతరాష్ట్రుడు మాట్లాడింది పాండవుల రాయబారితో కాదు ద్రుపదుని పురోహితునితో నన్న మాట పరిశీలనార్హం. ఈ విషయం తను బంధువుల్ని మంత్రి గణాన్ని పెద్దలను విచారించి ప్రజలకు ప్రీతి చేకూర్చే విధంగా "సౌమ్యు" నొకని పంపి పరిష్కార మార్గం చూపుతాన"న్నాడు. ఈ పురోహితుడు సౌమ్యుడు కాదా? యని ప్రశ్న. ఇతడు మాటల్లో అవలంబించిన 'పారుష్యం" తీరునెత్తి చూపుతూంది. ఇది సంధికి అవఘాతాన్ని కలిగిస్తూందన్న సూచన ఉంది. పురోహితుడు తిరిగి వెళ్ళి ద్రుపదునికి "తన పోయి వచ్చిన కార్యంబు తెరగు" వివరించాడు. దీని పర్యవసానం పాండవులకు తెలుసు. ఇది తెలిసి కూడ ప్రయత్నించడం, శాంతిని కోరడం సత్పురుషుల ధర్మం. ఉత్తమ వీరుల కర్తవ్యం. రాజనీతి విధం.

## (2)
## సంజయ రాయబారం

ధృతరాష్ట్రుడు పురోహితునితో చెప్పిన విధంగా సౌమ్యుని పంపాడు. ఆ సౌమ్యుడే సంజయుడు. ఒక పక్షం నుండి వచ్చిన వ్యక్తి తానుగా నిర్ణయం చేయడానికి

స్వతంత్రించి అవసరాన్ని బట్టి ప్రయత్నం నెరపేందుకవకాశం లేనివాడు. అక్కడి యజమాని మాటను ఇక్కడ చెప్పటమే అతని కర్తవ్యం. దాన్ని సౌమ్యంగా నేర్పుగా ప్రకటించాలి. సంజయ రాయబారంలోని పరిమితులివి. సంజయ పాత్ర స్వరూపమిది. సందేశం ఎదురు పక్షం వారి కంగీకారం కానపుడు ఓర్పునేర్పు, మృదుభాషణం వినయ వర్తనం అవసరమవుతాయి. దీనికి విదురుడో విదురు నంత వాడో కావాలి. సంజయుడటువంటివాడు. ధర్మజుని మాటల్లో "నీ వొండె విదురు డొండెను, కావలయుం గాక యిట్టి కార్యంబులకున్" అన్న వాక్యం, పై అభిప్రాయాన్ని ధ్రువపరుస్తోంది. ఉపప్లావ్యంలో ఉన్న పాండుసుతుల్ని వాసుదేవ సహితంగా చూడమన్నాడు. వారున్న స్థితిని బట్టి శాంతికరమైన మాటలతో, "ఒక్కటియై మనుట"ను గురించి కార్యం నిర్వహించవలసిందిగా కోరాడు. ధృతరాష్ట్రుని హృదయం, కోరింది. ఒకటి పాండుపుత్రులు కష్టాల్ని దాటినందుకు సంతోషం; రెండు వారికింపు పుట్టగ మాట్లాడడం, మూడు శాంతి ప్రకారం రాజ కార్యం నడవడం. సంజయుని కార్యాచరణకివి గీటు రాళ్ళయినాయి.

సంజయునితో, ధృతరాష్ట్రుడు తాను ప్రత్యేకంగా పంపిన విధం ధర్మజునికి చెప్పమన్నాడు. దుర్యోధనుడు "కార్యాకార్యజ్ఞుడు" కాకపోవడం వల్ల "కలక" కలిగింది. పాండవులు ధృఢ ధైర్యులు, రణ ధుర్యులు, కౌరవ పాండవులు పాలు నీరు వలె కలిసి యుండాలి. కృష్ణుడు సారథిగా అర్జునుడు, గదాధారియై భీముడు కవలలు ద్రుపదాదులు సామాన్యులు కారు తగవు నడుప ధర్మజుడు కలడు. ఈ మాటలు తిక్కన రచనలో ప్రశ్నల రూపంలో సమాధాన సూచకాలుగా ఉన్నాయి. ఈ మాటలు చుట్టూ ఉన్న వారి వైపు తిరిగి అన్నాడు. సంజయుని వైపు ముఖమై "నీవు ధర్మజు పాలికి నరుగు మ"ని చెప్పాడు. ధృతరాష్ట్రుడు ప్రస్తుతం చేయదలచుకుంది. పాండవుల్ని యుద్ధ విముఖుల్ని గావించడం, రాయబారికీ ఉద్దేశం తెలుసు! ఒక వేళ యుద్ధం జరిగితే దుర్యోధనుని విజయం పట్ల ధృతరాష్ట్రునికి అనుమానమే ఉంది.

సంజయుడు మొదట శ్రీకృష్ణుని కడకు వెళ్ళాడు. అప్పుడక్కడ అర్జునుడు ద్రౌపది సత్యభామ ఉన్నారు. వారు యుద్ధం వల్ల కౌరవ నాశనం తప్పదని తేల్చి చెప్పారు. వాసుదేవుని తన కభిముఖుని చేసుకోవాలని వెళ్ళాడు. ఆ పైన ధర్మజుని

ఒప్పించవచ్చు ననుకున్నారు. మొదటనే అఘాతం తగిలింది. సంజయుడు రాజనీతి వేత్త, వాక్చతురుడు, ధర్మజుడితని గూర్చి, "నయోన్నత చరితా!" యని సంబోధించడం గమనార్హం. ఇతని మాటల్లో మార్దవం, వినయం, నిబిడమై ఉంటాయి. దూతకివి అవసరం. దీనికి తోడు చేతలో నేర్పు కలవాడు.

ధర్మజుని కొలువులోకి సంజయుడు ప్రవేశించాడు. ధర్మజు డాదరంతో తన ప్రక్కన కూర్చోబెట్టుకున్నాడు. సంజయుడు ధృతరాష్ట్రుని "నితాంత స్నేహ పూర్వ చేతో వృత్తి"ని తెలియజేసాడు. ఆరంభంలోనే ప్రశాంత వాతావరణం నెలకొంది. ఒకరి సామర్థ్యాలు మరొకరికి సద్భావనాపూర్వకంగా చెప్పడం వల్ల ఉపశమన స్థితి చేకూరుతుంది. క్రితం రాత్రి శ్రీకృష్ణ మందిరంలో జరిగింది మనసులో వుంది. ధృతరాష్ట్రుని ఆంతర్యమతనికి తెలుసు. "ఆ రాజు కారుణ్య కతమున సుఖంబున నిట్లున్నారమ"న్నాడు. ఈ మాట మర్యాదా పూర్వకంగా కన్పించినా తాము పడిన కష్టాల్ని ధృతరాష్ట్రుని మనోరూపాన్ని సూచిస్తూంది. భీష్ముడు చెప్పిన ధర్మాన్ని కౌరవులు వినలేదు. ఘోషయాత్రలో జరిగిన కథను జ్ఞాపకం చేసాడు. పరాక్రమవంతులయ్యీ ధర్మ బద్ధులైన వారి వ్యక్తిత్వాన్ని స్ఫురింపజేసాడు. దుర్యోధనుని వద్ద కార్యానికీ ఖడ్గానికీ కారణమైన కర్ణుని గురించి అడిగాడు. ధర్మజుని మనస్సులో దాగిన కోపం చివురువేసినట్లుంది. సంజయుని సమాధాన మెంతో వ్యవహారోచితంగా ఉంది. "ప్రభువు వద్ద నీతి మంతులు నీతి రహితులు సాత్త్వికులు దురహంకారులు వివిధ ప్రకారులుంటారు" దీన్ని పట్టించుకోవనవసరం లేదని అభిప్రాయం. తాను ఏ ఉద్దేశంతో ఇక్కడికి వచ్చాడో దానికి భిన్నంగా సాగే సంభాషణను మృదువుగా వారించాడు. తన కార్యసాధన కిపుడు ధర్మజుని ప్రసన్నత అవసరం. "నీవు విమల హృదయంతో" కోరే పొందు వల్ల వారికి (కౌరవులకు) క్షేమం కలుగుతుందని బాధ్యతను ధర్మజునిపై నిలిపాడు.

ధృతరాష్ట్రుడు "వృద్ధుడగుట వల్ల చిత్త మొక విధంగా లేదు. సుతోద్ధతిని మాన్పలేకపోయాడు. ఇపుడు శాంతి" మనస్కుడయినాడని యాతని నిర్దోషిత్వాన్ని ప్రకాశమానం చేయడం జరిగింది. ధర్మజుని అజాత శత్రుత్వం నిఖిల లోక విశ్రు

తం. ధర్మ ప్రవీణ హృదయుడైన యుధిష్ఠిరుని పుణ్య చిత్తవృత్తి వల్ల ఇటువంటివి చెల్లుతున్నాయన్నాడు. కౌరవులొనర్చిన దుష్కృత్యాలు క్షమార్హాలు కావు. రాజకీయ జీవితంలో వీటికి బదులు చెప్పడం జరుగుతుంది. ఒక దుష్టుడు చెడ్డ పని చేస్తే లోకం అది వాని స్వభావమని తలుస్తుంది, నిందిస్తుంది. కాని ఒక ధర్మమూర్తి ఆ పని చేస్తే లోకం ఆశ్చర్యపోతుంది బాధపడుతుంది. దుర్వార బలులయి కూడ పాండుకుమారులు శాంతాత్ములన్న యశస్సు సామాన్యమైంది కాదన్నాడు. ఏదో కోపంతో బలముంది గదా! యని దుష్కృత్యాలు చేయరు. ప్రజల కభిమాన పాత్రమైన వారు కావడంతో వారు చేసే పనిపై లోకం కన్నువేసి ఉంటుంది. సంజయుని మాటలు వైయుక్తిక రాజకీయ ప్రజా దృష్టి తలాల్ని స్పృశిస్తూ సాగాయి. ఇవి అతని రాయబార సందేశానికి భూమికగా ఉన్నాయి. ధర్మజుని మూల భూతమైన మనో గుణాన్ని ధర్మ ప్రవృత్తిని ప్రజాహితాన్ని కదిలించి నేర్పుతో కార్యసాధనకు పక్రమించడం జరిగింది. ధర్మజుని కీవిషయం తెలుసు. "అందరు వింటారు, చెప్పుమ"న్నాడు. సందర్భంలో ధర్మజుని "గరువంపు పలుకుల"కు మనస్సులో కాస్త నొచ్చుకున్నాడు. "వారందరు విన" చెబుతానన్నాడు. కృష్ణుని సద్భక్తి వీక్షించాడు. ధర్మజునికి కేలు మోడ్చాడు. దూత కృత్యాన్ని నిర్వర్తింపబూనాడు.

ధృతరాష్ట్రుని కార్య శాంతతను పేర్కొన్నాడు మీరు సర్వధర్మాలకు ప్రోవని పాండవుల్ని కీర్తించాడు.

**"మడుగు చీర యందు మసి దాకినట్లు మీ సత్కులమున కల్మషంబు కౌర**
**వేంద్రు కతన బొందె! నింతయు బాపంగ నీవ నేర్తు, ధర్మ నిపుణ హృదయ"**

మళ్ళీ ధర్మానికే ప్రాధాన్యమిచ్చాడు. "ధర్మనిపుణ హృదయ" అను దానికి "కార్యనిపుణ హృదయ" అని పాఠాంతరం. ఇది సరియైంది కాదు. ఈ పనికి ధర్మజుడనుకూల మతి కావాలంటే ధర్మం పట్ల నిపుణమైఎన హృదయం కలవాడే అవాలి. కార్యనిపుణత్వం కన్నా ధర్మ నిపుణత్వం పై స్థాయికి చెందింది. ధర్మజుని ఉదాత్త శీలానికి సరిగా సరిపోయేది. శుభ్రమైన వస్త్రానికి మసి తాకినట్లు, సత్కులానికి

కౌరవేంద్రుని వల్ల కల్మషం అంటింది. ఒకరి కారణంగా సద్వంశం కళంకితం కాకూడదు. వంశ ప్రసక్తితో ధర్మరాజు ఎద మెత్తబడింది. వంశ మర్యాదకై శాంత ప్రవృత్తి నవలంబించడం సముచిత మనిపించవచ్చు. దుర్యోధనని గర్హించడంతో పాటు ధర్మజుని శాంత పరచడమూ జరిగింది. ఉత్తములు సంక్షయ కారణమైన యుద్ధాన్ని కోరరు, "దయాపయోనిధీ"అని సంబోధించాడు బంధువులు గురువులు ప్రజల క్షేమం ముఖ్యమన్న బోధ సంజయుని ప్రయత్నానికి విజయ ద్వారాన్ని చూపుతూంది. "పెట్టని కోట నీకు హరి" యని ఎవరెవరు సుయోధనునికి సహాయపడేదీ, వివరిస్తూ ఇరుపక్షాల జయింప శక్యం కానివే. అని తాటస్థ్యాన్ని రాయబారి సహజ లక్షణమైన సమభావాన్ని ప్రదర్శించాడు. "నీవు యుద్ధమునకొల్లవ"ని శాంతి ప్రియత్వాన్ని ఎత్తి చూపాడు. సంజయుడు శాంతిని కోరే మధ్యస్థుడుగా వ్యవహరించాడు. సంజయుడు కోరేది ఇరుపక్షాల సమైక్యం. అయితే రెండు ప్రశ్నలు, ఒకటి ధర్మజుని యుద్ధ విముఖుని చేసి యథాస్థితిని కొనసాగించడమా? పాండవులకు రాజ్యభాగ మిప్పించడమా? అన్నవి తలెత్తుతాయి. క్రోధ శాంతికై వేడడంతో సరిపోదు దాన్ని అనుసరించి కార్యాన్ని చక్కదిద్దడమనవసరం. ధర్మరాజు "పోరు లేకుండా లభించే అర్థ సిద్ధి" నెవడు వదలుకుంటాడన్నాడు. "మాకు కుడుము, నీకు తునక యన్నచో సఖ్యం కలుగుతుందా?" అని ప్రశ్నించాడు. ధృతరాష్ట్రుడు దుర్యోధనుని పట్ల పుత్ర మోహ వశుడవుతాడని తాత్పర్యం. ఏమైనా సంజయుని పక్షపాత వృత్తి మాని సమైక్య కార్యరూపానికి సన్నద్ధం కావలసిందిగా కోరాడు. సంజయుని పక్షపాతం, పాండవుల్ని పొగిడి, కౌరవుల్ని గెలవడం కష్టమని, పొత్తు మాట చెప్పడంలో కన్పిస్తుంది. ధృతరాష్ట్రుడు పిలిచి తమకు ఇంద్రప్రస్థం లేదా వేరొక పట్టణ మివ్వడం ఉచితం కాదా? యని ధర్మజుడు ప్రశ్నించాడు. ధృతరాష్ట్రుడు దుర్యోధనుని సమాధాన పరచలేడని ధర్మజునకు విదితమే. పాండవుల్ని సహనంతో శాంతితో సఖ్యతతో వర్తించవలసిందిగా చెప్పడమే అతడు చేయగలిగింది. సంజయుడు దీనికి మరో విధంగా సమాధానం చెప్పాడు. ధర్మజుని విభశం అహింసాత్మకమైంది. అనింద్యమయింది. యుద్ధం హింసాత్మకమైంది నింద్యమైంది. ఈ సందర్భంలో యుద్ధ వ్యతిరేకతను ప్రధానం చేసి, రాజ్యభాగాన్ని అప్రధానం చేయడం విశేషం. ధర్మజుని లౌకికేతర మైన స్వచ్ఛమైన వ్యక్తిత్వంపై

వెలుగు ప్రసరించడం జరిగింది. యుద్ధం వల్ల కలిగే రాజ్య విభవం పాండవుల సత్‌చరిత్రకు భిన్నమైంది. కష్టనష్టాలకు గురి అయినా దీన్ని కాపాడు కోవడ మవసరమన్న భావం సంజయుని మాటల్లో పునరుక్తమయింది. దీన్ని ధర్మజుడు పక్షపాత వైఖరిగా గుర్తించాడు. దీన్ని విడువ వలసిందిగా కోరాడు.

సంజయు డింతటితో ఆగలేదు, అల్పుడు హాలాహలం మ్రింగలేదు. నీల గళు ని తరువాత నిన్నే చెప్పాలి. అంటే నీవుపడే కష్టాలు నీకే సాధ్యం. లోక క్షేమం కొరకు వీటిని సహించవలసిన అవసరం మరీ మరీ చెప్పబడింది. సంజయుని మాటల్లోని సారాంశాన్ని గ్రహించిన ధర్మజుడు, "కొన్ని మొదట అధర్మంగా కన్పించి చివరకు ధర్మంమవుతాయి. కొన్ని మొదట ధర్మంగా కన్పించి చివరకు అధర్మ మవుతాయి" యని సంజయుని వాదాన్ని పరాస్తం చేసాడు. ధర్మ నిర్ణయం తేలికైన పని కాదని భావం కర్తవ్యాన్ని శాసింప వాసుదేవుడు కలడు, మనకీ వితర్కం బేటి" కని అంతా శ్రీకృష్ణునికి వదలి వేయడం సంజయుని నిరుత్తరుని చేసింది. దౌత్యానికి కొత్తమలుపు నిచ్చింది. శ్రీకృష్ణునికి కీలకమైన ప్రాధాన్యాన్ని కలిగించింది.

## III

శ్రీకృష్ణుడు రాత్రి సంజయునితో చెప్పిందే ఇప్పుడు సభలో వివరించడం జరిగింది. పాండవులతో తన సంబంధం, పుత్ర పౌత్రవంతుడగు ధృతరాష్ట్రునికి నష్టం వాటిల్ల రాదన్న తన అభిమతం, ప్రకటితమైంది సంజయుడు వదలిన రాజ్యభాగం గురించి నిశ్చయం, యుద్ధం వస్తే పాండవుల పైచేయి, సంజయుని శాంతి భంగి ప్రశంస స్పష్టంగా చేయబడింది ఈ విధంగా శ్రీకృష్ణుని రాజనీతిని, ప్రసంగ చాతుర్యాన్ని ప్రకటింపజేస్తుంది, పాండవులకు రాజ్యభాగాన్ని ఇప్పించడం వదలి శాంతిసఖ్యత గురించి పదేపదే ప్రసంగించడం సమంజసం కాదని ధ్వనితం. రాజ్య భాగం నిరాకరింపబడిన వారు రణ మనస్కులైతే ద్రోహమా? అని ప్రశ్నించాడు. అవమానంతో పౌరుష హీనులై మనుట కంటె, ఉజ్జ్వలుడై మార్కొనడం లెస్స"యని ప్రకటించాడు. అదియే "శుభం ఇది నా అభిమతమ"ని తేల్చి చెప్పాడు. ఈ ధర్మాలు దుర్యోధనాదులకు చెప్పవలసిందిగా కోరాడు. ఒక విధంగా ధర్మజుడు ప్రకటించలేని అభిప్రాయాన్ని

శ్రీకృష్ణుడు స్పష్టం చేయడం దౌత్యానికొక లక్ష్యాన్ని సూచించినట్లైంది. సంజయుడు కాదన లేదు, అవునన లేదు. ఇరు పక్షాల్ని విశ్లేషిస్తూ శ్రీకృష్ణుడు వర్ణించిన విధం విశ్లేషణారూపమైంది. ఇందులో రోష మహాతరువు సుయోధనుడు. మూల శక్తి ధృతరాష్ట్రుడు; అయితే ధర్మ తరుపు ధర్మజుడు, మూలచయం, తాను శ్రీకృష్ణుడు భూసురులు వేదాలన్న మహా విషయం అసాధారణమైంది. ఇది మొత్తం మహాభారత కథాగమనానికి ప్రాతిపదిక. ఇంకా మానవ స్వభావ భేద నిరూపకమైంది. సంజయుని పట్ల మర్యాదతో, "ఏ నీ పనికై వచ్చెద"నని బాధ్యతను స్వీకరించడంతో సంధిదశలో శాంతి స్థాపన లక్ష్యంలో కొత్త రూప మేర్పడింది. ఇది శ్రీకృష్ణుని ప్రౌఢ రాజనీతికి తార్కాణం. తన మాటల్లో "తగని యట్టివి" లేవు గదా? యని సంజయుని ప్రశ్నకు సమాధానంగా "ధర్మజుడు నీవు విదురుడిరువురే ఈ కార్యాని కర్హులు. "ఈ వినయము నేర్పు కలదె యితరులకెందున" అని ప్రశంసియిుడు. సంజయుడు "నీ యానతిచ్చిన మార్గం బంతయు నడిపెద"నన్నాడు. శ్రీకృష్ణుని నిర్ణయాత్మకమైన ప్రతిపాదనతో సంజయునిలో రాజనీతి లక్ష్యం స్పష్టతను పొందింది. ఇక ధర్మ ప్రసంగం మాని పాండవుల రాజ్య విషయమై కర్మాచరణానికి సిద్ధమైనాడు. ఇదో ముఖ్యమైన మార్పు, రాజనీతి దృష్ట్యా గణనీయమైంది. తిరుగు ముఖం పట్టిన దూతతో అర్జునుడు, "అజాత శత్రుని కృపా మౌగ్ధ్యంబు చాలంగ వారలకేలా నయవిక్రమోచిత, విచారక్లేశముల్" అన్నాడు. ధర్మజునిలో శాంత ప్రవృత్తియే దుర్యోధనాదుల్ని పరిష్కారమార్గాన్ని గురించి ఆలోచింపజేయనీయడం లేదు. ధర్మజునిలో కృపామౌగ్ధ్యం లేకపోతే, భీముడెప్పుడో సంహరించి ఉండేవాడన్న ఆత్మ ప్రత్యయం శ్రీకృష్ణుని యభిప్రాయాని కనుగుణంగా ప్రకటితమైంది. ధర్మజుని "కృపామౌగ్ధ్యం వల్లనే" ఇంత వరకు కౌరవ పాండవుల మధ్య నిర్యుద్ధమైన స్థితి కొనసాగుతూంది. ఇది గొప్ప మాట. పాత్ర స్వరూపాన్ని ప్రకాశింప చేస్తూంది.

సంజయుడు హస్తినకు వచ్చాడు. ధృతరాష్ట్రునితో పాండవుల క్షేమం ముందు చెప్పాడు. ధర్మజుని ప్రశంసించాడు. పాండవుల్ని బాధించడం ఆలుబిడ్డలు లేనివాడు చేయవలసిన పని యని, ప్రజల్లో గల కౌరవుల పట్ల వైముఖ్యాన్ని సూచించి దీన్ని సరిచేసే అవసరాన్ని వివరించాడు.

**"అనయము పుట్టె జూదమున యప్పుడ యంతయు చిచ్చు వెట్టి కా**

**ర్చినయది నీ యుపేక్షయ, వశీకృతచిత్తుడు ధర్మసూతి మె**

**త్తని పులి"** యని అందరు నీదె ఆధర్మ మనేంత వరకు మాట్లాడడు. ఆ తరువాత ఎవరికిని మరల్చడానికి శక్యం కాదు. ధృతరాష్ట్రుడు పెద్దరాజు. కాని కార్య నిర్ణేత దుర్యోధనుడు కావడంతో సమస్య జటిలమవుతూంది. పాండవుల పట్ల ధృతరాష్ట్రుని ఉపేక్ష దుర్యోధనుని పట్ల ఆపేక్ష ఎదుటి వారి బలాన్ని ఎరగకుండా చేసింది. రాయబార పర్యవసానం ఈ మాటల్లో స్పష్టమవుతూంది. ధర్మజుడు స్వవశీకృతచిత్తుడు ధృతరాష్ట్రుడు పుత్రవశీకృత చిత్తుడు. ఇతనికి జరుగుతూంది జరుగబోయేది ఆలోచన చేసే అభిలాష లేదు. ఆలోచన చేయగల శక్తి లేని వాడు కాదు. ధర్మజుడవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు. అతడు పైకి మెత్తగా కన్పించే పులి యని సంజయుని అభిప్రాయం. అతని శాంత రూపం వెనుక వీర భావం నిహితమై ఉందన్న సూచన ఉంది. ఇది పులి కృత్యం వలె అపాయకరమైంది కూడా ధర్మజుని ఎంతో నిశితంగా సూక్ష్మంగా పరిశీలించి అర్తం చేసుకున్న సంజయుని మాటల్లో ధర్మజ నాయక పాత్రలో నిక్షిప్తమైన విశేషగుణం పరిశీలనకందుతూంది. ఇది ధృతరాష్ట్రునితో జరిగిన ఏకాంత సంభాషణం. ఇందులో ఆత్మీయత ఉంది, హిత బోధ ఉంది. అన్నింటిని మించి ప్రస్తుత మవసరమైన ఇరుపక్షాల బల నిరూపణంతో తక్షణ కర్తవ్యం ప్రకటితమైనాయి.

ఇక తెల్లవారిన తరువాత సభలో సమస్తం వివరించాడు. చివరకు శ్రీకృష్ణుని మాటలుగా "అయ్యజాతశత్రు డలుగుట నీళ్లుల అగ్ని పుట్టుట"యే యని పరిస్థితి చేయిదాటి పోకుండా నియమించవలసిన అవసరాన్ని వక్కాణించాడు. సామాన్యంగా నీటితో అగ్నినార్పడం జరుగుతుంది. కాని ఇక్కడ నీళ్ళలో అగ్ని పుట్టడం జరుగుతూంది. ఆ విశేష స్థితి రాకూడదు. వస్తే యుద్ధ తప్పదు. దుర్యోధనుడు సంధిని నిరాకరించడం భీమార్జునులకు ప్రియమైంది. ఇపుడు ధృతరాష్ట్రుడు స్వశక్తుడు కావలసిన అవసరం కలిగింది.

ఇది జరగని పనియని అందరికి తమ మనస్సుల్లో తెలుసు. సంజయ రాయబారం యథాస్థితిని కొనసాగించింది. నీళ్లలో అగ్ని జనించే అసాధారణ పరిస్థితుల్ని వారించవలసిన అవసరాన్ని భావింపజేసింది. ఈ భాగం రాజనీతి కేంద్రంగా మానవ మూల మనస్తత్వంతో పరిస్థితుల్నిబట్టి స్వతంత్ర రూపంగా, కదలే జీవిత గమనాన్ని దాని ప్రభావాన్ని ఆవిష్కరిస్తూంది. చివరకు ధర్మాధర్మ సంఘర్షణగా సూచితమైంది. తిక్కన పాత్ర చిత్రణతో నిర్వహించే కథా నిర్మాణ కళను భావింపజేస్తూంది. ప్రధానంగా రాజనీతి ధోరణుల్ని బింబిస్తూంది. సన్నివేశ నిర్మితిలో రూపుకడుతూంది.

## (3)
## శ్రీకృష్ణ రాయబారం

**"ఆపద గడవం బెట్టగ నోపి శుభంబైన దాని నొడగూర్పగ మా**
**కీ పుట్టువునకు పాండు క్ష్మాపాలుడు నిన్ను చూపి చనియె మహాత్మా"**

ధర్మజుడు తమ్ములతో మాధవు మందిరానికి వెళ్ళి అందరి సమక్షంలో అన్న మాటలివి. ఇపుడు పాండవులకు పెద్దదిక్కు శ్రీకృష్ణుడయినాడు, ధృతరాష్ట్రుడు కాదు. ఇది శ్రీకృష్ణ రాయబారానికి ఆరంభ భూమిక. శ్రీకృష్ణ రాయబారం మహాభారతంలో ప్రధానమైంది. ఒక పక్షం నుండి కార్య సాధనకై ప్రవేశించిన వ్యక్తి, ఆ పక్షానికి మూలశక్తిగా క్రియాత్మకంగా పరిణమించడం విశేషం. ఇంతకు ముందు జరిపిన రాయబారులు స్వతంత్రులు కారు. వార్తనందించుటయే వారి పని. కార్య నిర్ణయంతో ప్రమేయం లేదు. ఈ రాయబారం అటువంటిది కాదు. శ్రీకృష్ణుడు ధర్మజుపై కూడ తన మాటను చెల్లించగల శక్తి సంపన్నుడు. స్వతంత్రుడు. ఈ ఘట్టంలో శ్రీకృష్ణుని రాజనీతి వేతృత్వం ప్రధానంగా దృష్టికి వస్తుంది. ఆతని దివ్యత్వం కూడా స్థాపితమైంది. ఈ రెండు లక్షణాలు వేరు. ఒకటి లౌకికమైంది, మరొకటి లోకాతీతమైంది. మానవ జీవితంలో ఈ రెండింటి అవసరాన్ని భావింపజేస్తూంది. ఈ సమావేశంలో హితైక దృష్టితో పాండవులను పెంచి పెద్ద చేసింది ధృతరాష్ట్రుడు. కాని అతడు వారికి శుభం కలిగించక పోగా ఆపదలకు నిలయమవుతున్నాడు. శ్రీకృష్ణుడేమి చేయాలో ధర్మజుడు చెప్పలేదు.

అవతలి వ్యక్తిచేత అడిగించుకొని చెప్పటం రాజమర్యాద. ఇది శ్రీకృష్ణునికి తెలుసు. "నీ పంచిన యట్ల చేయంగలవాడు, ఎయ్యది తలంపు సెప్పు"మనినాడు. ఇక్కడ శ్రీకృష్ణుని గడుసుదనముంది. ఇంతవరకు తానేమి మాట్లాడినా ధర్మజునిదే చివరిమాటయన్న సూచన శ్రీకృష్ణుని పలుకుల్లో కన్పిస్తుంది. ఇపుడు ధర్మజు డొక్కడే కాదు తమ్ములు ఇష్ట భృత్యవరులు, దొరలు మొదలైన వారున్నారు. వారి ముందు శ్రీకృష్ణుని నీతి ధర్మజుని నాయకత్వాన్ని స్థాపిస్తుంది. ధర్మజుడు తన యుద్ధ వైముఖ్యాన్ని శాంతి ప్రియత్వాన్ని ప్రకటించాడు. సమాజాని కవసరమైంది కూడా ఇదే.

**"పగ యడగించు టెంతయు శుభం బది లెస్స, యడంగునే పగం**
**బగ, పగగొన్న మార్కొనక పల్కక యుండగ వచ్చునే ? కడుం**
**దెగ మొదలెత్తి పోవ పగ దీర్పగ వచ్చిన క్రౌర్యమొందు నే**
**మిగతి తలంచినన్, పగకు మేలిమి లేదు ధ్రువంబు కేశవా"**

ఈ పద్యం ధర్మజుని రాజనీతిలో మకుటాయమానమైంది. ఈ స్థితిలో శాంతి పొందుట కర్జమ"ని స్పష్టం చేశాడు. శత్రుత్వాన్ని నశింపజేయడం శుభమైంది, ఉత్తమమైంది. శత్రుత్వంతో శత్రుత్వాన్ని నశింపజేయడం కుదరదు. శత్రుత్వం కలిగినపుడు తలపడకుండా మారు మాట్లాడకుండా ఉండడం కుదరదు. ఇట్లా పగ గురించి చెబుతూ ఎట్లా ఆలోచించినా శత్రుత్వానికి శ్రేయోగతి రూపం లేదు. ఈ నిశ్చయంతో ప్రస్తుతం శాంతియే కర్తవ్యమన్న ఉద్దేశాన్ని ప్రకటించడం జరిగింది. సుయోధనాదులు దుష్టులు కాబట్టి వారి వద్దకు నిన్ను రాయబారిగా "పంపలేన"న్నాడు. నీకు కష్టం కలిగించే "దేవ పదవి కూడ అక్కరలేద"ని ముగించాడు. శ్రీకృష్ణుని పట్ల గౌరవం భక్తి వెల్లడి అవుతుంది. అనుమానంలో భవిష్యత్కథా సూచన ఉంది. తననెదిరింపగలవాడు లేడని శ్రీకృష్ణుడు చెప్పగానే ధర్మజుడు "నీకన్నీ తెలుసు! నేను చెప్పగలవాడిని కాను, పొమ్ము" అన్నాడు. భీముడు కోపతీవ్రత కలవాడు, అయినా ఆ సమయంలో ధర్మజునే అనుసరించాడు. శ్రీకృష్ణునితో "ధార్తరాష్ట్రుడు శమించు కార్యం నడప"మన్నాడు. అర్జునుడు ఏదెట్లయినను నీవు ప్రయత్నింపుమ"న్నాడు. నకుల సహదేవులు తమ పద్ధతిలో శ్రీకృష్ణునిపై విశ్వాసాన్ని ప్రకటించారు. ఇంకా సాత్యకి రథిక ప్రవరులు తమతమ అభిప్రాయాల్ని తెలియజేసారు. ఇట్లా సభాగతంగా ఒక విషయాన్ని గూర్చి చర్చించి బయలుదేరడంలో శ్రీకృష్ణుని

రాజనీతి ఉంది. తానుపక్రమించే పనిలో అందరినీ భాగస్వాముల్ని చేయడం, బాధ్యతను గుర్తింపజేయడం గమనించవచ్చు. మధ్యలో భీముని రెచ్చగొట్టి శాంతింపజేయడమూ జరిగింది. రాయబారానికి పూర్వమే మానసికంగా అందరిలో ఉత్సాహ వాతావరణాన్ని సృజించాడు. అర్జునునికీ రాయబారం విఫలమవుతుందనే నిశ్చయ భావముంది. "కాదనుకున్న దానికీ ప్రయత్నించడం పురుషపద్ధతి, దైవం దానికనుకూలింపవలసి ఉంటుంద"న్నాడు. ఒకవేళ యుద్ధం జరిగితే ప్రధానపాత్ర వహించేది భీమార్జునులు. భీముని ప్రతిజ్ఞలు రెండున్నాయి. భీముడు తీవ్ర ప్రకృతి కలవాడు. ధర్మజుని ఆజ్ఞాబద్ధుడు. అర్జునుడు స్తిమిత ప్రకృతి కలవాడు. వివేకంతో ప్రవర్తించేవాడు. ధర్మజుని ధర్మాన్ని అనుసరించేవాడు. నకులుని మాటల్లో మృదుత్వం గోచరిస్తుంది. సహదేవుని మాటల్లో తీవ్రత భాసిస్తుంది. సహదేవుని ఈ ప్రవృత్తి రాజసూయాధ్వర సందర్భంలో "ఎడపక నర్ఘ్యమచ్యుతునకిచ్చితియ"న్నచోట కన్పిస్తుంది. నన్నయ అనుసరించిన పాత్ర చిత్రణాన్నే తిక్కన మౌలికంగా కొనసాగించాడు. భిన్నవైఖరుల మధ్య సభాసదుల ఆమోదముద్రతో శ్రీకృష్ణుడు రాయబారాని కుపక్రమించాడు.

సభలో పాల్గొనవలసిన మరో ప్రధానవ్యక్తి ఉంది. ఆమె ద్రౌపది. అప్పటివరకు సభలో జరిగిన వృత్తాంతంపై ఈమె హృదయస్పందనం తెలుగు భారతంలో శాశ్వత స్థానాన్ని పొందింది. సభలో శాంతి ప్రయత్నం సంధికార్యం గురించి విన్నది. ప్రతిస్పందన కుద్యమించింది. దీని వెనుకనున్న పరిభూతమనస్వి, దు:ఖమూర్తి, క్షత్రియవంశజ, ప్రతీకారమతి, స్వతంత్రవ్యక్తి కలిసిన స్త్రీ రూపం బహిర్గతమయింది. మొట్టమొదట ధర్మజుని సంధి ప్రయత్నం శాంతి కాముకత్వం నచ్చలేదు. ఇది పౌరుషహీన కృత్యమని ఆమె అభిప్రాయం. అంతటి మహాపకారం చేసినవారు క్షమింపబడడమా? పాండవుల మాటలు విన్న తరువాత ఆమె మౌనం విస్ఫోటితమైంది. సహనం అంతరించింది. హృదయంలో దాగిన దు:ఖం విజృంభించింది. అది క్రోధ సమీరితమై జ్వలించింది. దు:ఖానుభవ స్మృతులు పరంపరగా వెలువడినాయి. ఆప్తుడైన శ్రీకృష్ణుని ముందు సాక్షాత్కరించాయి. ఇపుడివి బయటపడే సమయం దొరికింది. ఆమె మాటలు వ్యంగ్య విలసితాలై పాత్రలోని గాఢత్వాన్ని తీవ్రతను పట్టిస్తున్నాయి. "అంతలు సేసి, పోనడచి అక్కట! సంజయు చేత చెప్పి వుత్తెంతురె!" యని ఆక్షేపంతో ఆరంభించింది.

"అంతట" కౌరవుల పెక్కు దుష్కృత్యాల్ని తలపిస్తూంది. అడవులకు పంపారు. నిజంగా మనస్సులో పాండవుల క్షేమం కోరి సంజయుని పంపించి ఉంటారా? లేదని అర్థం. మరి ఎందుకు పంపింపబడినాడంటే, రణ విముఖుల్నీ, పురుషకార హీనుల్నీ చేయడానికే. ఈ మాత్రానికే తండ్రి రాయబారం పంపాడని ధర్మజుడు తమ్ములతో సంతోష స్వాంతుడయినాడు. ఐదూళ్ళు మాత్రం చాలునన్నాడు. సుయోధనుడిస్తాడా? ఇవ్వడు. కాని ఇస్తాడని ధర్మజుని ఆశ. అతడీయకుండా అంత కృపలేని మనస్సు కలవాడై అన్నదమ్ముల్ని బాధిస్తాడా? ఇట్లా తెలుగు పలుకుబడితో కాకువుతో మనస్తత్వ ప్రకాశనాత్మకంగా వ్యంగ్య మర్యాదాశోభితంగా రచన సాగింది. ధర్మజునికి తమ్ముడు సుయోధనునిపై కూర్మి పేర్మి గురించి కూడా ప్రస్తావించింది. దీన్ని వారించేందుకు మనమెవరం? ఇది సౌందర్యానికి చిహ్నమని పరిహాసం చేసింది. వారి సౌందర్యం అట్లా ఉంచి రాజ్య భాగ విషయంలో క్షత్రియోచితమైన రాజనీతిని క్షత్రియ కర్తవ్యాన్ని, వీరధర్మాన్ని జ్ఞాపకం చేసింది. ఏ కీడైనా సహించడానికి బ్రాహ్మణులు కారు. క్షత్రియ ధర్మాన్ని తక్షణ కర్తవ్యాన్ని ప్రపంచించింది. సుయోధనుడు దుష్టుడు, పాండవులు ధర్మరతులు. ధర్మజుడు కృపారాశి. అయితే యుద్ధం వస్తే పాండవులు యుద్ధప్రియులవుతారా? వనవాసగతులవుతారా? అని ప్రశ్నించింది. ఇంతవరకు ఉద్వేగాన్ని ఆవేశాన్ని బిగబట్టుకొంది. ఇక ఆపలేక విజృంభించింది. తన మాటలు కారులు ప్రేలుచున్నట్లనిపించవచ్చు. "వీరిడియైన మానసికి వివేక మెక్కడినుండి వస్తుంద"ని ప్రశ్నించింది. తానెటువంటిది? పాండురాజు కోడలు భర్తలు జనవంద్యులు. పుత్రులు నీతి విక్రమస్థితులు. ఇంతటి ప్రశస్తి కెక్కింది. ఇది ఇట్లా ఉంచి, సుభద్ర కన్నా ఎక్కువగా శ్రీకృష్ణుని సంభావనకు నోచుకుంది. రాజసూయావబృథంలో శుచియైన వేణినిబట్టి ఎవడో ఒకడు, ఈ యేవురు చూస్తూ ఉండగా సభకు ఈడ్చి తెచ్చాడు. ఆనాటి దుస్థితిని తలచుకొంది. అపుడు రక్షించింది శ్రీకృష్ణుడే! ధృతరాష్ట్రుని మహాపురుషుడని పేర్కొంది. ఇచట వ్యతిరేక న్యాయం వర్తించడంతో ధృతరాష్ట్రుని పక్షపాత దృష్టి మెదలుతుంది. "అన్నిటిని నీవే నిశ్చయింపుమ"ని కోరింది. ఇప్పటివరకు కూర్చొని ఉంది దిగ్గున లేచి, ఆర్తయైంది. క్రొమ్ముడి విడిచింది. సభాష్పయైంది. ఉదగ్ర వీరభావోపేత అయింది. వెంట్రుకలు తా వలచేత బూనింది. నల్లని భుజంగంవలె మెరిసే కేశరాజిని గోవిందు ముంగిట ప్రదర్శించింది. ఇవి దుశ్శాసనుని వ్రేళ్ళు తగిలి

రాలిపోయి మిగిలినవి. కౌరవుల కడ సంధి విషయం గురించి మాటల సందర్భంలో వీటిని తలచుకొనవలసిందిగా కోరింది. ఈ వెంట్రుకలు పట్టి ఈడ్చిన ఆ దుశ్శాసనుని తనువు ముక్కలు ముక్కలై చెదరి రూపు చెడిన స్థితిని చూస్తే గాని ఈ తాపం చల్లారదు. ఈ కన్నులతో రారాజు శవం చూడందే, భీముని భుజబలమెందులకు? గాండీవి విక్రమం దేనికి? కాల్పనా? వాటి ప్రయోజనమేమిటని ప్రశ్నించింది. ఇంతటి దీర్ఘకాలం మహాక్రోధాన్ని ఓపికతో "రక్కసిపట్టు"తో "చిచ్చొడిం గట్టినయట్లు" సహించి ఉన్నాను. దుష్టశిక్షణ శిష్టరక్షణ కలిగిన నీవు, తేజో మూర్తులయిన భర్తలు కలిగి ఈ మహాగ్ని చల్లారే సమయం రాలేదు. ఇక వస్తుందని ఎదురు చూస్తున్నానంది. తిక్కన మూలంలోని సారభూతమైన అంశాల్ని గ్రహించి స్వతంత్ర రచన అనిపించేట్లుగా కరుణ రసంలో పర్యవసితం చేసాడు. శ్రీకృష్ణుని ఊరడింపుతో ద్రౌపది శాంతించింది. ఈ ఘట్టం కరుణ జలం నుండి ఉత్సాహాగ్నిని అవతరింపజేసింది.

ఈ ఘట్టం మనస్తత్వపరంగా అన్నీ ఉండి, దుర్భరమైన స్థితిలో అవమానానికి గురియై, తమవారిచే ఉపేక్ష చేయబడిన వ్యక్తిలోని మానసికమైన చింతనను ఆవిష్కరిస్తూంది. ఇది ఉద్వేగంతో ఆవేశంతో ప్రతీకారంతో హృదయాన్ని కదిలించే అనుభూతి గుణాన్ని పొందింది. తిక్కన మనస్తత్వ సమర్పకమైన పాత్ర చిత్రణ నైపుణికి ఆదర్శంగా నిలిచింది. దీని కనుగుణమైన సంభాషణ, నిర్మాణకళతో వ్యంగ్య వైభవాన్ని పొందింది. వీటికి తోడు తెలుగు పద్య రచనా శిల్పంలో శిఖరాలనందుకుంది.

## II

శ్రీకృష్ణుడు ప్రారంభంలో ధృతరాష్ట్ర నుద్దేశించి "నీవెరుగని పనులుగలవె!" అయినను పరమహితాన్ని "తనవారికి చెప్పదగున"ని వచ్చానన్నాడు. అది సామాన్య సభ కాదు మహర్షులు భీష్మ ద్రోణాది మహానుభావులు, బాహ్లికాది కురు వృద్ధులతో నిండి ఉంది. సదస్యులు శ్రీకృష్ణుడు పలికిన పరమహితంలోని నయ కోవిదత్వం ధీరత, పొసగింపు లక్షణాలకు దిగ్భ్రమ చెందారు. భరతాన్వయ ప్రియం అతని లక్ష్యం వలె ఉంది. ఇది ఉభయ పక్ష హితాన్ని సూచిస్తూంది. సభలో ప్రధాన స్థానీయుడు ధృతరాష్ట్రుడు. అయినప్పటికీ పరిష్కారకర్త దుర్యోధనుడే. పాండవ కౌరవులు

క్షీరోదకంలా కలసి యుండాలన్నాడు. ధృతరాష్ట్రుని బాధ్యతను గుర్తుచేసాడు. పాండవుల్ని శైశవం నుండి "ప్రోచితి", "నడుమ నిష్కారణంగా విడువ దగునే" యని వారిని కలుపుకొని పోవడంలోని శ్రేయస్సును అవగతం చేసాడు. పాండవు "లౌకమాటగా" చెప్పుమన్న సందేశాన్ని వినిపించాడు. అది, "సారపు ధర్మమున్ విమలసత్యము... దక్షులెవ్వారలుపేక్ష చేసిరది వారల చేటగు"నని కర్తవ్యాన్ని జ్ఞాపకం చేసింది. సత్యమెప్పుడు శుభ దాయకమైంది. పైన దైవం ధర్మోద్ధరణాత్మకమైంది, ఉండనే ఉంది. ఇందులో లౌకికమైన వర్తనకూ, మానవ కర్తవ్యానికీ, సత్య రూపానికీ ధర్మగుణానికీ గల అవినాభావ సంబంధం స్థాపితమైంది. పాండవులు ధర్మవర్తనులు, సత్యచేతస్కులు. దుర్యోధనాదులచేత బహుదూషితులయినారు. ఈ దుస్థితిలో ధృతరాష్ట్రాదుల ఉపేక్ష పనికి రాదు. ఇది వారి వినాశనానికే దారితీస్తుంది. ఇవి సామాన్య వ్యక్తి అనదగిన మాటలు కాదు. విశిష్టమైన వ్యక్తికే చెల్లుతుంది. సత్యం ధర్మం సదా దైవ రక్షితాలై ఉంటాయి. మేఘం చేత కప్పబడిన సూర్యుని వెలుగువలె తాత్కాలికంగా మరుగున బడవచ్చు. రాయబారాన్ని ఉదాత్త స్థాయికి తీసుకరావడం జరిగింది. ఈ దృష్టితో ఇపుడు చేయదగిన కార్యం "క్రోధ మాత్సర్యాలు విడిచి, పాండవులకు తగినట్లు రాజ్యం పంచి ఇవ్వడం సముచితమ"న్న ప్రధాన విషయాన్ని తెలియజేసాడు. ఈ పని చేసి పుత్ర పౌత్రాదులతో "సుఖంగా ఉండుమ"ని ధృతరాష్ట్రుని కోరాడు. చివరగా "వారలు శాంతశూరులు భవచ్చరణంబులు కొల్వ బూని యున్నార"ని పాండవులు నీయందు భక్తి కలవారు. ఇది "నీకప్రియమైతే పోరుకు సిద్ధమయ్యే క్షత్రియోచితమైన వీరకర్మ కలవారు కూడా. ఈ రెండు విధాల్లో ఏది పథ్యమో నీవే నిశ్చయించు కోవాలన్నాడు శ్రీకృష్ణుని రాయబారంలో ఇదొక పార్శ్వం. ధృతరాష్ట్రునుద్దేశించింది.

ఆ తరువాత ఋషుల బోధల్ని దుర్యోధనుడు నిరాకరించడంతో "వీని తేర్పవే" యన్న ధృతరాష్ట్రుని కోరికపై దుర్యోధనునుద్దేశించిందీ రెండో పార్శ్వం. సుయోధనుని అంగీకారం సంధికి ప్రధానమన్న స్ఫూర్తి బలపరుస్తూంది. అతడు "రాజ్య భాగ మీయ నొడంబడుట" క్షేమమన్నది సారాంశం. ఈ సందర్భంలో భీమార్జునుల పరాక్రమ వర్ణనం చేయబడింది. పాండవులు బల రహితులై యుద్ధ భయంతో సంధిని కోరడం లేదన్న భావాన్ని తెలియజేయడమే దీని ఉద్దేశం. శ్రీకృష్ణుననుసరించి భీష్ముడు హితబోధ

చేసాడు. సంయోధనుడు "భీష్మాదులు నన్నెప్పుడు నిందింతురు నీవును నిందింప న్యాయమా?" అని శ్రీకృష్ణునికెదురు ప్రశ్న వేసాడు. నీవు పలికింది సత్యం కాదు, వట్టి నిందయన్న భ్రాంతిని కలిగించాడు. ఇది సుయోధనుని నీతి చతురతకు నిదర్శనమైంది. "ధర్మజుడు జూదరి, జూదమాడాడు, ఓడాడు" అని మూడు ముక్కల్లో తేల్చి చెప్పాడు. వారలు శాంత శూరులన్న మాటకు సమాధానంగా "కయ్యానికి కాలు దువ్వుచున్నార"ని ఆక్షేపించాడు. ఇంతయైన తరువాత సూది మోపినంత రాజ్యం కూడా ఇవ్వడం జరగదని స్పష్టం చేశాడు. దీనికంతటికి పాండవులదే దోషం, దోష పర్యవసానం అనుభవించక తప్పదన్న నీతిని సూటిగా ప్రతిపాదించాడు. రెండో దశలో శ్రీకృష్ణుడు చేసిన ప్రసంగాలకు దీటుగా సుయోధనుడు అనివార్యమయ్యే రాజకీయ స్థితి నెదుర్కొనే ఆత్మ ప్రత్యయాన్ని అవగతం చేసాడు. ఈ మాటలకు శ్రీకృష్ణ "దరుణ కమలాక్షుడ"యినాడు అరుణత్వం కోపాన్ని సూచిస్తూంది. ముఖాన చిరునవ్వు కనబరచాడు. దీనికంతటికీ సుయోధనుని అసత్ప్రవర్తనమే కారణమని నొక్కి వక్కాణించాడు. ఈ మాటలకు దుర్యోధనుడు "కటకటం" మడినాడు. అసహనంతో దిగ్గున లేచి సభను వీడిపోయాడు. శ్రీకృష్ణుడు సభావమానాన్ని ఎత్తిచూపి "దుర్యోధనుని నిర్జించిన నంతయుసరి" అవుతుందన్నాడు. కాని ఇది ఆచరణ యోగ్యం కాదు. "ఇక పోయి వచ్చెదనన్నా"డు. ఆ తరువాత విశ్వరూప ప్రదర్శనంతో శ్రీకృష్ణుని మహనీయమై వ్యక్తిత్వ, దివ్యత్వాన్ని స్పృశించింది. శ్రీకృష్ణుని రాయబారం సాధారణ లోకవృత్తాన్ని బింబిస్తూనే, దీని సుస్థితికవసరమైన ధర్మగుణాన్ని ప్రతిపాదించింది. మానుషాతీతమైన దివ్యశక్తిని ఆవిష్కరిస్తూ, విధి అపరిహార్యతను స్థాపించింది.

మహాభారత కథలో సభాపర్వంలో భగవంతుని ప్రవేశం, ప్రకృతం ఉద్యోగపర్వంలో కన్పిస్తుంది. సభా పర్వంలో ద్రౌపదీ మాన సంరక్షణ సందర్భంలో అధర్మ నిరోధం జరిగింది. ఉద్యోగపర్వంలో శ్రీకృష్ణరాయబార సందర్భంలో ధర్మోద్ధరణ ప్రయత్నం ఉంది. మనుష్య రూపంలో అవతరించిన భగవంతుని దివ్యాదివ్యత్వం శ్రీకృష్ణుని వ్యక్తిత్వంలో స్ఫుటమయింది. సభలో విశ్వరూప ప్రదర్శనంతో దివ్యత్వం స్థాపితమైంది. కథాదృష్టితో ఉద్యోగపర్వంలోని ఇతివృత్తం మానవ జీవితానికత్యంత సన్నిహితమైంది. ఈ ఘట్టాల నిర్వహణంలో కవికి మానవ మనస్తత్వ పరిశీలనం

తదభివ్యక్తి గుణం నిర్మాణ దక్షత అవసరం. ఏ పాత్ర పరిధి దానిదే, భిన్న పాత్రల మధ్య సంఘర్షణ సమన్వయం అనేవి పాత్ర అవలంబించే జీవిత దృక్పథాన్ని బట్టి ప్రవర్తనను బట్టి లక్ష్యాన్ని బట్టి ఉంటాయి. ఉద్యోగపర్వంలో రాయబార ఘట్టాల్లో భావ సంఘర్షణ ప్రవర్తనా భిన్నత్వం లక్ష్య వైవిధ్యం స్పష్టంగా కన్పిస్తాయి. కథలో వివిధ రసాలు అంగ రసాలుగా ప్రవేశించవచ్చు. అవి ప్రధాన రసానికి భంజకం కాకూడదు. ద్రౌపది సంభాషణలో కరుణం, భీముని మాటల్లో వీరం, విశ్వరూప ప్రదర్శనలో అద్భుతం పోషింపబడినాయి. రాయబార లక్ష్యమైన శాంతంలోకి పర్యవసితం కావడం జరిగింది. (తరువాత వీరం అందుకొని చివరకు శాంతరసంలో విలీనం కావడం వేరే విషయం.)

**"మహాకవీలోక శుభాభికాంక్షీ**
**మంత్రీవ గూఢార్థ మతిశ్చకాస్తే"** – విశ్వనాథ

వివేచనా శక్తితో కూడిన లోకజ్ఞతను కలిగిన మహాకవి కావ్యం నిగూడార్థ శోభితమైంది. మహామంత్రి కార్యం నిగూఢార్థ పర్యవసాయి. ఇరువురూ మహామతులు, లోకశు భాభికాంక్షులు. తిక్కన మహాకవి మరియు మహామంత్రి లక్షణాలు కలిగిన అద్వైత భావనాహృదయుడు. తిక్కన రచనలో తత్త్వప్రకాశనంతో పాటు పదప్రయోగం మొదలుకొని కావ్య నిర్మాణం వరకు స్వతంత్ర శక్తిని భావింపజేసే సృజనకళ అనుభవానికి వస్తుంది. నిర్వహణ శిల్పం సమాలోచన కందుతుంది.

# నిర్మాణ మార్మికత - ( I )

# దుశ్శాసన వధ

భీష్మపర్వం మొదలుకొని శల్య పర్వం వరకు యుద్ధమే. కౌరవ పక్షం సేనానుల మార్పును బట్టి పర్వ విభాగం జరిగింది. ఒక్కొక్క పర్వంలో ప్రత్యేకంగా పరిశీలింపదగిన ఘట్టాలనేకం ఉన్నాయి. వీటిలో దుశ్శాసన వధ వల్ల సగం, మిగిలిన సగం దుర్యోధన హననం వల్ల జరిగింది. మొదటి కృత్యంలో తీవ్రత ఎక్కువ. ద్రౌపదికి జరిగిన అవమానాల్లో మొదటిది కేశ గ్రహణంతో సభలో కీడ్చుకొని రావడం. రెండోది వస్త్రాపహరణం. దుర్యోధనుడపకృతితో, సైగ చేసి పిలిచిన స్థితినుద్దేశించి తీవ్ర స్వభావుడైన భీముడు ప్రతిజ్ఞను నెరవేర్చే ఘట్టం నిస్సందేహంగా విశిష్టమైంది. “దుశ్శాసనుని రొమ్ము చీల్చి” భీముడు రక్తం త్రాగాడంటే చాలదు. విషయం ఆ చేసే పనిలో, పాత్రప్రవర్తనం ప్రధానంగా ఆ అవకాశం లభించేప్పుడు, కలిగే ఉత్సాహం, పూర్వ విషయస్మరణం రెండూ కలిసి జుగుస్సావహమైన ప్రతీకార బీభత్సదృశ్యంతో కూడింది. ఇందులో వీర రౌద్ర భీభత్సాలు ముప్పిరిగొని ఉన్నాయి. రస నిర్వహణంలో ఈ ఘట్టం విశిష్టమైన రస సంయోజనతో ఆకర్షిస్తుంది.

దుశ్శాసనుడు భీమునెదుర్కొన్నాడు “ఆ సభలోని గొన్న ఋణమంతయు నీగ వంటి వడ్డితో నని తమ్ముడా” అని సంబోధించాడు. తాను ప్రతిజ్ఞ చేసింది సభలో కాబట్టి సభ ప్రస్తావన చేసాడు. దీనితో దుశ్శాసను డొనర్చిన కృత్యం అతని మనస్సులో మెదలడం సహజం. ఇపుడు విధాత తన వద్దకు చేర్చాడు. విధాత అంటే నిర్ణయించువాడు. దుశ్శాసన వధ విధి నిర్ణీతమని భావం. “తమ్ముడా” అన్న సంబోధనలో కావలసినంత హేళన ఉంది. ఈ మాటలకు దుశ్శాసనుడు లాక్షా గృహ దహనం నుండి అజ్ఞాతవాసం దాకా పాండవుల కష్టాలకు వారి బలహీనతయే కారణమన్న అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు. ఇది భీమునిలో క్రోధాన్ని పురి కొల్పింది. ఇక మాట్లాడలేదు. అతని దరహాసంలో కెంపు కదలింది. దరహాసం దుశ్శాసనుని పట్ల కలిగిన చులకనను, కెంపు కదలడం క్రోధాతిశయాన్ని వ్యజ్యమానం చేస్తున్నాయి. యుద్ధంలో దుశ్శాసనుడు

నిష్కేతనుడు, నిస్సూతుడయ్యాడు, వృకోదరుడు విరుధుడయ్యాడు. రణోత్సాహంతో మేను పెంచి గదను గ్రహించాడు. ఘోటకాలు ద్రుమందాయి, అరదాలు త్రెళ్ళాయి. ఈ సందర్భంలో తిక్కన భీముని 'కీచకారాతి' యని పేర్కోడం గమనార్హం. కీచకుని వధ చిత్రంగా జరిగింది. శరీరం ముద్ద చేయబడింది. ఈ కృత్యం పరమ భీభత్సమయమైంది. యుద్ధంలో నేలపైబడిన దుశ్శాసనుని "బెబ్బులి లేడి కొదమం పొదవు పోలిక" పట్టుకొన్నాడు. మెడత్రొక్కి పట్టాడు. "నీ మాటలు వినాలని వేడ్కపడుతున్నా, ఏమంటావో అనుమ"న్నాడు. ఈ ఎత్తి పొడుపు గదాఘాతం కన్నా తీవ్రమైంది. మూలంలో ద్రౌపది కేశాకర్షణం చేసిన చేయి యేదని భీముడడిగాడు. అపుడు దుశ్శాసనుడు,

**"అయం కరికరాకార: పీనస్తన విమర్దన:**

**గోసహస్ర ప్రదాతా చ క్షత్రియాంతకర: క:"** అని ఆ చేయి చూపాడు. భీముడు దానిని ఖండించాడు. ఈ మాటలు భావ సంశ్లిష్ట గుణంతో దుశ్శాసనుని బాహు బలాన్ని శృంగారస్పృహను పుణ్య బుద్ధిని వీర భావాన్ని ధ్వనింపజేస్తున్నాయి. ఎటువంటి స్థితిలో నైనా ఒక వీరుడు తనను తక్కువ చేసుకోడు. ఆత్మ ప్రత్యయంతోనే ప్రవర్తిస్తాడు. ఇది సహజం. ఈ దృష్టితో మూలంలో భావం సముచితంగా ఉంది. తిక్కన దీన్ని పరిహరించాడు. కారణమీ మాటలు భీముని అధిక్యాన్ని తగ్గించే అవకాశముందని భావించవచ్చు. ఏమైనా ఈ సందర్భంలో దేని ప్రత్యేకత దానిదే అన్న దృష్టి సమంజసమైంది. దుశ్శాసనుని ధరణిపై పొదివి పట్టుకొన్న స్థితిలో కౌరవబలం "కార్చిచ్చుకు లేళ్ళవలె" వెనుకకు తగ్గింది. అపుడు భీముడు దుశ్శాసనుని లీలం కేల సమర్చి ఆకాశంలో త్రిప్పాడు, భూమిపై వేసాడు. ముంగాలితో త్రోసాడు. మెడ తొక్కిపట్టాడు. భీముని క్రోధ వికట తాండవం వివిధ రీతుల్లో చిత్రితమైంది. ఈ ప్రవర్తన అతనిలో నెలకొన్న కసిని చాటుతూంది. దీన్ని "ఘోర విహారం"గా తిక్కన పేర్కొన్నాడు. భీముడు సభలో ద్రౌపదిని దిక్కులేనిదని అపహసించినదానికి ప్రతిమాటగా ఈ రణభూమిలో "నీకు దిక్కు కలిగిన వారిని పిలుచుకొమ్ము"న్నాడు. ఇపుడెవరు రక్షింపలేరు, చావు ధ్రువమని ఎత్తి పొడుపుగా చెప్పడమే. కుఠారం తీసాడు ఝుళిపించాడు. దుశ్శాసనునిలో అదరుపాటు కలిగించడానికే నృసింహుడు హిరణ్యకశిపు జంపు విధంగా గుండె చీల్చి దోసిట రక్తం త్రాగిన ప్రవర్తన విధం దారుణంగా కన్పించింది. అందరు

భయపడేట్లు మేన చల్లుకొన్నాడు. ముఖాన అలదుకొన్నాడు. ప్రతిజ్ఞా పూరణం చేసి, "తేనె, ఖండ శర్కరతో పాలుకూడ"ఇంత యింపుగావ"ని ఎలుగెత్తి పలికి, భుజాస్ఫాలనం చేసాడు. భీభత్స దృశ్యం భయానకంగా మారింది. ఒక్కసారిగా చంపబడటం కన్నా బహు విధాలుగా పీడింపబడి చంపబడడం నరక ప్రాయమైంది. భీముని చేతిలో దుశ్శాసను డిట్టి ఘోరమైన నారక స్థితి ననుభవించాడు. కొన ప్రాణంతో ఉన్న దుశ్శాసనునితో "పసరమ!" అని సంబోధిస్తూ గతంలో జరిపిన దుష్కృత్యాన్ని జ్ఞాపకం చేసాడు. "పతుల్ విజృంభిత శ్రీ విలసిల్లు కామినులు సేద్పడిరిట్లపతిత్విదీనతన్" అని ప్రకృత దుస్థితిని సూచించాడు. ఒక ప్రతిజ్ఞ నెరవేరింది. మరో ప్రతిజ్ఞ మిగిలి ఉందన్నాడు. ఈ మాటలన్ని ఒక్కమారు అన్నవి కావు. సైనికుల్ని పారద్రోలుచు, దుశ్శాసనుని కాళ్ళు లాగుతూ పీడిస్తూ కవ్విస్తూ మధ్య మధ్యన అన్నవి.

**"అనుభూతాని దుఃఖాని తేషాం హేతుస్త్వమేవ హి**
**దుఃఖాన్యేతాని జానీమో న సుఖాని కదాచన**
**ధృతరాష్ట్రస్య దౌరాత్మ్యా సుపుత్రస్య సదా వయం"** కర్ణ.ప. అధ్యా. 83శ్లో. 48.

మేమనుభవించిన దు:ఖాలకు నీవే కారణం! మాకు దు:ఖాలే తెలుసు! సుఖాలు తెలియవు, ఇది ధృతరాష్ట్ర పుత్రుని దౌరాత్మ్యం వల్లనే! అన్న మాటల పరమార్థాన్ని తిక్కన సమయోచితంగా పొందుపరచాడు. భీముని మాటలు ఆక్షేపపూర్వకమైనవి. అతనిలో నిక్షిప్తమైన చిరకాల క్రోధం ప్రతిజ్ఞా బంధురమైన రణోత్సాహంతో భీభత్స క్రియగా మారి వీరకృత్యంగా పరిణమించింది. ఈ ఘట్టంలో ఇతరుల యుద్ధం జొప్పించబడలేదు. మొదటి నుండి చివరి దాక తీవ్ర స్థాయి చెడకుండా, ఆవేశ స్థితి నిలవబడింది. రౌద్ర భీభత్స వీర రస సమ్మేళనంతో ఈ ఘట్టం రస సంయోజనా శిల్పంలో విలక్షణమైంది. తిక్కన నిర్మాణ మార్మికతను ప్రకాశమానం చేస్తూంది.

# నిర్మాణ మార్మికత - ( II)

# కర్ణయుద్ధం

కథలో యుద్ధ భాగాన్ని నిర్వహించే తీరు వేరు. ఇందులో పరాక్రమం నెరపే క్రియకు ప్రాధాన్యముంటుంది. యుద్ధేతర భాగాల్లో వ్యక్తుల భావ జగత్తు ప్రభావముంటుంది. భావం - క్రియ లేదా చర్య ఏకదేశంగానూ; మళ్ళీ ఇతర కథాంశాలతో సుసంయోజితమై ప్రాధాన్య వివక్షను పురస్కరించుకొనీ నిర్మాణ మార్మికతను పొందుతాయి. పాత్ర రణక్రియలో పూర్వాపర మనోరూపం ఆత్మనిశ్చయం లక్ష్యం మొదలైనవి దృష్టికి వస్తాయి. తిక్కన నిర్వహించిన ప్రతి యుద్ధ పర్వం ప్రత్యేకంగా పరిశీలింపదగినవి. భీష్మద్రోణుల పట్ల కన్నా దుర్యోధనునికి కర్ణుని పట్ల విశ్వాస మధికంగా ఉంది. కర్ణుడు సైన్యాధిపత్యాన్ని వహించేప్పుడు, దుర్యోధనుడు "నీ విక్రాంతియ నాపయింగల యతిస్నేహంబు ప్రఖ్యాతముల్" అన్నమాట, అతనిపై పెట్టుకొన్న ఆశావిశ్వాసాల్ని బింబిస్తుంది. విక్రాంతికర్ణుని వ్యక్తిత్వానికి చెందింది. ఇపుడు దుర్యోధనున కుపకరించేది. స్నేహం ఉభయులకు చెందింది. మానసికమైన బలాన్ని ఇచ్చేది. భీష్మ ద్రోణులు "ఉపేక్షంగాక", లేకపోతే వైరాన్నెపుడో తుదముట్టించేవాడు. ఇపుడు కౌంతేయుల్ని లీలగా గెలిచే ఆత్మవిశ్వాసం ప్రకటితమైంది. కర్ణుడు దుర్యోధనునితో పాటు పాండవుల కపకార క్రియలో ప్రముఖుడు. అర్జునుని వలని భయంబు సెడి ఔమ్మన చేయిడి నిద్రపోయిన"వాడు. అటువంటి కర్ణుడిపుడు సేనాధిపతి అయినాడు. ఇక దుర్యోధనుని సంతోషానికి మేరలు లేకపోవడం సహజం. ఈ మాటలు కర్ణుని మనస్సులో ఉత్సాహాన్ని పెంచి నిలవడానికీ ఉపకరించాయి.

కర్ణుని మనో రూపం ద్విధాభూతమైంది. శర తల్ప గతుడైన భీష్మునితో ఏకాంతంలో, వారు పాండవులు మహాబలులు బుద్ధి నెరుంగుదునన్నాడు. పాండవుల శౌర్యంతో పాటు భగవంతుని రక్షణ విషయమూ అతనికి తెలుసు. వారు విజయం పొందగలరని తెలుసు. "అయితే విడిచిపోవుట ధర్మమే, వీర కర్మమే!" అంటాడు.

"భూరి వివేక" అని భీష్ముని సంబోధించడం జరిగింది. తన శక్తీ పాండవుల శక్తీ వీటి రణ పర్యవసానం వివేకానికి మాత్రమే అందేవి. ఇది తెలిసిన తన చర్య కూడా అంతా. ధర్మస్వరూపం తెలిసినవాడుగా వీరకృత్యంపట్ల అభిమానం శ్రద్ధ కలవాడుగా దర్శనమిస్తాడు. పూర్వం శ్రీకృష్ణునితో మాట్లాడుతూ, "నీవుపద్రష్టవుగా రణయజ్ఞం" జరుగుతుందని, దీని పర్యవసానాన్ని స్పష్టం చేసాడు. ధర్మరాజు ధార్మికుడు. అతడాధిపత్యం చేయాలి. ధర్మం గెలుస్తుంది. అన్న మాటల్లో ప్రధాన కథా పర్యవసానం కర్ణునికి బాగా తెలుసునన్న విషయం స్పష్టం. అంతరంగంలో ధర్మస్వరూపం తెలియడం వేరు అనేక కారణాలవల్ల తెలియనట్లు ప్రవర్తించడం వేరు ఈ రెండు కర్ణునితో సమాంతరంగా కన్పిస్తాయి. ఈ స్థితి యాతని ద్విధాభూతి మనో రూపాన్ని సూచిస్తూంది. ఇది మొదట్లోకన్నా కథ చివరకు చేరుకునే కొద్దీ అతనిలో ప్రజలంగా పనిచేసింది దీనికి అనేక దృష్టాంతాలు కన్పిస్తాయి.

మరో విశేషం, కర్ణుడు సూర్య పుత్రుడు. ఈ కారణంగా కర్ణ ప్రవేశం మొదలుకొని సూర్య సంబంధం చివరి దాకా నెలకొల్పబడింది. "బాలార్క ప్రతిముడని" నన్నయచే కుమారాస్త్ర విద్యాప్రదర్శన సందర్భంలో ప్రారంభమైన ఈ సంబంధం, తిక్కనచే కర్ణసేనాధిపత్యం నుండి చివరి వరకు కొనసాగింపబడింది. కర్ణుని ఉత్సాహోనివృద్ధి క్షయాదులకు సూర్యుని ప్రతీకగా నిలిపి సూచించచడం జరిగింది. ప్రకృతి గతమైన అంశాలు కథతో మేళవింపబడడమే కాక, పాత్ర జీవితంలోని విశేషాంశాల స్ఫూర్తి కన్పిస్తుంది. మూలంలో కర్ణుని సేనాధిపతిని చేసేప్పుడు బ్రాహ్మణాశీర్వాదంలో సూర్యుని ప్రస్తావన ఉంది.

**"జహి పార్థాన్ స పాంచాలాన్ రాధేయ విజయాయ నః**
**ఉద్యన్నివ సదాభానుస్తమాంస్యు గ్రైర్గభస్తిభిః"**

ఈ సందర్భంలో దుర్యోధనుడు "పగరకు నీ కడంక, చీకటికి సూర్యోదయం బెట్టిదట్టిదయ్యెడుం గాక" యని పలికాడు. రణరంగంలో సేనాధిపతిగా కర్ణుని ప్రవేశం సూర్యోదయం వంటిది. ఉదయించిన సూర్యునికి అస్తమయం తప్పదు. పట్టపగలు

విజృంభిస్తాడు. ఆ తరువాత విజృంభణం తగ్గుతూ పోతూ అస్తమిస్తాడు. ప్రకృతి విషయానికివస్తే చీకటి అనబడే శత్రువులు నశింపరు, తొలగిపోతారు. సూర్యుడు మధ్య మధ్య మేఘాచ్ఛన్నం కావచ్చు. భీముడు కర్ణుని మూర్ఛ పరచడం ఇటువంటిదే. మూలంలో 'జహి' చంపుమని ఉంది. తెలుగులో దుర్యోధనుని వాక్యంలో ఇది లేదు. చీకటి సూర్యోదయంలో అదృశ్యమవుతుందే కాని నశించడం జరగదు. ఇక్కడే స్ఫూర్తి అవగతికి వస్తుంది. దుర్యోధనునికి సమాధానంగా కర్ణుడన్న మాటల్లో ఈ సూచన మరో విధంగా ఉంది. "నీ కిచ్చిన మాట మరవను, పాండుపుత్రుల "మదోల్లాసంబు మర్దింతు"నన్నాడు. గర్వాతిశయాన్ని మర్థించడం మంటే చంపడం కాదు. కర్ణునిలో పూర్వం పేర్కొన్న ద్వైధీభావం ఈ మాటల వెనుక పనిచేసింది. తాను అన్న విధంగానే పాండవుల మదోల్లాసాన్ని మర్దించాడు. ధర్మజుని రణరంగంలో పరాభవించడమిదే, (ఈ మాటలు మూలంలో లేవు, తత్కాలోచితంగా తిక్కన ఉపజ్ఞకాలు).

సేనాధిపతియైన కర్ణుడు, "అర్క ప్రభంబగు అరదమెక్కి" బయలుదేరాడు. ఈ సందర్భంలో కర్ణుని యుద్ధ సాధన వితతి సూర్య మూలకమైన కాంతి సాధనంగా చిత్రితమైంది. భీష్మ ద్రోణాదులు నిష్క్రమించిన రణరంగంలో ఉత్సాహమూర్తిగా కన్పించాడు. కౌరవ పక్షానికానందం కలిగింది. రెండోనాటి యుద్ధం శల్య సారథ్యంతో మొదలైంది. మొదటి రోజున నకులుని అవమానించి వదిలేశాడు. రెండో నాడు "మధ్యందిన మార్తాండు మండలంబునుంబోలె" వెలిగాడు. ఈ సందర్భంలో ఈ ఉపమానం మూలంలో లేదు. కర్ణుని మహా వ్యక్తిత్వంతో సూర్య సంబంధాన్ని స్థాపిస్తూ తిక్కన నిర్వహించిన విధంలో భాగమైందీ వర్ణనం. శల్యుని పని కర్ణుని నిరుత్సాహపరచడమే పైగా కర్ణుని కోరికపై బాధ్యతను స్వీకరించినవాడు. శల్యుని ప్రవర్తన కర్ణుని కోపోద్దీపితుని చేసింది. కూడా. ఇది ఇట్లా ఉంచి కర్ణుని ఏకాగ్రతను చెదరగొట్టే లక్ష్యంగా పరిణమించింది. మాటిమాటికి పాండవ విజయాన్ని కాంక్షిస్తూ పలికిన పలుకులు కర్మనిలో ఉత్సాహాన్ని శీర్ణపరచే విధంగా ఉన్నాయి. అయినప్పటికీ, "వేవురు గోవిందులు పది వేవురు పార్థులు పన్నినం పోరెదన"ని దృఢ సంకల్పాన్ని వ్యక్త చేసాడు. కృష్ణార్జునుల యందు లక్ష్మీ విజయం సుప్రతిష్ఠితమైందని అంతరంగానికి

తెలుసు వారి నెదుర్కొని పోరుటకంటే మేలు" వేరే లేదని తెలుసు. చివరి దాకా మహోదాత్త వీర మూర్తిగానే నిలవడానికే సంకల్పించాడు. ఇంత చేసి తాను వారితో "పోరెద"నన్నాడేగాని వారిని "చంపుతా"నన లేదు పోరాటం ఉత్తమ వీరుని లక్షణం. శత్రువైన ప్రతి వీరుని చంపడమతని చేతిలో లేదు. నిశ్చయంగా చెప్పడం కుదరదు. కర్ణుడు మహా పరాక్రమాన్ని ప్రదర్శించాడు. వీర జన స్తవనీయుడయినాడు. రణవిజయం ధర్మ సంబంధమైంది. తన వీర ప్రదర్శనం మైత్రీబద్ధమైంది. శల్యునితో కర్ణుడు నెరపిన సంభాషణలో ఈ భావం స్ఫుటంగా కన్పిస్తుంది. ఇది ద్వైధీభావ మనోరూపం ప్రభావమే కాని వేరు కాదు.

కర్ణయుద్ధం తీవ్రస్థాయి నందుకుంది. ధర్మజుని విరథుని చేసి అవమానించాడు. రణకేళి సలిపాడు. కర్ణుడు ప్రదర్శించే మహా యుద్ధానికి పాండవ సేనలు ఆక్రందనం చేసాయి. అర్జునుడు సైతం కర్ణుని తీవ్రతకు జంకాడు. కృష్ణునితో

**"పట్ట పగలింటి సూర్యుని పగిది కర్ణు డుగ్రమూర్తియై వెలుగుచు నున్నవాడు**
**మన రథంబిప్పుడు మాధవ మరలనిమ్ము బ్రతికి యుండిన శుభములు బడయవచ్చు**

మూలంలో ఈ సందర్భంలో –

**పశ్య కృష్ణ మహాబాహో భార్గవాస్త్రస్య విక్రమమ్**
**నైతదస్త్రం హి సమరే శక్యం హంతుం కథంచన**
**సూత పుత్రంచ సంరబ్ధం పశ్య! కృష్ణ! దారుణమ్**
**సుతీక్ష్ణం చోదయన్నశ్వాన్ ప్రేక్షత్ మాం ముహుర్ముహుః**

**న చ పశ్యామి సమరే కర్ణస్య ప్రపలాయితుమ్**
**జీవన్ ప్రాప్నోతి పురుష: సంఖ్యే జయ పరాజయౌ**
**అజితస్య హృషీకేశ! వధ ఏవ కుతో జయ:"**

మూలంలో సూటిగా లేని సూర్యునితో ఉపమనాన్ని అర్జునుని మాటల్లో తిక్కన నిక్షేపించడం సముచితంగా ఉంది. కర్ణుడెపుడు విజృంభించినా సూర్యుని ప్రసక్తి తేవడం

కన్పిస్తుంది. అర్జునుడు తప్పించుకొని పోవాలన్న భావం మూలం నుండి ఉటంకించిన చివరి శ్లోకంలో కన్పిస్తుంది. మూలంలోని తాత్పర్యాన్ని తిక్కన కర్ణుని పరాక్రమానికి దీప్తి కలిగించే విధంగా సంక్షిప్తం చేసాడు. సూర్యోపమానంతో ఉజ్వలత చేకూరింది. అర్జునుడు కర్ణుని "సూతపుత్రుడ"ని పేర్కోడంలో పొందే అవమానంలో సహింపరాని గుణాన్ని ఎత్తి చూపుతున్నట్లుంది. సూత పుత్రుడు, తన "కంతకప్రతిముడు"గా కన్పించడం మరీ దుర్భరంగా ఉంది. ఇది క్షత్రియాహంకారానికి దెబ్బ తగిలినట్లుంది. ఇది అర్జునుని మానసిక స్థితి చిత్రణం!

కర్ణునిచేత అవమానితుడైన ధర్మజుని చూచేందుకు కృష్ణార్జునులు వెళ్ళారు. కర్ణుడు చావలేదని తెలిసి ధర్మజుడర్జునుని నిందించాడు. అర్జునుడు కొత్త ఉత్సాహంతో రణంలోకి ప్రవేశించాడు. పట్ట పగటి సూర్యుడు పడమట దిశవాలడం మొదలైంది. దుశ్శాసన, వృషసేనుల వధ జరిగింది. దుశ్శాసనుడు దుర్యోధనుని తమ్ముడు. వృషసేనుడు తన కొడుకు. కర్ణుడు శోక వ్యాకులచిత్తుడయ్యాడు కన్నీరు ఒలికింది. తానేమి చేయజాలనందుకు మరీ బాధ పడ్డాడు. కోపాటోపంతో "ఉద్భటుడ"య్యాడు. "కరి కరి గిరి గిరి సంభోధర మంభోదరము" తాకినట్లు కర్ణార్జును లిరువురి యుద్ధం మొదలైంది. ఇందులో "కరి" ఉపమానం తిక్కన చేర్చింది. "ఆరబోవు దీపం వలె" కర్ణుడు డస్సినట్లు కన్పించాడు. కర్ణుని సర్పముఖ శరం శ్రీకృష్ణుని ఉపాయం వల్ల కిరీటాన్ని మాత్రమే ఛేదింపగలిగింది. అర్జునుని శరాఘాతాలకు నెత్తురు దోగిన కర్ణుడు "అరుణోజ్వల మండల కాంతి పూరపున్మొత్తము దీప్తులుం దగ నినుండపరాద్రి వెలుంగు" మాదిరి నిలిచాడు. ఇక్కడ అస్తమయ సూర్యునితో కర్ణుని పోల్చడం పూర్వం పేర్కొన్న సూర్యసంబంధాన్ని స్థాపిస్తుంది. భూసుర శాప వశాన రథం క్రుంగిపోయింది. పరశు రామ దత్తాస్త్రం స్ఫురించలేదు. అయినప్పటికి బ్రహ్మాస్త్రంతో అర్జునుని విధ్వస్తాస్త్రుని గావించాడు. శ్రీకృష్ణుడు "నిను నొంచువాడె కర్ణుడని అర్జునుని శరవిలాస నిరూఢా!" యని సంబోధించి "అసమానోజ్వల ఖేలనమున తెగటార్పుమ"ని ప్రేరేపించాడు. రౌద్రమంత్ర సహితంగా విషభుజగ భంగి బాణాన్ని సంధించే వేళకు రథ చక్రం భూమిలో దిగబడింది. శల్యుడు సహకరించలేదు.

కర్ణుడు "అరదంబు చక్రంబు ధరచాల క్రుంగిన నెత్తెద నంతకు నేయకుండు" మని క్లిష్ట స్థితిలో చిక్కుకున్న విధాన్ని చెప్పాడు. వచనం వలె సాగిన ఈ సీస పద్యం కర్ణుని దయనీయస్థితిని చిత్రిస్తూంది. ఎవరికైనా ఆపదలో నున్నపుడు ఎక్కడ లేని ధర్మం జ్ఞాపకానికొస్తుంది. శక్తి యుక్తులు పని చేయని దుర్విధిలో నున్న కర్ణుని విషయమింతే అయింది. కర్ణుని నోట ధర్మ ప్రసంగం కొంత ఆశ్చర్యాన్ని కలిగించకపోదు. తానిట్లు పలకడం "నీకును గోవిందునకు వెరచి కాద"నడంలో దయనీయమైన దశ పరాకాష్ఠకు చేరుకుంది. శ్రీకృష్ణుడు దీన్ని అపహాస్యం చేసాడు. కర్ణుడు భూమిపై నిలచే పరాక్రమం చూపే ప్రయత్నం చేసాడు. కృష్ణుని "పనుపున" అర్జునుడు మహాస్త్రంతో కర్ణుని శిరస్సు ఛేదించాడు. "చరమ గిరి నుండి పడియెడు తరణి కరణి" సూత పుత్రుని "కాంతి స్ఫురణోజ్వల"మైన అతి సుందరకాయం", ధరపై బడింది. ఆ శరీరం నుండి ఎగసిన తేజం సూర్యునిలో కలిసింది. కర్ణుడు సూర్య పుత్రుడవడం చేత సూర్యాస్తమయ వర్ణనం విశిష్టంగా సాగింది. ఇది పితా పుత్ర సంబంధాన్ని స్ఫురింపజేస్తుంది. అవనిపై పడియున్న కర్ణుని దేహం చూచి విషాదంతో చలించి తొలగి పోతున్నట్లు సూర్యుడస్తమించాడు. ప్రాణం నిష్క్రమించిన రాధేయుని తన కరాలతో కరుణతో స్పృశించిన కారణంగా

**"పావన స్నాన మొనరింప బోవు నట్లు నపర జలనిధి లోనికి నరిగె నినుడు"** దీనికి మూలంలో – **"కర్ణస్య దేహం రుధిరావసిక్తం భక్తాను కంపో భగవాన్ వివస్వాన్ స్పృష్ట్వాంశుభిర్లోహిత రక్త రూపః అభ్యేతి పరం సముద్రః"** యని అస్తమయ సూర్య దేవతా దృశ్య సమర్పకంగా కన్పిస్తుంది.

జీవితంలో విషాద సమయంలో కరుణతో మృతుని స్పృశించి ఆ తరువాత స్నానమాచరించే లోక విషయం సూర్యుని యందారోపితమైంది. సూర్యుడు కథలో పాత్రగాను సంభావితమైనాడు. ప్రతిరోజు సూర్యుడస్తమిస్తాడు. కాని ఈనాటి సూర్యస్తమయాని కొక విశిష్టత ఉంది. మూలలో ప్రకృతిగతంగా తీర్చిన కథాంశాన్ని దేహ సంబంధ మయిన బంధు లక్షణంతో పొసగింపజేసి సన్నివేశానికి

మానవీయరూపాన్ని కలిగించడం తిక్కన నిర్మాణమార్మికత. ఆ తరువాత ధృతరాష్ట్రుడు "కర్ణుడీల్గె నట్టె, యింకెక్కడి బ్రతుకు, మనకు నేటిభండం"బని మరణోద్యుక్తుడయినాడు. సంజయుడాపివేసాడు. ఈ మాట ధృతరాష్ట్రుని మనస్సులో కర్ణునికి గల ప్రత్యేక స్థానాన్ని వ్యంజింపజేస్తుంది.

కర్ణుని మనసులో పనిచేసే ద్వైధీభావం తిక్కన రచనలో కథాగమనంలో పోను పోను మరింత సాంద్రతరమయింది. సూర్యాంశకు ప్రతిబింబంగా పాత్రను తీర్చి చివరకు జీవ ప్రకృతుల ఆత్మీయ బంధం స్థాపితమైంది. తాత్త్విక స్పర్శపొందింది. పితాపుత్ర సంబంధంతో రాగాత్మకతను పొందింది. మహాభారత కథకు 'శీర్ష'స్థానమైన కర్ణుని వీరోజ్వల ఘట్టాన్ని బింబించే కర్ణపర్వం తిక్కన సృజన కళకు, నిర్మాణ దక్షతకూ యశోరూపం. కావ్యరామణీయకతను పొందింది.

# స్త్రీపర్వం - నిర్మాణశిల్పం

తిక్కన మహాభారతంలో స్త్రీ పర్వమొక విశిష్టమయిన సృజన రూపం. ఇతర పర్వాల్లో కథాంశాలకు ప్రాధాన్యం ఉంది. ఇందులో కథాంశాల కన్నా శోక భావం విస్తరించింది. కాబట్టి భావాత్మకం. ఇది కరుణ రసాత్మకంగా తీర్చబడింది. స్త్రీ పర్వాన్ని గూర్చి నన్నయ "కృపాయితమై... వెలయు సుకవి పండిత సభలన్" అని పేర్కొన్నాడు. కృపచేత కూడినదై అంటే కరుణం చేత పర్యాప్తమై ఉందని అర్థం. ఇది సుకవులు పండితులు గల సభల్లో ప్రశస్తి కెక్కింది. "సుకవి" అన్నమాట ఇచ్చటే పేర్కొబడింది. మరో చోట అంటే ఇతర పర్వాల గురించి చెప్పేప్పుడు పేర్కొబడలేదు. సుకువుల్ని ఆకర్షించేది అనుభూతి గుణం. అనుభూతి స్పందన చేతనే కవి అవతరిస్తాడు. ఉపసర్గ"సు" మంచి, చక్కని అంటే ఉత్తమత్వాన్ని సూచిస్తూంది. దీన్ని బట్టి అనుభూతి ప్రధానమైందన్న అభిప్రాయ మేర్పడుతూంది స్పందన గుణాన్ని భావింపజేస్తూంది. "సుకవి" ప్రస్తావన ఈ విధంగా సామంజస్యాన్ని భజిస్తూంది. స్త్రీ పర్వాన్ని అనుసరించి "శాంత పర్వం" ఉంది. ఇది శమాభిముఖమైంది. ప్రధానమైన శాంత రస ప్రముఖత్వానికి దీని ముందున్న కరుణ రసౌత్కట్యం ఎంతగానో తోడ్పడుతుంది. దీనికి పూర్వం వీర రస విజృంభణం భీభత్స రసాతిశయం వీలు కలిగించిన మాట మరచి పోకూడదు సమాహారంగా మహాభారత కథలో ఈ విధం మహాకవి రస సంయోజన శిల్పాన్ని భావింపజేస్తూంది. ఈ దృష్టితో స్త్రీ పర్వ రచన అనితరమైందిగా కన్పిస్తుంది. దీనికిదే సాటిగా ఉంది. శోకం హృదయాన్ని కలచివేస్తుంది. సమత్వాన్ని చలింపజేస్తుంది. సమత్వం శమంలో కన్పిస్తుంది. అందుకే శాంత పర్వాన్ని గురించి తెలుపుతూ నన్నయ "సమబుద్ధి"కి "సకల హితంబై" "సఫల" "ప్రకటిత" మౌతుందన్నాడు. శోకం సులభంగా హృదయాన్ని ఆకర్షిస్తుంది, ద్రవింపజేస్తుంది. ఈ కారణం చేత కావ్య ప్రపంచంలో శృంగార రసం తరువాత కరుణ రసమే ప్రభావోపేతమైందిగా కన్పిస్తుంది. ఆ తరువాత జీవిత చరమగమ్యమైన శాంతం అనివార్యమైందిగాను గ్రహించవచ్చు.

ఒక్కమారు పర్యాలోచనచేస్తే ఇది యుద్ధానంతరం నెలకొన్న మహావిషాద స్థితి నుండి సముద్భవించింది. శోక పూరితమైంది. సృష్టికి వ్యతిరేకమైన విలయంతో

ప్రవృత్తమైంది. యుద్ధంలో మరణించిన వీరుల తల్లులు, కూతుండ్రు, కోడండ్రు మొదలుగా దు:ఖితులైన స్త్రీ సమాజ హృదయానికీ స్త్రీ పర్వం ప్రతీకగా నిలిచింది. ఈ కారణంగా (ఈ విశేష స్థితి చేత స్త్రీ పర్వ రచన మిగతా పర్వ రచన కన్నా భిన్నంగా విశిష్టంగా ఆవిష్కృతమైంది.) ఇది కవి సృజన శక్తి నుండి సద్యోనిర్గతమైంది తప్ప వేరు కాదు. ఇందులో ప్రధానమైన భావస్థానాలు ధృతరాష్ట్రుని దు:ఖం, గాంధారి దు:ఖ జనిత కోపం, శ్మశాన భూమిలో గాందారి విలాపం, మానవ జీవితంలో అసాధారణమైన విధి వైపరీత్యంతో కూడుకున్నవి.

యుద్ధంలో చనిపోగా మిగిలిన వారిలో ఎవ్వరికీ ఈ పరిణామం ఆనందకరంగా లేదు. వనితా జనం కౌంతేయాగ్రజుని చూచి “ఇందఱ జంపితినని ఉబ్బిపోయేవు, విభూతి యన నీకెద్దీ” అని ఉపాలంభిచారు. గాంధారి తన పుత్రుల కొరకే కాదు అభిమన్యుని కొరకు ఉపపాండవుల కొరకు అంతేగాక ద్రుపదాదుల కొరకు దు:ఖించింది. మాతృహృదయస్పందనం సాధారణ భేదాల్ని పరిధుల్ని అతిక్రమించింది. విశ్వ జనీనత్వాన్ని పొందింది. కౌరవ పాండవుల బంధువులే కాదు, అనేక క్షత్రియ వీరుల తత్సహాయక గణం మరణించారు. గజ తురగాది ప్రాణి కోటి కూడ క్షతమైంది. ఈ వ్యక్తుల పరాక్రమం నేర్పు శక్తి అనేక విధాలైనవి. ఇక దు:ఖ విషయానికొస్తే ఇది ఒక విధమైంది కాదు. అనంత వైవిధ్యోపేతమైంది, బంధు స్నేహ పరివార అధికారాది భావాలతో కూడింది. మొత్తం మీద మానవీయ ప్రాణిగత స్పందనతో సర్వం అనుభూతి మయమైంది. ఈ మహా వైవిధ్యం కవిబ్రహ్మ సృజనశక్తిని వైవిధ్యోన్ముఖంగా వర్తింపజేసింది. ఇంతటి భావ వైవిధ్యాన్ని ప్రకటించడానికి వైవిధ్యం గల వృత్తాల్లో పద్యాలు సాక్షాత్కరించాయి.

స్త్రీ పర్వంలో సాధారణ ప్రసిద్ధ వృత్తాలు దేశీయ పద్యాలతో పాటు అసాధారణమైన వృత్తాల ప్రయోగం కన్పిస్తుంది. ఈ రచనా నిర్మాణం ఎవరి ఆక్షేపణపైనో పాండిత్య ప్రకర్షకో తలపెట్టింది కాదు. అసాధారణమైన శోక భావోదగ్గమన స్థితులు వాటికి తగిన విశేష విధానం వైపు దృష్టిని ప్రసరింపజేస్తాయి. దీని మూలం సృజన రూపంలో భాగమైంది. దీని అభివ్యక్తి కావ్య నిర్మాణ శిల్పంలో అంతర్భూతమైంది.

ఈ సందర్భంలో ఛందశ్శాస్త్రవేత్త కోవెల సంపత్కుమారాచార్య విశ్లేషణంలో ఈ క్రింది విధంగా రూపితమైంది. "తిక్కన స్త్రీ పర్వంలో ఉపయోగించిన వృత్తాల్లో నన్నయ భారతంలో ప్రయుక్తమైనవి. తరల, వహంతతిలక, మత్తకోకిల, తోటక, కవిరాజవిరాజిత, మాలినీ, మానినీ, స్వాగత, వనమయూర, ద్రుతవిలంబిత, అంబురుహ, లయగ్రాహి, ఉత్సాహ తరువోజ యన్నవి పదునాలుగు. భుజంగ ప్రయాతం, క్రౌంచపథం. మణిగణనికర, మంగళమహాశ్రీ (నన్నెచోడుడు కుమార సంభవంలో ప్రయోగించినవి) నాలుగుతో ఈ పదునెనిమిది గాక తిక్కన ఇంద్రవజ్ర, మంజుభాషి, ఉపజాతి, దోదక, తోడక మణిమాలా, నర్కుట, బంధుర శుద్ధవిరాం, లయవిభాతి, ఉపేంద్రవజ్ర, స్రగ్విణి, పణవ, జలధర, మేదినీ, ప్రహరణకలిత, సరసిజ, భాస్కర విలసితయన్నవి పదునెన్మిదిని కొత్తగా ఉపయోగించెనవచ్చును". ఇక్కడ మొత్తం మీద తిక్కన ఛంద: ప్రయోగ వైవిధ్యానికి సంబంధించిన రచనా శిల్పమే ముఖ్యం. ఈ ప్రత్యేకతను గూర్చి కోవెల సంపత్కుమారాచార్య "ఇందు సాధారణ ఖ్యాత వృత్తములు దేశీయ పద్యములున్నను విశేషముగా నసాధారణములయిన విశేష వృత్త ప్రయోగ బాహుళ్యమున్నది. విపులమైన వృత్త వైవిధ్యము గమన వైవిధ్యములతో స్త్రీ పర్వము వైలక్షణ్యమును సంపాదించుకొన్నది." ఈ అంశంపై మరింత సూక్ష్మంగా ప్రత్యేకమైన పరిశీలన జరుపవలసి ఉంది.

పూర్వ మహావైభవం వినష్టమైంది. దాని స్థానంలో మహా విషాదం ఆవరించింది. ఇది తత్ప్రనావానికి గురియైన వారిలో తత్రత్యులైన వారిలో కోపానికీ ఆవేదనకూ ఆవేశానికీ బాధకూ మానసిక వైక్లబ్యానికీ దారి తీసింది. ఈ అనిదంపూర్వమైన వాతావరణ వైవిధ్యం బహు విధ ఛందోరూపాల్లో స్ఫుటాకృతిని పొందింది. స్త్రీ పర్వంలో వక్తవ్యాంశం 'తరళ' మన్న వృత్తంతో మొదలయింది. జనమేజయునితో వైశంపాయనుడు, పలికిన విధంగా ధృతరాష్ట్రుని చింతా స్థితిని చిత్రించడం జరిగింది.

**"ధరణి నాయక! యట్లు పుత్ర శతంబు వైరి కులంబుచే**
**నిరవశేషత నొందుటన్ మహనీయ గౌరవ హీనతం**
**బొరసి కొమ్మలు దున్మ మ్రోద్పడు భూరుహంబును బోలె ని**
**ర్భర విపద్వికలాత్ముడై ధృతరాష్ట్ర డుల్లము నెవ్వగన్"**

ఈ చిత్రణలో ప్రధానమైంది ధృతరాష్ట్రుడు భరింప శక్యం కాని విపత్తులో పొందిన వైకల్యం. ఈ భావాన్ని చెప్పడానికి "తరళం" స్వీకృతమయింది. తరళ మంటే చంచలమైంది. చలించింది. ఇక్కడ ధృతరాష్ట్రుని మనస్సు స్థిరత్వాన్ని కోల్పోయింది, సమత్వం లోపించింది. ఈ కారణంగా వృత్తం ఎన్నిక సముచితంగా ఉంది. మరో దృష్టితో తరళ మంటే నాయకమణి అంటే హార మధ్య భాగంలో ఉన్నప్రధానమైన మణి. ఏతత్స్వార్థీయుడు ధృతరాష్ట్రుడు. అతడిపుడు "కొమ్మలు దున్నమోడ్పుడు" భూరుహం వలె ఉన్నాడు. ధృతరాష్ట్రునికి కౌరవ వంశంలో సహజంగా ఉన్న పెద్దరికాన్ని బట్టి "తరళ" శృత్తం ప్రయోగం సమంజస మనిపిస్తుంది. ఇట్లా స్త్రీ పర్వంలో పద్య రచనా శిల్పాన్ని ప్రత్యేకంగా సమాలోచనం చేసే వీలుంది. లయగ్రాహి యుద్ధరంగంలో పిశితాశనులకు సంతోష స్థానంగా పరిణమించిన స్థితి చిత్రితమయింది. ఇందులో "చిత్తముల దృప్తిన్ జొత్తిలి నితాంత మద మత్తములుగా" చటుల నృత్తాలు చేసే వారి మానసిక రూపాని కనుగుణమైన నడక సంపాదితమైంది. 'మంగళమహాశ్రీ' వృత్త ప్రయోగం పేరు చేత ఈ సందర్భంలో కాస్త ఇబ్బంది పెట్టవచ్చు కాని దుర్యోధనుని "కళేబరాన్ని చూచి గాంధారి, అతడు రణ రంగానికేగే ముందు తన వద్దకు దీవెనకై వచ్చిన మధురమైన స్మృతి విశేషంతో ఔచిత్యాన్ని భజిస్తూంది. గతంలోని పేర్కొదగిన స్థితుల్ని యధాతథంగా స్మరిస్తూ విలపించడం సహజం. ఇది అమేయ దు:ఖంలో మానసికంగా కొంత ఊరటను కలిగించే మాట నిజం. ఇది మనస్తత్వ విశ్లేషణ పరమైన అనుకూల ప్రతికూల రీతుల్లో స్థితి సందర్భంతో, పాత్ర గుణంతో మానవ సంబంధంతో అనుభూతి గుణంతో రచన సాగింది. సుప్రసిద్ధ విమర్శకులు కోవెల సంపత్కుమారాచార్య మాటల్లో "ఈ అసాధారణ ప్రయోగాన్ని సమర్థవంతంగా సప్రయోజనంగా తిక్కన నిర్వహించినాడు." ఈ అసాధారణ ప్రయోగం ఛందశ్శిల్ప రామణీయకతను కలిగింది.

స్త్రీ పర్వం ప్రథమాశ్వాసం మొదటి పద్యంలో నన్నయ సృజన సూత్రాన్ని అందిపుచ్చుకొన్న తిక్కన, తత్త్వభూమికలో హరిహరనాథుని కరుణామయమూర్తిగా వర్ణించడం గమనించదగింది. ఈ పర్వంలో నిర్వహింపబడే కథాగతమైన కరుణఆమయమైన విషయాన్ని సూచిస్తూంది. యుద్ధంలో మరణించిన వారికి నూర్ధ్వ

దైహిక క్రియలతో దు:ఖ సాగర మగ్నులైన వారు శాంతస్థితికి చేరుకోవలసిన అవసరముంది. సంభ్రాంత స్థితి నుండి సాధారణ వివేకానికి దారి చూపవలసి ఉంది. ఈ విధంగా స్త్రీ పర్వ రచనా శిల్ప మసాధారణ నిర్వహణ శిల్పంతో లోకోత్తరమయింది.

ఇతిహాస రచనలో కావ్య స్వరూపంతో "ప్రబంధ మండలి"గా లక్షితమైన, తిక్కన మహాభారత రచన తనదైన సృజన కళ – నిర్వహణ శిల్పంచేత ఆదర్శమైంది, ఆదరణీయమైంది. ఇది తెలుగు కవిత్వానికి విరాట్ స్వరూపాన్ని ఆవిష్కరించింది.

# నిర్వచనోత్తర రామాయణం : కావ్య కళా శిల్పం

తిక్కన మొదటి కావ్యం నిర్వచనోత్తర రామాయణం. దీనికి వాల్మీకి మహర్షి రామాయణంలో ఉత్తరకాండ ఆధారం. ఈ కావ్య రచనలో తిక్కన మూలానుసరణంలో ఎక్కువ స్వాతంత్ర్యాన్ని వహించాడు. పూర్వ రామాయణ కథా ప్రసక్తిని కొ,త సంగ్రహపరిచాడు. శ్రీరామ నిర్యాణాన్ని పరిహరించాడు. కావ్యాన్ని శుభాంతం చేసాడు. "అమలోదాత్త మనీషనే నుభయ కావ్య ప్రౌఢ పాటించు శిల్పమునన్ పారగుడన్ కళావిదుడ" అన్న మాటలకు లక్ష్యభూతంగా దీన్ని తీర్చాడు.

మునులు రాముని స్తుతించారు. కారణం రాక్షసుల్ని జయించడమే. ఆ రాక్షసుల్ని గురించి తనకు తెలీదు. సవిస్తరంగా చెప్పవలసిందిగా రాముడు మునుల్ని కోరడం కావ్యాన్ని ఆరంభించడంలో ఆవలంబించిన శిల్పం. రావణ వధకు కారణం సీత అశోకవనంలో ఉన్న సీతావార్తను హనుమంతుడు తెచ్చాడు రాముని మనస్సుకు శాంతి చేకూర్చాడు. హనుమంతుని ప్రశంసించడం జరిగింది. "హనుమంతుడు లేనిచో జనకజను, పొందడం సంభవ మయ్యేది కాదు. హనుమంతుడు వినయం చేత లజ్జచేత అవనతవదనుడయినాడు. రాముడు ప్రేమతో కృతజ్ఞతతో హనుమంతుని వీక్షించాడు. అనుష్ఠానం వేళ అయింది. "విచిత్ర కథా రసవృత్తి"లో సమయం తెలియలేదు. మునులు విశ్వజనీనుడనైన నిన్ను చూస్తూ ఉండడం అనుష్ఠానం కాదా?" అన్నారు. రాముడవతారపురుషుడన్న భావం సూచితమయింది. దుష్ట శిక్షణం శిష్ట రక్షణం చేత మునుల బాధలు తీరాయి. రాముడు వారి దృష్టిలో సామాన్యుడు కాదు. ఈ అనుష్ఠానాదు లెవరి కొరకో అతడు తమ ఎదుటనే ఉన్నాడు. ఇక్కడ కథాంశం భౌమం నుండి దివ్యాని కెత్తబడింది. శ్రీ రామచంద్రుని పరమేశ్వరత్వం స్థాపితమయింది.

## వేదవతి

వేదవతీ చరిత్ర మొక చిన్న కథ. అయినా ఇది రామాయణానికి ప్రాణభూతమైంది. ఈ కథలేకపోతే రామాయణమేలేదు. సీతాజననమే ఉండేది కాదు. రావణుడు కైలాస పర్వత మెత్తబోయి విఫలుడై హిమ గిరి ప్రదేశంలో

విహారతత్పరుడయినాడు. ఒకచోట రాగ వర్జితయైయున్న సంయమనను యౌవనవతిని చూచాడు. కామాయత్త చిత్తుడయినాడు. "ఎవరవ"ని ప్రశ్నించాడు. తన వృత్తాంతం చెప్పింది. అతిథి మర్యాదకనుగుణంగా సంభాషించింది. ఆమె కుశధ్వజుని కూతురు. వేదాభ్యాస సుకృతం వల్ల జన్మించింది. వేదవతి యని పేరు పెట్టాడు. ఆమెను విష్ణువునకీయాలని తండ్రి సంకల్పం, ఎవరడిగినా నిరాకరించాడు. సురేంద్రుడు అడిగి విఫలుడై కోపించి యాతని చంపాడు. తల్లి చిత్యగ్ని ప్రవేశించింది. తండ్రి కోర్కెతీర్చేందుకు విష్ణువును మది నిల్పి తపస్సు చేస్తూంది. ఆ స్థితిలో రావణుడామెను చూచాడు. ఈ కథకు రావణుడు శ్రోత అయినాడు. రావణుడహంకార మదోద్ధతుడు. ఆమె మాటలు సంక్తిశీర్షుడయి కూడా తలకెక్కలేదు. ఆమె మహోత్కంఠత మనోవేదన అర్థం కాలేదు. ఆమెను కోరాడు.

తిక్కన కథాంశాన్ని ఘటించిన తీరు కళాత్మకమైంది. రావణుడామెను 'పొందుమ'ని అడగలేదు. ఆమె అవలంబించే తపోనియమాలు తగవన్నాడు. ఆమె విష్ణు గత మతి, యని తెలుసు! తన యభిప్రాయాన్ని క్రమంగా బోధపరచే ప్రయత్నం చేసాడు. ఇది మొదటి మెట్టు. అతనిలో బయటికి స్ఫురించే మృదురూపం ఆవిష్కృతమయింది. ఆమెతో "ఒంటరిగా శరీరాన్ని కాఱియబెట్టడం పాడియె?" అని ప్రశ్నించాడు. "చారులోచనా!" యని సంబోధించాడు. ఆమె కష్టాల్ని గురించి సహానుభూతి యటుంచి అందమైన కళ్ళు కలదిగా ప్రశంసించడం లోపల దాగియున్న సౌందర్య పిపాసను సూచిస్తుంది. ఆమె మాట్లాడలేదు. అతడు 'లలనా!' అని మృదువుగా సంబోధించాడు. "విష్ణు వనంగ నెవ్వడ"ని ప్రశ్నించాడు. తన దోర్బల సంపత్తి ప్రఖ్యాత పరాక్రమం వివరించాడు. ఇంతకు ముందే యాతని దోర్బల సంపత్తి శివునిచే అణచబడింది. ఇక విష్ణువు వంతు ఉంది. విష్ణువుకు తనకున్న వీర వ్యక్తిత్వం లేదని పలికాడు. లంకను పేర్కొన్నాడు. దాని ముందు సకల లోక సంపత్తి పనికి రాదన్నాడు. రావణుడు విష్ణువిరోధి. ఆమె విష్ణువునందాసక్తి కలిగిందని తెలియడంతోనే కోపం కలిగింది. కాని దాన్ని అణచి వేసాడు. ఇపుడీ మాటల్లో బహిర్గతం కాక తప్ప లేదు. ఇది రెండో మెట్టు. వేదవతి చెవులు మూసుకుంది. 'లోకవంద్యు, పరము అవ్యయు, ఫలదాత హరిని చెడనాడగూడద"ని పలికింది. ఆమె పతిభావన ఆధ్యాత్మిక యోగ

నిష్ఠమైంది. ఈ మాటలు రావణుని చెవికెక్కలేదు. అతనిలో బలాత్కార భావన అతిశయించింది. ఇది మూడో మెట్టు. రావణుని రాక్షస భావంలో అధర్మమైన కోరిక కలగడం, దాన్ని గురించి ఆలోచన వేయడం దానికై ప్రయత్నం జరపడమన్న మూడు దశల క్రమ పరిణామం చిత్రితమైంది. అతడు మోహావేశాన్ని పొందాడు. "జక్కవ దోయివోని చన్నుగవ యింపెసలారగ నాదు వక్షమన్ సరోవరంబున కేళి యొనర్పు"మని శృంగార భావాన్ని ఒలకబోసాడు. "కోమలీ' అని మరో సంబోధనం పలికాడు. స్త్రీ విషయంలో రావణునిలో సంయమనం అసాధ్యం. ఇది అవధుల్ని స్పృశిస్తోంది. అతని సంయమ రహితమైన మాటలకు కోపం వహించింది, కాని పౌలస్త్యుడని ఉపేక్షించింది. 'అతిథియని సపర్య, సమయోచిత సంభాషణం' చేసింది. అయితే అతనికి "మతిలేదు" మతి ఉన్న వ్యక్తిగా ప్రవర్తించడం లేదు అందువల్ల "దురాత్మా!" అని సంబఓధించింది. అతని ఆత్మ దుష్టమైంది. కాబట్టి మతి లేకపోవడం ఆలోచన సరిగా చేయకపోవడంలో ఆశ్చర్య లేదు. వేదవతి అచ్చటి నుండి వెళ్ళదలచింది. రావణుడిది గ్రహించాడు. వెంటనే "గ్రక్కున వేనలి" పట్టుకున్నాడు. రావణుని గుణాల్లోకి తొందరపాటు దుశ్చర్యకు దారి తీసింది. అంగన వ్రేలవేయడంతో కత్తివలె తాకి "కత్తిరించిన క్రియ" వెంద్రుకలు చేతిలోకి వచ్చాయి. రావణుడు భయపడ్డాడు. ఆశ్చర్యపోయాడు. ఆమె రోషానల జ్వాల అయింది. ఆమె తపోమహిమాన్విత, సామాన్య స్త్రీ కాదని తెలిసింది. ఆమె తప: ప్రభావ మిపుడతని కనుభవానికి వచ్చింది. ఇతః పూర్వం బుద్ధిని క్రమ్మి మోహాంధకారంలో దీన్ని గురించి ఆలోచన కవకాశంలేదు. ఇపుడు మోహం పలచబడింది. రోషం కోపంతో ఒకటైంది. ఇది అవమాన జనితమైంది. అతడు ఓటమి నెరుగని (ఒక్క కైలాస పర్వతాన్ని పెకలించే వేళ శివ ప్రభావం వల్ల తప్ప) పౌరుష మూర్తి. తానింతవరకితరులకు భయమూర్తిగా ఆశ్చర్య రూపంగా ఉన్నవాడు, పరిస్థితి తలక్రిందులయింది. మరో క్షణమే నిలదొక్కుకున్నాడు. "రోష మహానల జ్వలన" మూర్తి అయినాడు. ఆమె వనుకకు మరలింది. నేను నిన్ను శపించఃగలను. అది తప: ప్రభావోన్నతికి చేటు, నీకు మృత్యువై ఉద్భవిస్తాను. "సన్నుత పుణ్యజాతయన జాలి యయోనిజమూర్తి" దాలుస్తానంది. మళ్ళీ అతడు దుశ్చర్యకు ప్రయత్నింపవచ్చు. ఆమె అనలం బాపాదించుకొని విష్ణుభావనతో చిత్యగ్ని

ప్రవేశించింది. ఆమెకు ప్రాణం కన్నా గౌరవాభిమానం దానికన్నా తపస్సు ముఖ్యం. తపస్సు ఆత్మగతమైంది. తపశ్శక్తికి నష్టం లేకుండా "దశాననుని గర్వమణ" చాలనుకుంది. రావణుని గుండెలో మృత్యుభావన కొండయై నిలిచింది. "దశాననుని యేపడగన్" అన్న కవి వాక్యం పాత్ర పొందిన పరిణామాన్ని సూచిస్తూంది. కృతయుగంలో వేదవతి, త్రేతాయుగంలో సీతయై జన్మించింది. వేదవతి ఆలౌకికమైన దివ్యభావన పట్ల నిష్ఠ కలిగింది. రావణుడు లౌకికమైన భౌతిక పట్ల అభిలాష కలవాడు.

ఒక ఆత్మ ఊర్ధ్వముఖంగా ఉంది. మరొక ఆత్మ అధోముఖంగా ఉంది. ఈ రెండు పరస్పరం భిన్నమైన ప్రకృతుల్ని ఆశ్రయించి ఉన్నాయి. వీటి వైరం నిరంతరమైంది. ఈ రహస్య మెరిగిన తిక్కన మూల భూతమైన జీవ గుణాల్ని ఆశ్రయించి కథాంశాల్ని ఘటితం చేయడం జరిగింది. ఇది కరుణ రసాత్మకమైంది. అనన్య నిర్మాణ రూపం కలిగింది.

అగస్త్యుడు రామునితో ఆ వేదవతియే ఈ సీత అనడంతో, రామునిలో ఆమె పుణ్యచరితకు "విస్మయం". ఆమె జన్మజన్మలో పొందిన దుస్థితికి "ఆర్తి" రావణుడట్లు జన్మజన్మలో చేయడం వల్ల "కోపం" రావణవధతో సీతను తిరిగి పొందినందుకు "ప్రీతి" కలిగింది. రామునకు విష్ణ్వంశ సంభూతుడని ఒకరు తెలియచేయ వలయునా? అన్న ప్రశ్న కలగవచ్చు. కాని రాముడు మాయా మానుష విగ్రహుడు కాబట్టి తెలియదు. కృష్ణుడు లీలా మానుష విగ్రహుడు కాబట్టి తెలియదు. కృష్ణుడు లీలా మానుష విగ్రహుడు కాబట్టి తెలుస్తుంది. ఇది ఇరువురి అవతారాల్లోని భేదం. అగస్త్యుడు జ్ఞాపకం చేసాడు. అప్పుడప్పుడు విశేషస్థితిలో లీలగా స్ఫూర్తిగా రావచ్చు.

జీవునికి కర్మయే ప్రధానం. ఫలితం లేని కర్మ ఉండదు. కార్య కారణ భావాన్ని అనుసరించి సృష్టి నిరంతరం సాగుతుంది. కర్మఫలం దూర ఫలమనీ సద్య: ఫలమనీ రెండు విధాలు. ఇక్కడ తాను చేసి దుష్కృత్య విషయంలో దూరఫలం అనుభవించడం జరిగింది. రాక్షస ప్రవృత్తి కలవాడైనప్పటి రావణుడు తపస్సంపన్నుడు. శివానుగ్రహం పొందినవాడు. వేదవేత్త! ఒక దోషం చేత ఆత్మ హననం జరిగింది. సామాన్య పాత్రల్ని చిత్రించినట్లుగా ఊహ చేయడం కుదరదు. అన్ని కర్మ మనస్సు

ఆలంబనంగా రూపొందుతాయి. ఋషులు దీన్ని నియమిస్తారు. సత్పురుషులు ఆదుపులో పెడతారు. సుఖ వాంఛకై జీవుడు యత్నిస్తాడు. ఇది జీవ సంస్కారానుగుణంగా సాగుతుంది. ఇది పూర్వ జన్మకృత పుణ్య పాప ప్రభావ కలితంగా రూపొందుతుంది. ఒక పని సాధించడానికొకరు ధర్మ మార్గాన్ని అవలంమిస్తారు. మరొకరు ఆధర్మ మార్గాన్ని అవలంబిస్తారు. ఒకరే ఒక సమయంలో ధర్మ మార్గాన్ని మరొక సమయంలో ఆధర్మ మార్గాన్ని అనుసరిస్తారు. ఏది ధర్మం అన్నది మరో సూక్ష్మ విషయం. రావణుడు మాత్రం ఈ సందర్భంలో పుణ్యపాప వివేచన లేకుండా స్త్రీ విషయంలో అదీ తపస్సాధనలో ఉన్న పవిత్రమూర్తి పట్ల కామాంధుడై ప్రవర్తించాడు. దుశ్చర్యకొడిగట్టాడు. కాబట్టి ఆ కర్మఫలం అనుభవించక తప్పదు. ఇది కావ్య రచన అవడం వల్ల కథాంతర్గతమైన తాత్త్వికాంశాలు కవి మాటల్లోను మధ్య మధ్య సూచన ప్రాయంగాను ప్రకటితమయినాయి. ఇక పాత్ర చిత్రణంలో పరస్పర వ్యతిరేకమైన ప్రకృతుల చిత్తవృత్తులు ప్రవర్తనా రూపాలు దృష్టికి వస్తాయి. ఇందులో అనివార్యమైన ఘర్షణ కథాగతిలో దాని పర్యవసానంతో కావ్య శోభను పొందింది. తిక్కన కావ్య కళాశిల్ప ముఖాన్ని బింబిస్తూంది.

# రంభా రావణ సంవాదం

రంభారావణ సంవాదం రామాయణ గాథతో ప్రధానమైన సంబంధం కలిగింది. రావణుడు రంభను చెరపట్టాడు. ఆమె తన ప్రియుడు నలకూబరునికీ విషయం చెప్పింది. అతడు కుపితుడై "ఇంక దశకంధరు డెవ్వతెనైన నీక్రమంబున పయివడ్డ మృతింపొందగలడ"ని శపించాడు. దీనికి దేవతలు సంతోషించారు. రావణుడు సీత నపహరించినపుడు ఆమె మనస్సు తమ పట్ల మారడానికి కొండ గడువు ఇచ్చాడు. లేనిచో ఆమెను వధించి మాంసం భుజిస్తానన్నాడు. కాని బలాత్కరించ లేదు. అతనికి ప్రాణం ముఖ్యమైంది.

రావణుడు రంభను చూచే ముందుచంద్రో దయ చంద్రికా వర్ణనం ప్రకృత స్థితికి సముచితంగా ఉంది. అతనిలో తలెత్తబోయే శృంగార భావానికి దోహదం చేస్తూంది. చంద్ర బింబం నడిమి లాంఛనంతో ఉదయించింది.

**చిత్తజు చిగురులం చిత్రంబుగా నిడ్డ, లలిత తమాల వల్లవ మనంగ**
**రతిపు మాణిక్య దర్పణమున నూనిన, కమనీయ మృగ మద కణమనంగ**
**వెడవిల్లు లీలో రవిందంబు మీదికి, దివుటమై నెరగిన తేటి యనగ**
**వలరాజు సింధూర తిలకంబులో చెలు వొందు కాలాగురు బిందు వనగ**

రంభ రావణుని "అతులిత ధైర్య సార కరుణాలయ మానస" అని సంబోధించింది. అసమానమైన ధైర్య వహించాడు, బాగానే ఉంది. కరుణ కూడ ఉన్నవాడని, దాన్ని చూపుమని కోరిక వెలిబుచ్చింది. "నేను రంభను, నాపతి నలకూబరుడు, అతని పాలికి పోయెద"నని "అన్యచిత్తయై పోయే అతివను అడ్డగిస్తారా?" అని ప్రశ్నించింది. తనను బలాత్కరింపవచ్చు. ఉపాయంతో తప్పించుకోవాలి. అందుకని పొగడింది. అతనితో తనకు కన్పించిన ధైర్యాన్ని, కన్పించని కరుణను కీర్తించింది. అతని మనస్సు కరుణా నిలయ మనడంతో మెత్తబడి ప్రార్థన మన్నించి వదలి వేస్తాడనుకుంది. నాయికా నాయకాశ్రితమైనపుడే శృంగారం పూర్ణతను పొందుతుంది.

అయితే "అనుచిత విభావలంబనత్వం రసాభాసత్వం" ఉచితం కాని అంటే తగని విభావాలంబనం కూడా రసాభాసమే. అన్యుని యందు అవుతుంది. రక్తయై ప్రకృతం ఆసక్తి లేని నాయిక పట్ల "శృంగార భావ ప్రకటనం అనుచితమే. "అనౌచిత్యాధృతే నాన్యద్రసభంగస్య కారణమ్" అని అనౌచిత్యాన్ని పొందడం కన్నా రసభంగానికి కారణం వేరే లేదు. రంభ దేవ వేశ్య కామ కళా పారగురాలు. కాబట్టి ఉపాయంతో పరిపూర్ణ రస వివేకంతో పలికింది. రావణుడీమాటలకు మొత్తబడ లేదు సరికదా ఆమెపై వలపు మరింత అధికమైంది. తన పేరు ప్రఖ్యాతులు చెప్పాడు. అమరావతి పైకి దండెత్తి హిమగిరి ప్రాంతంలో సేనల్ని "విడియించి" తిరుగుతూన్న విధం తెలియజేసాడు. ఇక్కడ సేనల ప్రసక్తి దేనికి? అంటే తాను మహావీరుడు, పైగా ఒంటరిగా లేడు. సేనా సమూహంతో నున్న మాటలో బల ప్రసక్తితో ఆమె మనస్సును భయభ్రాంతం చేసే వైఖరి కన్పిస్తుంది. ఆమె తప్పించుకో జూచే కల్పన శృంగార భావ సమర్పకంగా సుకుమారమైన ఊహలతో మలచబడింది. చంద్రునిలో లాంఛనాన్ని వర్ణించడంలో రావణుని మనస్సులో ఏర్పడబోయే కళంకం సూచితమవుతూంది.

ఈ సన్నివేశం శృంగార భావోపేతమైంది. కోరిక అధర్మమైంది కావచ్చు. కాని కోరిక నుద్దీప్తంచేసేవి, అనుగుణమైనవి ప్రకృతి సహజాలు. "చెలగి చెలగి మలగి మలగి యల్ల నల్లన క్రాలి క్రాలి బిట్టు తూలి తూలి సమదవృత్తి కేళి సలుపు చకోర చయం" కనిపించింది. ఈ దృశ్యం రావణుని మనస్సును ప్రభావితం చేసింది. కామ ప్రవృత్తి కలవాడవడం వల్ల కౌముది అతని దృష్టికి సంభోగ శృంగార భావ సమర్పకమైన కల్పనతో రూపొందింది. వెన్నెలను కోరి రమించే ఉన్మత్త చకోర దంపతుల్ని మెచ్చుకుంటూ వేరొక స్థలానికి వెళ్ళాడు. అప్పుడొ కర్తును చూచాడు. సహజ సౌందర్యాకృతి, ఆభరణాలెక్కువ ధరింపలేదు. మెల్లగా నడుస్తూంది. ఆమెను పొందాలనే భావం, ఇంతకు ముందు హత్తుకున్న చకోర దంపతుల దృశ్యంతో మనస్సులో గాఢరమైంది. ఆమె కడ్డం వెళ్ళాడు. ఆమె కంపించింది. అతడు రాగంతో ఆమె చేయిపట్టుకొని "నీ వెవ్వతవు? ఎచ్చోటికి పోయెదవ"ని ప్రశ్నించాడు. ఆమెకు చెమటలు పట్టాయి. అతని ధైర్యానికి ఆశ్చర్యపడింది. తనకు తెలీని స్త్రీని చూచి సాహసంతో చొరవ తీసుకొని ప్రవర్తించడం విచిత్రంగా ఉంది. "నిన్ను చూచి కామ వశుడన"య్యాను.

తనను స్వీకరించి ఇష్ట భోగాల్ని అనుభవించవలసిందిగా కోరాడు. ఏ విధమైన బలప్రయెగమైనా చిట్ట చివర ఉపయోగించవలసిందేనని రావణునకు తెలుసు. రంభ మరో ఉపాయం ప్రయోగించింది. “నీవు పంక్తి ముఖుడవైతే నీకు కోడల్ని కదా! తొలగు మ”ంది. చుట్టరికం కలిపి, వరుస కుదరదని, ఇది తగదన్న సంప్రదాయ ధర్మంతో వారించాలనుకుంది. “తొలగు తొలగు” మన్న పునరుక్తి తెలియక తప్పు చేసిన వ్యక్తికి తప్పు తెలియజేసి దాని నుండి వెంటనే విముఖుణ్ణి చేసే యత్నాన్ని ప్రకటిస్తోంది. ఏ మాత్రం ధర్మబుద్ధి ఉన్నవాడైనా ఈ ఉపాయానికి తల ఒగ్గక తప్పదనుకుంది. “నీవు మాటలాడ నెర్చిన దాని”వని “కొడుకు భార్య అయితనే కోడలు! ఏదో విధంగా వరస కలపడం తగద”న్నాడు, ఆమె తన ప్రయత్నం మానలేదు. మూడో ఉపాయం పన్నింది. ఆ కుబేరుడు నీవు అన్నదమ్ములు కదా! అతని కొడుకు నీకు కొడుకు కాదా? యని ప్రశ్నించింది. ఈ మాటలు రావణుని మతి కెక్కలేదు. రంభ వేశ్య కాబట్టి “కుల భామ వలె తగవు ఘటించడం” పనికిరాదన్నాడు. “సిరి వస్తే మోకాలడ్డే వారున్నారా?” అని తన మనోవాంఛను సమర్థించుకుంటూ నిష్కర్షగా మాట్లాడతాడు. “నీవు ప్రేమభావ మెరుగవ”ని “విరస” వచనాలతో, భంగింప జూచింది. కాని ఆమె మాట లతని చెవికెక్కలేదు. “ఉన్మత్తుని” వలె, పొదివి కొన్నాడు.

**“పగరాజు పై వచ్చి బలువిడి పరిభవించిన తలంకిన పురశ్రీ విధమున**
**సమద ద్విపము కేళి సలిపిన చాల నలంగిన యుద్యాన లక్ష్మి కరణి”**

రావణునిచే బలాత్కరింపబడిన రంభ స్థితి “ఎంతయు  “విన్న” దనాన్ని పొందింది. రావణుడు ఈ పద్యంలో పగరాజు, సమద ద్విపదం, ఘన లులాయం, ఝంఝూ మారుతంతో పోల్చబడినాడు. శత్రుభావం మదాంధత్వం మోటుదనం తీవ్రగతి తత్కాలంలో అతని మనోరూపాన్ని ప్రకటిస్తున్నాయి. ఆమె దేవవేశ్య కాబట్టి అతనిలో శత్రుభావం, ఉండనే ఉంది కామం చేత మదాంధత్వం కలిగించి. రాక్షస జన్మ కాబట్టి మోటుదనం బల దర్పాహంకారం వల్ల తీవ్ర గతి వైఖరి స్ఫూర్తికి వస్తాయి. రంభ పురశ్రీ ఉద్యానలక్ష్మి నెత్తమ్మి కొలను మవ్వంపు తీగెతో పోల్చబడింది.

సౌభాగ్యం సౌందర్యం శాంతమనం, సౌకుమార్యం ఆమె సహజ రూపాన్ని బింబిస్తున్నాయి. రావణుని చేత అనుభవింపబడిన అంభ "తలంకిన"దై "నలంగినదై" కలంగినదై నెఱి దప్పినదై "చెన్ను దప్పి"ంది "విన్న"నయింది. ఇది తిక్కన సృజన రూపానికి ఉదాహరణీయంగా ఉంది.

మరో విషయం రావణుడు దేవతల పైకి దండెత్తి మధ్యలో అక్కడ విడిది చేసాడు. దేవతలపై అతనికి పట్టరాని కోపం. రంభ దేవతా నగరానికి శోభ తెచ్చేది. ఆమెను బలాత్కరించి అనుభవించడంలో అతనికి స్వర్గాన్ని కొల్లగొట్టి నంత ఆనందం. ఆమె స్వర్గ పురశ్రీ ఈతడు పగరాజు. మదించిన ఏనుగు మన్ను మిన్ను కానదు. ఉద్యాన వన మంటే చెట్లు తీగెలు నీటి కాల్వలు దిద్ది తీర్చిన సౌందర్య కళా ప్రదేశం. బహు వర్ణ కుసుమాలతో వివిధ పరిమళ పవమానంతో భోగాకృతి పొందింది. నాగరక సేవ్యమైంది. సమద ద్విపం ఉండవలసిన స్థానం అడవి. అది మదమెక్కినపుడు సరభస గతితో పరుగెత్తుతుంది. ఉద్యానవనమని ఆగిపోదు. దాన్ని నాశనం చేసి తీరుతుంది. ఆమె ఉద్యానలక్ష్మి ఈతడు సమదద్విపం. లులాయం మోటుదనాని కవధిభూతమైంది. నెత్తమ్మి కొలను స్వచ్ఛత సౌకుమార్యం శాంతం సౌందర్యం వికాసం సువాసనల కాటపట్టు విలాస జన లీలా విహార యోగ్యమైంది. అది దానికి శోభా హేతువు. దేనికేది ఉచితమో అది లభించినపుడే రెండింటికి సార్థకత. లులాయానికి తగిన స్థలం బురద మడుగు మాత్రమే. ఝంఝూ మారుతం చెట్లను పెల్లగిస్తుంది. ఇక తీగెల విషయం చెప్పనక్కరలేదు. ఛిన్నా భిన్నం చేస్తుంది. మంద సమీరానికి నృత్యం చేసే తీగెలు ఝంఝూ మారుతాన్ని కోరవు. ఝంఝూనిలం విలయ లక్షణం కలిగింది. రావణుడు తనను తానదుపులో పెట్టుకోజాలనివాడు. తీవ్రమైన ప్రకృతిగలవాడు. మనోజ్ఞ లతా గుణం మూర్తీభవించిన స్త్రీ రంభ, మవ్వపు తీగె అతడు ఝంఝూ మారుతం. రావణునికి నిర్వ్యాజ సహజ శృంగారం కన్నా విజృంభమాణ కామతృష్ణను తీర్చుకోవడమే ప్రధానం దీనితో శత్రు సంపదను పొందిన తృప్తి కలిగింది.

రావణునిచే పరిభూతమైన రంభ “వెలవెల బారుచు, తలకుచు తొౖట్రు పడుచు తనలో పలుకుచు” నలకూబరుని సన్నిధి కేగి జరిగింది చెప్పింది. అతడు కలుషించి, రావణుని శపించాడు. సర్వస్త్రీ జాతికీ శాపమూలంగా రక్షణ దొరికింది. ఈ శాప విషయం రావణునికి తెలిసింది. ఇక బలవంతంగా చెలువల్ని గ్రహించ రాదనుకున్నాడు. ఈ నిశ్చయం రావణునిలో ప్రాణభయాన్ని సూచిస్తుంది. అతనిలో అధర్మ కామ గుణం సంపూర్ణ వీర వ్యక్తిత్వానికి క్షతి కలిగించిన మాట వాస్తవం. ఆ స్థితిలో అభిమానం మొక్కవోయింది, మనస్సు వికలమైంది. పూర్వమనుకున్న దాన్ని ఆలస్యం చేయకుండా ఆ స్వర్గం పైకి కదలాడు. ఏదో ఒక రూపంలో అతనిలో దుష్కార్యబుద్ధి విజృంభిస్తూనే ఉంది. తిక్కన రంభా రావణ సంవాద ఘట్టాన్ని ఆధర్మ కామ వశమైన మనస్సు కేంద్రంగా, ఆహంకార రేఖల తీవ్రత నుండి యేర్పడే విపరీత ప్రవర్తనం. దాని ప్రభావ పర్యవసానంతో తీర్చడం జరిగింది. ఇది మహాకవి కావ్య కళకు నిదర్శనమైంది.

# శక్ర మోక్షణం

రావణ సేనానీకం స్వర్గంపై దండెత్తింది. దేవానీకం రౌద్ర రస దృప్తాకార ఘోరాకృతి శౌర్యావేశంతో పోరాడుతూంది. ఈ ఘట్టం ఓ జోగుణ భూయిష్ఠంగా రచితమైంది.

"రుద్రాదిత్యమరుద్వసు ప్రభృతులార్పుల్ నింగి ముట్టంగ వీ
రోద్రోకంబున..................... దాకె "రిపు ధైర్య స్రావణున్ రావణున్"

ఇంద్రుడు తన సర్వశక్తిని సమీకరించుకొని రావణుని పరిమార్చాలనే కృతనిశ్చయంతో ఉన్నాడు. రిపుల ధైర్యాన్ని నీరుకాజేసే వాడన్న విశేషణం రావణుని విజయాన్ని సూచిస్తూంది. ఇది కవి వాక్యం. పద్య మంతా ఇంద్రుని శౌర్య ప్రతాపాల్ని చిత్రిస్తూంది. చివర ఈ విశేషణం బలవత్తరమైన విధికి సూచన. ఇరుపక్షాల శక్తి సామర్థ్యాలతో పాటు భవితవ్యాన్ని దృష్టిలో ఉంచుకొని రచన ప్రౌఢమైన శిల్పంతో సాక్షాత్కరిస్తుంది. రావణునకు యుద్ధ మొక కేళీ రంగం వలె ఉంది. అందరి కన్ని వైపుల కన్పిస్తున్నాడు. పరస్పర జిగీషా సంరంభాన్ని వ్యంజింపజేసి గాఢ బంధంతో రచన సాగింది. ''వ్యగ్రాటోపత నొండొరున్ మిగుల బాహా శక్తి సూపన్ మహోదగ్రంబయ్యె సురాసురేంద్ర రణ మన్యోన్య ధ్వజచ్ఛేదనా త్యుగ్రంబై" దిశాధిపతులు రావణుని బందింపసమాయత్తులయ్యారు. మేఘనాథుడు వడిగా వచ్చి మాయా తమస్సుతో వారిని ముంచి వేస్తాడు. ఇంద్రుడు మాయా పిహిత లోచన సహస్రుడు, తహినము కురిసిన పయోరుహ సమూహంవలె" ఉన్నాడు. ఇంతలో మూర్ఛపోయాడు. ఇంద్రుడు సహస్రాక్షుడు. ఇన్ని కళ్ళు ఉన్నా చూడలేకపోతున్నాడు. పై ఉపమానం ఇంద్రుని వ్యక్తిత్వానికి సహజంగా ఉంది. ప్రకృత స్థితిని వ్యంజింపజేస్తూంది. మంచు శాశ్వతంగా ఉండదు. కొంత ఆలస్యంగానైనా సూర్య కిరణాలకు తొలగిపోవలసిందే. ఈ ఉపమానంలోని సూచన కథాంతానికి గాని తెలిసి రాదు. ప్రకృత స్థితిలో ఇంద్రజిత్తు జయ శంఖం పూరించాడు. రావణుడు కొడుకును కౌగిలించుకున్నాడు. రావణుని సేనలు మందుగా మేఘనాథుని నిడుకొని లంకకు పయనమయ్యాయి. వెనుక రావణుడు

కదలాడు. ఇది మేఘనాథుడు పొందిన గౌరవం. వెనుక నుండి ఎవరైనా తాకవచ్చు. అందుకని ఈ జాగ్రత్త! ఇంద్రుని పట్టుకొని లంకకు తీసుకొని పోవడం సామాన్యం కాదు. ఇది పుత్రుడైన మేఘనాథుని ఆజ్ఞా చక్రం క్రిందనే జరిగింది. అతడిపుడు ఇంద్రజిత్తు. రావణుడనుకున్నట్లుగానే వెనుక నుండి దేవతలు వచ్చి తాకారు. రావణుడు వారిని పికపికలై పారిపోవునట్లు చేస్తాడు.

ఇంద్రుడిపుడు బంధితుడు. ఇంద్రుడు లేక యజ్ఞాది క్రియలు స్తంభించాయి. స్వర్గం తేజోహీన మయింది. అపుడు బ్రహ్మ మునులు కొల్వగా లంకకు వెళ్ళాడు. దనుజవిభుని ధృఢ శౌర్యం, మేఘనాథుని పరాక్రమం పొగిడాడు. తానిపుడు కార్యార్థియై వచ్చాడు. వారి శక్తి సామర్థ్యాల్ని స్మరించడంలో లౌకికముంది. రావణుడు బ్రహ్మ ప్రసాదిత వరుడు. బ్రహ్మ నుండి నాలుగో తరం వాడు. బ్రహ్మ రావణునితో ఇంద్రుడు బంధింపబడటం వల్ల వచ్చిన సంకటాన్ని తెలియ జేసాడు. బ్రహ్మ చెప్పింది నాలుగు మాటలే, నాలుగు ముఖాలు నాలుగు మాటలు మాట్లాడాయి. ఒకటి ఇంద్రుడు చతుర్భువనాలకు ప్రోది రెండు అతడు లేక అన్నింటికి సంకటంగా ఉంది మూడు ఇంద్రుని విడువుము నాలుగు నీవు కోరిక వరాలిస్తాను. బ్రహ్మ చతుర్ముఖుడు కాబట్టి నాలుగు మాటలు ఔచితీవంతంగా పలికింపబడినాయి. నిజానికి ఇంద్రుని బంధించిన వ్యక్తి మేఘనాథుడు. కాని బ్రహ్మ అడిగేది రావణుని మాత్రమే. దీనికి కారణం రావణుడు ప్రభువు. అయితే రావణుడు మాట్లాడలేదు. వరం కోరలేదు. వరం కోరింది రావణ సూనుడు. తన "విక్రమానికి వెల" కడితే "శాశ్వతమైన అమరత్వాన్ని కారుణ్యం సేయమ"ని అడిగాడు. ఇది ఈశ్వరునకు దక్క ఇతరులకు లేదని" బ్రహ్మ సమాధాన మిచ్చాడు. హోమ సమాప్తి నుత్థిత రథోత్తమ మొక్కటి తప్ప వొంట సంగ్రామము సేయబోనది మొదలుగా వరమడిగాడు. నీకు ఊరకనే ఇంద్రుని ఇస్తాను తీసుకొని పొమ్మన్నాడు. బ్రహ్మ మేఘనాథుడు కోరిన వర మిచ్చాడు. ఇంద్రజిత్సమాఖ్యనిచ్చాడు. ఈ వ్యవహారమంతా మేఘనాథునితోనే జరిగింది. బ్రహ్మ యంతటి వాడు తన వద్దకు వచ్చాడు. ఇది అతనికి గౌరవమే బ్రహ్మ దశాననుని ముఖం చూచాడు. ఈ వ్యవహారాన్ని ఒక మాటలో అతడు త్రోసి పుచ్చవచ్చు. అపుడు సర్వం పునః పాక ప్రయత్నమవుతుంది. తన కుమారుని ప్రశస్తి తన ప్రశస్తియే.

ఇంద్రుని వదనం లజ్జా పరిమ్లానమై ఉంది. దీనికి కారణం తెలిసిన వాడొక్కడే సృష్టికర్త! ఇతడు చేసిన దుష్కృతాని కాపద, సుకృతానికి శుభం కలుగుతుంది. "సాధ్వి అహల్యను కోరి గౌతమునికి తప్పితీవకట! తత్ఫలమీ యశుభంబు" అని బ్రహ్మ దోష నివృత్తికై విష్ణు తుష్టిగా యజ్ఞం చేయమన్నాడు. గౌతమునికి ద్రోహం చేసిన ఫలితంగా మేఘనాథునిచే బంధనం జరిగింది. బ్రహ్మ సృష్టికర్త! భూత భవిష్యద్వర్తమాన కాల కర్మ స్వరూప వేత్త! కథారంభం నుండి కావ్యం "విచిత్ర కథా రస వృత్తి మయంగా సాగింది. రావణ మేఘ నాథుల పరాక్రమం, సాహసం, విజిగీష, ఇంద్ర మోక్షణం మొదలుగా వీర రసావిష్కారకంగా సృజనకళ నిర్వహింపబడింది.

# సీతా రాముల శృంగారం

నిర్వచనోత్తర రామాయణం రెండు భాగాలుగా కన్పిస్తుంది. ఒకటి రావణాదుల చరిత్ర రెండు సీతారాముల చరిత్ర. రావణ వధానంతరం సీతా చరిత్రే వాల్మీకి ఉత్తర కాండలో ప్రధాన కథ, ఈ కావ్యారంభంలో పూర్వ కథను జ్ఞాపకం చేసేదిగా ఉంది. అష్టమాశ్వాసంలో దాంపత్య నిష్ఠమయిన సీతారాముల దివ్య ప్రణయం వర్ణితమైంది. రాముడు ధీరోదాత్తుడుగా మానవ సహజ సుఖ దు:ఖానుభూతి తత్పరుడుగా చిత్రితమైనాడు. అక్కడక్కడ పరమేశ్వర భావం సూచితమైంది. "సౌభాగ్య సారాభిరామ మూర్తి" "రమణీ రాగాబ్ధి పూర్ణేందు"డై, ప్రణయ కోపం ఉపశమనం, మన్మథ కళా స్వాతంత్ర్యం మొదలుగా పొందిన శృంగార రసం ఆవిష్కృతమైంది.

**"కలపంబు లభినవ గంధంబులుగ కూర్చి తను వల్లి కల యందు తాన యలదు,**
**మృగ మద పకంబు మృదువుగా సారించి తిలకంబు పెట్టి నెచ్చెలికి జూపు"**

ఆమె ప్రకృతి. ఇతడు పురుషుడు. వీరి సంబంధం సనాతనమైంది. ఈ దృష్టి ఆలోచన కందుతుంది. సాధారణంగా ఇతిహాస పురాణాల్లో వీర శాంతాలకు ప్రాధాన్యముంటుంది. కావ్యేతిహాసంగా తీర్చబడిన నిర్వచనోత్తర రామాయణంలో శృంగార రసానికీ ప్రముఖమైన స్థానం లభించింది. స్త్రీ పురుషుల బహి:ప్రకృతుల నాశ్రయించి వర్ణించడం ఒక పద్ధతి. సూక్ష్మ మనోనుభూతులకు ప్రాధాన్యముంటుంది. ఈ కావ్యంలో దంపతీ నిష్ఠమై శృంగారం మనోనుభూతి విశిష్టమైంది. సీతారాములు పూలు కోయడం తుమ్మెదల్ని పారద్రోలడం కీరపోతాల మాటలకు పరవశులవడం, పొంచి పొంచి హంసల్ని పట్టడం మయూర నర్తనల్ని తిలకించడం, కౌతుకాయత్తులై తిరగడం మొదలుగా బహిర్లీలా వ్యాపారం హృద్యంగా వర్ణితమైంది. అందని పూగుత్తులను రాముడు సీతకు చూపాడు. ఆమెకందలేదు. "నీవు ఎగురు నేను నిన్నెత్తుతాన"నిమై పొదివికొని ఆనందం పొందుతారు. వారి ఉద్యాన జల విహార లీలా విశేషాలు ప్రకృతి వర్ణననుసరించి మానసిక చిత్రణంతోను అలరిస్తాయి. ఈ

వర్ణనలు ప్రబంధ కవిత్వానికి మార్గదర్శకంగాను ఉన్నాయి. ఆననాబ్జాలు, కుంతల భృంగ మాలికలు, వళీ తరంగాలు, స్తన చక్రవాకాలు వస్తు సామ్యంలో స్త్రీ ప్రకృతి రూపారోపాలతో కల్పితమయినాయి. ఈ విధమైన అలంకార రచన తెలుగులో ఆనాటికి కొత్తదే. ఇది కావ్యోచితమైంది. ఇరువురి జలక్రీడ హేలా తర్పితమైంది జల విహారంలో జల్లులాట ఈదులాట పారే నీటిపై తేలిపోవుట మునిగి లోతుకు వెళ్ళి పైకి లేచి తిరుగుట సామాన్య మానవ కృత్యాలే. రాముడు తుమ్మెదలకు బదులు వేనలి చూస్తూ నలినాలకు బదులు చూపులు మెచ్చుకుంటూ హంస కోకిల స్వరాలకు బదులు మృదూక్తుల్ని పలుకురి, రాముడు సీతతో చేసే వన విహారం అనురాగ తత్పరమైంది, దంపతీ నిష్ఠమైంది.

**"ప్రమదము మూర్తమై నటుల, రాగము రూపు వహించినట్లు వి**
**భ్రమ మొద లెత్తినట్లు, రతి రాజ విహార కుతూహలంబు దే**
**హము తగ దాల్చినట్లు, హృదయంగమమై విలసిల్లుచున్న యా**
**రమణి ప్రమోద రూఢ మద రంజితు జేయు విభుండు ధీరుడై"**

ఈ వర్ణనం ఉదాత్తమైంది. సీత ఆ సమయంలో సంతోషం రాగం విభ్రమం మన్మథభావం కలిసి ఆకృతి దాల్చినట్లు కన్పించింది. ఆమెను రాముడు ప్రమోద రంజితం చేసాడు. ఈ పద్యం భౌతికమైన వర్ణన నధిగమించింది. మానసికమైన అనుభూతి భావ మయమైంది. పదునాలుగేండ్ల వనవాస క్లేశాన్ని మరపించే విధంగా సౌఖ్య రసాల కరువు గట్టి పోసి చేసిన రూపాల వలె శృంగార రస మగ్నులయినాడు. రమణీయ హర్మ్యాల్లో మనోరాగారాల్లో లతాభవనాల్లో అద్రి వన కుంజాల్లో బహు విధాభిరాములైన సీతారాముల శృంగారం ఆత్మ నిష్ఠమైంది. సుకుమార మనో భావానుభూతి సమర్పకమైంది.

అనతి కాలంలో వియోగం సంభవింపనుంది. ఆ తరువాత శృంగార ప్రసక్తి లేదు. కాబట్టి ప్రకృతం గాఢమైన అనుభవ చిత్రణం అత్యంత సముచితంగా ఉంది. కావ్యానికి శృంగార రస బంధురతను కలిగిస్తూంది.

# సీతా ప్రవాసం

సీతాదేవి మాతృమూర్తి కాబోతూంది. ఆమె "గర్భసంపద" "సుధాంశుడు కల్గిన రాత్రి" వలె వంశానికి ప్రశస్తికరమైందన్న రాముని ప్రియమైన మాటలకు సిగ్గుపడింది. లేతనవ్వు ఒలికింది. గంగాతీర దర్శనాభిలాషను తెలిపింది. రాముడు సమ్మతించాడు. పై వర్ణనలో సీత రాత్రి స్థానీయ, గర్భ సంపద సుధాంశు స్థానీయం, భవిష్యత్తు కథలో సీత కపవాదం రాబోతూంది. చీకటి రాత్రిని క్రమ్మిన్ల్లు అపవాదం ఆమె జీవితంలో ప్రవేశించి ప్రధాన పాత్ర నిర్వహించనుంది. సంతానం సుంధాంశు వు వలె కొంత ఊరట కలిగిస్తూంది. ఈ రూపంలో వెన్నెల ప్రసరించనుంది. ఇది భవిష్యత్కథా సూచనా రమణీయమైంది.

రామచంద్రుడు తన రాజ్యంలో చారుడయిన భద్రునితో అతని సంస్తుతి తరువాత సమాజంలో "కలయంతవట్టు" చెప్పమన్నాడు. ఏమి జరుగుతూంది, ఉన్న దున్నట్లుగా తన కపకారం జరిగినాసరే, అది "కీడుమాట" అయినా వినడానికి సిద్ధంగా ఉన్నాడు. భద్రుడు వెల్లనయ్యాడు, తల్లడిల్లాడు. రాముడు "లోకుల మాటలు చెప్పడం అహితంకాదు. నీవు హితుడవ"న్నాడు. ఈ మాటల్లో చారుని పట్ల రాముని విశ్వాసం, ప్రజాభిప్రాయం పట్ల గౌరవం వ్యక్తమవుతూంది. అతడు సీతాపవాదాన్ని తెలిపాడు. హృదయం, సురసుర మాడిన విధంగా రాముడు బాధపడ్డాడు. అంతలో ధీర గుణంతో కొంత పడకుండా, ప్రవర్తించాడు. మూలంలో "పరమార్తవత్" దు:ఖితుడైన రాముడు తిక్కన రచనలో గంభీర వ్యక్తిగా తీర్చబడినాడు. ధృతి వహించి వశం తప్పే మనస్సును నిలుపుకున్నాడు. మూర్ఛా సమస్థితిని ఎట్లాగో నిలువరించుకున్నాడు.

"రావణు నింట నుండగ ధరాసుత నే మరలంగ దెచ్చి సంభావన సేత" గురించి చెప్పాడు. "మహాదేవుడు బ్రహ్మ మునులు దేవగణం మెచ్చగా" సీతను "పావకు డిచ్చె నాకు" అని వివరించాడు. పునాతీతి పావక: పవిత్రం చేసేవాడు. అగ్ని పరీక్షకు నిలబడి మెప్పును పొందింది. ఆమె కష్టాల్ని, పాతివ్రత్యాన్ని ఎరిగిన మహామతి లక్ష్మణుడు సీత విశుద్ధ చరిత్రం లక్ష్మణునకు తెలిసి నంతగా మరెవరికి తెలియదు. ఈ అభిప్రాయమే "లక్ష్మణా!" యని సంబోధింపజేసింది. "పాపపు మాటల"

పుట్టుకకు కారణాన్ని గురించి ఆలోచనకు వ్యవధి లేకుండా "జానకిని పరిత్యజింంన గాని అపకీర్తి పాయద"నన్న నిశ్చయానికి వచ్చాడు. రామునికి సీతా పాతివ్రత్యం గురించి తెలుసు. వేయి మాటలు దేనికి? ఆమెనట్లు అనడం మహాపాపమని మనస్సుకు తెలుసు ప్రజాభిమతాన్ని మన్నించి మతి వేరుగా పనిచేస్తుంది. ఇక్కడ సీతాపతిగా రాముడు వేరు. ప్రభువుగా రాముడు వేరు. వ్యక్తి నిష్ఠమైన ధర్మం వేరు. ప్రజాగతమైన రాజ ధర్మం వేరు.

వైయక్తిక ధర్మానికీ రాజ ధర్మానికీ మధ్య ఘర్షణకు దారితీసే పరిస్థితి ఇది. వైయక్తిక సుఖాన్ని త్రోసి పుచ్చి ప్రజాభిమాతాన్ని మన్నించే వైఖరి నవలంబించాడు.

**"స్నేహం దయాం చ సౌఖ్యం చ, యది వా జానకీ మపి**
**ఆరాధనాయ లోకస్య ముంచతో నాస్తి మే వ్యథా"** అని ఉత్తర రామచరిత్ర నాటకంలో, భవభూతి మాటలు రాజధర్మాన్ని స్థాపించేవి. ఎవడో నోరుపుచ్చిన వాడు పలికిన మాటలకు రామచంద్రుడు విలువ ఇక్కడ మేమిటి? వాడెటువంటి వాడో ఎవరు చెప్పాలి? అనేక ధర్మాలున్నాయి. మానవధర్మం, పతిధర్మం, సతీధర్మం. రాజధర్మం మొదలైనవి బాగా పరిశీలించవలసి ఉంటుంది. "యథా స్త్రీణాం తథా వాచాం సాధుత్వే దుర్జనో జన:, అతి దుర్జన ఇతి వక్తవ్యమ్" అని ఉత్తర రామచరిత్రలో భవభూతి స్త్రీల విషయంలో అపవాద దుర్జనకత్వాన్ని గురించి భావన చేసాడు. రాముడు మరో విధంగా ఈ అపవాదాన్ని పరీక్షకు నిలిపి స్థిర పరచుకొనే ప్రయత్నం చేయలేదు. లక్ష్మణుని కాజ్ఞ యిచ్చాడు. సీత కోరిక నెపంతో రేపు రథంపై అడవికి తీసుకొని వెళ్ళమన్న నిర్ణయం అసాధారణమైంది. స్థూలదృష్టికి నింద్య చరిత్రగా కన్పిస్తుంది. సీతా రాములిరువురు మానసికంగా ననపాయులే! ఒక ప్రత్యేక పరిస్థితిల శరీర వియోగం అనుభవించవలసి వచ్చింది. "సూక్ష్మంగా తలంచిన విశుద్ధ చరిత్రము" అని రాముని అంత:కరణానికి తెలుసు! లక్ష్మణుని దృష్టిలో రాముడు సోదరభావాన్ని మించిన మహానుభావుడు, ప్రభువు ఆజ్ఞను కాదనలేకపోయాడు. సీతాపరిత్యాగానికి రంగం సిద్ధమైంది.

ఆ రాత్రి గడచింది. లక్ష్మణుడు దు:ఖమతియై రథాన్ని సమాయత్తపరచాడు. రాఘువుడు తన తలపించుకంతయైన సీత యెరుగకుండునట్లు "పాల తోడ విషం బిడు పగిది ననిచి పుచ్చి యుల్లంబు నొచ్చికిని" మరలాడు. సీతకు పరిత్యాగ విషయం తెలియదు. ఇది గుప్తంగా ఉంచబడింది. దీన్ని పాలలో విషంతో తిక్కన పోల్చాడు. వర్తమానంలో దాగిన భవిష్యదాపదను సూచిస్తూంది. ఇది కవి వాక్యం. మనస్సు కేతనం వలె సీత వైపు వెనక్కు చూస్తూంది. శరీరం ముందుకు సాగుతూంది. ఈ అంతర్బహిర్విధా మనోరూపం రాముని విషయంలో పాత్ర గతంగా విశిష్టతను చేకూరుస్తూంది. వనంలో సీతను దింపి లక్ష్మణుడు, విషయం చెప్పడానికి నోరు రాక కన్నీళ్ళతో డగ్గుత్తికతో "రఘుకులాధీశున్ జగం బెల్ల నీకై నిందింపగ జాల నొచ్చి, యది మిథ్యా వాదమైనన్" "ఊహాపోహ సంవేదియైన" రాముని నిర్ణయాన్ని తెలిపాడు. రాముని ఆజ్ఞను పరిపాలించవలసినవాడు, అడవిలో సీతకు సమాధానం చెప్పవలసి వాడు లక్ష్మణుడు. ఆమె వాత్సల్యానికి నోచుకున్నవాడు. రాముడు ఊహ అపోహలను బాగా తెలిసినవాడు. ఒక పని తెలిసి చేయడానికి సరిగా తెలియకుండా చేయడానికి భేదం ఉంది. తెలియక చేయడంలో అజ్ఞానముంది. తెలిసి చేయడంలో వివేకముంది. అజ్ఞానం మాయా లక్షణం. రాముడు జ్ఞాన మూర్తి ధీరోదాత్తుడు, ధర్మమూర్తి, ఆదర్శ ప్రభువు, ఊహనూ ఆపోహనూ వివేచించి నిర్ణయం తీసుకున్నాడన్నది పర్యవసానం. వాల్మీకి ఆశ్రయాన్ని చూపించాడు. ముని చరణాశ్రయమై నిరస్త శోక అవుతుందని లక్ష్మణుని అభిప్రాయం. పతియే సర్వస్వం "అతని పంపొనర్చుటయ కాదె! ధర్మంబు నాతి కరయ" అని సీత ధర్మానుసరణిని అంగీకరించింది. "తులువ మాటలు మానుపనుపాయము జొప్పడదేమి సేయుద"నని దు:ఖ వివశ అయింది. తీవ్ర శోకంతో లక్ష్మణుడు సెలవు తీసుకున్నాడు. తిక్కన రచనలో రాముని రాజ ధర్మంతో సమానంగా పతి పట్ల సీత ధర్మానుసరణాన్ని చిత్రించాడు. ఒక విధంగా విధిని వహించడంలో దు:ఖంలోను ఆమె చూపిన ఉదాత్త వ్యక్తిత్వం స్త్రీ పాత్ర చిత్రణలో శిఖరాయమాణమైంది.

ముని బాలకులు చూచి వెళ్ళి వాల్మీకికి ఒక నారీ తిలకం కాననంలో "ఉద్దామ శోకార్తయై" యున్న విషయం విన్నవించారు. "ఏ మహాభాగుని సతియో, నిరుపమోదాత్త మూర్తి యన్నీరజాక్షి" యని సంవేదనతో సహానుభూతితో స్పందించాడు.

ఆమె పతి మహాభాగుడు, రామచంద్రుడు, విష్ణ్వంశ సంభూతుడు త్రిలోకీ జేత యైన రావణ విజేత. మునులకు అగ్నులకు తపస్సులకు భంగం వాటిల్లకుండా కాపాడే మహా వీరుడు. ధర్మమూర్తి. అతని పతి శ్రీదేవి. దివ్య దృష్టికి గోచరమయ్యే ఈ ఆంతర్యం ఋషి బాలకులకు స్థూలంగా ఏదో మహనీయభావరేఖగా అనుభూత మయింది. వాల్మీకి మహర్షి దివ్య దృష్టితో "నీ చరిత్ర నిర్మలమ"ని ఆమెను ఆశ్వాసించాడు. "ఇది మన యాశ్రమం బిచ్చట నీవు వసింపు" మని ఆదరించాడు. మన ఆశ్రమ మంటే మునులకూ రామునకూ భేదం లేదు, కాబట్టి "నీవు నీ గృహం చేరితివి" అని దీవించాడు మహర్షి ఆదరం, అభయం, ఆత్మీయత ఆశీస్సులతో ఆమె శోక వహ్ని శాంతించింది.

ఈమె "జనకుని కూతురు, రాముని దేవి, "తాపన వృత్తి భరింప వచ్చినద"ని చెప్పి "బాంధవ్యము నెరప" జేసాడు. అపరాధ విషయం చెప్పలేదు. అట్లా జరిగితే లోకం దుర్వ్యాఖ్యానం చేయవచ్చు. సీతను అపయశస్సు పాలు చేసినవాడవుతాడు. సీత కూడ ఆ ప్రసక్తి వల్ల దు:ఖిత అవుతుంది. "తాపన వృత్తి భరింప" వచ్చిందని, ఆమె పాత్రను సమున్నతం చేయడం జరిగింది. జనకుడు రాజర్షి బ్రహ్మవేత్త అట్టి మహనీయుని కూతురు. రాముడు అవతార పురుషుడు, ఈమె మహావీరుని ధర్మగుణోపేతుని సతి. భర్తృ పరిత్యక్త, తాపన వృత్తియే యాచరణీయమైంది. సీతాదేవి భవిష్యన్మార్గం సూచితమైంది.

ఇప్పుడు రాముని స్థితి బహు విచిత్రంగా ఉంది. ప్రభువుగా వర్తించింది ఇది భౌతికేతరమైంది, తపోమయమైంది. తన ప్రాణంలో ప్రాణానికి పతి అయింది అంతస్స్వరూపం. అందరితో రాజసంబంధమైన కార్యాలు నిర్వర్తిస్తున్నాడు. ఏకాంతంగా సీతను తలచుకొని "లోకము వారి మెచ్చునకు లోల విలోచన! పాఱవైచితింబో"యని వేదనకు గురి అవుతున్నాడు. ఈ స్థితిలోను "ఉదాత్తవృత్తి మహినేలి"న రాముని "సద్వృత్తం" "సంభావ్యం" కావడం సహజం. ఒకవైపు ప్రజాపాలనం, రాజధర్మం మరొకవైపు కుటుంబ ధర్మం, ధర్మపత్నీ ప్రేమ ఈ రెండింటి మధ్య సంఘర్షణలో రాజుగా మొదటిది ఎన్నుకోవడం జరిగింది. మరో విషయం శత్రుఘ్నుడు లవణుని వధించి పన్నెండేండ్లు మధురను పాలించి తిరిగి వచ్చాడు. మిమ్మల్ని కొల్చే సుఖానికి

"రాజ సౌఖ్యం ఈడు కాద"న్నాడు. అపుడు రాముడు "అల్లన నవ్వి", నరనాథుల కిట్లన జెల్లు నయ్య" యని రాజ ధర్మాన్ని జ్ఞాపకం చేసాడు. ఇది జీవితంలో ప్రజాపాలనం, రాజధర్మం పట్ల రాముని అచంచల విశ్వాసాన్ని ప్రకటిస్తూంది.

అశ్వమేధం రామ కుశలవుల సమాగమానికి కారణమైంది. మహర్షి కుశలవుల నొప్పగించి, సీతను గైకొనుమన్నాడు. రాముడు లోకాన్ని "మెచ్చించుట యుక్త"మన్నాడు. సీత అచటికి వచ్చింది. ఆమెకు రామచంద్రుని మనస్సు ప్రధానం, లోకం కోసం ఆమె తనను తాను నిరూపించదలచుకోలేదు. ఇది తన పని కాదు. ఆమె మహావ్యక్తిత్వానికి తగదు. ఒక మారు అగ్ని పరీక్ష అయింది. భూదేవి వైపు చూచి "ఎమ్మెయి రామ నృపతి నేను తప్పని దాన నేని, నన్ను నీలో చేర్చుకొమ్మ"నగా "అందరి కచ్చెరువుగాగ" భూదేవి సీతను తనలో ప్రవేశింపజేసుకుంది. రామచంద్రునికి పుత్ర సమాగమం సంభవించింది. తిక్కన రామనిర్యాణాన్ని వదిలేసాడు. కావ్యంలో సమాప్తి రేఖ సీత ఆత్మత్యాగంతో రామునికి తీసిపోని అంతకన్న ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని పొందింది. వాల్మీకి రామాయణం ప్రేరణ శక్తియైనా కథాంశాల నిర్మాణంలో తిక్కన స్వతంత్రమైన సృజనకళ కావ్యశిల్పంతో సాక్షాత్కరిస్తుంది.

# కావ్య నిర్వహణం

నిర్వచనోత్తర రామాయణం కావ్యంలో ప్రధాన రసం వీరం. రావణుని కథలోని కృత్యాలన్నీ రౌద్ర రసస్ఫోరకాలు. ఇది యుద్ధ చర్యలో భాగాలు. యుద్ధ వర్ణనలన్ని వీర రస ప్రధానాలు. రామ ధరణీ పతి వృత్తం ధర్మ వీర మంగిగా నుంది. ఆయా ఘట్టాల్లో శృంగార కరుణ రసాలు ధర్మ వీరాని కంగాలుగా కన్పిస్తాయి. రావణుని వీరం కన్నా రాముని ధర్మం వీరం ఉత్తమమైంది లోక హితంకరమైంది కాబట్టి రాముని ధర్మ వీరం రావణుని వీరాన్ని అంతర్భవింపజేసుకుంది. రావణుని జయించిన మహావీరుడు రాముడు. కావ్యం రెండు భాగాలుగా 1. రావణుని పూర్వకథతో 2. సీత కథతో విశ్లేషణ కందినా ఈ రెండిటిని అధిగమించి చివరకు రాముని ధర్మవీరం శిఖర భూతంగా నిలిచింది. వీర రసంలో అనేక ప్రభేదాలున్నాయి. వీటిలో ముఖ్యమైనవి దానవీర, ధర్మవీర, యుద్ధవీరాలు.

**"దాన వీరం ధర్మవీరం యుద్ధవీరం తథైవ చ**
**రసం వీరమపి ప్రాహ బ్రహ్మ త్రివిథమేవ చ"** నాట్యశాస్త్రం అధ్యా, IV శ్లో. 80

దయా సత్య క్షమాది ఇతర భేదాలన్ని ఈ మూడింటిలో అంతర్భవిస్తాయి. వీర రసం స్థాయి భావం ఉత్సాహం. వీరం ఉత్తమ ప్రకృతి గతమైంది. ఉత్సాహాత్మకం ఉన్నతమైన లక్ష్యసాధనకు చేసే పురుషకారం ఉత్తమ ప్రకృతికమయి వీరమవుతుంది. ధర్మానుబంధియైన ఉత్సాహం ధర్మవీర మవుతూంది.

ధర్మం మూడు విధాలు మొదటిది సాధారణ ధర్మం రెండోది విశేష ధర్మం మూడోది ఆపద్ధర్మం. మాతా పితరుల పట్ల భక్తి భార్య పట్ల ప్రేమ గురువుల పట్ల గౌరవం మొదలయినవి సామాన్య ధర్మాలు. ప్రజా సంరక్షణం, పాలనం మొదలయిన విశేషధర్మాలు. వ్యక్తి లేదా సమాజ క్షేమం దృష్ట్యా తత్కాలంలో అవసరానికి అవలంబించేవి ఆపద్ధర్మాలు.

ఈ కావ్యంలో సీతాపతిగా కన్పిస్తూనే, చివరకు ఉదాత్తమైన రాజమార్గంలో ధరణీపతిగా జనరంజకుడుగా రామచంద్రుని సద్వృత్తం పై దృష్టి కేంద్రీకృతమయింది. కావున ఈ లక్షణం శిఖర తుల్యంగా కన్పిస్తుంది. విశేష ధర్మం పట్ల ఉత్సాహంతో చిత్త స్థైర్యాన్ని కలిగిన వ్యక్తి అవడం వల్ల రాముడు. ప్రాణతుల్యమైన పత్నిని పరిత్యజించడానికి సైతం వెనుదీయలేదు. సాధారణ ధర్మం కన్న విశేష ధర్మం బలీయమైంది. తన పాలనలో ఉన్న ప్రజల్ని రక్షించడం వారికి తృప్తిని కలిగించడం విశేష ధర్మం. రాజ ధర్మ పరాయణుడైన రామచంద్రుని సద్వృత్తం వీర రస ప్రధానంగా అందునా ధర్మ వీర ప్రభేదంతో నిర్వహింపబడింది. కావ్యంలో నాయకుడు రామచంద్రుడు, ఆదర్శమూర్తిగా ఖ్యాతికెక్కాడు.

నిర్వచనోత్తర రామాయణంలో పూర్వ భాగంలో రావణుని కథ ఉంది. పూర్వ రామాయణంలో రావణుడు ప్రతి నాయకుడు, రాముడు నాయకుడు, ఉత్తర రామాయణంలో నాయకుడైన రాముడు ప్రతినాయకుడైన రావణుని వృత్తం వినకోరాడు. రావణ వధ చేసింది రాముడు. రావణ వృత్తం వినగోరింది అతడే. ఇది రాముని ఉదాత్త గుణాన్ని బింబిస్తూంది. తనకు వ్యతిరేకమైన వ్యక్తిని గురించి వినాలనుకోవడం ఉదార మనస్తత్వాన్ని భావింపజేస్తూంది. రావణుని దుర్వృత్తం రాముని సద్వృత్తానికి లోబడింది. కాబట్టి దుర్వృత్తానికి ప్రాధాన్యం ఉండదు. తిక్కన కావ్యావతారికలో ధీరోదాత్త నృపోత్తముడయిన రామ ధరణీ పతి సద్వృత్తం సంభావ్య మని రచనా పరమార్థాన్ని ప్రకటించాడు. ఎంతటి రావణుని కథ అయినా కవి ప్రతిపాదింపదలచిన మహార్థంలో విలీనమవుతూంది. కాబట్టి రాముని సద్వృత్తానికే పట్టాభిషేకం జరిగింది. ఈ కావ్యం శ్రీ రామచంద్రుడిట్లు మహారాజ్య పదస్థుడై"యని యారంభమైంది. "సర్వజనంబు నుత్తమ మార్గ వర్తన శీలతం బొలయ ధారుణి యేలె" నని సమాప్తమైంది. ఇది జన భావన మరియు రాజ ధర్మం దృష్టితో కావ్య తాత్పర్య రూపాన్ని భావింపజేస్తూంది. కావ్యంలో రావణ చరిత్ర వల్ల అంతటి శక్తిమంతుడు (మహాకాముకుడు మహోద్ధతుడు దేవతా విరోధి సుజనాపకారి మొదలైన దుర్లక్షణాలవల్ల)

ఎవరిచే సంహరింపబడినాడో ఆ రాముని గొప్పతనాన్ని పరోక్షంగా ఎత్తి చూపుతూంది. రామచంద్రుని ఉత్తమనాయకత్వం స్థాపితమవుతూంది.

నిర్వచనోత్తర రామాయణం తిక్కన తొలి రచన. దీన్ని మహాభారత రచనతో పోల్చి చూడకూడదు. భారతంలో తిక్కన నిర్వహించింది ప్రధాన కథ. ఈ కావ్యం ప్రధాన కథానంతరం కథ. ఇది రావణ గాథతో జోడింపబడింది. ఏమైనా ఇదో రెండు కథా భాగాల విచిత్ర సమ్మేళనం ఉత్తమ కావ్య సృజన రూపాన్ని పొందింది. దీని నిర్మాణం తిక్కన స్వతంత్రమైన కావ్య శిల్ప రూపాన్ని ఆవిష్కరిస్తూంది.

# ఎర్రన కృతులు
## సృజన రూపం - నిర్వహణ శిల్పం
## అరణ్య పర్వ శేషం

ఎఱ్ఱన రచనల్లో అరణ్య పర్వ శేషం మహాభారత గ్రంథ వైశిష్ట్యం చేత ప్రముఖంగా పేర్కోదగింది. ఇది 'తద్రచనయకా' నన్నయననుసరించే ప్రయత్నరూపం. ఇతర రచనలు నృసింహపురాణం, హరివంశం, కవిత్రయంలో ఎఱ్ఱన స్థానాన్ని పరిపుష్టం చేస్తున్నాయి. రామాయణ రచన లభ్యం కాలేదు. నన్నయ "సరస సారస్వతాంశ", తిక్కన "కావ్యకళా ప్రభావం" కలిసి తన సృజనరూపం "ప్రబంధ పరమేశ్వర" ఖ్యాతిని లభింపచేసింది. అరణ్యపర్వ శేషాన్ని నన్నయ పద్ధతినే నిర్వహించాడు. గద్యలో కూడ తన పేరు చెప్పుకోలేదు. నన్నయవలె వ్రాయగలవాడన్న కీర్తి లభించింది. తత్కవితా రీతియు కొంత దోప తద్రచనయకా పూరించినట్లు తెలుస్తూంది. ప్రసన్న కథా కలితార్థయుక్తి, అక్షరరమ్యత నన్నయ కవితా లక్షణాలు. నృసింహ పురాణంలో అరణ్యపర్వ శేషోన్నయ మాంధ్రభాష సుజనోత్సవమొప్పగ" నిర్వహించినట్లు చెప్పుకొన్నాడు. ఇందులో శేష శబ్దానకి (1) నన్నయ రచింపగా మిగిలిందని కందుకూరి వీరేశలింగంగారు, 2) మిగిలింది (శేష) విడిచిన భాగాన్ని ఉద్ధరించెనని ఉన్నయ శబ్దానికర్థం చెబుతూ చాగంటి శేషయ్యగారు అభిప్రాయపడినారు. ఉన్నయమనగా పూరణం, రచన, పైకి తీసుకొని వచ్చుట, ఊహించుట యని బహ్వర్థాలు చెప్పబడినాయి. అరణ్యపర్వంలో చివర కొంత భాగం శిథిలమైపోగా ఊహించి పూరించెనని మరియు అరణ్యపర్వ శేష పూరణమే చేసెనని అభిప్రాయాలున్నాయి.

"ఉన్నయ ఉత్ప్రేక్షిత బాహుళకాత్" అని సిద్ధాంత కౌముది "ఉన్నాయ ఉన్నయే" అని సంకీర్ణవర్ణంలో అమరకోశం. దీన్నిబట్టి ఊహించుట, పైకి వచ్చేట్లు చేయుట అనే భావం అవగతమవుతుంది. ప్రకరణాన్నిబట్టి మిగిలింది పూర్తి చేయడం చివరి వరకు రచించడమన్న అర్థం లక్షితమవుతూంది. నన్నయ వదలిన భాగాన్నే "ధీర విచారుడు" ఎఱ్ఱన "తత్కవితారీతియు కొంత దోప తద్రచనయ కా'

పూరించాడనడం సమంజసం. రాధామాధవ కవి ఎఱ్ఱనను మధ్యస్థమణిగా భావించాడు. ఎఱ్ఱన నిర్వహించిన అరణ్యపర్వ శేషభాగానికి అవతారిక ప్రసక్తి లేదు.

అరణ్యపర్వం నాలుగో ఆశ్వాసంలో "స్ఫురదురుణాంశు రాగ రుచి" యున్న పద్యం (143)తో ఎఱ్ఱన కవిత్వం మొదలవుతూంది. ఇది ఎట్లా నిర్ణయించడమంటే ఒకటి పరంపరను, జనశ్రుతిని ఆదరించడం, రెండోది అంతర్గత విషయాన్నిబట్టి మన్నించడం.

అదేమంటే "అరుణ" అంటే ఎఱ్ఱన అని అర్థం. "స్ఫురదరుణ" పద్యం ఇక్కడి నుండి ఎఱ్ఱన కవిత్వారంభమన్న సూచన స్ఫూర్తికి వస్తుంది. కవి ప్రయోగించిన శబ్దం అంతర్గత సాక్ష్యంగా ఉపకరిస్తూంది.

ఎఱ్ఱన రచన శరత్కాల వర్ణనతో ఆరంభమైంది.

## కథా కథన శిల్పం - ఘోషయాత్ర

శరత్కాలం వచ్చింది. వర్షా మేఘాలకు భయం కలిగింది. నిగూఢ రూపంతో భూమిపకి దిగినవన్నట్లుగా వనంలో మదగజ సమూహాలున్నాయి. వాన జలాల్లో పయోధారల్ని బృంహితాల్లో గర్జాధ్వనుల్ని దాచుకొన్నాయి.

**"దానంభ: పటలంబునన్ పృథు పయోధారావళిం దాల్చి గ**
**ర్జా నిర్ఘోషము బృంహితచ్ఛటల ప్రచ్ఛాదించి....**
**శరద్భయంబున నిగూఢా కారతన్ డిగ్గె నా**
**గా నొప్పారె, మదోత్కట ద్విరద సంఘంబుల్ వనాంతంబునన్"**

పాండవులు శరన్మూర్తులు. దుర్యోధనాదులు మదోత్కట ద్విరద రూపాలు. వనవాసం చేసే పాండవులకు తమ సౌభాగ్యాన్ని ప్రదర్శించి దు:ఖింపచేయాలన్న ఉద్దేశంతో ఘోష యాత్రా ఛలచ్ఛన్న రూపంతో దిగనున్నారు. ప్రకృతి వర్ణనలో భవిష్యత్కథా సూచన చేయబడింది. ఇది కథాకథన శిల్పంలో భాగం. ఎఱ్ఱన రచనలో ప్రసన్నత కన్నా గాఢత్వం గమనార్హమైంది.

ద్వైతవనంలో ఉన్న పాండవుల కడకొక బ్రాహ్మణుడు వస్తాడు. అతడు సరస కథా కథన కుశలుడు. రస సహితంగా కథ చెప్పడంలో నేర్పరి అన్న భావం ప్రకృత రచనకు కూడ వర్తిస్తుంది. ఇది నన్నయ ప్రసన్న కథా కలితార్థయుక్తిని భావింపజేస్తూంది. కథాంశం రసాభిముఖంగా సాగినపుడే ప్రసన్నత చేకూరుతుందన్న దృష్టి కలిగిందీ విశేషణం. ఇది "తద్రచనయకా" అన్న నన్నయ రచనా స్వరూపాన్ని సూచిస్తూంది.

ఆ బ్రాహ్మణుడు కౌంతేయుల కడనుండి ధృతరాష్ట్రుని వద్దకు వస్తాడు. అతని వలన పాండవుల దుస్థితి తెలిసిన ధృతరాష్ట్రుడు విషణ్ణ హృదయుడవుతాడు. "పుణ్యాచారుల కెందులేని ఆపద" వచ్చిందని బాష్పపూరిత నేత్రుడవుతాడు. కథాంశం కరుణరస స్పర్శతో కదలిస్తుంది. ధృతరాష్ట్రుడు హృదృయమార్దవం కలవాడుగా, పాండవుల పట్ల అనురాగం కలవాడుగా కన్పిస్తాడు. అతని అంతస్స్వరూపం రాయబార సందర్భాల్లో సువ్యక్తమయింది. ధృతరాష్ట్రుడు గాఢమైన పుత్రవ్యామోహం కలవాడు కావచ్చు. అయినవారు పడే కష్టాలు విని సంతోషించేవాడు మాత్రం కాదు. అతడు బాధపడడం సహజం. అందునా తన చేతులపై పెరిగిన సోదరుని పుత్రులు, తనపై గౌరవం కలిగి ఉన్న కోడలు ద్రౌపది, వీరు తనవారే! కాబట్టి శోకమూర్తి కావడం సహజం. తనలోని దోషభావం మానసికంగా క్రుంగదీయనూ వచ్చు. ఇది ధృతరాష్ట్రునిలో నిహితమైన జ్ఞాతిస్పందనంగా భావించవచ్చు.

ఉదయం "మాగధ సూత గీత వాద శుభస్థితి మేల్కొనే" ధర్మరాజుడిపుడు "సృగాల నినాద వికీర్ణ కర్ణుడై" మేల్కొనే దుస్థితి చిత్రితమైంది. "నాగాయత సత్త్వుడు భీముడ, దిజ్నగా యుత హస్తుడు ధర్మజుని వాక్యబద్ధుడు 'డస్సిన నాగం' వలె ఉన్నాడు. అర్జునుడు అస్త్రవిద్యా విశారదుడు, సన్నుతుడు శోకతప్తుడై యున్నాడు. మృదుగాత్రులు నకుల సహదేవులు దయనీయ స్థితి చెపనలవి కాకుండా ఉంది. ఇక్కడో సూక్ష్మాంశం, ధృతరాష్ట్రుడు భీమార్జునుల అనుపమ బలపరాక్రమాన్ని మాటిమాటికి తలపోయడం, వారివల్ల మునుముందు వాటిల్లే ఆపద గురించి శంకను, భయాన్ని తలపిస్తూంది. ఇది మానస తలంపై పాత్రచిత్రణలో భాగం.

పాండవుల దుస్థితి విని దుర్యోధనుని దుష్టవర్తనం తలపుకు వచ్చింది. వాయుతనయ దవాగ్ని అర్జునానిల ప్రేరితమై దుర్వారమై కర్ణ సౌబల సహితంగా పుత్ర శత కాననాన్ని దహించవచ్చునన్న భీత్యతిశయం తాత్త్వికతను పొందింది. ఇది

"కర్మఫలములు దగకుడువక పోవ వశమె" అన్న సమాధాన వాక్యం ధృతరాష్ట్రుని మానసిక దౌర్బల్యాన్ని, నిస్సహాయత్వాన్ని ముఖ్యంగా విధిపై విశ్వాసాన్ని ప్రకటిస్తూ,ది. తత్త్వాశ్రయం దు:ఖ సంతప్త హృదయానికి శాంతి లభించినట్లు భాసిస్తుంది. ధృతరాష్ట్రుని అంతరంగం ఇపుడు సమదర్శనంతో ప్రకాశిస్తూంది. దీన్ని స్థిరంగా నిలుపుకోడానికి మితిమీరిన పుత్ర వ్యామోహానికి దూరంగా ఉండడం అవసరం. రాత్రి నిష్క్రమణంతో పగలు ఆగమనం పగలు నిష్క్రమణంతో రాత్రి ఆగమనం సహజం. ఇదే విధంగా కార్య విపర్యయం చేత సుఖదు:ఖాలు మనుషుల్ని పొందుతాయి. ఇక్కడ అర్థాంతర న్యాసాలంకారం చేత వైయక్తికమైన మహా దు:ఖాన్ని విశ్వజనీనమైన దృష్టితో చూచే ధృతరాష్ట్రుని మనస్సు గురించి ఆలోచన తలెత్తుతుంది. ఈ సద్భావన వాస్తవంగా క్రియలో పర్యవసితం కావడంలో సమస్య తలెత్తుతుంది. ఎన్నో అడ్డు వస్తాయి. ఈ సమయంలో ధృతరాష్ట్రుని మన: పరిపాక దశయే వేరు. ఇదొక ముఖం. అంతర్గతమైంది. ఏకాంత విచారణాశీలమైంది మాత్రమే. ఇదంతా భగవంతుని తలపిస్తూ వచ్చిన ఆ బ్రాహ్మణుని ముఖత: విన్న పాండవుల వర్తమాన కథాకథన పర్యవసానమే.

వనవాస క్లేశంలోను అర్జునుడు "నిర్జరుల వరంబున మహాస్త్ర లాభం" పొందుతాడు. "ఇట్టివి కదా వివిధాద్భుత కర్మపాకముల"ని ధృతరాష్ట్రుడు ఆశ్చర్యపోయాడు. వనవాస దు:ఖంలోను కష్టంలోను పాండవుల శక్తి బహుముఖాలుగా విస్తరిస్తున్నట్లు అనిపించింది. "గాండీవము విల్లటె! తత్కాండంబులు దివ్యములటె!" అని అర్జునుని తలచుకొని "ఒండేటికి నతని ధనమ యుర్వియు సిరియున్" ఈ భూమి, సిరి, సంపద అంతా అతనిదే అవుతుందన్న భావం కలిగింది. ఇంతకుముందు భీముడొక్కడే అంతకనిభుడుగా సాక్షాత్కరించాడు. ఇపుడతని ప్రక్కన అర్జునుడు చేరాడు. ఇది ధృతరాష్ట్రుని మరో ముఖం. లౌకికమైంది. బాహ్యమైన విషయ సమాలోచనం కలిగి,ది. ఎఱ్ఱన ధృతరాష్ట్రునిలో నున్న అంతర్బహిర్ముఖాలు తాత్త్విక లౌకిక భావనా రూపాలుగా వనవాస కథాకథనం కల్పనతో ఒదిగించి సముచిత వర్ణనతో మానసిక రేఖలతో ఇతిహాసాన్ని కావ్యశోభామయం చేసాడు.

## 2

ధృతరాష్ట్రుని భయ హృదయం దుర్యోధనున కవగతమయింది. కర్ణ సహితంగా కార్యాలోచనకు దిగాడు. కర్ణుడు గ్రీష్మంలో "తపను తేజంబై" "పగతుర కతి దుస్సహంబు"గా వర్తింపుమని బోధించాడు. గ్రీష్మకాల సూర్యతేజం దురధికారానికి ప్రతీక. ఇది పరాకాష్ఠనందేట్లు చేయడం కర్ణుని ఉద్దేశం. వ్యక్తి స్వభావానికనుగుణంగా కార్యానికి పురికొల్పడం జరిగింది. సంపదల ఫలం, "మిత్రజన మోదం శత్రుజన ఖేదం"గా భావించేవాడు కర్ణుడు. ద్వైతవనంలో ఉన్న పాండవుల్ని ముఖ్యంగా అర్జునుని దుర్విధిలో రాజ్య వైభవంతో చూచి ఆనందించడం అవసరమైంది. అర్జునుని ప్రత్యేకంగా పేర్కోడంలో కర్ణునిలో తీవ్రతరమయ్యే ప్రతిస్పర్థిత్వం బయటపడుతూంది. కుమారాస్త్ర విద్యా ప్రదర్శనం నాటి అవమానానికి మానసికమైన తృప్తి లభిస్తుంది. సౌభాగ్య భోగ మహిమనున్న "నీ దేవుల జూచి" పాండవాంగన "యెఱియవలదె" అని కూడ అన్నాడు. పతులు సమర్థులయి కూడ ద్రౌపది పరాభూత అయింది. ఇపుడు "ధృతి తరిగి" వ్యధాకుల కావాలని కోరిక. "నీ అభీష్ట" మన్నాడు. ధృతరాష్ట్రుని అనుమతి లభించాలి. ఆలోచన కర్ణునిది. ఇది దుర్యోధనుడంగీకరించినా ధృతరాష్ట్రుని ఆజ్ఞ లభించాలి. ధృతరాష్ట్రుడు మొదటవలదన్నాడు. కారణం "ఉరుతర విక్రమాఢ్యులు తపో విశేష సుస్థిరుల"ని పాండవులకు "భీతి" చెందుతున్నాడు. దుర్యోధనుడు కర్ణునితో "వింటె" యని ఆశ్చర్యాన్ని ప్రకటించాడు. అయితే ధృతరాష్ట్రుని ఊహ సరియైందే. ధృతరాష్ట్రుడు పాండవుల గురించి "తలపోత" "విలాపం"కాదు, యథార్థం. విదురుడు పాండవపక్షపాతి కాబట్టి అతనికి తెలియకుండా ధృతరాష్ట్రుని ఒప్పించే ప్రయత్నం మొదలైంది.

మరునాడు కర్ణుడొక ఉపాయం చెప్పాడు. ద్వైతవనంలో గోకదంబాల్ని చూచే వ్యాజంతో వెళ్ళవచ్చునన్నది బాగా ఉంది. కర్ణునిలో సమస్యను సృష్టించే నేర్పు ఉంది. సౌబలుడీ ఊహయే తనకు రాత్రి కలిగిందన్నాడు. అతడేకీభవించడంలో ఇదో తెలివైన పద్ధతి. కర్ణుడు ఆలోచనా గతి అయితే దుర్యోధనుడు క్రియా రూపంగా కన్పిస్తారు. కర్ణ సౌబలులు ధృతరాష్ట్రునితో మాటల్లో దుష్ట మృగ నాశనానికీ, గోగణ సంరక్షణకూ

గోపాలుని రాక కారణంగా సుయోధనుని నియమించే అభ్యర్థన చేసారు. అయితే ధృతరాష్ట్రుడు దీనికి ఒప్పుకోలేదు.

"వనమున నోసి వందురిన వారని వారల మీరవశ్యముం చెనక దలంతురు" వారు "తపోమహిమన్ మిము నిర్దహింతుర"ని వారించాడు. ధృతరాష్ట్రునికి దుర్యోధనుని పన్నుగడ తెలుసు. అతని శ్రేయం ముఖ్యం కాబట్టి ఘోషరక్షణకు తగిన వారిని పంపుదామన్నాడు. దుష్టమృగవినాశనానికీ, గో సంరక్షణకూ దుర్యోధనాదులే పోనవసరం లేదన్న మాట. దీని వెనక నుండి ఒకటి పాండవులున్న దుర్దశనుబట్టి సహానుభూతి, రెండు వారి విక్రమం పట్ల విశ్వాసం, భయం, మూడు దుర్యోధనుని ఆలోచన పట్ల సందేహంతో కూడిన మనోరూపం కన్పిస్తుంది. దీనితో ఘోషయాత్రా వ్యాజం బట్ట బయలయింది. శకుని వీలుచూచుకొని "పాలిత విక్రమోన్నతులు పాండుతనూజులు వారికప్రియంబేల యొనర్తు మే మధిప" "ప్రతిజ్ఞా లలితుండు ధర్మజుడు సత్యము తప్పునె? తమ్ము లేల తచ్ఛీల మతిక్రమింతుర"ని విశ్వసింపజేసాడు. పాండవుల విక్రమాన్ని ప్రశంసించడం గమనార్హం. ఇది ధృతరాష్ట్రుని మనోభావంతో ఏకీభవించినట్లైంది. వారి గొప్పతనం తెలిసిన తరువాత తామెందు కప్రియంగా ప్రవర్తిస్తారు. ఒకవేళ పొరపాటున జరిగినా ధర్మజుడు ప్రతిజ్ఞ నతిక్రమిస్తాడా? ధర్మజుని ప్రశంస విశ్వసనీయతను బలపరుస్తుంది. సమయం సందర్భం లేకుండా పాండవులపై కాలుదువ్వటే మాకు పనియా? అన్న ప్రశ్నతోపాటు మేము చేసే ప్రతి పనిని శంకించవద్దన్న సూచన కూడా ఉంది. భీమార్జునులు ధర్మజునాజ్ఞాబద్ధులు కాబట్టి ఘర్షణకవకాశమే లేదన్న నిశ్చయం ధృతరాష్ట్రునిలో అంగీకారానికి దారితీసింది. "మృగయా కౌతుకమ"న్న మరో అంశం జోడింపబడింది. రణాభిలాషతో వెళ్ళుట లేదన్న భావం స్పష్టం చేయబడింది. ఒకవేళ వారించినా మరో నెపంతో బయలుదేరవచ్చు. ఇప్పుడైతే పాండవులపట్ల శాంతంగా వర్తిస్తారన్న ఆలోచనతో దృతరాష్ట్రుడు "బుద్ధిమంతులై గోధనము నరసి తడయక రండ"ని పలికాడు. "బుద్ధిమంతులై" "తడయక" అన్న మాటల్లో దుర్యోధనాదుల ప్రవర్తన పట్ల అనుమానం – పాండవుల నుండి భయం పోలేదన్నది స్పష్టం. వారు వెళ్ళే పనికి మాత్రమే పరిమితం కావలసిందని ఎట్టి పరిస్థితుల్లోను వివేకం కోల్పోరాదన్న సూచనలో

ధృతరాష్ట్రుని జాగరూకమైన వ్యక్తిత్వం చిత్రితమైంది. తద్రచనయకా సాగిన కథా నిర్మాణం నన్నయతో ఎఱ్ఱన సమానశక్తిని సమ్యగవగాహనను తలపిస్తూంది.

**3**

దుర్యోధనుడు మహాసేనతో ఘోషయాత్ర జరిపాడు. సేనా పరివారం ద్వైతవన సరోవర ప్రాంతంలో విడిది చేసారు. చిత్రసేనుడనే గంధర్వపతి క్రీడార్థం కల్పితమైన ఆచోట క్రీడాగృహం నిర్మితికి దుర్యోధనుని ఆజ్ఞ అయింది. ఎఱ్ఱన చిత్రించిన విధంలో "బలియుడు, అలఘుడు, మహాబాహుడైన దుర్యోధనుని భృత్యులు గంధర్వులను తొలగి పొమ్మన్నారు. ఈ మాటలు దుర్యోధనుని అండ చూచుకొని అన్నవి. "గంధర్వు లుద్ధత క్రోధు"లయ్యారు. దుర్యోధనుని పనుపున "రణ దుర్మదు" లవతరించారు. ఇది గంధర్వులకు చెనటి పనిగా తోచింది. "బుద్ధిమ,తులై చనుట లెస్స"యని వారికి హితబోధ చేసారు. ధృతరాష్ట్రుడు తలచినట్లుగానే పాండవులపైగాక మరొకరిపై దుర్యోధనుని "ఎదిరిం తన్ను నెరుంగని" మతి కారణంగా మానాన్ని, ప్రాణాన్ని కోల్పోయే స్థితి యేర్పడింది. సరోవర మాక్రమించే ప్రయత్నం మొదలైంది. గంధర్వరాజు చిత్రసేనుని చేతిలో దుర్యోధనాదులు పరాభూతులయినారు. కర్ణుడు విరథుడై రణభూమినుండి తొలగిపోయారు. ఆ గంధర్వరాజు మాయా సంగర కోవిదుడు. ఎఱ్ఱన గర్వాహంకారౌద్ధత్యాది వికృత గుణాల సమాహార భూతమైన దుర్యోధనునిలో వివేచన లేని కారణంగా పరివారానికంతటికీ ఆపద సంభవించిన కథాంశాల్ని లోక సహజమైన ప్రవృత్తి చిత్రణతో నిర్వహించడం జరిగింది. ఇది కతాగమనంలో ప్రసన్నతను భజింపజేస్తూనే ప్రధానంగా నన్నయ మార్గమైనప్పటికీ రచనలో ఎఱ్ఱన ముద్ర స్ఫుటంగా ప్రౌఢబంధురంగా కన్పిస్తుంది.

ధర్మజుడపుడు యజ్ఞదీక్షలో ఉన్నాడు. కొందరతనికీ వృత్తాంతం తెలిపారు. "రిపుక్షోభంబు గావించి నీ యనుజ వ్రాతము గావవే" "కరుణ నిండారంగ" "రాజోత్తమా!" అని వేడుకున్నారు. బంధుభావం, క్షత్రియకర్తవ్యం, కరుణాహృదయం మానవ స్పందనం దృష్టికి వస్తాయి. వారి దృష్టిలో ధర్మజుడు రాజోత్తముడుగా

కన్పిస్తున్నాడు. అసలు రాజు నిర్బంధంలో ఉన్నాడు. భీముడు "విధాత చతురత" కాశ్చర్యపోయాడు. "ప్రవహసితాననుడ"యినాడు.

**"విపరీత స్థితి నొంది ఘోర విపినోర్వీవాసులై నిత్య దుః**
**ఖ పరాధీనత తూలి రంచు మనలన్ గర్వాధిక స్వాంతుడై**
**యపలాపింపగ వచ్చె దుర్ణయపరుండా ధార్తరాష్ట్రుండు రో**
**ష పరీతాత్ముడు తత్ఫలంబు కుడిచెన్ సత్యంబు సామాత్యుడై"**

అని "వాని దెస కృప సేయవలద"ని పలికాడు. "విపరీత ప్రతిభాష లేమిటి" కన్న నన్నయ పద్యారంభాన్ని తలపిస్తూంది. ద్వైతవన సమీపానికి దుర్యోధనుడు సపరివారంగా రావడంలోని ఆంతర్యం మొదట దురుద్దేశంతో కూడుకుంది. ఉద్రేక ప్రకృతిగల భీమునిపట్ల ఈ మాటలు సహజంగా ఉన్నాయి. పైగా ప్రతజ్ఞాబద్ధుడు, ధర్మజుని ఆజ్ఞాబద్ధుడు కూడా. స్త్రీపర్వంలో గాంధారి భీమునిచూచి ఎంత కోపమున్న తమ్ముని రక్తం త్రాగుదురా? యని ప్రశ్నించింది. దీనికి భీముడు త్రాగినట్లు నటించి నెత్తురు ముఖాన పూసికొన్నానన్నాడు. ఈ దృశ్యానికి సైనికులు పారిపోయారు. కావలసింది కూడా ఇదే. ధర్మజుడు భీమునితో జ్ఞాతి జనుల రక్షించుట బంధు ధర్మం. పైగా శరణాగత రక్షం రాజకర్తవ్యం. సహజస్నేహం, మానుషధర్మం తప్పదన్నాడు. తమ కాపద ఘటిల్లజేయవచ్చినవారిని ఆపద నుండి రక్షించే స్థితి చేకూరడం విధి వైపరీత్యమే. అవమానం రెండు విధాలు. ఒకటి దైహికం, గంధర్వుల వలన జరిగింది. రెండోది మానసికం. ఇది ధర్మజునిచే విడిపింపబడటం వల్ల జరుగనుంది. దైహికావమానం కన్నా మానసికమైన అవమానం ఘోరమైంది. దుర్యోధనుడు బంధవిముక్తుడైన పిదప ధర్మజుడు పలికిన మాటల్లో అతని రాజనీతి ప్రకాశనం భీమాదుల కన్నా పై స్థితిలో పనిచేస్తుందన్న విషయం స్పష్టమవుతుంది.

యజ్ఞదీక్షితుడైయున్న ధర్మజుడు శరణాగత ధర్మాన్ని భీమునికి తెలియజేసాడు. "ధర్మసూతి మెత్తని పులి" అంతా "అధర్మం" నీ పయి పెట్టునంత వరకు వేచి ఉంటాడన్న తిక్కన మాటలు సంజయరాయబార సందర్భంలో వెలువడినవి. ఎఱ్ఱన

రచనలో ధర్మజ పాత్ర చిత్రణలో ఈ విధమే మూలభూతంగా కన్పిస్తుంది. క్షత్రియ ధర్మ నిర్వహణం వల్ల పుణ్యము కీర్తి లభిస్తాయన్నాడు. ధర్మజుని మాటల్లో సాధారణ లౌకిక వర్తనాని కతీతమైన భావన సత్ప్రవృత్తికి లోక శుభానికి సంబంధించింది భాసిస్తుంది. ఈ శక్తి తమ్ముల్ని కట్టివేస్తుంది. భీముడంగీకరించాడు. అర్జునాదుల ప్రసక్తి లేదు. అర్జునునికి కర్ణునితోనే స్పర్ధ. అతి అతనికెదురు తీర్చే అవసరమొచ్చినపుడే, మునుముందు ఆలోచింపదగింది. పైగా అర్జునుడు ధర్మజునికి సదా వశమై ఉండేవాడు. తొందరపాటు లేని వ్యక్తి. గభీర మనోమూర్తి!

గంధర్వులు ప్రకటితాటోపంతో 'అగ్ని కల్పుల్ని' 'తేజో ధనుల్ని' 'అనఘుల్ని' పాండవుల్ని మార్కొన్నారు. ఇరువైపుల పేర్కొన్న విశేషణాలు అర్థవంతాలుగా ఉన్నాయి. పాండవుల విజయసూచన ఉంది. ధర్మజుడు తమను పంపేప్పుడు చెప్పినట్లు గంధర్వుల్ని "ప్రియ పూర్వకంగా" ననునయించే ప్రయత్నం చేసారు. ఇది ధర్మజుని శాంతి ప్రియత్వాన్ని భావింపజేస్తూంది. "సామ్య" వచనాలతో కాకపోతే చివరకు పరాక్రమంతో కార్యం తీర్చుమని ఆదేశించాడు.

గంధర్వులు అర్జునుని అనునయపూర్వకమైన మాటల్ని ఒప్పుకోలేదు. "ధర్మజుడు మాకు ప్రభువే" అని ప్రశ్నించారు. గంధర్వులు మానవాతీత శక్తి కలవారు. కాని అర్జునుడు తపోమహిమోజ్జ్వలుడు దివ్యాస్త్ర సంపన్నుడు. అర్జునుడు కోదండ మౌర్వీ క్వణనంతో "దివ్యశరార్చులు" ప్రసరింపజేసాడు. ఈ రణ సన్నివేశాన్ని ఎఱ్ఱన స్రగ్ధరా వృత్తంలో చిత్రించాడు. వనవాసంలో ఉన్న పాండవులెదుర్కొన్న విచిత్ర పరిస్థితిని మాయారణాన్ని దివ్య తపోమహిమతో పరాక్రమంతో ఎదుర్కొనే శక్తిని ప్రదర్శిస్తూంది. నకుల సహదేవులు భీముడు చూపిన శక్తి భయదమైంది. యుద్ధ వర్ణనను ఎఱ్ఱన ప్రౌఢ బంధురంగా చిత్రించాడు. అర్జునుడు గంధర్వుల్ని "శరపంజరం"లో బంధించాడు. గంధర్వరాజు మాయాబలాన్ని అర్జునుడు శబ్ద వేధి సాయంకాలతో ఛేదించాడు. అర్జునుని మహాస్త్ర విద్యా నైపుణ్యానికి గంధర్వపతి తల ఒగ్గక తప్పలేదు. అర్జునుడు చిత్రసేనునితో "సుయోధనుని విడుచుట ధర్మజునికి ప్రమోదం" అన్నాడు. ఇంద్రుని ఆజ్ఞా పాలకుడుగా తన్ను పరిచయం చేసుకున్నాడు. యుద్ధవేళ అర్జునుని ప్రవర్తన

వేరు. ఇపుడున్న అర్జునుని ప్రవర్తన వేరు. మృదుమర్యాదాశోభితంగా మారింది. చిత్రసేనుడు తానింద్రుని పనువులవల్ల వచ్చిన విషయం తరువాత చెప్పాడు. ధర్మజుడు చిత్రసేనుని సత్కరించాడు. దుర్యోధనుని చూచి "వీని విడువ వలయు"నని కోరాడు. "వీడు" అన్నమాట తమ్ముడు కాబట్టి చనువును, దోష హృదయంతో వచ్చాడు కాబట్టి. నిరాదరణను రెండు స్థాయిల్లో స్ఫురింపజేస్తూ అర్థవంతమైంది. బంధమోక్షితుడైన యాతని జూచి, ధర్మజుడు "ఎన్నడు నిట్టి సాహసము లింకనొనర్పకుమయ్య" అని వీడ్కొల్పాడు. ఈ పద్యం దుర్యోధనుని కుటిలబుద్ధికి వ్యాఖ్యానంగా ఉంది. ద్వైతవనం రావడంలోని రహస్యం తమకు తెలిసిన విషయం హృదయగతంగా దీప్తమైంది. దుర్జనత్వం సాహస క్రియలతో కూడి నాశనానికి దారి తీస్తుంది. ఈ స్థితికి మనస్సులో "విషాదాన్ని పొందకుమ"ని అనునయించడం జరిగింది. ఈ కథాంశం "అజాతశత్రుని కృపామౌగ్ధ్యా"న్ని అవగతికి తెస్తూంది. కథకు సంబంధించి నంతవరకు ఎఱ్ఱన రచనలో ప్రసన్న కథాకథన శిల్పం నన్నయ "తద్రచన"ను తలపిస్తుంది.

అయినప్పటికీ మూలంలోని ముఖ్యార్థానికి బాధ కలగకుండా, వాఖ్యానంతో వర్ణనతో స్థూలంగా ఎఱ్ఱన రచన నన్నయ తిక్కనల ప్రభావ సహితమై తనదైన ప్రాబంధిక రూపాన్ని పొందింది. ప్రబంధ యుగానికి మార్గదర్శకమయింది. ఈ ప్రౌఢ గుణం తరువాత తరువాత స్వతంత్ర వ్యక్తిత్వంతో ప్రబంధ పరమేశ్వరత్వాన్ని ఆవిష్కరింపజేసింది. 'కవిత్రయ' భావన ఒకే లక్ష్యం కలిగిన మూడు స్వతంత్రమైన విభిన్న వ్యక్తిత్వాల్ని స్మరింపజేస్తూంది. తెలుగు మహాభారత రచన కవిత్రయం సృజనకళ, నిర్మాణశిల్పంచేత ప్రత్యేకతను కలిగింది. పద్య రచనా సంప్రదాయ పరంపరకు తిరుగులేని బలమైన ప్రేరణ శక్తిగా నిలిచింది.

# నృసింహ పురాణం - కావ్యశోభ

నృసింహ పురాణం అష్టాదశ పురాణాల్లో ఒకటి కాదు. ఈ కథ బ్రహ్మాండాది పురాణాంతర్గతమైంది. భాగవతంలో విష్ణుపురాణంలో నృసింహావతార కథ ఉంది. కవి దీన్ని స్వీకరించి ప్రతిభా శక్తిచేత ప్రబంధ నిర్మాణానికి పూనుకున్నాడు. గ్రంథం అశోబలేశ్వర స్తుతితో ప్రారంభమయింది. రచనా కాంక్షా స్వరూపాన్ని గురించి

**"మించిన వేడ్క వీనులకు మిక్కుటమై మధు వృష్టి క్రమ్మ రా**
**యంచలు కూయ క్రౌంచమును నావల కూయ కడంగు భంగి ప్రౌ**
**ఢాంచిత శబ్దసారులు మహా కవులాద్యులు కావ్య శయ్య కీ**
**లించిన కీర్తి సంగ సుఖ లీలకు నేనును కాంక్ష చేసితిన్".**

ఇందులో రాయంచల కూతలు విని క్రౌంచం కూసినట్లు పూర్వ మహాకవుల పలుకుల్ని అనుసరించి తాను పలుకుచున్నట్లు పరంపరారూపం ప్రసక్తమైంది. ఇక్కడో విశేషముంది. రాయంచ స్వరం విని రాయంచ కూయడం కాకుండా క్రౌంచం కూయడంలో తన ప్రత్యేకత సూచితమైంది. ఇది తనకు పూర్వకవులైన నన్నయ తిక్కనల కన్న భిన్నమైంది. పై పద్యం "మధువృష్టి"లో రస నిర్భరతను భావింపజేస్తుంది. శబ్దం యొక్క సారం నాదం. కవిత్వంలో నాదశక్తిని ప్రసరింపజేసిన ప్రతిభా సంపన్నులాది కవులు. వీరి కవిత్వ శయ్యా సౌభాగ్యం ఆకర్షించింది. రసానుభూతి హృదయానికి సంబంధించింది. శబ్ద సార శయ్యాదులు రసనిర్వహణకుపస్కారకాలు. వివేచనకు సంబందించినవి. ఇవి సృజనకళను తలపింపజేస్తాయి. స్వప్నంలో తాత ఎఱపోత సూరి ఆనతి ననుసరించి నృసింహావతార ప్రబంధాన్ని నిర్మింప పూనుకున్నాడు. అప్పటికే ఉన్నత సంస్కృతాది చతురోక్తి పదంబుల కావ్యకర్త అయినాడు. ప్రబంధ పరమేశ్వరుడనంగ నరణ్య పర్వశేషోన్నయ మాంధ్రభాష నిర్వహించిన కీర్తి లభించింది.

సంస్కృతంతో పాటు తెలుగులో చతురమైన ఉక్తితో కూడిన పదాలతో కావ్య నిర్మాణం చేసే శక్తి ఒకటి. ఈ గుణాన్నే శ్రీనాథుడు సూక్తివైచిత్రి అనడం జరిగింది. ఇక్కడ ప్రబంధమన్నమాట గ్రంథం లేదా కావ్య పర్యాయపదం. ప్రకృష్టమైన అంటే

ప్రౌఢమైన రచనను భావింపజేసేది మరొకటి. దీన్ని ఎఱ్ఱన రచనలో వర్ణనాత్మకమైన ప్రౌఢమైన గుణంగా గుర్తించవచ్చు. ఉదాహరణకు అగస్త్య నక్షత్రోదయమైందనడానికి అగస్త్యుని పురస్కరించుకొని సుదీర్ఘమైన విశేషణం వేసి, "అతి గాంభీర్య విభూతి నేక చుళుకాహంకార నిశ్శేష శోషిత పాథోధిపయస్కుడైన ముని తోచెన్" అనడం ఒకటి. ఇది ఎఱ్ఱన అరణ్యపర్వం శేషంలోది. "తద్రచనయకా" ఉపక్రమించినపుడు కూడ కవి ప్రత్యేకత మరుగునబడలేదు. ఒక స్వతంత్ర గ్రంథం వ్రాసేప్పుడు మరీ స్ఫుటమవడం సహజం.

నృసింహపురాణంలో "ప్రబంధరచనా ప్రావీణ్యంబు నీకు సహజ సిద్ధము" ఇట్లు మహాప్రబంధ కల్పనా కుతూహలాయత్త చిత్తంబుతో" "ఆ తీర్థం బెరిగింపు పరమోదాత్త ప్రబంధోక్తులన్" మదీ వాంఛితము... శ్రీకర కావ్య రూపమున్ బ్రహ్మాండాది పురాణోక్తంబయిన[2] శ్రీ నరసింహావతార పురాణంబు" విజ్ఞానాత్మక వాఙ్మయంబున అన్న మాటల్ని పరిశీలిస్తే ఒకటి వస్తువుపై దృష్టితో పురాణంగా, రెండు నిర్వహణం, అభివ్యక్తి భావనపై దృష్టితో ప్రబంధం, కావ్యంగా మూడు తత్త్వంపై దృష్టితో విజ్ఞాన వాఙ్మయంగా కన్పిస్తాయి. "విజ్ఞానం బ్రహ్మేతి వ్యజానాత్" అని విజ్ఞానమంటే పరబ్రహ్మ సంబంధ జ్ఞానంగా పేర్కోబడింది. ఇది తత్త్వ స్వరూపాన్ని తెలియజేస్తుంది. ఇది నృసింహ స్వామి మాహాత్మ్య ప్రతిపాదకం, ప్రహ్లాదభక్తి మహితం, కాబట్టి విజ్ఞానశబ్దం భగవత్తత్త్వోద్దిష్టమైంది. ఈ విధంగా తిక్కన "ప్రబంధ" మండలి ప్రభావంతో రూపొందిన ప్రబంధ శబ్దం, కావ్యపదం ప్రౌఢమైన కవితావిష్కార రూపాన్ని, పురాణ శద్బం సంస్కృత మూలానికి సంబంధించిన పురాణ ప్రక్రియను స్థూలంగా వస్తువును విజ్ఞాన శబ్దం తత్త్వపరమైన రూపాన్ని భావింపజేస్తాయి.

**జయవిజయులు :**

ఏ తీర్థం సమగ్ర వైభవోపేతం, ముక్తి సాధన గృహం అయిందో దాన్ని "పరమోదాత్త ప్రబంధోక్తుల"తో, "గంభీర వాక్ప్రౌఢి"తో "కథనం" చేయడం ముఖ్యం. మొదటిది ఇష్టార్థ సిద్ధిప్రదం. ఇది రచనలో పరమార్థానికి సంబంధించింది. రెండోది తన రచనలో అవలంబించే గుణానికి సంబందించిన ప్రత్యేకతను భావింపజేస్తుంది.

ఆ ప్రత్యేకతయే ప్రాబంధికత్వం, ఎఱ్ఱన ప్రత్యేకంగా ఉద్దేశించింది. దీన్నే కవి ప్రబంధ సామగ్రి, ప్రబంధోక్తి, ప్రబంధ రచనా ప్రావీణ్యంగా పేర్కొనడం జరిగింది. ఇది ప్రౌఢమైన బంధం, వర్ణనా శోభితంగా పర్యాప్తమైంది. ఈ సందర్భంలో "వఱలు జటాటవిం కుసుమవల్లరులై.... చెలువారు శివేందు చంద్రికలు మన్ముఖమనీషిత కావ్యకళా కుముద్వతిని బ్రోచుగావుత" అన్న పద్యం పరిశీలనార్హమైంది. శివేందు చంద్రికలు జటా సమూహాన పూల తీగెలుగా, గంగా తరంగాలపై డిండీరంగా, శిరోలంకార సర్పాల శరీరంపై కుబుసాలుగా వెలిగేవి. కావ్యకళయనే కుముద్వతిని ముఖ మనీషిత వాఙ్మనోహరంగా వాక్ప్రియంగా పాలిస్తాయి. 'శివ' శబ్దం శుభపరంగాను అన్వయించవచ్చు. చంద్రకిరణ ప్రసారంచేత కుముద్వతి (తెల్లకలువల సరస్సు) హ్లాదైక పూర్ణమవుతుంది. వికాసరూపాన్ని పొందుతుంది. రచనా పరంగా కావ్యకళకు చెందింది. ఇది ఎఱ్ఱన వాక్సౌందర్య ప్రియమైంది. ఎఱ్ఱన వ్యక్తిత్వం శంభుదాసుడవడంవల్ల ప్రబంధ పరమేశ్వరుడుగా ఈ వర్ణనలో శివభావనతో రూపొందింది. పై అలంకారంలోని వస్తువులు తెలుపు వర్ణం కలవి సత్త్వగుణాన్ని తెలుపుతున్నాయి. సౌందర్యాపాదకాలుగాను ఉన్నాయి. ఇది ఎఱ్ఱన అలంకార శైలీ రామణీయకతను వ్యంజింపజేస్తున్నాయి. పౌరాణిక వస్తువును భవద్భావనా మహితమైన దాన్ని కళా సౌందర్య గుణంతో తీర్చే దృష్టి కనిపిస్తుంది. ఈ దృష్టితో చూస్తే ప్రబంధపద ప్రయోగంలోని కావ్య కళాత్మకమైన ఆంతర్యం స్పష్టమవుతుంది.

నృసింహావతార కథకు బ్రహ్మ మానసపుత్రుల శాపం కారణం. శ్రీమహావిష్ణువు ద్వారపాలకులు జయవిజయులు బ్రహ్మమానసపుత్రుల్ని లోనికి వెళ్ళకుండా వారించారు. వారు వీరిని కోపంత అసురులై జనింపుడని, శ్రీమహావిష్ణువుపై "మత్సరం కోపం సతతం కారియబెట్టు గాత" అని శపించారు. ఇది పరిహరింపరానిది. వీరు కశ్యపునికి దితికి సుతులై హిరణ్యకశిపుడు, హిరణ్యాక్షులుగా ప్రసిద్ధికెక్కారు. వీరికి తాము జయ విజయులన్న భావం కలగదు. ఈ భావం కలిగితే రాక్షసత్వ విజృంభణం జరగదు. ఈ పూర్వకథ తన తండ్రిని గురించి ప్రహ్లాదునికి చెప్పబడింది. ఎఱ్ఱన దీనికొక ఆశ్వాసం వినియోగించాడు. క్షీరసముద్రం మొదలుగా లక్ష్మీనారాయణ

మహిమోపేతంగా పుర స్త్రీ ఉద్యానవన చంద్రోదయ సరోవరాది వర్ణనలతో రచన నవ్యతను సంతరించుకుంది.

క్షీరాబ్ధి స్వరూపం శృంగార భావ సముపేతంగా వర్ణితమైంది. మనోహర కవితా రూపాన్ని కలిగింది.

**"బిగి యుల్ల సిల్లెడు పగడంపు కెమ్మోవి**
**చెలువంపు బింకంబు చిగురు లొత్త**
**తనరారు పులిన నితంబ బింబమున నా**
**కులితమై ఫేన దుకూల మమర"**

చంద్రోదయ వేళ సముద్ర వర్ణనం శృంగార భావ సమంచితంగా చిత్రితమైంది. పగడపు కెమ్మోవితో నితంబంపై ఫేన దుకూలంతో, ముక్తాఫల స్వేద కణాలతో, ఉద్వృత్త మీన నేత్ర రోచులతో, లలిత భంగుల నొప్పే వేలా వధూటిని వీచీ భుజాలతో కౌగిలించికొని రసోల్లాస లీలతో ఉదధి శృంగారమూర్తిగా గోచరిస్తుంది. ఈ పద్యం రూపకాలంకార శోనితమైంది. బ్రహ్మమానసపుత్రులేతెంచినపుడు లక్ష్మీనారాయణులు శృంగార తత్పరులై ఉంటారు. ఆగామి కథలోని ప్రధానమైన అంశాన్ని సూచించే రచనా శిల్పాన్ని పొందింది. దీనికి విరుద్ధమైన భావస్ఫోరకమైందీ పద్యం.

**కడలు చేతులార్చుచు ఫేన తరాట్ట హాస రుచితో ప్రవాళ జటాలి విద్రిచి**
**ఔర్వ శిఖి పాలలోచనం బనగ సింధు వమరు తాండవ మాడెడు హరుని వోలె"**

సముద్రం తాండవమాడే శివునితో పోల్చబడింది. తరంగ హస్తాలతో ఫేనాట్టహాస రుచితో, ప్రవాళ జటలు విరియబోసుకొని, బడమానలం, ఫాలలోచనమన తాండవశివుని వలె సముద్రం కన్పించింది. రౌద్ర రస వ్యంజకమైంది. ఆగామి కథలోని నృసింహుని రౌద్రావతార స్ఫూర్తిని కలిగింది. రూపకోపమాలంకార శోభితమైంది.

"సిరి పుట్టినిల్లు రాజీవలోచను సెజ్జ పట్టు, మహీకాంత కట్టుజీర" ఈ పద్యంలో సముద్రుడు గొప్ప ఆశ్రయశీలిగా అనేకమైన ఉపపత్తులతో వర్ణింపబడినాడు. లక్ష్మికి

జన్మస్థానం, విష్ణువు శయ్యయైన ఆదిశేషుని ఆవాసం, ఇంద్రవజ్ర భీతుడైన మైనాకునికి కోట అంటే సురక్షితస్థానం, బడబాగ్ని బ్రతికేచోటు, ఘన మేఘాలకు ప్రపా సీమ, చంద్రుని పుట్టుకకు స్థానం, మర్యాదలకు మహిమలకు నెలవు, అఖిల రత్నాలకాకరం, వాహినీ సుందరులకు శృంగార నిలయం, ప్రేమకు నిలకడ, గభీర గుణాలకు నెలవు, ఈ విధంగా వేనికవి వేరుగా నున్న బహు భావాల్ని గుదిగ్రుచ్చి ఒక వస్తువు లేదా వ్యక్తి ఔన్నత్యాన్ని స్థాపించే పద్ధతి కొత్తది. ఇది ఆ తరువాత వచ్చిన ప్రబంధాల కాదర్శమైంది.

పురస్త్రీలను వర్ణిస్తూ – "తమ వాడి చూడ్కి కందర్పున కేపనియైన సాధించు దివ్యాస్త్రమనగ" ఒక్కొక్క పాదంలో భావం స్వయం సంపూర్ణమైంది. మొత్తంమీద ఒక గుణాన్ని ఉదాహరణకు స్త్రీ సౌందర్యాన్ని కల్పనచేసి శృంగార జీవితాన్ని చిత్రించడం కూడ ప్రబంధాలకు మార్గదర్శకమైంది. కందర్పుడైదు బాణాలతో చేసే పని వీరు ఒక్క చూడిక్కతోనే నెరవేరుస్తున్నారు. ఇది సత్వర ఫలదాయకమైంది. ఇది దివ్యాస్త్రం వంటిది. వ్యర్థమయ్యే ప్రశ్న లేదు. ఇట్లా ఆలోచనకవకాశమిస్తూ అర్థాంతరాన్ని భావింపజేస్తూంది. చిత్రమేమంటే ఈ ప్రబంధంలో స్త్రీ సౌందర్యం భావనాత్మకంగా అనుభూతి ప్రధానమైన స్థాయిలో వర్ణితమైంది. పద్యరచనలోను అనేకమైన గతి విశేష శిల్పరీతులు కన్పిస్తాయి. ఉదాహరణకు మందానిల వర్ణనం సందర్భంలో, సీసపద్యంలో ప్రతి పాదం చివర "చల్లి చల్లి", "దాటి దాటి", "చేసి చేసి", "గిరిపి గిరిపి" అన్న క్రియారూపాల ద్విరుక్తితో అందాన్ని తెచ్చే పద్ధతి తరువాత వచ్చిన శ్రీనాథాదుల్లో బాగా కన్పిస్తుంది.

విష్ణుమూర్తి "కలిత గుణత్రయోజ్వల పరాత్ముండు నా నెగడి విశ్వమునకు మిగిలి యుండు". అతడు లక్ష్మీశ్వరుండు, జగదధీశ్వరుండు. రజస్సత్త్వతమో గుణాలచేత సృష్టికర్త, రక్షకుడు, లయకారుడుగాను, గుణత్రయ సంపుటిచేత పరాత్పరుడుగా విష్ణుతత్త్వము ప్రతిపాదితమయింది. ఆ పరాత్పరుడే గరుడవాహనుడు, రమాపతి, సగుణుడు, సవిశేషుడు, బ్రహ్మము. ఈ బ్రహ్మము పర, వ్యూహ, విభవ, అంతర్యామి, అర్చావతారాలని అయిదు విధాలు. ఈ కావ్యంలో వర్ణితమయింది పర రూపం. తరువాత ఆవేశావతారమైన నరసింహమూర్తి విభవరూపం. అహోబల క్షేత్ర

నరసింహస్వామి విగ్రహా (అర్చా) రూపం. ఈ మూడు రూపాల వర్ణన మీ గ్రంథంలో కన్పిస్తుంది.❖ జగత్తుకు కారణమైన జగదధీశ్వరుడు, లక్ష్మీశ్వరుడు, రజోగుణ వశాన భువనాల్ని సృజిస్తూ బ్రహ్మగా, సత్త్వగుణ వశాన భువనాల్ని రక్షిస్తూ విష్ణువుగా, తమోగుణ వశాన లయింపజేస్తూ ఈశుడవుతున్నాడు. ఈ గుణత్రయంచేత పరాత్మపరుడుగా భాసిస్తున్నాడు. ఇతడే నిఖిల దేవతామయ మూర్తి. సర్వదేవతలకు శరణ్యుడు, ఈ ప్రపంచం❖❖ ఈశ్వరమయం.

కేవలం జ్ఞానం ముక్తినివ్వదు. పరమేశ్వరుని పట్ల భక్తి తాత్పర్యాలు అవసరం. అపుడే పరమేశ్వరుడు ప్రసన్నుడవుతాడు. అతని దయకు పాత్రులయ్యేందుకై దేవతలు స్తోత్రాలతో వైకుంఠంలో శరణు పొందుతారు. పిపీలికాది బ్రహ్మ పర్యంతం జీవులు పరమేశ్వరానుగ్రహవశులై ఉన్నవారే. ఎఱ్ఱన ఈ భాగంలో వైష్ణవ తత్త్వాన్ని పరచి కావ్యానికి దీప్తి చేకూర్చాడు. విష్ణువు "అజరు డమరు డనంతు డవ్యయుడు" మొదలుగా "శుభాలు ఒసగే భక్తజన పారిజాతం"గా "కరుణరసప్రీతి" కలవాడుగా అభివర్ణింప బడినాడు.

---

❖ 1. పరరూపం – పరబ్రహ్మం పరవాసుదేవుడు, నారాయణుడు. వైకుంఠంలో శ్రీ సేవితుడు. శంఖ చక్రాద్యాయుధధారి. ద్వారపాలకులచేత రక్షితుడు, శేషశాయి, అనంతకల్యాణమూర్తి.

2. వ్యూహరూపం–జగదుత్పత్తికై పరరూపం వాసుదేవసంకర్షణప్రద్యుమ్నానిరుద్ధ రూపాల్ని ధరిస్తుంది.

3. విభవరూపం – విష్ణుమూర్తి దశావతారాలు.

4. అంతర్యామి రూపం – ఈశ్వరుడు మానవ హృదయంలో బింబించే రూపం, యోగులకు దర్శనమిచ్చేది, జీవాత్మతో కలిసి ఉంటుంది.

5. విగ్రహరూపం – దేవాలయాల్లో మానవులచేత ప్రతిష్ఠితమైంది. అర్చాది విధులు పొందే రూపం.

❖❖ ఈ ప్రపంచం చిత్ (జీవులు), అచిత్ (జడం)తో కూడుకుంది. పిపీలిక మొదలు చతుర్ముఖ బ్రహ్మ పర్యంతం అందరూ జీవులే. వారి వారి కర్మల్నిబట్టి శరీరాలు ధరిస్తారు. ప్రతి జీవునిలో పరమాత్మ అంతర్యామియై ఉంటుంది. ఈ జీవులు మూడు విధాలు.

1. నిత్యులు – అనంతుడు, గరుడుడు మొదలైనవారు. వీరి నివాసం వైకుంఠం. కర్మ ప్రకృతులకు లోబడక విష్ణువు సమక్షంలో మహానందాన్ని అనుభవిస్తుంటారు.

2. ముక్తులు – జ్ఞాన భక్తి ప్రపత్తులచేత ముక్తులయినవారు.

3. బద్ధులు – సంసారంలో పరిభ్రమించే జీవులు. కర్మప్రకృతులకు బద్ధులు. దేవతలు మానవులు పశుపక్ష్యాదులు.

లక్ష్మీదేవి ముందుగా మేల్కొంటుంది. మహా సౌందర్య సౌభాగ్యాతిశయంతో మేల్కొన్న విష్ణువుకు సమంగళ భావ పర్యాప్తమవుతుంది. ఆమె కంటి వెలుగులు నీరాజనాలుగా వర్ణితమయినాయి. పాంచజన్యం మెరసింది. సుదర్శనం జయ శబ్దితమైంది. కౌమోదకి నర్తనం చేసింది. నందకం దీప్తులెసగింది. విష్ణుమూర్తి లక్ష్మీదేవితో ప్రమోద రసమగ్నుడై ఉన్నాడు. ఆ సమయంలో బ్రహ్మ మానస పుత్రులు వచ్చారు. వారి ప్రవేశాన్ని ప్రతీహారులైన జయవిజయులు నిరోధించారు. సిద్ధులు, సురప్రభులు, సంయమివరులు వేచి ఉన్నారు. ఒక్కింత తడవు సైరణ నవలంబించవలసిందిగా కోరారు. దీనికి బ్రహ్మమానసపుత్రులకు కోపం వచ్చింది. "ధర్మద్విషులై అసురులై జనింపుడ"ని శపించారు. జయవిజయులు తమ విధిని నిర్వర్తించారు. దీనికి శాపమా? అన్న ప్రశ్నకు సమాధానమన్నట్లు ఎఱ్ఱన కథనం నడిచింది. "లక్ష్మీరమణుడిపుడు తన చూపు లితరులపై త్రిప్పడన్న" మాట వారిని కలచింది. ఎవరికైనా అందులో గణనీయులతో ఇపుడు వెళ్ళితే నీ ముఖం చూడడంటే ఎట్లా ఉంటుంది? అతడు తమ ముఖం చూస్తాడో చూడడో అది వేరు విషయం. పైగా వారు బ్రహ్మమానసపుత్రులు. మనలనాపుటకు వీరెవరరన్న భావం కలుగుతుంది. ఇది లోకసహజం. అక్కడున్న వారితో సమానంగా చూడడం మరో కారణం. నీవు కూడా వారితోపటు వేచి ఉండమన్నట్లుంది. ఈ హేతువులపై కథనం సాగింది. జయవిజయులు పరమేశ్వరునికీ తమకూ మధ్య అంతరాయంగా కన్పించారు. ఇదో దురితంగా భాసించింది. భగవంతునికీ భక్తునికీ మధ్య అధికార వర్తనం కారణంగా స్థితి అంతరాయంగా పరిణమించినట్లుంది. దీనికి బీజం అహంకారం. అందువల్ల తగిన ఫలం అనుభవింపవలయు మీరని శపించారు. దీన్ని విష్ణుమూర్తి దివ్యదృష్టితో తెలుసుకున్నాడు. మునుల శాపానికి కోపం రాకపోవడాన్ని ప్రశంసించాడు కాని శాపానుభవాన్ని కాదనలేదు. ఎఱ్ఱన కథాంశాల్ని సహేతుకంగా పొసగించి లోకవర్తనాన్ని బింబిస్తూ వ్రాయడంలో నేర్పు ప్రశంసనీయమైంది.

## హిరణ్యకశిపుని తపస్సు:

"అమరుల తల్లికంటెను మదంబ వరిష్ఠ" కాబట్టి త్రిలోక రాజ్యభోగాలు నాకు యోగ్యాలన్న వితర్కంతో హిరణ్యకశిపుడు సురలతో బద్ధ మత్సరుడయినాడు. హిరణ్యాక్షుని కన్న హిరణ్యకశిపుడు కొంత ఊహాశాలి. లోకజ్ఞుడు. విష్ణువును సంహరిస్తానని

హిరణ్యాక్షుడు మూర్ఖంగా ప్రవర్తించి మరణించాడు. ఎఱ్ఱన ముందుగా హిరణ్యకశిపుడు వితర్కమతిగా రూపొందించడంలో ఉత్తరోత్తరం అతడు ఒక పద్ధతిలో దేవతల్ని జయించే ప్రయత్నబీజం ఉంది. తపస్సు ప్రాధాన్యాన్ని గుర్తించాడు. అతని తపస్సు దేవతల కాశ్చర్యంగా భయావహంగా పరిణమించింది. అజుని మెప్పింపగోరే హిరణ్యకశిపుని తపస్సును గ్రీష్మ వర్ష హేమంత వసంత ఋతువులేమాత్రం ప్రభావితం చేయలేకపోయాయి. పంచాగ్నుల మధ్య తపస్సు గ్రీష్మంతో ఆరంభమైంది. ఉద్వేగదూరుడు నిశ్చలాంగుడు, నిర్వికారుడుగా అసురవరుడు కన్పిస్తాడు. వర్షధారలాతని సప్తాంగాల పైబడి ఔర్వశిఖల్లో కలిసిన "జలధి సలిలములవలె"నైనాయి. హేమంతంలో రాక్షసుని ఘోరతపస్సుకు భయపడినట్లు సరస్సు నెత్తమ్మి కన్ను మూసింది. వసంతం స్వర్లోకాప్సరోనివహంతో వచ్చింది. శరత్తు శిశిరాలు వర్ణింపబడలేదు. ఉత్తరోత్తరం భౌతిక మానసిక తలాలపై పనిచేసే బలీయాలైన గ్రీష్మ వర్ష మరియు హేమంత వసంతాలే ఏమీ చేయలేకపోయాయి. ఇక ప్రసన్నమైన శరత్తు, సూక్ష్మమైన శిశిరం ఏమి చేయగలవు? తపస్సమయంలో ఋతువర్ణనం పాత్ర భౌతిక మానసిక దృఢ శీలాదుల కనుగుణంగా ప్రౌఢ కవితా రమణీయంగా కళాత్మకతను పొందింది.

హిరణ్యకశివుని తపస్సుకు ఇంద్రుడు భయపడి, సురగురువు నాశ్రయించాడు. అతడు ఆదిదేవుడైన విష్ణునామ సంకీర్తన మహిమను తెలియజేసాడు. తరువాత సవిశేష సంస్కారంగా నారాయణ మంత్రోపదేశం చేసాడు. "దారుణ దురితాంధకార సూర్యోదయం బధిక పాతక విపినానలంబు" పాపమనే చీకటికి సూర్యోదయం, విపినానికి దవానలం, శైలానికి వజ్రాఘాతం, భుజగానికి గరుడమూర్తి, కాలకూటానికి గంగామౌళి, సర్వవేద శాస్త్రసారం, సకల మంత్రరహస్యం, విష్ణ్వతీత శక్తి లేదు. దీని సంబంధం ఈ ఘట్టం చివర దేవతల విష్ణ్వాశ్రిత స్థితిలో స్థాపితమైంది. దీన్ని కథా నిర్మాణ శిల్పంలో భాగంగా ఎఱ్ఱన ప్రౌఢ సుందరంగా తీర్చాడు.

దీనితో పాటు ఇంద్రుడు లౌకిక దశలో హిరణ్యకశిపునిపై రంభాద్యప్సరో సాధనాల్ని ప్రయోగించాడు. "నాకు మీ యంచిత చారు చంచల కటాక్షము నమ్మిన యస్త్రమ"ని వారిపై విశ్వాసాన్ని తెలియజేశాడు. ఏదో వ్రతం, జపం, క్రతువు, యోగం, తపరంలో ఉన్న మనస్సుపై "సుదతీ మద తీక్ష్ణ కటాక్ష కోణ" ప్రభావాన్ని జ్ఞాపకం

చేసాడు. ఇది చేయకూడని పని కాదు. "జగద్ధితమైందనడంలో ఇంద్రుని కార్యసాధనా నైపుణ్యం వ్యక్తమవుతుంది. ఎఱ్ఱన రచనలో పాత్ర వైయక్తిక స్థాయినుండి సమాజస్థాయికి స్వార్థరూపం నుండి పరార్థ రూపానికి ఎదగడం ప్రయోజన విస్తృతిని పొందుతూంది.

ఇది సురల కార్యం కాబట్టి పట్టుదలతో అప్సరసలు గంధమాదనం చేరుకున్నారు. వనంలో ఎక్కడ చూచినా విస్ఫురత్వసంత సౌందర్య రూపమే. కింశుక కోరకాళి, హిరణ్యకశిపుని వక్షస్థల విదారణం వల్ల పెల్లుబికిన రుధిరంతో తడిసి దీపించే నృసింహ దేవుని 'నఖపంక్తి'ని సూచించేట్లున్నాయి. వసంత విజృంభణ ప్రయత్నమంతా హిరణ్య కశిపుని తపోభంగం కోసమే. దీన్ని అధిగమించి అతని మృత్యువును స్ఫూర్తిమంతం చేయడం విశేషం.

విష్ణుమూర్తి హిరణ్యకశిపుని చంపడానికి ఏ అవతారమెత్తేది తెలీదు, కథాక్రమ గమనంపై దృష్టితో కాకుండా ఇందులో తెలిసిన కథలో హేతు దృష్టితో మాత్రమే సమంజసమైంది. విష్ణుగతమైన భక్త్యావేశం ఈ అంశాన్ని ఆలోచింపనీయలేదు. వసంతంలో తుమ్మెదరవం వనదేవతా మంజీర ధ్వనులవలె మ్రోగాయి. ప్రకృతిగతంగా శృంగార వర్ణనం ఆ కాలం నాటికి కావ్యవికాస దశలో నవ్యతను పొందింది. బాహ్యావర్ణనల్ని అధిగమించిన సుకుమారమైన అనుభూతిప్రదమైన మనోభావ చిత్రణం ఎఱ్ఱన కవితా శక్తికి కిరీటాయమానంగా ఉంది.

ముని కాళ్ళపై నిలిచి పూలు కోసే అప్సరస కాలివేళ్ళు నెత్తురు క్రమ్మి, శోభ ఇనుమడించింది. అపుడు "నేల పల్లవించినట్లు మెరసింద"నడం కవి భావనాశక్తి విలసితంగా ఉంది. అప్సరసల పాటకు జడ జగత్తు చైతన్యభరితమయింది. చేతనా జగత్తు చిత్ర రూపాన్ని పొందింది. హిరణ్యకశిపుని స్థితి "కరంగని అంతరంగంబు నిస్తరంగంబగు నంబు రాశియుం బోలె" అని ఎఱ్ఱన, తరంగం చంచలత్వానికి ప్రతీక. ఎటువంటి ఆకర్షణలకు చలింపని మనోరూపం, కదలికలు లేని సముద్రం వలె గభీరత్వాన్నీ సుస్థితినీ పొందింది. సముద్రం సాధారణంగా దాటరానిది. ఈ స్థితిలో హిరణ్య కశిపుని దేవతా స్త్రీలు విలాస విభ్రమాలచేత లొంగదీసుకోలేరని సూచితం. దీనికి కారణాలు ఇతడు "తరువో, పుత్తడిరూపో, చిత్తమున చైతన్యంబు శూన్యంబొ" యని కారణాలు వెదకడం మొదలుపెట్టారు. వారి శ్రమ అంతా "అడవి కాచిన వెన్నెల" అయింది.

"సిగ్గువోయిరి యచ్చర చెలువ వెల్ల" అనడంలో పరాజయాన్ని అంగీకరించి నట్లైంది. వారి "గర్వం బెండు"వోయింది. రచనలో పాత్ర రాక్షసుడైనప్పటి నిశ్చయంతో సాధనా లక్ష్యంతో రూపొందే స్థిరత్వాన్ని చూపేందుకు ఎఱ్ఱన ప్రదర్శించిన కళాత్మకత భావ సౌందర్యంతో ఆకర్షిస్తుంది. పాత్ర స్వరూపానికి బలం చేకూరుస్తుంది.

బ్రహ్మ ప్రత్యక్షమైనాడు. హిరణ్యశిపుడు "అమరేంద్రత్వం" కోరాడు. '3సురాధిపతిత్వము నీ కదెంత" అని బ్రహ్మ చమత్కారంగా తప్పించాడు. లోకంలో తన భావనలో నున్న దేనిచేతను మృత్యువు రాకుండా వరం కోరాడు. తన భావనా పరిధుల్ని అతిక్రమించి మృత్యువు వస్తుందని తెలియదు. ఇదే అజ్ఞానమంటే. అతడు తమోగుణ సంపన్నుడు. తపస్సుచేత కొంత జ్ఞానోదయం కావచ్చు. అయితే ఇదే సర్వసమగ్రం కాదు. బ్రహ్మ నుండి కోరిన వరం పొందాడు. ముందు జననికి తెలియజేశాడు పైన పేర్కొన్న విధంగా. "అమరుల తల్లికంటె మదంబ వరిష్ఠ" యని అతని నిశ్చయం కాబట్టి తల్లికి చెప్పడంలో ఔచిత్యముంది. ఆమెకు గౌరవస్థానాన్ని ఇవ్వడంలో తృప్తి సంతోషం పొందడం జరిగింది. దానవులు వచ్చి ప్రశంసించారు. అట్టి సురాధి నాథ నదతటంతయు బాపి" "దైత్యకులాభివృద్ధికై" మమ్ము తగబంచి పనుల్గొను మీశ్వరుండవై"యని పొంగిపోయారు. ఎఱ్ఱన ఈ సన్నివేశాన్ని లోకసహజ సుందరంగా చిత్రించాడు.

ఒకరు తమ కులంలో/వంశంలో గొప్ప పని చేస్తే ఆతని వ్యక్తిత్వాన్ని పొగడడం, అతని అధీనం కావడం లోకసహజం. వారిలో సంతోషం చెంగలిస్తుంది. సమర్థుడైన నాయకుడు తపశ్శక్తి సంపన్నుడు కావడం వల్ల అతని నీడలో ఏ పనికైనా సిద్ధపడడం ఉన్నదే. పై పద్యంలో "ట్ట" ప్రాసతో గతి విశేషం వారిలో హిరణ్యకశిపుని పట్ల గల గాఢమైన ఉత్సాహ రూపాన్ని సహకరించే పట్టుదలను సురాధినాథునిపై కోపాన్నీ దేవతలపై మునులపై తిరస్కారాన్నీ స్ఫురింపజేస్తూంది. గ్రీష్మవేళా ప్రచండ సూర్య కిరణాలకు "ఇంద్రలోకీ నయనోత్పలా వళులు" ఖేదాన్ని పొందాయి. హిరణ్యకశిపుని పట్టాభిషేకాతపత్రం సుధాంశు బింబ గరిమను పొందాయి. ఇది దేవతలకు భాస్కరమండలంగా దీపించింది. ఒకరి శుభకీర్తి మరొకరికి దుఃఖతాపంగా పరిణమించింది. ఎఱ్ఱన ఉదాత్తమైన కవితా రామణీయకతకు నిదర్శనంగా ఉంది.

హిరణ్యకశిపుని శాసనంలో సమస్త లోకాలు భయ బాధా గ్రస్తమైనాయి. మునుల్ని పట్టి తెప్పించడం, గంధర్వుల చేతి విణియల్ని పిశాచుల కిచ్చి పాడింపజేయడం, పొద్దువోకకై దుశ్చర్యలకు దిగడం, చివరకు అమరావతిపై దండెత్తడం జరిగింది. దీనితో "మనకు దైవంబు దాత వాసుదేవుడ"న్న బృహస్పతి ఆలోచనపై నిర్ణయంతో "రండు పోదము లెండు వేగమ" యని బయలుదేరారు. ఈ పద్యం దేవతల త్వరమాణ చిత్త స్ఫూర్తితో కూడిన ఆవేశాన్ని ఆవేగాన్ని, ముఖ్యంగా కార్యవ్యగ్రతను వ్యంజింపజేస్తూంది. ఈ ఘట్టం ఆరంభంలో విష్ణునామ మహిమ ప్రాశస్త్యం, చివరలో విష్ణు ధర్మోద్ధరణ తేజం కావ్య పరమార్థ దృష్టితో ఆంతర నిర్మాణ శిల్పాన్ని భావింపజేస్తున్నాయి. ముందు జరుగబోయే అవతారానికి సూత్రంగా నిలుస్తూంది. వైకుంఠంలో దేవతల ప్రార్థన విన్న విష్ణుమూర్త నరసింహ దివ్యావతార సూచనతో అభయమివ్వడం కావ్య పరమార్థాన్ని స్థాపిస్తూంది. హరిస్తోత్రంలో మత్స్య కూర్మ వరాహావతారాలు మాత్రమే వర్ణింపబడినాయి. నాల్గవది నృసింహావతారం. ఈ సందర్భంలో హయగ్రీవ నారాయణ రూపాలు మాత్రం పేర్కొని మిగతావి వదిలివేయడం జరిగింది. దీనిలో సందర్భౌచిత్యం ఉంది. దశావతారాల్లో నాల్గవది నృసింహావతారం వర్ణింపబడకపోవడం వస్తు విషయంలో ఎఱ్ఱన అవలంబించిన కాలౌచిత్యం స్పష్టం. ఇందులో నారాయణ పరబ్రహ్మం యొక్క సర్వశక్తి సంపన్నత్వం ఆవిష్కృతమైంది. ఎఱ్ఱన తాత్త్విక మరియు కవిత్వ కళా రూపాలకు ప్రాతినిధ్యం వహిస్తూందీ ఘట్టం.

## ప్రహ్లాద భక్తి :

దైత్యరాజ మహిషి కలలో భూదేవు డొకడు సంతాన ఫలమిచ్చి, ఆమె మెడలో హారాన్ని "నఖాంకురమున తిగిచికొని" పోయాడు. శుక్రాచార్యుడు "ఆ వచ్చినది లక్ష్మీధవుడ"ని, "కుంపటిలో తామర మొలిచిన క్రియ సుతుడు కలుగున"ని చెప్పాడు. ఈ స్వప్నం విష్ణుభక్తుని అవతారాన్ని హిరణ్యకశిపు వధను సూచిస్తూంది. పుణ్య విచారా అన్న సంబోధనం ఆమె పాతివ్రత్యాన్ని ప్రకాశింపజేసే ధర్మబుద్ధిని స్ఫురింపజేస్తూంది. ఆమె భర్త వీర ప్రవృత్తి కలవాడు. ఉదయించే పుత్రుడు శాంతప్రవృత్తి

కలవాడు ఈ పరస్పర విరుద్ధ భావాల్ని కుంపటిలో మొలిచిన తామరపూవుతో పోల్చడంతో సాధారణేతరమైన విశేషస్థితి వ్యంజితం. ఆ తరువాత నృసింహుని చేతిలో హిరణ్యకశిపుని మృత్యువు చిత్రితమైంది. ఈ స్వప్నం కథలో ఆగామి మంచి చెడుల పర్యవసాన సూచకమైంది.

ఆమెకు నెల మసలింది. గర్భవతి చిహ్నాలు పుట్టబోయే సత్త్వమూర్తి గుణాభిముఖంగా తీర్చబడినాయి. ఆ బాలుని విరక్తి భావం వలె జిహ్వా రుచి తొలగింది. ఆతని గుణ సంపూర్ణత వలె నడుం నిండుదనం పొందింది. ఆమె బుద్ధి పరమేశ్వర సమర్పకంగా వర్తించింది. ఈ రచనా పద్ధతి తరువాత వచ్చిన కావ్యాల్లో కథలో ఈ సందర్భం గల కథల కాదర్శమైంది.

**"అమృతాంబు నిధి సముదంచిత వీచిక కుదయించు తుహిన మయూఖు డనగ"**

పుత్రోదయం జరిగింది. ఈ సందర్భంలో ఎఱ్ఱన వర్ణనం కవితామయమైంది. లీలావతి "అమృతాంబునిధి, తూర్పుదిక్కు, రోహణాచలావని, మందార లతిక"తో పోల్చబడింది. ఆమె సుతుడు "తుహిన మయూఖుడు, సరోజినీ విభుడు, మహనీయ రత్నం, సురుచిర స్తబకం"తో పోల్చబడినాడు. ఒక మహోన్నతమైన వస్తువు మరో మహోదాత్త వస్తూత్పత్తికి కారణమైంది. లీలావతి సౌందర్యవతి, జ్ఞానమూర్తి, సౌభాగ్యవతి, పుణ్యచరితగా; ప్రహ్లాదుడు ప్రసన్నమతి, తేజస్సంపన్నుడు, మహిమాన్వితుడు, భక్తిమయుడుగా దర్శనమిస్తారు. ధర్మాచరణంతో పుణ్యఫలంతో పాత్రలు నిర్దిష్టమైనాయి.

## ప్రహ్లాదుని బాల్యచేష్టలు :

**"పసిపాపడై తాను పవళించు కాలంబు వటపత్ర శయను భావంబు దలచు"**

మొదలుగా విష్ణ్వవతార భావ సమర్పకంగా చిత్రితమైనాయి. పసిపాపయై పవళించే దశలో వటపత్రశాయిత్వం, బోరగిలపడే దశలో కూర్మ మూర్తిత్వం, అడుగులు వేసే దశలో త్రివిక్రమత్వం, వెన్నపాలు గ్రోలే దశలో గోపాలత్వం, ఆపైన విష్ణుధ్యానం తప్ప అన్యమెరుగని దివ్యదశ ప్రహ్లాదుని ఆబాల వ్యక్తిత్వంలో సమాకలితమైనాయి.

చిన్నతనంలో బీజప్రాయంగా ఉన్న బుద్ధి ఆ తరువాత జీవితాన్ని రూపొందిస్తుందన్న భావానికి నిదర్శనంగా ఉంది. "మూడేండ్లకు లేని బుద్ధి ముప్పది యేండ్లకు" ఉండదన్న సామెత అర్థమయ్యే "హిత వివేకపాకం" అతనిలో ఏర్పడింది.

శిశుదశ దాటింది. బాల్యం ప్రవేశించింది. ఈడు బాలురతో విద్యాభ్యాసం ఒనకూర్చబడింది. ఒకనాడు తండ్రి కోరికపై ఒక దివ్య సుభాషితం చెప్పమంటే –

**"ఆదియు మధ్యంబు నంతంబు నెవ్వాని కరయ లేదని చెప్పు నాగమంబు"**

అని నారయణుడే పరబ్రహ్మం, జ్ఞానరూపం, త్రిలాకాలబాధ్యం, కారణ కార్యరూపం, అతడే ఆదిదేవుడైన విష్ణువు, భగవత్ప్రపత్తియే ముఖ్యమన్న వాసుదేవ తత్త్వాన్ని ఉపన్యసించాడు. విష్ణుపురాణంలోని నృసింహావతార కథలో –

**"అనాది మధ్యాంతమజమవృద్ధి మక్షయ మచ్యుతం**
**ప్రణతోస్మ్యంత సంతాపం సర్వకారణ కారణమ్"** విష్ణు పు. 1–17సర్గ.–శ్లో. 15

శ్లోకానికి విస్తృతమైన సుందర వ్యాఖ్యానమే పై సీసపద్యం. ఈ మాటలకు హిరణ్యకశిపుడు మండిపడడం సహజం. తండ్రి ప్రశ్నలకు సమాధానంగా "ప్రభుడొకండు, మా దేవుడు వాసుదేవుడ"ని నిర్భయంగా చెప్పాడు. "అలుక విడుము! శాంతుడవగుము తండ్రి!" అని హితబోధ కూడా చేసాడు. తండ్రి "జగము లెల్లనేలే వాడను నేన"న్నాడు. ప్రహ్లాదుడు "జగత్తునకు ప్రభువు పరమేశ్వరుడు, విష్ణువు"గా పేర్కొని, ప్రకృతి పురుష తత్త్వం ప్రతిపాదించడంలో ప్రహ్లాదుని పూర్వ జన్మాగత విజ్ఞానశక్తి బింమిస్తూంది. హిరణ్యకశిపుని శత్రువు విష్ణువు. ఆ విష్ణుకీర్తనం సహింపరానిది కావడంతో ప్రహ్లాదుని శిక్షించడానికి ఆజ్ఞ అయింది. ప్రహ్లాదుడు "నిశ్చల నిర్వికార లీల" "సర్వాత్ము విష్ణు గనుచు" మహిత సమాధి నిష్ఠుడయినాడు.

ఈ సందర్భంలో ఎఱ్ఱన ప్రహ్లాదుని తత్త్వమతిగా, యోగ సాధకుడుగా రూపొందించాడు. ఇది రచనలో వీడని పురాణ సంబంధాన్ని తలపిస్తూంది. జీవ స్వరూపం జగత్కార్య కారణ భావం, పునర్జన్మ, కర్మసిద్ధాంతం మొదలుగా మాయ, భ్రాంతి, జ్ఞానం, పరమేశ్వర స్వరూపంతో ఉపనిషద్భావజాలం ఆవిష్కృతమైంది. పుట్టుక,

పెరుగుదల, మృత్యువు మనిషికి తప్పవు. దేహం వదలిన జీవుడు మళ్ళీ దేహధారి అవుతాడు. కారణం లేకుండా జన్మ లేదు. కారణం పూర్వఫలం. దీన్ని తొలగించే ప్రయత్నం అవసరం. అంటే జన్మరాహిత్యమన్న మాట. ఇది హరిభక్తి వల్ల హరి విజ్ఞానం వల్ల సిద్ధిస్తుంది. శైశవంలోనే మోహాన్ని పోద్రోచి మనస్సును విష్ణుమయమైన పుణ్య సమాహితమైన తత్త్వచింతనకు తేవాలి. వైరభావాన్ని వదలి భూత మైత్రి పాటించాలి. హరి సమర్పిత చిత్తుడు, పంచభూతాలచే మరే విధమైన రూపాలచేత పీడితుడు కాడు. "మహాయోగి హృదయగమ్య"మయిన "మహానంద తత్త్వాన్ని" తోడి బాలురకు ప్రబోధించడం జరిగింది. ఇది హిరణ్యకశిపునితో జరిగిన సంభాషణలోను కన్పిస్తుంది. ఇందులో ప్రధానంగా అచ్చమైన ప్రకృతికీ తద్వికృతికీ, అంటే జ్ఞానానికీ అజ్ఞానికీ మరియు వెలుతురు చీకటికీ సంకేతాలైన మానవుల మధ్య జరిగే మంచి చెడుల మధ్య సంఘర్షణ సూచితమైంది. అహంకార దర్పగర్వాటోపాద్యనేక వికృత రూపమైన హిరణ్యకశిపుడు, అచ్చమైన ప్రకృతి రూపానికి దగ్గరైన ప్రహ్లాదునిపై సర్వ మారణ యత్నాలు సాగిస్తాడు. నిష్ఫలుడవుతాడు. "పుత్రాకృతి పొందిన శత్రురూపంగా భావించాడు సహించే స్థితిని కోల్పోయాడు.

ప్రథమాశ్వాసంలో విష్ణుమూర్తి జయవిజయులతో "పగవాడైనను, మూర్ఖచిత్తుడయినన్, పాపాత్ముడయినన్ మదీయ గుణ ధ్యాన విధేయ ధీ పరిణతుండై" యున్నచో కరుణా కటాక్షం ప్రసరిస్తానంటాడు. అయితే విష్ణు గుణాల్ని ధ్యానించడం మొదలుగా బుద్ధి నిరంతర భావనచేత పరాకాష్ఠనందుకోవాలి. హిరణ్యకశిపునిలో ఒక విధంగా అంటే పూర్వజన్మ సంబంధమైన శాపవశంచేత ప్రహ్లాదునిలో మరో విధంగా పుణ్యకర్మవశంచేత పరస్పర భిన్న ముఖాలుగా కథాంశమొకే సూత్రంలో బంధింపబడింది. రచనలో ఎఱ్ఱన సృజన కళ తత్త్వగుణం చేత భాసిస్తుంది.

దైత్యులెన్ని హత్యా ప్రయత్నాలు జరిపినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. ప్రహ్లాదుని బహిర్ముఖత్వం ఔపచారికమైంది. ప్రముఖమైంది అంతర్ముఖత్వం. ఇది పరమేశ్వర భావ సనాథమైంది, కీలకమైంది. ప్రముఖ్యంగా చతుర్థాశ్వాసంలో సృష్టి మొదటినుండి సహజ వైరభావాన్ని కలిగియుండే రెండు భిన్న ప్రకృతుల తీవ్రత్వం గాఢత్వం నిశితత్వం పరాకాష్ఠనందిన స్థితులు కథాగత సన్నివేశ రూపాల్లో

ఆవిష్కృతమైనాయి. ఒకటి దైవగుణంగా, మరొకటి రాక్షసగుణంగా విశ్లేషణకందుతాయి. మొదటిది జ్ఞాన సహితమైంది, రెండోది అవిద్యా విహితమైంది. వీటి సంఘర్షణ అనివార్యం. అందువల్ల భగవంతుడు అవతారాలెత్తవలసిన అవసరం కలుగుతూంది. ఒక్కొక్కప్పుడీ రాక్షసగుణం పెచ్చు పెరిగి ఇదియే సర్వశక్తిమంతమన్నట్లు విజృంభిస్తుంది. కాని చివరకు దైవగుణమే ప్రతిష్ఠమవుతుంది. ఈ లక్ష్యం సర్వ పురాణాల్లో మహాత్మ్యాల్లో ప్రపంచితమయింది. ఎఱ్ఱన నృసింహపురాణంలో తత్త్వపరంగా దీనికున్న ప్రాధాన్యం తగ్గింపబడలేదు. కావ్య సౌందర్యం ప్రవేశపెట్టబడింది. కావ్య ప్రయోజనంలోని 'ఉపదేశ' మరియు 'సద్యఃపరనిర్వృతి' రెండింటి చక్కని సమ్మేళనం దృష్టికి వస్తుంది.

పంచమాశ్వాసం కథా ఫల స్వరూపంగా పరిణమించింది. ప్రహ్లాదుని "కసుగందని" స్థితికి రాక్షసుని హృదయంలో "భయము, అద్భుతము, కోపము" ముప్పిరిగొన్నాయి. ఇతడు తన మృత్యువుకు కారణమౌతాడేమోనన్న భావం భయాన్ని కలిగించింది. ప్రమాణాన్ని అధిగమించిన స్థాయి ప్రతీకారాన్ని జ్వలింపజేసింది. తన బల శౌర్యాలు మొక్కవోయినట్లనిపించింది. తన తక్కువతనాన్ని అంగీకరించేందుకు మనస్కరించలేదు. ఈ క్లిష్టస్థితి కోపాన్ని కలిగించింది. ఇవి ఆతని ఆందోళిత చిత్తాన్ని ప్రతిబింబిస్తున్నాయి. చివరకు తన అధీనంలోకి వచ్చిన యముని కప్పగించినా లాభం లేకపోయింది. ఇది మరీ దిగ్భ్రాంత పరచింది.

ఒకనాడు సభా మంటపంలో, శత్రు ప్రతినిధిని విడిచి అసలు శత్రువునే పట్టి చంపాలని నిశ్చయించుకున్నాడు. 'నీవ కనుంగొనుచుండుము నీ విష్ణుని పట్టి తెచ్చి మెదిపెద"నన్నాడు. ప్రహ్లాదుడు నవ్వాడు. ఆ నవ్వు తండ్రి అజ్ఞానాంధకారాన్ని చూపించే దివ్వెవలె ఉంది. "విష్ణుమయము జగమంతయు" అని దాని త్రిభువన వ్యాపకత్వం జగదేక సంహారకత్వం, విశ్వరక్షాకరత్వం, భువన సంభవ హేతుకత్వం గురించి ఉపన్యసించాడు. ఇవి క్రమంగా నారాయణ పరబ్రహ్మం యొక్క నాలుగు రూపాల్ని భావింపజేస్తాయి. అవి వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమన్న, అనిరుద్ధ అనేవి. వాసుదేవునిలో సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ రూపాలంతర్గతమై ఉంటాయి. సంకర్షణునికి జ్ఞాన బలాలనే గుణాలు, ప్రద్యుమ్నునికి ఐశ్వర్య వీర్యాలనే గుణాలు, అనిరుద్ధనికి తేజస్సులనే గుణాలు ఉంటాయి. ఈ ఆరు గుణాలు వాసుదేవునిలో ఉంటాయి.

"త్రిభువన వ్యాపక దీప్తి నిర్గుణ మూర్తి వాసుదేవాఖ్య నుజ్వలతనొంది" సీస పద్యంలో నారాయణ పరబ్రహ్మము యొక్క వ్యూహరూపం ఆవిష్కృతమయింది. దీన్ని వివరిస్తే, మూడు లోకాలు వ్యాపించి తత్ప్రకాశమాన మూల నిర్గుణ మూర్తి వాసుదేవుడుగా, తామసగుణ ప్రధానమైన జగత్సహారమూర్తి సంకర్షణుడుగా, సత్త్వగుణ ప్రధానమైన జగద్రక్షామూర్తి అనిరుద్ధుడుగా భావితమైనారు. పురాణ కథలో చతురాత్ముడుగా పిలవబడే ఒక్క నారాయణ పరబ్రహ్మము ఇన్ని ఆకృతులుగా విరాజిల్లడం వ్యాఖ్యాతమైంది. వేదాలు పురాణాలు సగుణ బ్రహ్మాన్నే ప్రతిపాదించాయి. ఇది శుభోపేతం, దోషరహితం, అనంత గుణావహమైంది. తనకు తెలియకుండా శరణుజొచ్చేవాడు హిరణ్యశిపుడు. అన్ని తెలిసి శరణు జొచ్చేవాడు ప్రహ్లాదుడు. అజ్ఞానం నుండి జ్ఞానానికి పయనించే ఈ కథ ఒక్కొక్క లీల సుదర్శనం నందకం పాంచజన్యం శార్ఙ్గం ధరించే చతుర్భుజుడైన విష్ణు మాహాత్మ్యాన్ని ప్రతిపాదిస్తుంది. సర్వవ్యాపకతను సూచిస్తుంది, వైష్ణవ తత్త్వాన్ని స్థాపిస్తుంది.

"కలడు మేదిని యందు కల దుదకంబుల" సీసపద్యం పంచభూతాలు సూర్య చంద్రులు మొదలుగా సర్వం నారాయణ పరబ్రహ్మమయంగా వర్ణితమైంది.

పోతన భాగవతంలో ప్రసిద్ధమైన

"కల దంభోధి కలండు గాలి కల డాకాశంబునం కుంభినిఁ
కల డగ్నిన్ దిశలఁ పవళ్ళ నిశలన్ ఖద్యోత చంద్రాత్మలఁ
కల డోంకారమునన్ త్రిమూర్తుల త్రిలింగ వ్యక్తులం దంతటన్
కలడీశుండు కలండు తండ్రి ! వెదకంగా నేల ఈ యా యెడన్"

ఈ పద్యంలో ఎఱ్ఱన రచనా ప్రభావం స్పష్టంగా కన్పిస్తుంది. చిదచిద్విశిష్టాత్మకమయిన సర్వ ప్రపంచం నారాయణ పరబ్రహ్మమయంగా దర్శితమయింది. ఎఱ్ఱన రచనలో ఈశ్వరుడు జీవుడు ప్రకృతి అనే మూడు తత్త్వాలు వ్యాఖ్యానింపబడినాయి. చిదచిద్విశిష్టమైంది బ్రహ్మము. జీవుడు బ్రహ్మ యొక్క అంశం. బ్రహ్మము సర్వాంతర్యామి. బ్రహ్మమునకు రెండు అవస్థలున్నాయి. ఒకటి నామ రూప విభాగానికర్హమైంది. సూక్ష్మదశలో కారణావస్థ. రెండోది నామ రూప విభాగానికర్హమైంది. స్థూలదశలో కార్యావస్థ.

ఈ బ్రహ్మము పైన పేర్కొన్నవిధంగా ఈశ్వరుడు జీవుడు ప్రకృతి తత్త్వాల సంపుటి. ఈశ్వరుడు సర్వనియంత, కల్యాణగుణావహుడు. జీవులు పూర్వజన్మ కర్మ పరంపరా నిబద్ధులై శరీరాల్ని ధరిస్తారు. సుఖదుఃఖాల్ని అనుభవిస్తారు. ఈ జీవులందరు భేదరహితమైన జ్ఞానదృష్టిలో ఏకాకారులు. భగవంతుడు వాని ఆత్మలుగా రూపొందుతాడు. ఇది జీవస్వరూపం. ఇక మూడోది ప్రకృతి. త్రిగుణాత్మకమైన అచిత్పదార్థం. బహువికారాలు పొందే మయారూపం. త్రిగుణాత్మకమంటే సత్త్వరజస్తమో యుతమైంది. సర్వావస్థల్లో ప్రకృతి త్రిగుణాల్ని కలిగి ఉంటుంది. సర్వవేళల వికారాన్ని పొందుతుంటుంది. కాబట్టి క్షరం.

అవ్యక్త స్థితిలో సత్త్వరజస్తమో గుణాలు సమస్థితిలో ఉంటాయి. ఈశ్వరుని సృజనేచ్ఛతో విపర్యాస మేర్పడుతుంది. మొదట మహత్తు తరువాత అహంకారం మనస్సు వీనినుండి పంచ జ్ఞానేంద్రియాలు జనిస్తాయి. అహంకారం నుండి ప్రకృతి, రజస్తమోగుణాలు, వానినుండి తన్మాత్ర సూక్ష్మ భూతాలు, వానినుండి స్థూలభూతాలనబడే ఆకాశ వాయు తేజస్సలిల పృథ్వి రూపాలు వ్యక్తమవుతాయి. తరువాత పంచీకరణ ప్రక్రియచేత మిశ్రభూతా లేర్పడతాయి. ఈ తత్త్వపరిశీలనం చాలా విస్తృతమైంది. ప్రకృతి విషయానికి వస్తే పరమేశ్వరుడే చిదచిద్విశిష్టమైన చరాచర ప్రపంచానికి కారణభూతుడు. స్థూల ప్రపంచంలో పంచభూత వినిర్మితం కాని వస్తువు లేదు. కాబట్టి విష్ణుమూర్తి స్తంభం నుండి ఆవిర్భవించడంలో ఆశ్చర్యం లేదు.

నారాయణ పరబ్రహ్మము సర్వ వస్తువులకాత్మ. దీని ఏకత్వ నానాత్వ ప్రతిష్ఠాపనం ప్రహ్లాద ముఖాన ఎఱ్ఱన ఆవిష్కరించడం జరిగింది. ఎవరు వ్రాసినా విష్ణు మూలతత్త్వమొకటే. భావ ప్రకటనలో భేదం మాత్రమే. ఈ కారణంగా ఎఱ్ఱన పోతన రచనల్లో సామ్యం కన్పిస్తుంది. కొన్నిచోట్ల పోతన రచనలో ఎఱ్ఱన రచనా ప్రభావం విశేషమైన గౌరవభావం వల్ల సంక్రాంతమైందిగా భావింపవచ్చు.

ఎఱ్ఱన ప్రహ్లాదుని విజ్ఞానపరవశునిగా, వాక్ప్రౌఢునిగా భావిస్తే, పోతన కేవలం 'భక్తిపరవశునిగా' 'బాలవర్తన'శీలిగా భావించడంతో పాత్రచిత్రణలో దృష్టిభేదంతో భిన్నత్వం గోచరిస్తుంది.

ఎఱ్ఱనలో భక్తిభావం ఆలోచనకొదిగి ప్రసరిస్తుంది. పోతనలో భక్తిభావం ఆవేశాన్ని పొంది ప్రవహిస్తుంది. ఇరువురి రచనల్లో భగవదనుభూతి వ్యాప్తమైంది. "సహృదయుల' ' హృదయాల్ని ఆకర్షిస్తాయి.

హిరణ్యకశిపుడు ప్రహ్లాదునితో "ఇందుగలడె!" యని స్తంభాన్ని 'ఘోరకరాహతి' విజృంభించడంలో నిర్లక్ష్యమైఖరి, ప్రతీకారధోరణి, పరాకాష్ఠనందిన చరమదశ చిత్రితమైంది. ఇంతకుముందు ప్రహ్లాదుడు ఘోర విపత్తుల నుండి పరోక్షంగా రక్షింపబడినాడు. ఇపుడతడు విపరీతమైన స్థితినుండి ప్రత్యక్షంగా రక్షింపబడవలసిన అవసరం సమాసన్నమయింది. హిరణ్యకశిపుని శత్రుభావం పరాకాష్ఠ దశకు చేరుకుంది. ప్రహ్లాదుని విజ్ఞాన పరవశ భక్తిభావం శిఖరదశకు చేరుకోనుంది.

అపుడు "బడబానలాహతి జడనిధిలో నున్న పటు శైల తతి ప్రేలి పెటిలె నొక్కొ" అనిపించింది. బడనాలాహతిచేత సముద్రంలోని శైల సమూహం ప్రేలినట్లు, ఘనతరమైన ఉత్పాత సహస్రాలొక్కమారు మ్రోగినట్లు, జీవులల్లకల్లోలమై పోవ బ్రహ్మాండ భాండం పగిలినట్లు, రుద్రుడు ఉద్ధతిని విలయ కాల పటహం మ్రోగించినట్లు, విశ్వం మూర్ఛపోయేట్లు స్తంభం నుండి మహాశబ్దం ఉద్గమించింది. అద్భుతావహమైన శ్రీ నరసింహరూపం సమావిర్భవించింది. లోకశ్రేయస్సు కొరకు విష్ణుమూర్తి రౌద్రాకృతి దాల్చాడు. హిరణ్య కశిపుని మృత్యువిపుడు విలయంలో భాగం.

ప్రకృతార్థానికనుగుణంగా భయద సన్నివేశం నిర్మితమైంది. దుష్టుల శక్తికతీతమైన పరమేశ్వర మహానుభావం దీప్తం చేయబడింది. ఇది నృసింహావతారం స్తంభోద్భవ వచనంలో ప్రౌఢబంధురంగా భావ రమణీయంగా వర్ణింపబడింది. ఇది తేజస్సంభృతమైన విలయాకృతి పొందిన మహారౌద్ర స్వరూపాన్ని శబ్దిస్తూంది. ప్రహ్లాదుడీ రూపాన్ని చూచి "భయ సంభ్రమాద్భుత భక్తి చిత్తు"డైనాడు. ఉదాత్త ధ్యాన పరవశుడై నృసింహున కెదురు పోయాడు. హిరణ్యకశిపుడీ భయద తేజోనుభవానికి తట్టుకోలేక నిశ్చేష్టుడయినాడు. ప్రహ్లాదుడు తండ్రితో "కృతార్థులమై"తి మింక "కృపానిధి నాశ్రయింపుమ"ని కోరాడు. "దుష్కృతముల కెల్ల శుద్ధియగు నీకు" అని హితం బోధించాడు. అన్నీ మరచి తండ్రిపట్ల వినయ గౌరవ మర్యాదలతో మాట్లాడటం గమనార్హం. "నా

కెదురై పెనంగ నీ విశ్వమున కలడె యెవ్వాడైనన్" అని తండ్రి చాప కృపాణ సాధనాలతో ఎదురు జని రణ సమారంభుడయినాడు. చిట్టచివరి సంభాషణం, తండ్రి కొడుకుల మనో నిష్ఠమైన గుణాల పరాకాష్ఠ దశకు చివరి మెరుపుగా కథన నైపుణ్యాన్ని వ్యక్తీకరిస్తుంది. హితబోధతో క్షమాగుణ హృదయంతో పితృణాన్ని తీర్చుకొనే పుత్ర స్వరూపం ప్రహ్లాదుని పాత్రలో చివరి రేఖగా కన్పిస్తుంది. అసురుల శస్త్రాస్త్రాలు వారిధిలో పడి మునిగే "స్రవంతికల"వలె అణగిపోయాయి. సముద్రోప మానంతో నృసింహుని గంభీర భయంకర దుస్సాధ్యమైన తేజోరూపం సూచితమౌతూంది.

ఎఱ్ఱన భగవంతుని అమేయమైన దివ్యశక్తి ఎదురుగా దైత్యుని పరిమితమైన శక్తి రెండిటి తారతమ్య స్ఫూర్తి కొరకు, హిరణ్యకశిపుని రాజపద సముచితంగా మారణ సన్నివేశాన్ని సృష్టించాడు. నృసింహుడు, కోరలు గీటుతూ నయనాల నుండి అనల స్ఫులింగాలు రాల, చెవులు బిగియ, ఘనకేసరాలు విదలిస్తూ విజృంభించి హిరణ్యకశిపుని పట్టుకున్నాడు. రౌద్ర వేగ రోష రభస స్ఫూర్తియైన నృసింహమూర్తి కతదు లోనయినాడు. దీన్ని "పటు మృగాదిపు జూడ బారి మదం బేది వడకు బంధుర మదావళము భంగి" యన్న సీసపద్యంలో ఎఱ్ఱన ఉదాత్త కవితాబంధురంగా తీర్చాడు. హిరణ్యకశిపుడు మృగరాజును చూచి వణకే మదగజం వలె, పులి పొదవిన పోలేని సారంగవిభుని వలె, సముద్రంలో మొసలి ఒడుపున చిక్కిన పెద్ద చేపలె, నిస్తేజస్కుడయినాడు. మృగరాజు గజం, గరుత్మంతుడు భుజగం, పులి సారంగం, మొసలి చేప సహజ వైరం కలిగినవి. కాబట్టి ఈ సందర్భంలో ఔచితీవంతమైన ఆలంకారికతను పొందాయి. గంధర్వులు జయధ్వానం చేసారు. దేవతలు సంస్తవములొనర్చారు. సన్మునులు "అహోబల రుద్ర రూప మాధవ భవతే నమో" యని ప్రస్తుతించారు. నృసింహమూర్తి అట్టహాసం చేసి, భీషణ కులిశ నఖాలతో హిరణ్యకశిపుని వక్షస్థలం చీల్చాడు. ఈ సన్నివేశం భయ రౌద్ర బీభత్సమయంగా చిత్రితమైంది. నరహరి చల్లిన రక్తశీకరాలు వనపంక్తులపై పడినాయి. అవి పల్లవ వసంత భ్రాంతిని కలిగించాయి. ఇది గొప్ప వర్ణనం. సత్ ప్రయోజనాన్ని సూచిస్తూంది.

వసంత భావనచేత లోకం పొందిన హర్షాతిశయంతోపాటు జగద్ధితానికై మార్పు వ్యంజితం. తండ్రి ఎంతటి దుష్టుడైనను పుత్రుడు పొందే దు:ఖాన్ని రక్తనిష్ఠమైన

బంధు భావాన్ని దృష్టిలో పెట్టుకొని నృసింహమూర్తి అనునయంతో "పుత్ర కృత్యములు నడుపుము! అతనికి పరమసిద్ధి జేయుదు"నని సుఖస్వాంతుని గావించాడు. భగవంతుడైనప్పటికి మానవ ప్రవర్తనను తలపిస్తూంది. హిరణ్యకశిపుడు విభూతి పొందుటకు ప్రహ్లాదుని ప్రోత్సహించాడు. "హిరణ్యకశిపుడు దోషాయత్త చిత్తుడు" కాడని, కథాగత రహస్యాన్ని సూచించడంతో కథన శిల్పం కళాత్మకతను పొందింది. శ్రీదేవి అక్కడికి శాంతి తుష్టి ధృతి సన్మతి నెచ్చెలులతో వచ్చి "ముకుందు నంకతటి" స్వీకరించింది. వేదం సాకారమై శైలాకృతి సవతరించింది, వేదాద్రి అయింది.

పరబ్రహ్మ స్వరూపుడైన నారాయణుడు సర్వదా శ్రీసమేతుడు. శ్రీ తత్త్వం అతనిలో నిహితమైంది. దివ్య దాంపత్య భావాన్ని వహిస్తుంది. ఆమె నిత్యానపాయిని శుభాకార, పరమ దయాస్వరూపిణి. జీవునిపట్ల కఠినంగా ఉన్న భగవంతునికి క్షమా దయా గుణాల్ని ఉపదేశిస్తుంది. ఈ విషయంలోనే శ్రీ దేవిని 'పురుషకార'మని చెబుతారు. ఈ దృష్టితో ఎఱ్ఱన లక్ష్మీదేవి ఆగమనాన్ని చిత్రించాడు. ఆమె విభుత్వాన్ని స్ఫురింప జేస్తూంది. తత్త్వప్రపంచనంతో పురాణ లక్షణాన్నీ వర్ణనాశక్తితో కావ్యత్వాన్నీ ప్రౌఢ రచనతో ప్రాబంధికత్వాన్ని మేళవించుకున్న గ్రంథం నృసింహ పురాణం. ఇందులో కావ్యం ప్రబంధం లక్ష్యం ఒకటే కాబట్టి కళాదృష్టితో వేరుగా తీసుకోనక్కరలేద. శృంగార వీర కరుణాద్భుత రౌద్ర భీభత్సాలు చివరకు శాంతంలోకి పర్యవసితమైనాయి.

నన్నయ కథనశిల్పంతో తిక్కన లోకవృత్తమయమైన పాత్ర చిత్రణంతో స్వీయ ప్రాబంధిక గుణంతో కలిసి ఎఱ్ఱన నృసింహ పురాణం తెలుగులో పురాణం మరియు ప్రబంధ ప్రక్రియల రెండింటి సమన్వయ భావస్ఫూర్తితో అవతరించిన విశిష్ట రూపంగా అవతరించింది. తిక్కన "ప్రబంధ మండలి" అన్నంతమాత్రాన ప్రతి పర్వాన్ని ప్రబంధంగా భావించలేం. తెలుగు సాహిత్యంలో ప్రబంధమంటే ఒక నిర్దిష్టమైన లక్షణాలతో వెలువడిన ఒక ప్రక్రియగా స్థిరపడింది. కాబట్టి ఎఱ్రన నృసింహ పురాణాన్ని ప్రబంధ గుణంతో పురాణ కావ్యంగా పరిగణించడం సముచితం. అంటే పురాణ సంబంధమైన వస్తు పరిణామంతో కావ్యగతమైన నిర్వహణ శిల్పం కలిగిన గ్రంథం అని అర్థం. ఏ పరిణామ క్రమంలోనైనా సంధి దశలో ఈ శ్లిష్ట లక్షణం అనివార్యంగా ఏర్పడుతుంది.

# హరివంశం - ప్రబంధ స్ఫూర్తి

హరివంశం మహాభారతాని కనుబంధ గ్రంథం. భారత రచనానంతరం వ్యాసమహర్షి హరివంవాన్ని రెండు భాగాలుగా రచించాడు. ఒకటి పూర్వభాగం, రెండోది ఉత్తరభాగం. "హరి వంశస్తత: ఖిల సంజ్ఞితమ్", "ఖిలేషు హరి వంశశ్చ భవిష్యచ్ఛ ప్రకీర్తితమ్" హరివంశం భారతానికి ఖిలం. ఖిలమంటే పరిశిష్టం. దీనితో మహాభారతానికి సంపూర్ణత చేకూరుతుందని ఒక అభిప్రాయం. నన్నయ్య తిక్కనల అనంతరం, భారతారణ్యపర్వ శేషాన్ని పూరించిన ఎఱ్ఱన మిగిలిన హరిశంశాన్ని భారతాని కనుబంధాన్ని ఆంధ్రీకృతం చేయ సంకల్పించాడు. "హరివంశం వినా భారత పారాయణ మపి న పూర్యత" హరివంశం లేకుండా భారత పారాయణం పూర్తి కాదన్న అభిజ్ఞోక్తి ఉంది. హరివంవం వేమారెడ్డి కంకితమైంది. "భారత మపరాంశమని" బుధులు చెపుతారు. ఆ రమ్యకథను తెలుగులో "నిర్వహించి తెలుపుము మాక"ని సంభావించాడు. నన్నయ తిక్కన చూపిన త్రోవ వెన్నుని వృత్తాన్ని "ప్రబంధం"గా నిర్మిస్తానని బదులు చెప్పాడు.

ఎఱ్ఱన వ్యక్తిగతంగా సాధుసమ్మతుడు, నిత్య సౌమ్యమతి, భవ్యుడు. సాహిత్య పరంగా సకల భాషా కవిత్వ విశారదుడు హరివంశం భారతానంతర కథ కాబట్టి తిక్కన రచనకు దగ్గరగా కన్పిస్తుంది. ఎర్రన స్వభావత: నన్నయకు దగ్గరవాడు. ఈ కారణంగా నన్నయ కథన శిల్పం, తిక్కన నిర్వహణ శిల్పం సమన్వయంతో స్వీయమైన ప్రబంధ నిర్మితితో కూడిన స్వరూపం సమాలోచన కందుతుంది. వేమారెడ్డి తమ్ముడు మల్లారెడ్డి ఆదరణలో రచించిన రామాయణం దొరకడంలేదు, వినష్టమైంది. "నా తమ్ముండు ఘనుండు మల్ల రథినీ నాథుండు... రామ కథయున్ జెప్పించి అన్న వేమారెడ్డి మాటలు సర్వ లక్షణ సారం లక్షణ గ్రంథంలో కూచిమంచి తిమ్మకవి ఉదాహరణలుగా ఎర్రాప్రెగడ రామాయణంలోనివని పేర్కొన్న పద్యాలు, ఎర్రన రామాయణ రచన కాధారాలుగా నిలిచాయి. ఎర్రన ప్రౌఢరచన "ప్రబంధ" శబ్ద ప్రయోగానికర్హమైందిగా కన్పిస్తుంది.

# II

బ్రహ్మ స్తుతి, "తమ్మికి చూలు, లోకముల తాత తపస్వుల యొజ్జ యోగి వర్గమ్ముల కాధ్యుడాగమ పరంపరకున్ ప్రభవంబు" ఇది ప్రోలయ వేముని కాయువు కోరే పద్యం ఏ భావాని కది వేరుగా, లోకంలో బహువిధమైన సంబంధాల సంపుటి. బ్రహ్మ కేంద్రస్థానం. బ్రహ్మతోగల వివిధ సంబంధాలు వర్ణింపబడినాయి. లోకంలో తండ్రి, తాత, గురువు అట్లే కర్తృత్వాదులతో లౌకికం నుండి పారలౌకికానికి కవి భావన క్రమించడం కనిపిస్తుంది. ఒకే వస్తువును బహుముఖాలుగా వర్ణించి, వర్ణనలో వాగ్వైశిష్ట్యాన్ని కనబరచడం ఎఱ్రన ప్రత్యేకత. ఇక్కడ విషయంలో కన్నా అభివ్యక్తిలో ప్రత్యేకత ఉంది. ఇందులో భావన విస్తరింపబడింది. ప్రబంధ ప్రక్రియలో ఈ గుణం పరాకాష్ఠ నందింది. లోక సహజమైన సంబంధ సంధానంతో విశేషణాత్మకంగా భావ సమాప్తినిబట్టి విచ్ఛిత్తి విశేషంతో రచన శిల్పత్వాన్ని పొందింది.

"ఉన్నత గోత్ర సంభవము నూర్జిత సత్త్వము" మొదలుగా నన్నయభట్టును స్తుతించిన పద్యం, నన్నయ భట్టును నిరంకుశ గతితో సంచరించే కుంజరంతో రూపితం చేయడం జరిగింది. ఆ కుంజరానికి విశేషణాలు క్రమంగా ఊర్జిత సత్త్వగుణాల్ని కలిగించాయి. ఉత్తమమైన భద్ర జాతికి చెందింది. ఉద్ధతుల్ని పరిభావితం చేసే మదోత్కటమైంది. నరేంద్ర పూజలకు తగింది. నరేంద్ర శబ్దం రాజులతో పాటు రాజరాజనరేంద్రుని స్ఫురింపజేస్తూంది. ఒక విశేషణం తరువాత మరొకటి అందిపుచ్చుకొని నన్నయ మహావ్యక్తిత్వాన్ని స్థాపించే ప్రయత్నం జరిగింది. ఈ విధమైన వర్ణనాత్మక శైలి ప్రామంధికతను సమర్థిస్తూంది.

"తను కావించిన సృష్టి తక్కొరుల చేతన్ కాదునా" పద్యం పైదానికన్న భిన్నమైంది. తిక్కన బ్రహ్మతో పోల్చబడినాడు. బ్రహ్మసృష్టి వలె ఇతని సృష్టి ఆశ్చర్యజనకమయింది. రచన విశ్లేషణాత్మకమైంది. తిక్కన రచనా పద్ధతికి దగ్గరగా ఉంది.

ఇక కథకు వస్తే కథలోని ముఖ్యార్థాన్ని పట్టుకొని కథకు సంబంధించిన బహ్వంశాల్ని పొసగింపజేస్తూ కథా శరీరాన్ని వివిధాంశాల్ని ఔచితీవంతంగా తీర్చే

విధానం ఆకర్షిస్తుంది. దీనితో పాటు కల్పనారూపం వర్ణనా శక్తి దృష్టికి వస్తాయి. వీటితో ప్రౌఢమైన పద్యరచనా విశేషం ఎఱ్ఱన ప్రత్యేక వ్యక్తిత్వాన్ని భావింపచేస్తూంది.

హరివంశం రచనలో ఎఱ్ఱన భారతాంధ్రీకరణ విధానమే అవలంబించడం జరిగింది. మూలంలోని హంస డిభకోపాఖ్యానం వదలివేయబడింది. ఇది నాచన సోమన ఉత్తర హరివంశంలో కన్పిస్తుంది. నన్నయభట్టు "హరివంశంబు భవిష్యత్పర్వంబు నను శతపర్వంబులు కలిగి"నదిగా పేర్కొన్నాడు. ఎఱ్ఱన దీన్ని అనుసరించి హరివంశ భవిష్యత్పర్వాలనడానికి బదులు పూర్వభాగం ఉత్తరభాగంగా విభజించాడు. అయితే బొంబాయి మూలప్రతుల్లో పూర్వ హరివంశం, ఉత్తర హరివంశమని ఉంది. పర్వ విభాగం లేదు. ఈ ప్రతులు ఎఱ్ఱన దృష్టికి వచ్చి ఉండవచ్చు. భారత భావ దీపికతో ముద్రితమైన (క్రీ.శ. 1936) హరివంశం (పూనాప్రతి)లో హరివంశపర్వం, విష్ణుపర్వం, భవిష్యపర్వం అని మూడు పర్వాలున్నాయి. "ఈ మూడింటితో కలిపి నూరు పర్వాల"ని వేలూరి శివరామశాస్త్రిగారి అభిప్రాయం. హరివంశం ప్రధానంగా శ్రీకృష్ణచరితం, మహాభారతంలో శ్రీకృష్ణుడు నిర్వహించిన దుష్ట శిక్షణం శిష్టరక్షణ ప్రధానమైన భగవదవతార పాత్ర పురస్కరించుకొని వర్ణితమైంది. మహాభారతానికి ఖిలంగా ప్రత్యేకతను పొందింది.

# కళా శిల్పం - ప్రబంధ స్ఫూర్తి

హరివంశం పూర్వభాగంలో శ్యమంతకోపాఖ్యానం చాలా ప్రసిద్ధమైంది. వినాయక చవితినాడు చంద్రుని చూస్తే నీలాపనిందలు కలుగుతాయన్న విశ్వాసాన్ని పరిహరించేందుకీ కథ పఠిస్తారు. అటువంటిది శ్రీకృష్ణునకు ఘటిల్లింది. దాని నతడు తొలగించుకున్నాడు. శ్రీకృష్ణుడు ఆదర్శమూర్తి, భగవద్విషయ మఖిల కల్మష హరం, పుణ్యప్రదం. కథలో నీలాపనిందల స్వరూపం లోకంలో ప్రచారం, మనస్సుపై వాటి ప్రభావం, వాటి పరిహరణంకై వ్యక్తి ప్రయత్నం, దాని పర్యవసానం దృష్టికి వస్తాయి. నీలాపనింద వల్ల మానసికమైన క్షతి కలుగుతుంది. ఇది యథార్థం తెలియకపోవడం వల్ల జరుగుతుంది. యథార్థం తెలియగానే అజ్ఞానావరణం తొలగి దు:ఖ కారకమైన నీలాపనింద తొలగుతుంది.

సత్రాజిత్తు సూర్యునారాధించి పొందిన శ్యమంతకమణిని ప్రసేనున కిస్తాడు. ప్రసేనుని చంపి శ్రీకృష్ణుడు మణినపహరించాడన్న అపవాదం బయలుదేరింది. దీన్ని పరిహరింప జేసుకోడానికి శ్రీకృష్ణుడడవికి వెళ్ళి యథార్థాన్ని గ్రహిస్తాడు. దీన్ని లోకానికి తెలియజేస్తాడు. తాను చేయని దోషం తనపై మోపబడడమే నీలాపనింద ఈ అపవాదం నుండి విముక్తుడవుతాడు. ఇది కథలో ప్రధాన విషయం. దీన్ని ఎఱ్ఱన నిర్వహించిన విధాన్ని పరిశీలించడమే ప్రకృతోద్దేశం.

సత్రాజిత్తు సముద్ర తీరాన నిలిచి నియతుడై పదకొండు రోజులు సూర్యునారాధించాడు. అపుడు సూర్యుడు ప్రసన్నుడై మూర్త్యంతరం ధరించి ప్రత్యక్షమయినాడు. ఇది మూలంలో లేదు. ఆ తేజానికి సత్రాజిత్తు తట్టుకోలేకపోయాడు. దేవ! 'నిన్నెట్లా చూచేది' అన్నాడు, పూజ చేసాడు. సూర్యుడు సంతుష్టుడై "మేలుసేయ" తలపును వెల్లడించాడు. ఆ తేజ:పుంజానికి కారణమైన కంఠంలోని శ్యమంతకమణిని తీసి సత్రాజిత్తు కంఠాన్ని అలంకరించాడు. వరం కోరుకోమన్నాడు. మూలంలో "స్వకంఠాదవముచ్యైవ ఏకాన్తే న్యస్తనావ్ విభు:" సూర్యుడు స్వకంఠం నుండి తీసి ఏకాన్తమందు ఉంచాడన్నది. తెలుగులో సత్రాజిత్తు కంఠాన్ని అలంకరించాడు. వరం

కోరుకోమన్నాడు. మూలంలో "స్వకంఠాదవముచ్యైవ ఏకాన్తే న్యస్తవాన్ విభు:" సూర్యుడు స్వకంఠం నుండి తీసి ఏకాన్తమందు ఉంచాడన్నది. తెలుగులో సత్రాజిత్తు కంఠాన్ని అలంకరించడంగా మారడంలో ఔచిత్యముంది. కథారంభంలోనే సత్రాజిత్తు విమలచారిత్రం కారణంగా త్రిభువనమిత్రుడు మిత్రుడయినట్లు చెప్పబడింది కాబట్టి ఈ చర్య మిత్రసహజంగా ఉంది. ఆ శ్యమంతకమణిని వరంగా కోరుకున్నాడు. సూర్యుడు తనకంఠంలో దాన్ని వేయకపోతే – వరమడిగేవాడో కాని ప్రకృతం మణిచేత ఆకర్షింపబడి, దాని కాంతికి చకితుడై దాన్నే వరంగా కోరాడు. ఈ సందర్భంలో పోతన భాగవతంలో సత్రాజిత్తు సూర్యునకు భక్తుడై చెలిమి చేయ నతని వలన సంతసించి సూర్యుడు శ్యమంతకమణినిచ్చెనని క్లుప్తంగా వచనంలో ముగించబడింది.

సత్రాజిత్తు మణిని ధరించి ద్వారక ప్రవేశించాడు. ప్రజలు విస్మయ సమ్మోహ సంభ్రములయినారు. ఆతని ఆ దివ్యమణి తేజ:పుంజంలో గుర్తించలేకపోయారు. ఒక మహానుభవానికి లోనయినారు. శ్రీకృష్ణుని కడకు జని సూర్యుడు దిగి వచ్చుచున్నాడని నివేదించారు. అతనికి నవ్వు వచ్చింది. ఆ వచ్చేది సూర్య వరప్రసాదలబ్ధుడు సత్రాజిత్తుగా తెలియజేసాడు.

ఎఱ్ఱన సన్నివేశాన్ని లోక సహజమైన ప్రవర్తనకనుగుణంగా నిర్మించారు. పోతన రచనలో భక్తి పారవశ్యంతో ప్రజలు శ్రీకృష్ణుని స్తుతించడంలో ప్రజల మూఢత్వం శ్రీకృష్ణుని జ్ఞానసంపన్నత్వం ద్యోతమానమయింది. ఎఱ్ఱన రచనలో అమాయకత్వం లోకవృత్త సహజంగా తీర్చబడింది. "రత్నహారీతు పార్థివ:" అన్నట్లుగా శ్రీకృష్ణుడా మణిని ఉగ్రసేనునకు "చేర్ప" సంకల్పించాడు. సత్రాజిత్తు నగనగాడనికభిమానం అడ్డువస్తూంది. "వేరొరులకే నెట్లిత్తు నంచుం బొరిన్ తదనుధ్యానము సేయుచుం తలకు సత్రాజిత్తు డెల్లప్పుడున్" శ్రీకృష్ణుని కామణిపై మనస్సు కలదని సత్రాజిత్తునకు తెలుసు. అయితే శ్రీకృష్ణుడు దాన్ని సత్రాజిత్తు స్వయంగా సమర్పించే పరిస్థితి కల్పింపబడాలన్న భావనతో నున్నాడు. శ్రీకృష్ణుడు సశక్తుడై కూడ మిన్నకుండటాని కారణం "కులంబునం కలహంబు పుట్టు"ననియే "గోవిన్దో న చ తల్లేభే శక్తోపి, న జహార సః" అని మూలం. ఇందులో కారణం చెప్పబడలేదు. దీని సహేతుక వ్యాఖ్యానమే ఎఱ్ఱన రచన. తన అభిప్రాయం సత్రాజిత్తు చెవిదాకా వెళ్ళేట్లుగా బంధువులతో

ప్రసంగ సందర్భంలో ప్రకటించడం జరిగింది. శ్రీకృష్ణుడు శ్యమంతకమణిని కోరడం అందరికీ తెలిసింది. ఈ స్థితిలో సత్రాజిత్తు చెవిదాకా వెళ్ళేట్లుగా బంధువులతో ప్రసంగ సందర్భంలో ప్రకటించడం జరిగింది. శ్రీకృష్ణుడు శ్యమంతకమణిని కోరడం అందరికీ తెలిసింది. ఈ స్థితిలో సత్రాజిత్తు మణిని ప్రసేనునకిచ్చాడు. ఇక్కడి నుండి కథ ఆరంభమవుతూంది. అశుచియైన వ్యక్తి మణిని ధరిస్తే అది గుణాన్ని చూపదు. పైగా ప్రాణానికాపద కలిగిస్తుంది. ఈ రహస్యం సత్రాజిత్తుకు తెలుసు ప్రసేనునికి తెలియదు. సత్రాజిత్తు విషయంలో అయితే తపస్సుచేత దాన్ని పొందాడు. దానికర్హుడని సూర్యుడు తలచాడు. శ్రీకృష్ణుడడుగుతాడన్న భయంతో సోదరునిపట్ల ప్రేమతో ఈ పని చేసాడు. "దీనికతడర్హుడా?" యన్న ఆలోచన రాలేదు. ఈ అజ్ఞానం నుండి ఆపద వచ్చిపడనుంది. ఇది శ్రీకృష్ణునిపై నీలాపనిందలకు కారణమైంది.

ఒకనాడు ప్రసేనుడు తురగారూఢుడై అడవికి వెళ్ళాడు. అతని కంఠంలో వ్రేలాడే మణిని చూచి సింహం అదొక మాంసఖండమని చంపేసి కబళింపబోయే సమయంలో జాంబవంతుడు చూచాడు. సింహాన్ని వధించాడు. ఆ మణిని గ్రహించాడు. తన శిశువు సుకుమారునికి క్రీడావస్తువుగా ఉంచాడు. అడవికి వెళ్ళిన ప్రసేనుడు తిరిగి రాలేదు. "ఇది కృష్ణకృత్యంబు కానోపు" అని ప్రజలు భావించారు. ఇది సహజం కూడా. "కర్ణపరంపర"గా "పరివాదం" వ్యాపించింది. ఇది "లోకవేది" శ్రీకృష్ణునకు తెలిసింది. ప్రసేనుని చావుచేట్లరసెద"నని ప్రయత్నం మొదలుపెట్టాడు. ఎవరో ఒక మాట అంటారు, దాన్ని మరొకరు ఇట్లా అది అహేతుకంగా వ్యాపిస్తుంది. సత్రాజిత్తు కూడా నమ్మటలో ఆశ్చర్యం లేదు. శ్రీకృష్ణుడు అడవిలో, మృతుడైన ప్రసేనుని చూచాడు.

**"బలవత్సింహ చపేట పాటిత తను ప్రభ్రష్ట భూషాంబరా**
**కుల కౌశ ప్రకరుం, కరస్ఖలిత ఖడ్గోన్ముక్త కల్యాణ సం**
**వ లిత గ్రీవ  వికీర్ణ కేసర మృతాశ్వ ప్రాంత సంస్థున్ రజ:**
**కలుష శ్మశ్రుముఖున్ ప్రసేను కనియెం క్రవ్యాద సంవేష్టితున్"**

బీభత్స దృశ్యం ప్రకృష్ణ బంధ సుందరంగా ప్రౌఢ శైలీ నిర్మాణ సంపన్నంగా వర్ణితమైంది. సింహ శవం ప్రక్కన తొలగిన భూషణాలు వస్త్రాలతో చెదరిన కేశరాజితో జారిన

ఖడ్గంతో మృతాశ్వం దగ్గరలో దుమ్ము క్రమ్మి క్రవ్యాద సేవితుడై కన్పించాడు. మణి కన్పించలేదు. ఋక్ష పద చిహ్నాల్ని బట్టి బిలద్వారం చేరుకున్నాడు. అనుచరుల్ని బయట నిలిపి లోనికి వెళ్ళాడు.

ఈ సందర్భంలో మూలంలో కథాంశం "సాశ్వం హతం ప్రసేనం వై నావిన్దచ్చేచ్ఛితం మణిమ్ అథ సింహ: ప్రసేనస్య శరీరస్యా విదూరత:" అని దీన్ని తెలుగులో జరిగిన విషయం చిత్రాకృతి పొందింది. శ్రీకృష్ణునికి కావలసింది మణి. దానికిగల "గౌరవం ఋహించి" అన్న మాటలో మణి చాలా ప్రభావోపేతమైంది. దాన్ని ధరించే అర్హత లేని ప్రసేనుడు, దాన్ని గ్రహింపనెంచిన అనర్హమైన సింహం చనిపోయారు. వారు దీనికి తగరనుట స్పష్టం. గుహలోకి శ్రీకృష్ణుడు సమీపించడం చూచి ధాత్రి అరచింది. జాంబవంతుడు పరుగెత్తుకొని వచ్చి ఉదగ్ర కోపంతో శ్రీకృష్ణునితో యుద్ధానికి దిగాడు. "పటు భుజ వ్యాఘాత నిర్ఘాత సంపతనాభీలంగా" "యుయుధే వాసుదేవస్తు బిలే జాంబవతా సహ బాహుభ్యామేవ గోవిన్దో దివసానేక వింశతిమ్" ఇరవై ఒక్కరోజులు పోరాడారు.

జాంబవంతుడు వస్తూనే ఆలోచన చేయకుండా ప్రవర్తించాడు. శ్రీకృష్ణునికాతడు జన్మాంతర భక్తుడని తెలుసు. కాని హఠాత్తుగా వచ్చి ముష్టియుద్ధం మొదలు పెడితే ఏమి చేస్తాడు? 'యుయుధే వాసుదేవస్తు బిలే' జాంమవతా సహ" అన్న మూలంలోని భావాన్ని ఎఱ్ఱన ఓజో గుణయుతమైన ప్రౌఢ రచనచేత ముష్టియుద్ధ వాతావరణాన్ని శబ్దింప జేయడం ప్రబంధ రచనా శిల్పాన్ని తెలియజేస్తూంది. "నీవు భక్తుడవ"ని "యుద్ధమాడ వలద"ని చెప్పడం కుదరదు. ఒకవేళ చెప్పినప్పటికి ఆ మణి నపహరించడానికి పెద్ద ఎత్తు వేసాడనే భావించడం జరుగుతుంది. తాను చెప్పడం కన్న ఈ విషయం నెమ్మదిగా అనుభవంలోకి రావడంలో కథకు పట్టు చేకూరుతుంది. ఉత్సుకత పెరుగుతుంది. ఫల రూపం మధురంగా ఉంటుంది. ఇరువురు పరస్పర విజిగీషతో రోజులు గడుస్తున్నాయి. శ్రీకృష్ణుని అనుచరులు ఏడెనిమిది దినములు వేచి బలదేవానుజుడు నిహతుడైనాడని తలచి వెళ్ళిపోయారు.

శ్రీకృష్ణుని తరువాత తమకు ప్రభువు బలరాముడు. కాబట్టి శ్రీకృష్ణుడు "బలరామానుజు"డయ్యాడు. జాంబవంతుడు నిరాహారం వల్ల ప్రబల ప్రహారాల వల్ల

బలహీనుడై, ఓటువడినాడు. అప్పుడు "తన స్వామి దాశరథి యేమో"నన్న ఊహ కలిగింది. శ్రీకృష్ణునకు సత్త్వ హాని కలుగలేదు. ఇది జాంబవంతుని ఆశ్చర్యపరచింది. ఇతడెవరో మహానుభావుడనుకున్నాడు. "దేవా! నిన్ను మత్స్వామి దాశరథిం ప్రాప్త పునస్సముద్భవుని"గా సందేహిస్తున్నానన్నాడు. శ్రీరాముడు మరో అవతారాన్ని పొంది, ప్రత్యక్షమైన మానసికమైన అనుభూతిని పొందాడు. ప్రార్థనాయత్త చిత్తుడయినాడు.

కథ హఠాత్తుగా భక్తిభావోపేతమైంది. శాంత రసాభిముఖంగా ప్రవర్తమాన మయింది. తాత్కాలికమైన మహోద్రేకంలో కప్పబడిన భాగవత లక్షణం అహంకారంవీడిన సత్త్వమహిత భక్తి స్థితిలో ప్రకాశమాన మయింది. శ్రీకృష్ణుని కాతని మాటలకు 'నవ్వు' వచ్చింది. ఇప్పటికైనా గుర్తింప గలిగినందుకు సంతోషం స్ఫురిస్తూంది. కారణం జాంబవంతుని జీవ సంస్కారమటు వంటిది. కాస్త ఆలస్యంగానైనా దివ్యశక్తిని గుర్తింపగలిగాడు. భాగవతాపచార శంకతో స్తుతించాడు. పూర్వప్రవర్తనకూ, ప్రస్తుత ప్రవర్తనకూ పోలిక లేదు. పూర్వ ఉదగ్ర కోపోద్ధతుడు, శత్రు భావపరీతుడు. జిగీషాతత్పరుడు. ఇపుడు సాత్త్వికగుణోపేతుడు, భక్తిభావ భరితుడు, శరణాగత తత్పరుడు. ఈ హఠాత్పరివర్తనం శ్రీకృష్ణునకు నవ్వు పుట్టించింది. భక్తుని మన్నించిన భావంతో ప్రకాశించింది. పైకెంత కఠినుడో లోపల అంత స్నిగ్ధమూర్తి జాంబవంతుడు. ఈ స్నిగ్ధత్వం విష్ణుభావన చేత సందీప్తమయింది. శ్రీకృష్ణ కరస్పర్శతో సమర శ్రమ మరచి, ఆనంద స్వాంతుడయినాడు. తన కూతురు జాంబవతిని, శ్యమంతకమణిని సమర్పించాడు.

ఈ కథలో విధి విహితం ప్రపంచితమైంది. నీలాపనింద శ్రీకృష్ణుడంతటివాడికే తప్పలేదు. విధి గమనాన్ని బట్టి బుద్ధులు ప్రసరిస్తాయి. ప్రవర్తనలు సాగుతాయి. పరిస్థితులు తారుమారవుతాయి. సాధారణ బుద్ధికందని స్థితి యేర్పడుతుంది. కాలమే దీన్ని పరిష్కరిస్తుంది. శ్రీకృష్ణుడు మణిని ఉగ్రసేనున కీయదలచాడు. కాని అది ఫలించలేదు సరికదా! ప్రమాదానికి దారితీసింది. భగవంతునికే తప్పలేదు. చివరకు శుభవంతంగా యశోవంతంగా పరిణమించింది. దీనితోపాటు భక్తునికీ దైవానికీ గల సంబంధం, ప్రపత్తితో సమర్పణ భావసముపేతంగా ఆవిష్కృతమైంది. కథారచనలో ఈ విధమైన బహ్వంశాల సమాకలనంతో ఎఱ్ఱన రచన అపూర్వమైన ప్రౌఢ సుందరమైన విశిష్టతను పొందింది.

# శ్రీకృష్ణ మహిమ - శిశు క్రీడలు :

ఎఱ్ఱన శ్రీకృష్ణ చరితలో కథన శిల్పం వర్ణనా రామణీయకతతోపాటు సాధారణ జీవిత చిత్రణం పొందింది. ఇది మానవ మనస్తత్వ ప్రకాశనాత్మకంగానూ తీర్చబడింది. ఇది మూలంనుండి భిన్నమైన రచనా రూపం. ఇందులో మూల విధేయమైన కథా సూత్రంతో భగవన్మహిమా పూర్ణమైన తాత్త్విక బింబమూ కన్పిస్తుంది. పోతన భాగవతంలో ఇవే కథలు భక్తి రసావేశంతో ఆవహిస్తాయి. ఎఱ్ఱన హరివంశంలో భక్తిభావన ఐహికాముష్మిక తీరాల మధ్య ప్రవాహం వలె సాగుతుంది.

శ్రీకృష్ణు జననంతోనే భగవత్తత్త్వం యోజితమయింది. "విశ్వజగదాధారో దయుడు, ధర్మనిర్వహణారంభ ధురీణుడు, నిత్యవిభూతావర్ధిష్ణుడు" మొదలైన విశేషణాలు, మూలరూపాన్నీ కర్తవ్యపాలనను, సర్వశక్తిమత్వాన్నీ ప్రతిపాదిస్తున్నాయి. దేవకి తొడలపై వటపత్రంపై నున్న చందంగా శోభిల్లాడు. మూలంలో

**"వసుదేవశ్చ తం రాత్రౌ జాతం పుత్రమధోక్షజమ్**
**శ్రీవత్స లక్షణం దృష్ట్వా యుతం దివ్యైశ్చ లక్షణైః**
**ఉవాచ వసుదేవస్తు రూపం సంహర వై ప్రభు!**
**మమ పుత్రా హతాస్తేన తవ జ్యేష్ఠామ్బుజేక్షణ"**

వసుదేవుడు శ్రీవత్సచిహ్నాన్ని, దివ్య లక్షణాల్ని చూచి భీతుడై కంసుని కృత్యాలు తలపుకు వచ్చి వాటిని ఉపసంహరింపుమని ప్రార్థించాడు. ఎఱ్ఱన దీనిని పరిహరించాడు. విష్ణుమాయా ప్రభావం వల్ల జనులు నిద్రా వివశులయినట్లు వ్రాసాడు. ఎఱ్ఱన కంసుని పాపకృత్యాల్ని వసుదేవుడాత్మలో తలపోసినట్లు భావించాడు. మరో విశేషం, నందగోపు నింటికి వసుదేవుడు వెళ్ళడానికి చెరసాల సంకెళ్ళు విగళితం కాలేదు. ఆదిశేషుడు వచ్చి తలుపులు తెరవలేదు. యమునానది విచ్చి దారి చూపలేదు. ఆరంభంలో విష్ణ్వవతార ప్రసక్తితో తన్మయ సూచన గావింపబడింది. అమానుష సంఘటనలకు ప్రాధాన్యమీయలేదు. మనుష్య యత్నానికి దైవం సహాయంగా ఉండవచ్చు. అందువల్ల శ్రీకృష్ణుని పరమేశ్వరత్వానికి విఘాతం కలుగకుండా, భగవత్తత్వ

ప్రకాశనంతో మానవ స్వభావ వర్తన సముచితంగా జీవితానుభవ ప్రతిబింబంగా రచన నిర్వహింపబడింది.

హరివంశం భారతేతిహాసాని కనుబంధం. భాగవతం కేవలం విష్ణు కల్యాణ గుణ కీర్తనాత్మకం, కథకన్న పరమార్థానికే ప్రాధాన్యం. మరీ ముఖ్యంగా పూర్వం వ్రాయబడిన తెలుగు మహాభారత రచనా పరంపర నందిపుచ్చుకొని దాన్ని కొనసాగించడం జరిగింది. కాబట్టి ఈ విధం తప్పదు. దేవకి "అన్నా! అలుగకుమీ నా కన్నది యిదె యాడు బిడ్డ గావుము దీనిన్" అని వేడుకుంది. ఆమెకు జన్మించింది మగశిశువే యన్న నిశ్చయనావంతో కంసుడు వచ్చాడు. "నిన్నొకటి చేయగలదే! కన్నియ యతిలోక పురుషకార సమగ్రున్" అని వేడుకొంది.

కంసుడు పురుష ప్రయత్నంలో అధికుడు. దైవ విషయంలో అసమగ్రుడు. దైవ మాతనికి వ్యతిరేకం. అతని ప్రాణాలు తీయడానికి సిద్ధంగా వేరొకచోట మానుషాకృతి వహించి ఉంది. కంసునికీ మాటలు వినే సహనం లేదు. "ఆ పాపనెప్పటి రాతితో నడచే" ప్రయత్నం చేసాడు. పూర్వం శిశువుల్ని చంపిన రాయినే మృత్యుసాధనంగా గ్రహించాడు. ఆ శిశువు జారి పైకెగసింది. అద్భుతాకారయై భయ విస్మయాల్ని కలిగించే విధంగా "ఓరి దురాత్మ" అని సంబోధించింది. రాబోవు మృత్యువును సూచించింది. ఈ మాటలకు కంసుడు కంపించిపోయాడు. దేవకికి కృతాంజలియై "ఏ నిటు ప్రాణ రక్షకయి యెంతయు పాపము సేసి గర్భ సంతాన విఘాతినై నిను నుదంచిత శోక పయోధి ముంచితిన్" అని వాపోయాడు. స్వప్రాణ రక్షణకై చేసిన పాపాన్ని దేవకి కొనర్చిన దు:ఖాన్ని తలచుకొన్నాడు. వ్యర్థమైన కార్య శూరత్వానికి పశ్చాత్తప్తుడయినాడు. "విధాత చెయ్ది ఎవ్వానికి మాన్పగా వశమె" యని మానుష తుచ్ఛ యత్నాన్ని మీరిన దైవశక్తిని గురించి ఆలోచన మొదలైంది. దీన్ని చిరకాలం నిలుపుకొనే మానసిక శక్తి అతనికి లేదు. అతనిలో కారుణ్యం ఉదయించింది. తాను చేసిన పనిలోని వ్యర్థత్వం పాపభావం మనస్సును కుదిపాయి. తాను శిశువును చంపలేకపోయాడు. తన శక్తి యుక్తులకు క్షతి కలిగింది. పైగా తనకు మృత్యుమూర్తియైంది. ఈ విషమ స్థితి నుండి దేవకి తనను దయతో రక్షిస్తుందేమోనన్న ఆశ సహజం. కృతాంజలియై ఆమెను ప్రార్థించడంలోని అంతర్యమిది. "ఆడుబిడ్డ!

కాపాడుమ"ని ఆవు అరచినట్లరచింది. కాని ఆతని మనస్సు చలింపలేదు. ఇపుడు విఫల స్థితిలో "వేడుకొనెద! పరమ పవిత్ర చరిత్ర" యని ఊరడించే స్థితికి రావడంలో కంసుని అశక్తత, భయభావం సూచితం. ఈ స్థితిలో దైవాన్ని పేర్కోడం తాత్త్వికతను ప్రదర్శించడం సహజం, మూలంలో –

**"కాల ఏవ నృణాం శత్రుః కాలశ్చ పరిణామకః**
**కాలో నయతి సర్వం వై హేతుభూతస్తు మద్విధిః**
**ఆగమిష్యన్తి వై దేవి! యథాభాగ ముపద్రవాః**
**ఇదం తు కష్టం యజ్ఞస్తు కర్తాహమితి మన్యతే"**

కాలమే నరులకు శత్రువు, కాలమే పరిణామకం. ఒక అవస్థ నుండి మరో అవస్థకు పరిణమింపజేస్తుంది. కాలమే అన్నిటిని నడుపుతుంది. మానవ విధి హేతుభూతమైంది. భాగ్యాన్ని అనుసరించి ఉపద్రవాలు వస్తాయి. జీవుడు తాను కర్తయని భావిస్తాడు. కాని కాలమే కర్త.

**"నిను చంప చెరుప మనుపను, ఘనతరమగు కాల మొకడ కర్త మనుష్యుం**
**డు నిమిత్త మాత్ర మింతియ, యనయమ్మును కాల పాకమైన క్రియన్"**

అన్నిటికీ కాలమే కర్త. మనిషి నిమిత్త మాత్రమే "కాలశ్చ పరిణామక:" అన్న దానికి "కాలపాకమ"ని ఆంధ్రీకృతమైంది. పై రెండు శ్లోకాల పిండితార్థమే ఎర్రన పద్యం. ఈ తత్త్వ ప్రదర్శనతో దేవకి మనస్సును శాంతింపజేయడమే కాక తన పట్ల శత్రుభావ రహితం చేసుకోవడం కూడా. ఇది కంసుని తత్కాలోచితమైన లౌకిక ప్రవర్తనా గుణాన్ని చిత్రిస్తూంది. ప్రబల దుష్టమతిలోను కాల పరిణామంతో మెరసే సద్భావనా స్ఫూర్తిని పట్టిస్తూంది.

వసుదేవుడు ఉదయం "హృదయ ప్రియ సహృదుడై"న నందగోపుని కడకు వెళ్ళాడు. భామినీ సహితంగా వ్రేపల్లె జని అపాయాల నుండి రక్షించుకోవలసిందని ఉద్బోధించాడు. వసుదేవుని మనస్సులో పుత్రవాత్సల్యం పొంగుతూంది. ఇపుడు శిశువును కంసుని బారి నుండి రక్షించుట, ప్రథమ కర్తవ్యం "అత్యద్భుత లక్షణాన్వితుడు",

"తేజోభాసితు"డైన పుత్రుని గన్న ధన్యత్వం లోకదృష్టితో అతనికే చెందింది. కాని మానసికంగా తనకే చెందుతుంది.

నందునితో వసుదేవుడు "పుట్టగ పుట్టగా దునిమె పుత్రుల", "పాపజాతియగు కంసుడు", "వీని నీ వెట్టయినన్ మహాత్మ! భరియింపుమ"ని ఆంతర్యాన్ని స్పష్టం చేస్తాడు. పుత్రనాశన దు:ఖంలో శిశువును గూర్చి భీతిలో నందుడు మునిగే సముద్రంలో తెప్పవలె తోచాడు. నందగోపుని వ్రేపల్లెకు ప్రయాణం, తెలుగు గ్రామీణ జీవిత వాతావరణాన్ని తలపిస్తుంది.

**"పురిటి పాపని తొట్టెలో పొందుగాగ బెట్టి మోపించుకొని తాను ప్రియసతియు**
**మేటి గజ్జెలు గట్టిన పాటి బండి యెక్కి శీఘ్రంబ మందకు నేగె నెలమి"**

అక్కడ ఉంటే ఆపదను శంకించి త్వరగా ఘోషకు నిర్గమించాడు. కాళిందీ తీరంలో ఘోష, కదుపులతో, వృషరాజములతో కార్యనిమగ్నులైన గొల్లలతో దధి మధన నిమగ్న బాలికలతో కుటుంబినులతో గోపికల ఉదాత్త చేష్టలతో తృణచ్ఛన్న కుటీరాలతో, ఆజ్య దుగ్ధ దధి విచిత్ర సువాసనలతో నిండింది. మూలంలో ఈ అంశం లేదు. ఇది ఎఱ్ఱన కల్పితం.

## II

హరివంశంలో ''పూతనా ప్రాణహరణం శకటాసుర భంజనం తరుద్వయోన్మూలనం" – బాల్యక్రీడలు మౌళిభూతమైనవి. ఇవి ఆశ్చర్యకృత్యాలు, అద్భుతమైన ప్రభావాన్ని నెరపాయి. పూతన ఉత్తానశాయియైన బాలకృష్ణుని కడకు వచ్చింది. "నిశాచరి"కి ఆ తేజం భయాన్ని అద్భుతాన్ని కలుగజేసింది. నిశాచరి ప్రయోగం సముచితమైంది. ఆమె రాత్రివేళ చరించేది. చీకటికి దగ్గరి సంబంధం. అందువల్ల తేజస్సుకు భయపడింది. తనకు కలిగిన అనుభవానికి అద్భుతమందింది. పూర్వం చూడనిదన్నమాట. చిత్రమేమంటే ఆ తేజంతో కొంతసేపు తనలో "మెత్తన" కనుగొంది. కఠిన ప్రవృత్తికి బదులు ఆమెలో మృదుప్రవృత్తి చోటుచేసుకుంది. అయితే ఎక్కువకాలం నిలిచేందుకు కావలసిన సంస్కారం ఆమెలో లేదు. తాను వచ్చిన పని

జ్ఞాపకం వచ్చింది. మనస్సు సాధారణమైన రక్షోభావస్పృష్టమైంది. ఇది తనకు సహజం కాదు. అందువల్ల కోపం వచ్చింది. "వీడెల్ల తోటి బాలుడు" కాడని భావించింది. ఇతనిలో ఏదో విశేషముందన్న స్థూలమైన భావం కలిగింది కాని, ఆ విశేషమేమిటో ఆలోచించే స్థితి ఆమెలో లేదు. వీడు కంసునికి కీడు గావింప జన్మించినవాడుగా తోచాడు. మృదుభావం నశించింది. రాక్షసస్వభావం విజృంభించింది. పండ్లు కొరికింది. కనుబొమలు కుంచితమైనాయి. బాలునెత్తుకొంది. ఱొమ్ముకు హత్తుకొని విషపు చనుమొన కృష్ణుని నోటి కదిమింది. మూలంలో పూతన –

**"తతోర్ధరాత్ర సమయే పూతనా ప్రత్యదృశ్యత వ్యాఘ్రు నిర్ఘోషం వ్యాహరన్తీ పున: పున:"**

అయితే మాటిమాటికీ వ్యాఘ్రు నిర్ఘోష చేయడాన్ని ఎఱ్ఱన పరిహరించాడు. దీనివల్ల అక్కడున్న జనం మేల్కోవచ్చు, భయపడవచ్చు, ఆపద శంకించవచ్చు. జాగ్రత్త వహించవచ్చు. యశోద జాగ్రత్త పడుతుంది. అపుడు పూతన చర్యకంతరాయం ఏర్పడుతుంది. పూతన చర్యకు "పాపడార్తుడైనట్ల పోలె" కావు కావురని శిశు సహజంగా యేడ్చాడు. ఐనట్ల పోలె అంటే నిజంగా ఆర్తుడు కాలేదని అర్థం. దాని పయోధరాగ్రాన్ని కుత్తుక దాక బెట్టుకొని చనుబాలతో సప్తధాతు ససితమైన ప్రాణాల్ని అపహరించాడు. శ్రీకృష్ణుడు లీలామానుష విగ్రహుడు కాబట్టి రాక్షసియని గ్రహించడం జరిగింది. క్షణంలో ప్రాణాల్ని హరించడంతో అది 'హా' యని నేలపై బడింది. మందలో జనం మేల్కొన్నారు. యశోధ మేల్కొంది. పక్కలో శిశువు లేదు. నందగోపుని పిలిచింది. అందరు వచ్చారు. దూరాన పడియున్న రాక్షసి కనిపించింది. రాక్షసి ఒడిలో "పతంగుని" భంగి బాలకృష్ణుడు నిర్భయంగా కనిపించాడు. యశోధ మాతృసహజ హృదయస్పందనతో బాలుని హత్తుకుంది. ఇదో "మాయ" వలె అనిపించింది. శిశువును చంపడానికి బదులు రాక్షసి తానే చచ్చిపడి ఉంది. మహాశ్చర్య చకితులయ్యారు. ఇది వారి సాధారణ బుద్ధి కతీతమైన విషయం. ఒక ఆపద గడిచాక, ఇక అంతా శుభమన్న లోకసహజమైన ఆశాభావం ప్రకటితమైంది. "చంద్రబింబాననుడింక వీడు పరమాయురుపేతుడు యెల్ల భంగులన్" మానసికమైన ఆనందాన్ని "చంద్ర బింబాననుండు"లో గమనించవచ్చు. చంద్రబింబం ఆహ్లాదకరమైంది. ఇపుడు బాలకృష్ణుని ముఖం ఆపద నుండి ముక్తమై ప్రసన్నమై వెలుగుతూంది. ఇంతకన్న తల్లికి ఆనందాన్ని

కలిగించే స్థితి లేదు. "ఏ నలినాక్షికిం గలదె ఇట్టి తపంబుల పేర్మి" యన్న మాటలు మాతృ హృదయ సహజాలు. పూర్వ తప: ఫలంవల్లనే శ్రీకృష్ణుడు లభించాడు. శిశు వాత్సల్యగర్భితమైన పుణ్య భావం రచనకు ఉదాత్తతను చేకూరుస్తుంది. నందుడు శిశువు నెత్తుకొని గో కరీష పురీష మిశ్రితమైన భూపరాగంతో నొసట తిలకం పెట్టాడు. స్వస్తి వచనాలతో రక్షార్థం మంత్రాలు జపించారు. ఇప్పటికీ గ్రామాల్లో గృహస్థులు ఆపదల్లో అవలంబించే విధానం. భగవంతునికి కూడ జన్మ ఎత్తినపుడు సంప్రదాయ బంధురత తప్పదు. ఇది ఎఱ్ఱన జనజీవన పరిశీలనకు దాని చిత్రణాభిలాషకు నిదర్శనంగా ఉంది.

## III

పూతన మరణవార్త కంసుని మనస్సులో శంకకాస్థానమైంది. శకటాసురుని పంపాడు. అతడు మాయతో నందగోపుని శకటాన్ని ఆవహించి ఉన్నాడు. ఆ శకటం క్రింద పాన్పుపై పాపని నిద్ర పుచ్చి యశోద వెళ్ళింది. శకటాన్ని ఆవేశించిన రాక్షసుడు శిశు సంహారానికై పరి పరి విధాలుగా ఆలోచన చేసాడు.

**"ఏడలించి మీదట నెసగెడు పరపెల్ల బడద్రోచి యడతునో పడుచు నేమి**
**వెరపున వరియింప దొరకొను నాకది యవసరంబని తన యాత్మ దలచు"**

ఒక రహస్య హత్యా ప్రయత్నంలో ఎట్లా చేస్తే విజయవంతమౌతుందో ఉహ చేసే మనోరూపం చిత్రితమైంది. ఒక శిశువును చంపడానికింత ఆలోచనా? అన్న ప్రశ్న సహజం. అయితే మరణం సహజమన్నట్లుగా పని చేయచూడడం, ఇంతకుముందే శిశువును గురించి కంసుని వల్లనో మరొకరివల్లనో భయభావం ఏర్పడి ఉండడం కారణాలు కావచ్చు. శ్రీకృష్ణుడు రాక్షసుని ఉనికిని కనిపెట్టి జూక చరణమెత్తి తాకాడు. ఆ క్షణంలో బండి సంధులు వ్రీలి చెదరి నేలపై పడిపోయింది. శ్రీకృష్ణుడు భగవంతుడన్న భావం నిగూఢంగా వర్తిల్లచేయబడింది. ఇది విపు సహజ చేష్టతో బహిరాకృతిని పొందింది. బండిని పూనిన అసురరూపం లోకానికి కన్పించలేదు కాని శిశువుగానున్న హరికి కన్పించింది. యశోద స్నాతయై వచ్చి విపర్యస్తంగా పడియున్న శకటాన్ని చూచి ఆశ్చర్యపడింది. "భవజ్జనకుడు వచ్చి" "ఎన్ని తెరగుల"

పల్కునో యని భయపడింది. ఇక్కడ భారత స్త్రీ తన భర్తపేరు ఉచ్చరింపకూడదని ఆచారానికి సంబంధించిన ఔచిత్యం పాటింపబడింది. గురుతరమైన తల్లి బాధ్యతనుస్మరింపజేస్తుంది కూడా. నందుడు వచ్చి విశీర్ణశకటాన్ని చూచి “ఉల్లంబు ఝల్లన తనువు వణక” బాలకుడేమయ్యెనో యని భయపడినాడు. లోనికి వెళ్ళి, “స్తన దుగ్ధామృత మారగించుచు బొరిం చారుస్మితోల్లాన మానన బింబంబు నలంకరింప” “ఈప్సిత కల్పశాఖి”యైన పుత్రుని చూచాడు. నందుని మనస్సు కుదుట బడింది. జరిగింది తెలుసుకున్నాడు. ఏమియు జరుగనట్లే ఉన్న స్థితిని చూచి ర్పసన్న చిత్తుడయినాడు.

ఎర్రన రచనలో విషాదం భయం వెంటనే సంతోషం, ప్రసన్నత పరస్పర విరుద్ధ భావపరంపరతో పాత్రల మానసిక చిత్రణం కన్పిస్తుంది. కల్పవృక్షం కోరింది ఇస్తుంది. మానవులకు దీని అవసరముంది. కల్పవృక్షానికి మానవుల అవసరం లేదు. ఇక్కడ “నిజాభీప్సిత కల్పశాఖి”గా శ్రీకృష్ణుడు పేర్కొనబడినాడు. అతనికెవరి రక్షణ అవసరం లేదు. అతడే అందరిని రక్షింప సమర్థుడు. తమ కోరికల్ని నెరవేర్చే కల్పవృక్షం. భౌతిక మానసిక తలాలపై ప్రభావాన్ని నెరపే శక్తి కలిగింది. లోకం దృష్టిలో శ్రీకృష్ణునికి నందుడు తండ్రి, యశోద తల్లి గోపగోపీజనం బంధువులు, మిత్రులు మొదలైనవారు. కాని ఆంతర్యంలో అతడే లోకాలకు తండ్రి, ప్రభువు. అయితే లోకంలో బంధుభావాన్ని అనుసరించి ప్రేమ వాత్సల్యాదులు ప్రదర్శింపబడడం జరిగింది. ఆంతర్యం సూచితమైంది.

శ్రీకృష్ణపాత్రను రెండు స్థాయిల్లో ఎర్రన తీర్చినట్లు కన్పిస్తుంది. నందుడు భగ్న శకటాన్ని చూచి “యాబోతులు రేగి త్రొక్కినవా? ఝంఝామారుతాహతి విశీర్ణమైందా?” అని ప్రశ్నిస్తాడు. ఎట్టైననేమి పుత్రుడు క్షేమంగా ఉన్నాడని సంతోషిస్తాడు. మూలంలో “పిబస్తం స్తన మాలక్ష్య పుత్రం స్వస్థోబ్రవీత్ పున:”అన్న భావాన్ని గ్రహించి తత్కాలోచిత మనోభావ సమర్పకంగా ఎర్రన సన్నివేశ చిత్రణం గావించాడు. ఇంతలో బాలకులు వచ్చి “మేమిచట నాడుకొనుచుండగా శ్రీకృష్ణుడు తన కాలెత్తాడు, శకటమిట్లు పడింద”ని చెబుతూ “ఇదియేమి దైవికమో!” అన్నారు. శ్రీకృష్ణుని దైవత్వం బాలకులచేత చెప్పించడంలో కవి ప్రమేయం లేకుండా మానుష పాత్ర ద్వారా చెప్పించే కథన శిల్పం దృష్టికి వస్తుంది.

రచనలో కవి ప్రమేయం లేక పోవడం చేత కళాత్మకత చేకూరుతుందన్న అభిప్రాయం ఉంది. ఇది ఇట్లా ఉంచి రచనలో ఎఱ్ఱన లోకంలో కుటుంబంలోని దంపతుల ప్రవృత్తులు, ప్రవర్తనలు చుట్టూ ఉన్న జన ప్రమేయం వాస్తవోచితంగా చిత్రించడం కన్పిస్తుంది.

## IV

## శైశవోత్సవం

శ్రీ కృష్ణుని శైశవోత్సవ చిత్రణం శిశు దశలోని వివిధావస్థల వర్ణనా రమణీయమైంది.

**"పొలుపారగా బోరగిలి పాన్పు నాల్గు**
**మూలలకుసు వచ్చును మెలగి మెలగి"**

బోరగిల పక్క నాలుగు వైపుల మెలగడం, చెక్కిళ్ళ గిలిగింతలతో కలకలనవ్వడం, మోకాళ్ళపై చేతులు తడువుతూ తారాడడం, నిలుచోబెట్టి చేయి వ్రేలు ఊతనిస్తే తప్పటడుగులు వేయడం, "అన్న, తండ్రి అయ్య, ఇందురావయ్యా!" అని పిలిచేసరికి నడయాడడం ఎంతో నేత్రపర్వంగా ఉండే క్రీడారూపాలు. శిశు ప్రకృతి సహజమైన అమాయకతతో తల్లిదండ్రుల ప్రేమ వాత్సల్యాలతో సమాపూర్ణమైంది. కాస్త పెరిగి ఆటలాడుతూ ధూళి దూసర శరీరంతో "హరి యనేక ధాతుచ్ఛటా వ్యక్తమైన శైల కుంజర కలనంబు వోలె నొప్పె" ఈ సుందరమైన ఉపమానంలో "హరి" శబ్దం విష్ణు భావనా వ్యంజితమైంది.

బాల్యదశలో శ్రీ కృష్ణుడు అంగనల్ని వెన్న వేడుకోడం, వారిని కారించడం, కవ్వపు తరిత్రాడు పట్టుకోడం, మొల గంటలు మ్రోగనాడడం, బాల్యచేష్టలు చిలిపితనంతో గోపికలకు సంతోషాన్నే కలిగించాయి. చేతిలో వెన్నముద్ద "ఏనుగు, కొదమ చేతిలో తెల్లని "తమ్మి మొగడ మాడ్కి" ఉంది. ఈ ఉపమానం కూడా ప్రకృతిగతమైన సహజ సౌందర్యంతో విలసిస్తుంది. "తరుణీ నిర్మథన లగ్న దది బిందువు"లతో బాలకుని శరీరం క్షీరాబ్ధి మధన వేళ కూర్మావతారాన్ని తలపిస్తోంది. ఇది విష్ణ్వవతార భావనతో లోక కల్యాణగుణాన్ని కలిగింది. ఇంకా కొంచెం పెరిగాడు. బాలుని ఆగడాలకు గోపికలు

తాళలేకపోయారు. పట్టి తెచ్చి తల్లికప్పగించడం, అంతలో తప్పించుకోవడం, "ఉదారచేష్టలు"గా కన్పించాయి. పైకి కోపభావం కనిపించినా లోపల ప్రేమభావంతో స్నిగ్ధమైన హృదయం అనుభూత మవుతుంది. "క్షీరాంభోధి మథించి తాను కృపతో గీర్వాణ కోటిన్ సుధా పూర ప్రీతిగ జేసినట్లు" పాలమీగడలను, తోడి బాలురకు పంచి పెట్టేవాడు. మాయా మోహినీ రూపమెత్తిన విష్ణుభావన బాల్యచేష్టకు మహిమార్థాన్ని కల్పిస్తూంది. ప్రకృత కథాంశం పూర్వ పురాణాంశం జోడింపమడి వస్తు గౌరవాన్ని పొందుతూంది. బాల్య క్రీడల్లో సహజమైన చర్యల్లో భగవద్భావన విష్ణు కథా లోలమైన సుందర రూపాన్ని పొందింది. ఇది ఎఱ్ఱన కవితా శక్తి జీవితానుభవ దృశ్య నిలయంగా దర్శనమిస్తుంది.

V

## అద్భుత దృశ్యం

శ్రీ కృష్ణుని మరో అద్భుత కృత్యం యమళార్జునోన్మూలనం. ఎఱ్ఱన కావ్య శిల్పానికి మరోముఖం, శ్రీకృష్ణుని ఆగడాలు సహింపలేక ఆక్షేపించే గోపికల్ని అనునయించి పంపింది. బాలునిపట్ల మమకారానికి సీమల్లేవు. కాని ఆగడాలు సహించి ఊరుకునే స్థితిలో లేదు. అయితే ఈ క్లిష్టస్థితిలో మమతా బంధాన్ని మరో విధంగా ప్రదర్శించింది.

**"భువన క్లేశము లెల్ల మాన్ప శిశుతా స్ఫూర్తిం ప్రవర్తిల్లుచున్**
**వివిధ క్రీడల ప్రోడయైన ప్రభువుం విష్ణుం ప్రవర్ధిష్ణు నా**
**నవనీతామృతచోరు జూచి యెలమిన్ రాజాస్యయాత్మీయ సం**
**భవతా బుద్ధి ప్రవృద్ధమైన మమతా బంధంబు సంధిల్లగన్"**

శ్రీకృష్ణుడు దుష్టశిక్షణ, శిష్టరక్షణ నిమిత్తమై మానుష జన్మనెత్తిన శ్రీమహావిష్ణువు. జన్మ యెత్తినపుడు సహజమైన వివిధ క్రీడలు చేస్తున్నాడు. ఈ క్రీడలు ప్రౌఢత్వాన్ని పొందడంలో విశేషముంది. ఇది ప్రభు స్ఫూర్తిని కల్గిస్తుంది. దీనిలో సామాన్యేతరమైన దివ్యభావన నిక్షిప్తమైంది. ఆ దివ్య భావనా రూపమే విష్ణువు. లౌకికదశలో నవనీతామృత చోరుడు. శ్రీకృష్ణునికీ యశోదకూ గల సంబంధం, శిశు మాతృ గుణాలతోపాటు

"ఆత్మీయ"మైంది కూడా. ఇది ఆంతరమైంది, మమతాపూర్ణమైంది. ఈ పద్యంలో యశోద పాత్ర రెండు స్థాయిల్లో చిత్రితమైంది. ఒకటి క్రిందిది, సాధారణమైంది, భౌతికమైంది. నవనీతచోరుడు, గోపికల ఆక్షేపానికి గురి అయినవాడు, శ్రీకృష్ణుని పట్ల గల బంధం. రెండోది ఆపైది, విశేషమైంది, అతీతమైంది. క్రీడల్లో ప్రౌఢత్వాన్ని ప్రదర్శించే ప్రభువు విష్ణువు. ఈ రెండోది అపుడపుడూ అందీ అందకుండా పోతుంది. మాయా పిహితమౌతుంది. "ఏలా యిందును నందు పారెదవు!" ఇంట్లో పాలు వెన్న పెరుగు చాలదా? ఈ గోల దేనికి? అని మాతృ హృదయాన్ని ఆవిష్కరిస్తుంది. "తల్లి చనుబాలు గ్రుక్కెడు, తక్కినయవి పుట్టెడుతో సమానం. ఈ సూక్తి నీ పట్ల అసత్యమౌతూంది. "నా పాలిండ్ల పాలు తృప్తి గ్రోలజాలవె!" యని పరిపరి విధాలుగా ఈషత్కోపం, ఈషత్సమాశ్వాసనం కనబరచింది. ఈ మాత్రం మాటల కతడు చేసే పనులు మానడని తెలుసు. కాని ఇట్లా మాట్లాడంలో తల్లికొక తృప్తి ఉంది. అదుపులో పెడుతున్నానన్న ఆనందముంది. శిశువును గుండెకు హత్తుకుంది. అతడు కడుపార పాలారగించాడు. చెక్కులు నొక్కింది. మస్తకము మూర్కొంది, ముద్దాడింది. "అయ్యర్భకు"ని ఉలూఖల బద్ధుని గావించింది. కదలవద్దని బెదిరించింది. కుటుంబ కార్యమతియై వెళ్ళిపోయింది.

**"తతో యశోదా సంక్రుద్ధా కృష్ణం కమలలోచనమ్**
**దామ్నా చైవోదరే బధ్వా ప్రత్యబన్ధదులూఖలే**
**యది శక్తోసి గచ్ఛేతి తముక్త్వా కర్మ సా కరోత్"**

ఒకవేళ శక్తి ఉంటే వెళ్లవలసింది అని ఉలూఖలానికి బంధించింది. "శక్తి ఉంటే" అన్న మాట ఆమెకు తెలీకుండానే నోట శ్రీకృష్ణుని శక్తిమత్వం ప్రకటితమైంది. ఈ శక్తి పూతనా సంహారం, శకట విధ్వంసం మొదలైన సందర్భాల్లో ప్రకాశమానమయింది. ఇది ఆమెకు అస్పష్టంగా తెలుసు. యశోద పాత్ర స్వరూపం చాలా సంశ్లిష్టమైంది. ఈ సంశ్లిష్టత మూల కథలోనే ఉంది. వ్యాసమహర్షి ప్రతిభాగతమైంది. ఎఱ్ఱన రచనలో మాతృ హృదయ స్పందనానుగుణంగా మానవ జీవితంలో కుటుంబ మర్యాదోచితంగా తీర్చబడింది. శ్రీకృష్ణుడా ఉలూఖలాన్ని జమిలి మద్దుల నడుమకీడ్చుకపోయాడు. ఆ రాపిడికి రెండు చెట్లు నేలకూలాయి. ఆ ధ్వని విని అందరు మూగారు. యశోధను ఆక్షేపింపసాగారు. "పుత్రుని త్రాళుల కట్టు

వారక్కట గల్గరు నేరుపు గల ననుచు నహంకారంబున మిడిసి పడితి బంగారము బోలెడు కొడుకును" కాపాడుమని ఆవేదన ప్రకటించారు. శ్రీకృష్ణుని కృత్యాల్ని ఉగ్గడించి రాక్షసుడుగాని బాలుడుగాడని మొరలిడినవారే ఇపుడు జాలిపడుతున్నారు. యశోదను నిందిస్తున్నారు. "బిడ్డను అదుపులో పెట్టాలిగాని రోలుకు కట్టివేస్తారా?" అనవచ్చు. "రోలుకు కట్టివేసినంతమాత్రాన ఇట్లా జరగాలా?" "జరుగుతుందని ఊహిస్తారా?" శ్రీకృష్ణుడు చేసిన ఆగడాలు చెప్పినంత మాత్రాన యశోద తన "నేర్పరితనాన్ని అహంకారాన్ని మిడిసిపాటును"' ప్రదర్శించిందనడంలో వారి మనోంతరంలో నిగూఢమైన ప్రేమ వ్యక్తమవుతూంది. ప్రస్తుత స్థితి యశోదయే బాధ్యురాలన్న భావం పరిస్థితి చేయిమీరితే సర్వం మరొకరిపై మోపే మనోరూపాన్ని సూచిస్తూంది.

**"అనిన్ తల్లడమంది, మేను విరియన్ హాయంచు గోపాల భా**
**మిని విస్రస్తములై పటాంచలము ధమ్మిల్లంబు దూలంగ లో**
**చన పద్మంబుల బాష్ప ధారలెసగన్ సంభ్రాంతి పాదద్వయం**
**బును తొట్రిల్లగ బారె, గోపికలు నుద్భూతార్తులై తో జనన్"**

ఈ స్థితిలో యశోద పొందిన భయాందోళనాన్ని, పుత్ర రక్షణలో పొందిన బాహ్య రూపాన్ని చిత్రిస్తుందీ పద్యం. "సా భీతా సహసోత్థాయ హాహాకారం ప్రకుర్వతీతం దేశ మాగమత్" అని మూలం. ఆమె భీతయై వేగంగా లేచి హాహాకారం చేస్తూ ఆ స్థలానికి వచ్చిందన్న వాక్యంలోని సారభూతమైన భావానికి వ్యాఖ్యాన చిత్రమే పై పద్యం సవేగాకుల మాతృ హృదయావిష్కారంతో స్వతంత్ర రచనవలె రూపొందింది.

నందగోపాదులు ముందే వెళ్లారు. శ్రీకృష్ణుడు వారికి "సమున్మూలిత యమళార్జున మధ్యమున" "మేఘద్వయము మధ్య విద్యోతి యగు శీతాంశుడునుంబోలె" కన్పించాడు. ఈ ఉపమానం మూలంలో లేదు. ఇది కథాగమనంలో ఔచిత్య భాసురంగా ఉంది. మేఘాలు చంద్రుని స్పృశింపలేవు. అతనికడ్డు వస్తాయి. గాలికి తొలగిపోతాయి, చెదరిపోతాయి. ఆ మేఘద్వయం మద్దిచెట్లు. సులభంగా అంతరించాయి. మేఘాలు

మోహ తమోరూపాలకు ప్రతీక. శ్రీకృష్ణుడు వాటిని ఛేదించడంలో నిపుణుడు, జ్ఞాన స్వరూపుడు. శీతాంశువులోని శీతలత్వం, ప్రసన్నత్వం, కాంతి ఇక్కడ సత్త్వగుణాన్ని సూచిస్తాయి. శ్రీకృష్ణుడు మోహ తమో రూపాల్ని ఉన్మూలించి, జ్ఞానబింబంవలె ప్రకాశిస్తున్నాడు.

ఇక పూర్వచరిత్రకు వస్తే ఈ తరువులు నలకూబర మణిగ్రీవులు. కుబేరుని కుమారులు. స్త్రీగత మదాంధులై ప్రవర్తించడంవల్ల నారద శాపవశాన భూలోకంలో ఈ రూపాల్ని ధరించారు. శ్రీకృష్ణుడు వారి మోహ తమో స్థితిని తొలగించడమన్న అర్థాంతరం స్పష్టం. సాధారణ లోకానికీ రహస్యం తెలియదు. వారు కుమారుని చూచి ఆనంద పరవశులయ్యారు. ఉలూఖలాన్ని ఎట్లా ఈడ్వగలిగాడన్న విషయం జనుల కాశ్చర్యస్థానమైంది. పూతనా నిపాతం, శకట భంజనం, తరుద్వయో న్మూలనం వెనుక నున్న శ్రీకృష్ణుని ప్రభావ శక్తి నారయుటకు, అధిక సంస్కారం కావాలి. ఎఱ్ఱన రచన మూల భావాన్ని ప్రేరణశక్తిగా గ్రహించింది, సమాజపరంగా, వ్యక్తిపరంగా, కుటుంబ పరంగా వాస్తవానుభవ చిత్రాకృతి పొందింది.

నందుడిపుడున్న ప్రదేశంలో ఆపదల్ని శంకించి, "ఎక్కడికి పోదమేమి సేయుదమ"ని తలచే సమయంలో నారదుడు వచ్చాడు. "నారాయణుడాది దేవుడు, జగద్విఖ్యాత సత్త్వుండు" "దైత్యుల విఘాతింప క్రీడార్థమై" అవతరించాడని ఉద్బోధించాడు. ఇంతవరకు పరమాశ్చర్యకరమైన శ్రీకృష్ణుని చర్యలు సువిదితమైనాయి. నారదుడు దేవలోకానికీ మానవలోకానికీ త్రెంచరాని లంకె. శ్రీకృష్ణుని సందర్శించాడు. "త్రైలోక్యంబు సృజింప పెంపు నడపన్ దక్షుండ"వు అంతటికీ "మూలంబై" ఎత్తిన నందసూనుని అవతారాన్ని శ్లాఘించాడు. ఇందులో అవతార ప్రయోజనం స్థూలంగా భావితమైంది. అది దైత్యవినాశనం, ధర్మరక్షణంతో కూడింది. దైత్యుల ఊహ, వర్తనం తమోన్ముఖమై ఉంటాయి. వీటి ప్రభావం నుండి తొలగించడమే శ్రీకృష్ణావతార ప్రయోజనం. దీన్ని "హేలానిర్దళితారి" అన్న మాటలో సూచితమైంది. ఈ పని భగవంతుని కొక హేల వంటిది. బృందారక వరదుని బృందావన కేళికై ప్రేరేపించాడు. "బృందారక వరద!" సంబోధనం పూర్వం దేవతలకు విష్ణుమూర్తి ఇచ్చిన వరాన్ని

జ్ఞాపకం చేస్తుంది. నందునితో నారదుడు "ఇంత తడవేటికి? మందగదల్చికొని పొమ్మ"ని ఉత్సాహపరచాడు. "నేను చేయవలసింది చేసాను, ఇక నీదే ఆలస్య"మని భావం. ఈ మాటలో సమస్య పరిష్కారం వల్ల సంతోషంతో శ్రేయోభావ పూర్ణమైన మనోరూపం వ్యంచితమవుతూంది.

శ్రీకృష్ణజనన చారితార్థ్యం బృందావనంలోగాని జరుగదు. ఈ రహస్యం నారదుని మాటల్లో వ్యక్తమైంది. నారదుడు దైవ కార్యానికి సహాయకకారిగా కన్పిస్తాడు. నారదుని ఉపదేశానుసారం బృందావన గమనం నిర్ణయమైంది. ఇది మానుష ప్రయత్నంలో పోతపోయబడి కన్పిస్తుంది. కాని దీని వెనుక విధి అదృశ్యంగా పనిచేస్తుంది. ఇది లోక దృష్టి కతీతమైంది. ఎఱ్ఱన రచన నన్నయ తిక్కనల మార్గాల సమన్వయ రూపంతో స్వీయ ప్రబంధ వ్యక్తిత్వంతో స్వతంత్ర రూపాన్ని పొందింది.

తెలుగులో కవిత్రయ మహాభారతం సంస్కృతంలో వ్యాసమహర్షి మహాభారత మహాదర్శనశక్తి నుండి ప్రభవించింది. ఈ ముప్పురు మహాకవుల కృతులు స్వతంత్రమైన వ్యక్తిత్వం కలిగినవి. వీటిలో నిహితమైన స్వతంత్రమైన సృజన రూపం – నిర్వహణ శిల్పరేఖల సమాలోచనమే ఈ సిద్ధాంత గ్రంథం.

# మాదిరాజు రంగారావు కృతులు

**❖A. స్వేచ్ఛా కవిత్వం – మొదటి భాగం రచనాకాలం 1952 – 2002**

1. మానవీయం 2. పడగెత్తిన ఉదయం
3. ముక్తధాత్రి 4. ఇది వియత్నాం
5. యుగ సంకేతం 6. ఆవాహన
7. ముక్తకాలు 8. నాలో ప్రవహిస్తోంది నది
9. నాకు జ్ఞాపకముంది 10. కిర్మీరం 11. మనోభూమికలు
12. వెలుగులో ఈ నేలపై 13. మేల్కొన్న ఈ సమయం 14. శబ్దమయి ప్రాణమై
15. అగ్నిమయం జీవితం 16. కాలాన్ని నిలిపి క్షణం 17. ఈ తరం స్వరచిత్రం
18. అశాంతి ఆర్కెస్ట్రా 19. వర్తమానం స్క్రీన్‌పై 20. అగ్ని నుండి ఆనందానికి
21. జైలు కార్నర్ నుండి 22. ప్రయాణం నుండి ప్రయాణం
23. డైరీ దర్పణంలో 24. ఈ శతాబ్ది రెక్కలపై 25. శాంతి స్వప్నం
26. క్రాస్ ఫైర్ 27. సీజ్ ఫైర్ 28. నేడు రేపు మధ్య
29. కిరణ పథం 30. స్వేచ్ఛకు సిగ్నల్

**❖స్వేచ్ఛా కవిత్వం – రెండో భాగం రచనాకాలం 2003 – 2012**

31. అభిషేకం – 2003 32. ఆగమనం – 2005 33. ఎప్పటికీ కొత్తే – 2005
34. సృజన దర్శనం 35. మరో వైపు 36. హృదయ మేఘం
37. సమకాలీనం – 2007 38. అభినవ యానం 39. ఆత్మ బంధం – 2008
40. సృజన మేఘం 41. ఉగ్ర చరణం 42. నవారంభం
43. నవ దర్శనం –2009 44. గిఫ్ట్ ప్యాకెట్ 45. పునర్దర్శనం
46. నడిచే వెలుగు చుట్టూ 47. అపూర్వ 48. అజ్ఞాతం నుండి–2010
49. రోజు వస్తుంది 50. ఉద్యమ చరణం 51. ఆల్బంలో ప్రజాస్వామ్యం–2011
52. అద్దంలో ప్రజాస్వామ్యం–2011 53. ప్రవాహంలో ప్రజాస్వామ్యం –2012

**❖స్వేచ్ఛా కవిత్వం – మూడోభాగం రచనా కాలం 2013–2014**

**54. ఖడ్గం కన్నీరు కార్చదు–2013 55. చార్ ధామ్–2013 56. ఆల్ ఇన్ వన్–2013**
**57. ఉద్యమ పథం–2013 58.అడవిలో ఆయుధం–2014 59. చెదరిన ప్రజాస్వామ్యం–2014**
**60. గాయ పడిన ప్రజాస్వామ్యం–2014**

**❖B. పరిశోధన – సమాలోచనం** 61. కవిత్రయం సృజనకళ–నిర్వహణ శిల్పం (సిద్ధాంత గ్రంథం)
62. నవల స్వరూపం 63. పరిశోధనా స్వరూపం 64. అధికార భాష 65. అనువాద కళ
66. దాశరథి కవితా సమాలోచనం 67. ఆలోకనం (సాహిత్య వ్యాసాలు)
68. సృజన రూపం – మానవీయ భావన 69. సృజన చేతన – భావ రూపాలు
70. Facets of T. Free-verse 71. శ్రీశ్రీ మహా ప్రస్థానం – సమాలోచనం
72. రామాయణ కల్పవృక్షం – సృజన చేతన 73. స్వేచ్ఛా కవిత్వం ప్రజాస్వామ్య దర్శనం
74. స్వేచ్ఛా కవిత్వం – మానవీయ దర్శనం 75. స్వేచ్ఛా కవిత్వం సహృదయ స్పందనం
76. మరోవైపు – గురజాడ ఆధునిక చేతన (2013)



## సంక్షిప్త పరిచయం

మాదిరాజు రంగారావు జననం 1936 జనవరి 7, ఖమ్మం పట్టణానికి పదిమైళ్ళ సమీపంలో పండితాపురం గ్రామం. ఖమ్మంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం. తదుపరి నిజాం కాలేజి, ఆర్ట్స్ కాలేజి, ఉస్మానియా విశ్వ విద్యాలయంలో M.A. (Sanskrit) 1960, M.A. (Telugu) 1962, Ph.D (Telugu) 1962-64 యు.జి.సి. రిసెర్చ్ స్కాలర్ గానూ సాగింది. తెలుగు మహాభాగవతం పరిష్కరణ సమితిలో, తెలుగు మహాభారతం పరిష్కరణ సమితిలో సభ్యులుగా ఉన్నారు. 1964లో ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో ప్రవేశం. కాకతీయ విశ్వ విద్యాలయం తెలుగు శాఖలో ప్రొఫెసర్‌గా Chairman Board of Studies and Dean Faculty of Arts గానూ ఉన్నారు. పదవీ విరమణం తరువాత యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (న్యూ ఢిల్లీ) రిసెర్చ్ ప్రాజెక్టుల (1995-98, 1999-2002) ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ గానూ తరువాత హ్యూమన్ రిసోర్సెస్ డెవలప్‌మెంట్ (న్యూఢిల్లీ) రిసెర్చ్ సీనియర్ ఫెలో (2003-2006)గానూ పనిచేశారు.

సాహిత్య క్షేత్రంలో 1952 నుండి స్వతంత్ర, నవత, భారతి, స్రవంతి, జయంతి, వాఙ్మయి, మూసీ, విశాలాక్షి, ఆకాశిక్, ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి, ఆంధ్రజ్యోతిలో కవితలు, సాహిత్య వ్యాసాలు ప్రకటితమయినాయి. స్వేచ్ఛా కవిత్వం (60), పరిశోధన-సమాలోచనం16 మొత్తం 76 పుస్తకాలు 1952-2014లో ప్రచురితమైనాయి.

**స్వేచ్ఛా కవిత్వంలో** 1. ప్రజాస్వామ్య దృక్పథం 2. మానవీయ భావన 3. సామాజిక వాస్తవికత 4. వర్తమాన స్థితి చలనం 5. మనస్తత్వ చిత్రణంతో ఒక పార్శ్వమూ.

**సమాలోచనంలో** 1. కవి దృష్టి - వ్యక్తిత్వం - కృతి 2. సమాజమూ - ఆదర్శరూపం 3. మానవీయం - విశ్వభావన 4. మనస్తత్వ ప్రకాశనం 5. సృజన కళ - సంవిధాన శిల్పంపై వెలుగుతో మరో పార్శ్వమూ కలిగిందీ, కవి సాహిత్య వ్యక్తిత్వం.

ఇది సృజన రచనలో చారిత్రక నేపథ్యం సామాజిక వాస్తవికత మరియు కవి మనోరూపం నేపథ్యంలో పరిశీలిస్తే కవిత్వంలో భిన్నత్వం అనివార్యమే కాదు, సహజమూ అన్న అభిప్రాయం కలుగుతుంది.

1970 నుండి రసధుని సాహితీ పరిషత్తు వ్యవస్థాపకులూ, అధ్యక్షులూ.

నివాసం
# జ్యోతి సౌభాగ్య అపార్ట్‌మెంట్, 10-2-289/61,
ఫ్లాట్ నెం. 202, శాంతినగర్, హైదరాబాద్ - 500 028.
040-23398899